# భారతదేశ తీర్థ -విహారయాత్రలు

## (ద్వాదశ జ్యోతిర్లింగ ప్రధానం)

## భావాలు, అనుభవాలు

(2008 – మార్చి- 2012)

రచయిత

***కొండూరు తులసీదాస్***

# భారతదేశ తీర్థ -విహారయాత్రలు

## (ద్వాదశ జ్యోతిర్లింగ ప్రధానం)

### భావాలు, అనుభవాలు

ఫోటోలు, రచన, పరిమిత ప్రచురణ

మరియు ©

కొండూరు తులసీదాస్

సెక్టార్-5; బి-847:యన్.జీ.వోస్.కాలనీ

వనస్థలిపురం, హైదరాబాద్ – 500070

ఫోను: 04024245859

9849136617

ఇ మెయిల్ : ktulasidas@gmail.com

| దర్శించిన క్షేత్రాలు | | | |
|---|---|---|---|
| 1 | తిరుమల | 21 | హరిద్వార్ |
| 2 | తిరుచానూరు | 22 | రిషికేష్ |
| 3 | తిరుత్తణి | 23 | ***కేదారనాథ్** |
| 4 | కంచి | 24 | ఓఖిమట్, |
| 5 | కుంబకోణం | 25 | జోషిమట్ |
| 6 | చిదంబరం | 26 | బదరీనాథ్ |
| 7 | తంజావూరు | 27 | నైమిశారణ్యం |
| 8 | శ్రీరంగం | 28 | ***వారణాసి** |
| 9 | ***రామేశ్వరం** | 29 | అయోధ్య |
| 10 | మదురై | 30 | గయ |
| 11 | కన్యాకుమారి | 31 | ***వైద్యనాథ్** |
| 12 | సుచీంద్రం | 32 | కోల్కతా |
| 13 | తిరువనంతపురం | 33 | పూరి |
| 14 | మైసూరు | 34 | భువనేశ్వర్ |
| 15 | ***ఓంకారేశ్వర్** | 35 | ***భీమాశంకర్** |
| 16 | ***ఉజ్జయిని** | 36 | ***త్రయంబకం** |
| 17 | ***సోమనాథ్** | 37 | ***ఘ్రుష్మేశ్వర్** |
| 18 | ***నాగేశ్వర్** | 38 | జాజిపూర్ |
| 19 | ద్వారక | 39 | పిఠాపురం |
| 20 | భేట్ ద్వారక | 40 | సామర్లకోట |

| విహరించిన ప్రదేశాలు |
| --- |
| ఆగ్రా, కోవలం, కోచి (కేరళ)<br>పుష్పవనం, ఆలీ, (ఉత్తరాఖండ్)<br>ఔరంగాబాద్, అజంతా, ఎల్లోరా (మహారాష్ట్ర) |

*జ్యోతిర్లింగ క్షేత్రాలు (శ్రీశైలం ఈ యాత్రలలో లేదు)

## ద్వాదశ జ్యోతిర్లింగ ప్రశస్తి

సౌరాష్ట్ర దేశే విశదేతి రమ్యే జ్యోతిర్మయం చంద్ర కళావతంసం
భక్తి ప్రదానాయ కృపావతీర్ధం తం సోమనాథం శరణం ప్రపద్యే

శ్రీశైల సంగే విబుధాతి సంగే తులాద్రితుంగేపి ముదావతంసం
తమర్జునం మల్లికా పూర్వమేకం సమామి సంసార సముద్ర సేతుం

అవంతికాయాం విహితావతారం ముక్తి ప్రదానాయచ సజ్జనానాం,
అకాల మృత్యో పరిరక్షనార్ధం వందే మహాకాల మహా సురేశం

కావేరికా నర్మదాయో పవిత్రే సమాగమ్ సజ్జన తారణాయ
సదైవమాం ధాత్రపురీ వసంతం ఓంకార మీశం శివమేక మీడే|

మహాద్రి పార్శ్వేచ తటే రమంతం సంపూజ్య మానం సతతం మునీద్రై,
సురా సురైర్యక్ష మహోరగాద్యై కేదారమీశం శివమేక మీడే

యందాకినీ శకినీ కాసమాజై నిషేవ్యమాణం పిశితా శనైశ్చ
సదైవ భీమాది ఏద ప్రసిద్ధం తం శంకరం భక్తిహీనం నమామి

సానందమానంద వనే వసంతం ఆనంద కాండం హత పాప బృందం,
వారణాసీ నాధమనాధ నాధం, శ్రీ విశ్వనాధం శరణం ప్రపద్యే.

సహ్యాద్రి శీర్షే విమలే వసంతం గోదావరీ తీర పవిత్ర దేశే
యద్దర్శనాత్పాతక మాశునాశం  ప్రయాతి తం త్ర్యంబక మీశ మీడే.

పూర్వోత్తరే ప్రజ్వలికాని దానే సదా వసంతం గిరిజా సమేతం
సురాసురధిత పాదపద్మం శ్రీ వైద్యనాధం తమహం నమామి

సదంగే నగరేతి రమ్యే విభూషితాంగం వివిధైశ్చ భోగై
సద్భక్తి ముక్తి ప్రదమీశ మేకం శ్రీ నాగానాధం శరణం ప్రపద్యే

సుతామ్రపర్ణీ జలరాశియోగే  నిభద్యసేతుం విశిఖై రసంఖ్యై
శ్రీరామ చంద్రేణ సమర్పితం తం రామేశ్వరాఖ్యం నియతం నమామి.

ఐళాపురే రమ్య విశాలకేస్మిన్ సముల్ల సంతంచ జగద్వరేఖ్యం
వందే మహోదర తర స్వభావం  ఘ్రుష్ణేశ్వరాఖ్యం శరణం ప్రపద్యే



*సప్త ప్రాకారమధ్యే నరసిజ ముకుళోద్భాసనసమానే విమానే*

*కావేరీ మధ్యదేశే ఫణిపతి శయనే శేష పర్యంక భాగే*

*నిద్రా ముద్రాభి రామం కటినికట శిరః పార్శ్వ విన్యస్త హస్తం*

*పద్మా ధాత్రీ కరాభ్యాం పకిచిత చరణం రంగనాథం భజేహం*



శ్రీరంగం

# ముందుమాట

ఈ యాత్రలు చేస్తున్నపుడు గమనించిన కొన్ని విషయాలను గుర్తు పెట్టుకోవటానికిగాను జేబులో ఇమిడే ఒక చిన్న పుస్తకంలో వ్రాసుకోవటం మొదలెట్టాను. అలా వ్రాసుకోటానికి కొన్ని సందర్భాలు అనుకూలించలేదు. ఆ అనుభవాలు తాత్కాలికంగా అలా మనసులో ఉండిపోయినందువల్ల, ఒక దశలో ఇవన్నీ వ్రాసుకుని ఏమిచేయాలిలే అనే ఉదాసీనత మనసులో చొరబడింది. దానితో వ్రాయటం పూర్తిగా మానేశాను. ఇంటికి చేరిన తరువాత యాత్రలో పొందిన అనుభూతుల్ని, జ్ఞాపకాలను, పందిరిగా చేసుకుని ఆ నీడలో విశ్రమిస్తుండగా భవిష్యత్తులో అవసరమయినప్పుడు నెమరు వేసుకోవటానికి గాను ఈ అనుభూతులు శాశ్వతంగా ఉండటానికీ, అవి పదిమందికీ అందుబాటులో ఉండటానికీ అక్షరబద్ధం చేయవచ్చుకదా అనే ఆలోచన వచ్చింది. అలాగే మొదలెట్టాను. కొన్నిపేజీలు చేతితో వ్రాసాను. చిత్తశుద్ధి లోపం లేదు. కానీ, ఏ పేజీ చూసినా చదువ సాధ్యమయిన అక్షరాలకంటే కొట్టివేతలే ఎక్కువ. నా రాత నేనే చదువ లేనంత అధ్వాన్నంగా ఉంది. అది మరొకరికి ఇచ్చి చదవమంటే అంతకు మించిన దారుణమైన శిక్ష మరొకటి ఉండదు. DTP ఒకటే శరణ్యం. కానీ కంప్యూటర్ ఉపయోగించటంలో, నాకు ఉన్న కొద్ది పరిజ్ఞానం చాలా పరిమితం. ఆంగ్లంలో అయితే ఏదో ప్రయత్నించగలను గానీ, నా వయస్కులయిన వారు, నా తరంలో ఇంకా జీవించి ఉన్న పెద్దలకు, ముఖ్యంగా ఆంగ్లంలో ఏ మాత్రమూ ప్రవేశం లేని సాంప్రదాయ కుటుంబాలలో మహిళలకు అది ఏ మాత్రం ఉపయోగపడదు గదా! మరి నాకు DTPలో ప్రవేశమే లేకపోయే. పోనీ ఆ రంగంలో నిపుణులతో చేయిద్దామా అంటే నా తాహతుకు మించిన భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారమాయే! తీవ్ర అసంతృప్తి కలిగింది.

నా సంఘర్షణను గమనించిన మా కుమారుడు, ఇటీవల వరకూ తను పనిచేసిన గూగుల్ సంస్థ వారి ఉత్పత్తి నొకదానిని పరిచయం చేసాడు. 'గూగుల్ ప్రతిలేఖిని' (Google Transliteration) అనే ఈ ప్రక్రియ ద్వారా, తెలుగు పదాలను ఆంగ్ల వర్ణమాల సహాయంతో అదే కీబోర్డు నుపయోగించి తెలుగులో సులభంగా వ్రాయవచ్చు. ఒక రోజంతా నిర్విరామంగా ప్రయోగాలు చేయగా ఈ ప్రక్రియను ఉపయోగించటంలో పట్టుచిక్కింది. అదే ఉత్సాహంతో రచన ప్రారంభించాను. అయితే ప్రధాన రచన ప్రారంభించిన తరువాత ఈ రచన ముఖ్యోద్దేశంపై నాలో నాకే స్పష్టత లోపించినట్టు గ్రహించాను. దాంతో రచనను తాత్కాలికంగా నిలిపివేసి లక్ష్యదిశా శోధన చేసాను.

కారణాలేమైనా, ఇటీవల కాలంలో తీర్థయాత్రల పట్ల ప్రజలకు ఆసక్తి పెరుగుతున్నది. పెరుగుతున్న ఆదరణకు దీటుగా ప్రైవేటు యాత్రా సంస్థల వారు అనేకులు, ముప్పై నుంచి యాభై, అరవై మంది వరకూ సభ్యుల బృందాలతో యాత్రలు నిర్వహిస్తూ తద్వారా వారు ఉపాధి పొందటమే కాక, వ్యక్తిగతంగా యాత్ర చేయలేనివారికి ఎంతో తోడ్పాటుగా ఉంటున్నారు. వారి కృషి నిస్సందేహంగా ప్రశంశనీయం.

ఆ విధంగా యాత్ర చేయటంలో సంతృప్తి, ఇతర ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కేవలం ఒక కుటుంబం కాక, బంధువులతో గాని, స్నేహితులతో గాని ఆరు లేదా ఎనిమిది మంది భిన్న వయస్కులు, ముఖ్యంగా 14 సంవత్సరములు దాటిన పిల్లలతో కూడిన బృందంగా చేసే యాత్రలలో ఉండే అనుభూతి, సంతృప్తి వేరు. యవ్వనంలో ప్రవేశించే దశ కనుక ఆ వయసు పిల్లలలో మానసిక వికాసం చురుగ్గా పరివర్తన చెందుతూ ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతూ ఉంటుంది. ఆ కారణంగా, అప్పగింపబడిన

బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, తల్లిదండ్రుల ప్రశంశలను పొందటానికి ఆరాటపడతారు. ప్రత్యేకించి 'చార్ ధాం', 'మానస సరోవర్', 'అమరనాథ్' వంటి యాత్రలను సంపూర్ణంగా ఆస్వాదిస్తారు. ధారణాశక్తి నిర్మాణదశలో నుండటం వల్ల అలా పొందిన అనుభూతులు చిరకాలం గుర్తుండటమే కాక విద్యాభ్యాసం లోనూ, భవిష్యత్తులో బాధ్యత గల పౌరులుగా ఎదగటానికిన్నీ ఎంతగానో తోడ్పడతాయి. యాత్ర సమయంలో తల్లి దండ్రులకు అవసరమయిన అండగా కూడా ఉంటారు.

సాధారణంగా, యాత్రలంటే మొక్కుబడులకే ప్రాధాన్యమిస్తాం. మొక్కుబడులు తప్పకుండా తీర్చుకోవాల్సిందే. కోరికలు నెరవేరటానికో, ఆపదల నుండి బయట పడటానికో, చేసిన మొక్కులు తీర్చటానికి, భార్యాబిడ్డలతో చేసే ఈ తరహా యాత్రలు జీవితంలో ఎప్పుడో ఒకసారి గాని చేసే అవకాశం కలుగదు. అందుచేత అటువంటి యాత్రలు ఆస్వాదించటానికి ఆస్కారం అంతగా లేని ఏదో 'మొక్కుబడి' గా మిగిలిపోయే అవకాశమే ఎక్కువ. అలాకాకుండా, తీర్ధ యాత్రలను, విహార యాత్రలుగా కలిపి ప్రతి రెండు మూడు సంవత్సరాల కొకసారి ఒక పది పన్నెండు రోజులు అలా తిరిగి వస్తే దైనందిన జీవనంలోని యాంత్రికత వల్ల కలిగే అనేక సమస్యలను అధిగమించవచ్చు. ముఖ్యంగా ఎదిగే పిల్లలకు, గృహిణులకు ఇది చాలా అవసరం.

సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా ఇంటర్నెట్ సౌకర్యం ప్రతివారికీ అందుబాటులో ఉన్న ప్రస్తుత కాలంలో, యాత్రలలో దర్శించే దేవాలయాల స్థలపురాణం గురించి, ఆయా పర్యటనా స్థలాల విశేషాలకు సంబంధించిన సమాచారం తెలుసుకోవటానికి పెద్ద శ్రమ పడనక్కరలేదు. ఎటొచ్చీ అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఆధారం చేసుకుని మన వ్యక్తిగత

పరిస్థితులకు, అవసరాలకు వర్తింపజేసుకుంటూ, తదనుగుణంగా వేసుకున్న ప్రణాళికపైనే యాత్రాసాఫల్యం ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. అట్టి సాఫల్య సాధనకు, ఒక ప్రణాళిక సిద్ధం చేసుకోవాల్సిన ఆవశ్యకతనుగానీ, శాస్త్రీయంగా అది తయారు చేసుకునే విధానాన్నిగానీ తెలియజేసే గ్రంధాలు ఉన్నాయేమో! నాకు లభ్యం కాలేదు. అందుచేత నేను వ్రాయబోయే గ్రంధంలో ఇటువంటి అరుదైన సమాచారాన్ని, సూచనలను అందించగలిగితే ఈ పుస్తకానికి కొంత ప్రయోజనం ఉంటుందని ఆలోచన కలిగింది.

ఇటువంటి విషయాలు ఇతరులకు తెలియజేసే సందర్భంలో ఆ విషయాలు, చదివో, విని, లేదా ఊహాజనితంగానో చెప్పినదానికంటే అనుభవ పూర్వకంగా చెపితే సహజంగానే వాటికొక ప్రామాణికత, విశ్వసనీయత ఒనగూడుతాయి. నా అనుభవాన్ని ఆ విధంగా వినియోగిస్తే ఈ కృషికి పరిపూర్ణత ఉంటుందని భావించాను. అయితే, యాత్రకు ప్రణాళికను రచించ టానికి ఎటువంటి సూత్రాలుగానీ, మార్గదర్శకాలు కానీ ఈ గ్రంధంలో నేరుగా కనబడవు. ఈ రచన, అందుకు మాత్రమే ఉద్దేశించినది కాదు. అందుచేత ఇందులో ఆచరణీయమని భావించిన వాటిని పాఠకులు వారి వారి స్వీయ ప్రయోజనార్ధం అన్వయపూర్వకంగా మాత్రమె గ్రహించగలరని మనవి.

అసలు యాత్ర ఆలోచన నాకు ఎలా కలిగినదీ, స్ఫూర్తి ఎక్కడ నుంచి పొందాను, ఆరోగ్య పరంగా, శారీరకంగా నాకున్న పరిమితులు, ఆటంకాలు ఏమిటి, వీటి నేపధ్యంలో యాత్రలో ఉత్పన్నమయ్యే సమస్యలు ఏ విధంగా ఉండవచ్చు, వాటిని ఎదుర్కొనటానికి ఎలాంటి సంసిద్ధత అవసరం, తీరా సమస్య ఎదురే అయితే ఆ సమస్యను అధిగమించటానికి అవసరమయిన కార్యాచరణ ఏ విధంగా ఉండాలి, మొదలైనవి యాత్రకు ప్రణాళిక రచన చేస్తున్నపుడు నేను దృష్టిలో ఉంచుకున్న అంశాలు. అందుచేత యాత్ర

ఆలోచనకు మూలమైన స్ఫూర్తి, ప్రేరణ, లోపరహిత ప్రణాళికయొక్క ఆవశ్యకత, అటువంటి ప్రణాళిక రచన, యాత్రకు సన్నాహం, ఏర్పాట్లు, ప్రధాన యాత్ర ఇవన్నీ గ్రంధంలో ఉండాలని ఎంచుకున్నాను. ఇక దైవదర్శనాలు, విహార ప్రదేశాల వివరణ, మొత్తం యాత్రలో విశేషాలు ఎలాగూ ఉంటాయి.

అలాగే, ప్రతి యాత్రకూ ముందు ఆ యాత్రగురించి అవసరమైన సమాచారం సేకరించుకొని దానిని ఎప్పటికప్పుడు పరిపుష్టం చేస్తూ సమగ్రమైన రీతిలో అందుబాటులో ఉంచుకున్నాను. అలా సిద్ధమైన సమాచారం వల్ల యాత్రా ప్రణాళిక సమగ్రంగా రూపొందటమే కాకుండా యాత్రలో కూడా అది వివిధ దశల్లో ఎంతో ఉపయోగపడింది.

మేమిరువమూ కాకుండా బృందంగా చేసిన యాత్రల ప్రణాళికకు తుది మెరుగులు దిద్దే దశలో మిగతా సభ్యుల ఆలోచనలకు, అభిరుచులకు, అభిప్రాయాలకు గౌరవమిస్తూ ప్రణాళికలో వాటికి సముచితమైన స్థానం కల్పించవలసి వచ్చేది. తుది ప్రణాళిక సిద్ధమైన తరువాత కూడా ముఖ్యంగా సభ్యులు వేరు వేరు ప్రాంతాల్లో ఉండటం వల్లనూ పైగా మేమిరువురుమూ తప్ప మిగతా వారు, వారి వారి వృత్తులు, ఉద్యోగాల రీత్యా సదా తలమునకలై ఉండటం వల్ల, సన్నాహాల దశలో సమన్వయ పరంగా పెద్ద కసరత్తే అవసరమయ్యేది. కొన్ని పనులు సకాలంలో పూర్తి అయ్యేవికావు. వీటిని అధిగమించగలిగిన తీరు ఏ రీత్యానూ విస్మరించ దగినది కాదు కనుక ఆయా సందర్భాలను గుర్తించి రచనలో స్థానం కల్పిస్తూ, యాత్ర సన్నాహక దశలోనూ, ఆ తదుపరి ఏర్పాట్ల విషయంలోనూ వారినుంచి లభించిన సహకారం, యాత్ర సమయంలో వారు స్వచ్ఛందంగా స్వీకరించిన బాధ్యతలు

మొదలైనవి కూడా ప్రధాన రచనలో సందర్భోచితంగా వివరిస్తే చదువరులకు ఆసక్తిదాయకంగానూ, ఉపయుక్తంగానూ ఉండగలవని భావించాను.

ఈ అంశాలన్నీ పరిగణలోకి తీసుకుంటే ఏ లేమితో రచనను నిలిపివేశానో ఆ దిశలో, లక్ష్యం స్పష్టంగా గోచరించింది. తాత్కాలికంగా నిలిపివేసిన రచన సరిగ్గా అక్కడ నుంచే కొనసాగించాను. ఈ అనుభవాన్ని ఎవరికి తగిన రీతిలో వారు అన్వయించుకోవచ్చు.

యాత్రా ప్రణాళికలో ఆర్థిక అంచనా విడదీయరాని భాగం. మాకు అయిన ఖర్చు విషయానికి వస్తే, పూర్తిగా విలాసవంతమైనది కాకుండానూ, అలా అని 'కనీస' స్థాయిలోనూ కాకుండా ఒక సగటు మధ్యతరగతి కుటుంబానికి తగిన స్థాయిలో మాత్రమే చేసిన యాత్ర ఇది. కొన్ని సందర్భాలలో ఉదారంగా అనిపించిప్పటికీ ఎక్కడా కూడా అవసరమైన దానికంటే ఎక్కువ ఖర్చు చేయటం గానీ, అలాగే అవసరమయిన చోట రాజీపడి సర్దుకుపోవటం గానీ చేయలేదు. ఈ రచనలో అలాంటి సందర్భాలు చాలానే కనపడతాయి. ఈ అంశాలు కేవలం మా వ్యక్తిగతమైనప్పటికీ, సందర్భౌచిత్యం దృష్ట్యా బహిరంగ పరచాను. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ సహృదయంతో అర్థం చేసుకోగలరని మనస్పూర్తిగా విశ్వసిస్తున్నాను.

**- కొండూరు తులసీదాస్**

# కృతజ్ఞతలు

ఈ గ్రంధం వ్రాత ప్రతిని మా కుటుంబ మిత్రులు శ్రీమాన్ శ్రిమత్తిరుమల వాసుదేవాచార్యులు గారికి తమ అభిప్రాయం నిమిత్తమై ఇవ్వగా, వారు అభిప్రాయాన్ని తెలపటంకంటే ముందుగా తీర్థయాత్రల ప్రాశస్త్యం, మానవ జీవితంలో వాటి ప్రాముఖ్యత, ఆవశ్యకతలను గురించి అమూల్యమైన విషయాలు తెలియజేస్తూ, వాటికి గ్రంధంలో చోటు కల్పించ వీలుకలదేమో పరిశీలించ వలసినదిగా సూచించారు. వారి సూచనను శిరసావహిస్తూ, తాము తెలిపిన ఆ విషయాలు, తామే వ్రాసి ఇస్తే, దానిని యధాతథంగా ఈ గ్రంధానికి పీఠికగా ఉపయోగించుకుంటానని అర్ధించాను. ఇందుకు వారు సమ్మతించి తాము తెలుపదలచిన ఆయా విషయాలను పురాణ, శ్రుతి ప్రామాణికంగా వివరించి మరీ అందజేశారు. వారికి హృదయపూర్వక ధన్యవాదములు.

అలాగే, అభిప్రాయం కోసమని డాక్టర్ రేమెళ్ల అవధానులు గారిని కోరగా,నిర్మొహమాటంగా సమయం తీసుకుని, ఆ సమయాన్ని ఒక్క క్షణం కూడా అతిక్రమించకుండా వ్రాసి ఇచ్చారు. నిజానికి ఇది కేవలం అభిప్రాయం మాత్రమే కాదు. విస్తరణకు పూర్వం, రెండు వందల పైగా పుటలున్న గ్రంధానికి అది ఒక సమగ్రమైన సమీక్ష. ఈ రచన ద్వారా నేను ఆవిష్కరించ దలచిన అన్ని అంశాలను వారు సమీక్షించి అందులోని సారాన్ని కేవలం పది పన్నెండు వాక్యాల్లోనే కదళీఫల న్యాయంగా అందించారు. వారి అభిప్రాయాన్నే, నాపట్ల వారికిగల వాత్సల్య ఫలంగానూ, ఆశీస్సులుగానూ భావిస్తూ వారికి హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

ఈ గ్రంధంలో విషయపరంగా నాయిక నా శ్రీమతి. ప్రచురించబోయే గ్రంధంలో ఆమె ఆరోగ్య విషయమైన అంశాలు విస్తృతంగా చోటుచేసుకోవటంతో

అమెకేమైనా ఇబ్బందికరంగా ఉంటుందేమోనని సంశయించాను. అయినా, చొరవ తీసుకుని నా సంశయాన్ని వ్యక్తపరచగా ఆమె తన మనఃపూర్వక మైన అంగీకారాన్ని తెలిపి ఈ రచనలో తన సంపూర్ణ సహకారాన్ని అందించి నందుకు ఆమెకు ధన్యవాదాలు.

మొదట, అడ్డదిడ్డంగా వ్రాయబడిన అధ్యాయాలన్నిటినీ ఒక క్రమంలో పెట్టి ఆయా భాగాలను సందర్భోచితమైన శీర్షికల క్రిందకూర్చినవారు చి| ముంగమూరి విజయగోపాల్, వారి శ్రీమతి సౌ| లక్ష్మీభవాని గార్లకు కృతజ్ఞతాపూర్వక ఆశీస్సులు.

ఈ గ్రంధం యొక్క కవరును సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దినవారు సినెర్జీ విజన్ సంస్థ అధినేత్రి సౌ| యల్లాప్రగడ సుధామాధవి, వారి శ్రీవారు, సోదర సంస్థ, క్లాసిక్ అపర్చర్స్ అధినేత, చి|యల్లాప్రగడ వెంకటరమణ. వారిని, వారి కుటుంబాన్ని ఎల్లవేళలా అనుగ్రహించి కాపాడ వలసినదిగా వారి ఇలవేలుపు అయిన శ్రీ వెంకటేశ్వరస్వామిని ప్రార్ధిస్తున్నాను. ఈ ప్రక్రియలో వారికి సహకరించిన ఆ సంస్థల ప్రధాన సాంకేతిక నిపుణుడు శ్రీ దర్పల్లి చిరంజీవిరెడ్డి గారికి ఇతర సిబ్బంది యావన్మందికీ కూడా కృతజ్ఞతలు.

ఏ గ్రంధం యొక్క స్వరూపమైనా, సమగ్రతయయినా దాని ప్రూఫులను సరిదిద్దినవారి నైపుణ్యంపై ఆధారపడి యుంటుంది. ఈ వ్యవహారాన్ని సమర్ధవంతంగా నిర్వహించిన వారు మా కుంటుంబ మిత్రులు శ్రీ చివుకుల సీతారాముడు, వారి శ్రీమతి లక్ష్మి గారలు. వారికి హృదయపూర్వక అభివందనలు.

ఈ గ్రంధ రచనలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ అమూల్యమైన సహకారం అందించినది చిరంజీవి కిరణ్ కుమార్ అతని అర్ధాంగి, సౌభాగ్యవతి

లక్ష్మి. ఒక వర్ధమాన కార్పొరేటుకు అతను సాక్షాత్తు అధిపతి. ఆమె మరొక ప్రముఖ అంతర్జాతీయ సంస్థ (Price Water Cooper House) లో ఉన్నతోద్యోగి. ఆ రీత్యా ఇరువురూ కూడా నిత్యం నిర్విరామంగా ఆ కార్యకలాపాలలో తలమునకలుగా ఉంటారు. అత్యవసర సమావేశాల్లో నిమగ్నమై ఉన్న సమయంలోనూ, కొన్ని సందర్భాలలో ఏ పర్యటనల లోనో ఉన్నప్పుడు సయితం, ఒక సలహానో, సహాయమో కావలసి వచ్చినపుడో, ముఖ్యంగా సాంకేతిక సమస్యతో కంప్యూటర్ మొరాయించినప్పుడో, మరేదైనా సందిగ్ధంలో చిక్కుకున్నప్పుడో సందర్భ మర్యాద, వేళా పాళా పాటించకుండా ఎప్పుడుపడితే అప్పుడు చిన్న పిల్లవాడివలె వారికి ఫోనులు చేస్తూ ఉండేవాణ్ణి. అయినా ఏమాత్రం విసుక్కోకుండా, వెంటనే సహాయపడలేని సందర్భాలలో సున్నితంగా సమయం కోరుతూ, వీలు చిక్కిన వెంటనే ఇద్దరిలో ఎవరో ఒకరు ఫోను చేసి, విషయం గ్రహించి నా సందేహాలు తీర్చి అవసరమైన సలహాలు ఇచ్చేవారు. ఈ సహకారమే లేకపోతే బహుశా ఈ గ్రంధాన్ని నేను ఎన్నటికీ పూర్తి చేయగలిగి ఉండేవాడిని కాదు. ఇది అతిశయోక్తి కాదు. వారు మా కుమారుడు, కోడలు. అందుచేత వారికి ఆశీస్సులతోనే కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

-- **రచయిత**

కౌసల్యా సుప్రజారామా పూర్వా సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూలా కర్తవ్యమ్ దైవమాహ్నికం



శ్రియః కాంతాయ కళ్యాణ  నిధయే నిధయేర్థినాం
శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళం /

# పీఠిక

భారత వర్షము పుణ్యక్షేత్రాలకు, పవిత్ర తీర్థాలకు నిలయము. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలలో ఈ పుణ్య క్షేత్రాలను దర్శించటానికి చేసే తీర్థయాత్రలకు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత ఉంది. అయితే, ఈ తీర్థ యాత్రల వల్ల ప్రయోజనం ఏమిటి ? అని అతి సామాన్య వివేకాన్నుంచి ఉద్భవించే ప్రథమ ప్రశ్న. సందేహం లేనిదే ప్రశ్న లేదు. ప్రశ్న లేనిదే సమాధానం లేదు. సమాధానం లేనిదే సందేహం తీరదు. సందేహం తీరనిదే జ్ఞానం సమకూరదు. తీర్థ యాత్రలు ఎందుకు చేయాలి? అనేది తప్పకుండా తీర్చుకోవలసిన అటువంటి సందేహమే. కనుక అందునుంచి ఉద్భవించిన ప్రశ్నకు సమాధానం అనివార్యం.

నా తండ్రిగారయిన శ్రీమాన్ మత్తిరుమల వేంకట శ్రీనివాసాచార్యులు గారు తాను రచించిన "శ్రీ మహాభారత వైజ్ఞానిక సమీక్ష" గ్రంధములో అర్జునుని తీర్థ యాత్ర ప్రసంగ సందర్భంగా కాశీ ఖండ కావ్యంలోని --

***"బిసరుహ పత్ర నేత్రక కృపేతములందు మునింగి యాడవే***
***మొసలులు,మీలుకర్కటకముల్, కమఠంబులు, వానికబ్బునే***
***అసదృశమైన మోక్ష పథమట్టి విధంబ సుమీ! తలంప మా***
***నస మగు తీర్థ మాడని జనంబులకు బహు బాహ్య తీర్థముల్."***

ఈ పద్యం ఉదహరించటం ద్వారా, మానస భావయుక్తములు కాని తీర్థయాత్రలు కేవలము ప్రయాస మాత్రములు, విహార యాత్రల వంటివి మాత్రమేనని తీర్మానించారు. 'ఆప ఏవ లోకః సృజాత్': ఆపస్సులు అనగా జలములు. ఈ జలముల చేతనే సమస్త లోకములు, శరీరములు, మానవులతోసహా సమస్త జీవులు సృజింపబడినవి. ఈ విధంగా స్వతహాగా స్వచ్ఛమైన జీవులు ముఖ్యంగా కొంత జ్ఞానసంపన్నులైన మానవుల

మనసులు, పూర్వజన్మ సంస్కారముల వలననూ, అవిద్య, అస్మిత, రాగ ద్వేష అభినివేశములు, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములు అనే అరిషడ్వర్గ దోషముల వలననూ పాపకర్మ సంపర్కమై అసురాక్రాంతము లగుచున్నవి. పరిశుభ్రముగా నున్న ఇంటియందు దుమ్ము ధూళి తనంతట తాను పడగా ఏ విధంగా శుభ్రం చేసుకుంటామో అదేవిధంగా మలినాక్రాంత మైన మనసులను సత్కర్మల ద్వారా పరిశుద్ధం చేసుకోవటం కూడా సన్మార్గులకు అంతే అవసరం. *'తృతర తీతి తీర్థం'* అనగా తరింపజేసేది తీర్థం అని అర్థం. కనుక తీర్థ దర్శనం ద్వారానే కల్మషమైన మనసులను పరిశుద్ధం చేయవచ్చునని చెప్పబడింది. అందుకు సూటియయిన మార్గమే తీర్థ దర్శనాలు.

*"మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయో "* అని కదా భగవద్గీత ప్రమాణము. మనసే మనుష్యుడు. ఆ మనసే ఇటు బంధానికి, అటు ఆ బంధాన్నుంచి విడిపించుకునే మోక్షానికి కూడా కారణమై ఉన్నది. *"చంద్రమా మనసో జాతా"* అనే పురుషసూక్త మంత్రము ద్వారా మనసు చంద్రుని వల్ల ఏర్పడినదని తెలుస్తున్నది. ఆకలి అనే అగ్నిలో అన్నము అనే సోమాన్ని వేయడంవలన ఆ అగ్నిలో ఆహుతి అయిన అన్నము ద్వారానే మనసు నిర్మింపబడుచున్నది. *దీనికి "అన్నమయం హి సౌమ్య మనః"* అన్న శ్రుతి ప్రమాణము. ఆ మనసు జలము వలెనే చంచలమయి నిరంతరమూ కదులుతూ ఉంటుంది. విశ్వరూపదర్శన సమయంలో అర్జునుడంతటి వాడే *"చంచలం హి మనః కృష్ణా"* అనటం మనకు తెలుసు. గంగ, యమునా, సరస్వతి, కృష్ణ, కావేరి, గోదావరి మొదలైన అనేక పుణ్య నదీతీర్థాలను దర్శించటం ద్వారాను, వాటిలో సంకల్ప పూర్వకంగా స్నానాలు ఆచరించటం ద్వారానూ, మనసులను నిర్మలం చేసుకుని స్థిరత్వం సాధించి తద్వారా

పాపసంచితాలను కొంతవరకు తగ్గించుకొని మోక్షమార్గానికి చేరువ కావచ్చును.

అదేవిధంగా మహర్షులు, ఈశ్వరాంశ సంభూతులు ఎక్కడెక్కడ అవతరించియుండిరో, ఎక్కడెక్కడ సమంత్ర పూర్వకముగా దేవతాశక్తి ప్రతిష్టింప బడియున్నదో ఆ ప్రదేశములన్నీ పుణ్యక్షేత్రాలుగా పరిగణింప బడుచున్నవి. ఆయా ప్రదేశాలకు మనం భౌతికంగా చేరుకొని, విహరించి, అక్కడ ఆహారము భుజించి, జలమును సేవించడం ద్వారా మనసుకు ప్రశాంతత చేకూరి పుణ్యమార్గము సుగమం అవుతున్నది. ఇదే తీర్థదర్శన లక్ష్యమూ ప్రధాన ప్రయోజనమూనూ.

ఇక యాత్ర విషయానికి వస్తే, మానవ జీవితమే ఒక యాత్ర. తల్లి గర్భము నుండి భూమి మీద పడినది మొదలు, ఈ శరీరమును వాహనముగా చేసుకుని అందులోని జీవుడు ప్రయాణము సాగిస్తూనే ఉంటాడు. ఆ ప్రయాణమే భౌతిక జీవనం. ఈ జీవనానికి ఒక రక్షణ, ఒక భద్రత అవసరం. కేవలము భౌతిక, లౌకిక, సంపదతో కూడిన వనరులు మాత్రమే ఈ రక్షణను భద్రతను కల్పించజాలవు. సౌఖ్యవంతమైన లౌకిక జీవనానికి ఆయుష్యు, ఆరోగ్యము, ఐశ్వర్యము - ఈ మూడు ప్రధాన వనరులు. కాని, అవే సర్వస్వము కావు. ఈశ్వర విభూతిగా సంప్రాప్తించిన ఈ వనరుల ద్వారా ఈ దేహాన్ని సత్కర్మలను ఆచరించుటకు మాత్రమే నియోగించవలసి ఉంటుంది.

వేదాలలో ఆదిభౌతిక, ఆది దైవిక, ఆధ్యాత్మిక అని మూడు కోణాలు సూచించబడ్డాయి. మనం ప్రత్యక్షంగా (చూస్తున్న) నివసిస్తున్న పృథ్వి ఆది భౌతికమైతే, సర్వదేవతామండలమైన సూర్యమండలం నుండి *"పరోక్ష ప్రియ ఇవహి దేవాః"* పరోక్షంగా ప్రసరించేది ఆదిదైవిక శక్తి. ఆ శక్తిని ఆత్మయందు

ఆవాహన పూర్వకంగా అధిష్టించుకున్నదువల్ల (అధి + ఆత్మ = అధ్యాత్మ) పొందే భౌతిక సౌఖ్యాలు ఒక స్థితి. అయితే అంతకంటే అనేక రెట్లు ఆనంద దాయకమైన స్థితి పొందటమే జీవనలక్ష్యంగా చేసుకున్నట్లయితే అందుకు 'తీర్థయాత్రలు' అతిభద్రమైన సులభమైన సోపానాలని చెప్పవచ్చు.

*'జ్ఞానం, జ్ఞానేన పరిపూర్ణతే'* అని మనం వింటూంటాం. జ్ఞాన సముపార్జన ఈ శరీరంలో ప్రాణప్రతిష్టతోనే ప్రారంభమవుతుంది జన్మించిన కొద్ది క్షణాలకే శిశువు మాతృ స్థన్యాన్ని అందుకోవటం ఇందుకు ఒక చక్కని ఉదాహరణ. ఈ జ్ఞానం సమకూరేది, నిలిచి ఉండేది శరీరంలో ప్రాణం నిలిచి ఉన్నంతవరకే. కనుక జ్ఞాన సముపార్జన ఎలాగైతే జ్ఞానంతో ప్రారంభ మౌతుందో అట్టి జ్ఞానం మళ్ళీ జ్ఞానంతోనే పరిపుష్టమవుతూ ఉంటుంది. ఇది అంతమంటూ లేనటువంటి నిరంతర ప్రక్రియ. అందుచేత జీవనయాత్ర భద్రంగా కొనసాగాలంటే జీవితకాలంలో సంపాదించుకున్న జ్ఞానం, అది ఎంత కొద్దిపాటిదైనప్పటికీ, దానిని తీర్థయాత్రలతో మేళవించటం ద్వారా వర్తమాన జీవితాన్ని మరింత జ్ఞానసంపన్నం చేసుకోవటానికేకాక జీవన్ముక్తినికూడా పొందవచ్చును.

కాశి,గయ, బ్రహ్మకపాలం వంటి అత్యంత పుణ్యప్రదేశములను కేవలం దర్శించటమేకాక, పితృ కార్యములు నిర్వహించటం ద్వారా మనం తరించటమేకాక, జన్మకారకులయిన మన పూర్వీకులనుకూడా తరింపజేయ వచ్చును. సూక్ష్మంగా ఇదే తీర్థయాత్రల ఆవశ్యకత.

ఈ ఆవశ్యకతను గుర్తించినవారైనందునే, వాహనాలు లోయల్లో పడిపోయే ప్రమాదాలకు ఆలవాలమైన ప్రయాణాలకు, ప్రాణవాయువు లభ్యం కాని దుర్భరమైన పరిస్థితులకు సయితం సంసిద్ధమై, వయోవృద్ధులు, కొద్ది మాసాల వయసున్న శిశువులతో కూడిన బృందాలు, అత్యంత దుర్లభంగా

పరిగణింపబడే అమరనాథ్, మానససరోవర్, ముక్తినాథ్, యమునోత్రి, గంగోత్రి, కేదార్ నాథ్, బదరినాథ్, వంటి యాత్రలు చేపట్టిన సందర్భాలు మనం చూస్తున్నాం.

శ్రీ కొండూరు తులసీదాసు గారు నాకు ఎంతో ఆత్మీయులు. ఎన్నో సంవత్సరాలనుండి సుపరిచితులు. వారే కాకుండా వారి కుటుంబంలోని యావన్మంది నన్ను 'వాసుసార్' అని పిలుస్తూ ఆత్మీయతలోని మాధుర్యాన్ని పంచుతుంటారు. జీవితంలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే వ్యక్తిగా వారు ఎందరికో ఆదర్శవంతులు.

వారు కుంటుంబ సభ్యులతో ఆధ్యాత్మిక సంస్కారములతో మానస భావయుక్తముగా చేసిన ఈ హిమాలయ యాత్ర హృదయ పూర్వకంగా అభినందించదగినది. వారిచే రచించబడి, ఫొటోలతో కూడిన 'మా తీర్థ-విహార యాత్ర' గ్రంధం, యాత్రలు చేయాలనుకునేవారికి కరదీపికగానేకాక, భావి తరాల వారికి ఎంతో జ్ఞానదాయకంగా నిలుస్తుందని మనఃపూర్వకంగా విశ్వసిస్తున్నాను.

ఇదే ఉత్సాహంతో వారు మరిన్ని యాత్రలు చేసి, ఆ అనుభవాలతో మరొక గ్రంధం వ్రాయాలని నా ఆకాంక్ష. అందుకు అవసరమైన అన్ని వనరులు అవకాశాలు సమకూర్చాలని ఈశ్వరుడిని ప్రార్ధిస్తున్నాను. నా అభిప్రాయాలను ఈ గ్రంధంలో పీఠికగా చేయటం నాకు దక్కిన గౌరవంగా భావిస్తూ ఈ విధంగా నా భావాలను పదుగురితో పంచుకునే అవకాశం కల్పించినందుకు వారికి కృతజ్ఞతలు. --

■ ***ఆచార్య వాసుదేవ***

***డాక్టర్ R.V.S.S అవధానులు,*** H-34, మధురానగర్,
M.Sc.,(NuclearPhysics) హైదరాబాద్ 500038
M.A.,Ph.D (Sanskrit) M.A.,Ph.D (Jyotisha)
Dy.Director (Computers) (Retd) NIMS, Hyderabad.

**వ్యవస్థాపకులు,**

**శ్రీ వేద భారతి**

మా ప్రియ మిత్రులు శ్రీ కొండూరు తులసీదాస్ గారు రచించిన "మా తీర్థ విహారయాత్ర" పుస్తకాన్ని ఆసాంతం చదివేను. వెంటనే దీనిపై నా అభిప్రాయాన్ని వ్యక్తం చెయ్యాలనిపించింది. ఈ పుస్తకం లోని రచనా శైలి ఒక చక్కని నవలలా సాగిందని చెప్పాలి. ఎక్కడా లోపం కనిపించలేదు. ఎక్కడా విసుగనిపించలేదు. నిజానికి ఒక్క పట్టులో ఈ పుస్తకం చదవడం పూర్తయింది.

ఇందులో ధర్మార్థ కామ మోక్షాలు అని పిలువబడే చతుర్విధ పురుషార్థాలకు చెందిన విషయాలు ఉన్నాయి. తీర్థ యాత్రా భాగం ధర్మ మోక్షాలకు చెందినది కాగా, విహార యాత్రా భాగం ధర్మ కామాలకు చెందినది గానూ జమా ఖర్చులు, పద్దులు అర్థానికి చెందినవి గానూ ఉన్నాయి.

దీనిలోని విషయం దేవభూమి స్థల సందర్శనము. అది తీర్థస్థలమైనా కావచ్చు, లేక విహారస్థలమైనా కావచ్చు. ఏదైనా, దేవభూమికి చాలా దూరంలో ఉండి, ముఖ్యంగా ఆ ప్రాంతంతో బొత్తిగా పరిచయంలేని మనవంటివారికి, ఈ పుస్తకం మంచి "మార్గదర్శి" గా ఉపయోగిస్తుంది. ఇది క్షేత్ర మహాత్మ్యాలను వర్ణించటానికి ఉద్దేశించ బడిన గ్రంథం కాదు. యాత్రను సుకరంగా ఎట్లా చేసుకోవాలి అనే అంశాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకుని వ్రాసిన గ్రంథం.

సామాన్యంగా, మనకు తెలియని ప్రదేశానికి వెళ్ళాలంటే ఒక బెరుకు ఉంటుంది. అందుకు కారణం సుదూరప్రాంత యాత్రలకు ఎక్కువమంది వెళ్లకపోవటానికి ఆ స్థల జ్ఞానము లేకపోవడమే. కేవలం ఆ కారణంగా యాత్రలు చేసే విషయంలో ఉదాసీనంగా ఉన్నవారిని యాత్రకు ఉన్ముఖులుగా చేయడం యాత్రా

మార్గదర్శి గ్రంథం చేయవలసిన ప్రధాన అంశము. ఆ విధంగా ఈ పుస్తకం ఎంతోమందికి ఉత్ప్రేరకంగా (Catalyst) పని చేస్తుందనడంలో సందేహం లేదు.

యాత్ర చేద్దామని నిర్ణయం తీసుకున్నాక, ఎక్కడెక్కడకు వెళ్ళాలి, అవి ఎక్కడెక్కడ ఉన్నాయి అనే వివరాలు కావలసి ఉంటుంది. తానూ చేసిన యాత్రల వరకూ రచయిత ఆ వివరాలన్నీ ఈ పుస్తకంలో కళ్ళకు కట్టినట్లు వివరించారు. అదే విధంగా యాత్రా సమయంలో ఎక్కడెక్కడ ఏమేమి వసతులు ఉన్నాయి, మనకు ఏది సరిపోవచ్చును, అనే అంశాలు కూడా ఈ పుస్తకంలో చక్కగా స్పృశించారు.

ఇక యాత్ర మధ్యంలో ఊహించని అవరోధాలు/ఆపదలు వస్తే, వాటిని అధిగమించే విధానాలను తెలుపటం ద్వారా ఒక సంరక్షకుని బాధ్యతను కూడా ఈ పుస్తకం నెరవేర్చింది.

యాత్ర మొత్తం మీద ఆర్థిక వనరులపై సంయమనం పాటించే విధంగా మానసిక స్థితిని కల్పించడంద్వారా ఒక సుశిక్షితుడైన యాత్రికునిగా తర్ఫీదు ఇస్తున్నట్లుగా కూడా ఈ గ్రంథం ఉపకరిస్తోంది. ఇట్లు అనేక కోణాలలో, యాత్ర చెయ్యాలనే సంకల్పం చేయించడం లగాయతు, సుఖంగా ఇంటికి చేరేవరకు చేయిపట్టుకుని నడిపిస్తున్న మార్గదర్శి ఈ పుస్తకం. ఇంత చక్కని పుస్తకాన్ని మనందరికీ అందించిన శ్రీ తులసీదాస్ గారికి మా హృదయపూర్వక అభినందనలు, అభివందనములు కూడా.

***డా| రేమెళ్ల అవధానులు***

**శ్రీ వేద భారతి**

# తీర్థ యాత్ర

## మొదటి అధ్యాయం

**పూర్వరంగం**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖలో డిప్యూటీ డైరెక్టరుగా 2004 లో పదవీ విరమణ చేసిన తరువాత ఆర్థిక ప్రయోజనాలు పూర్తిగా అందటానికి, మిగిలిన బాధ్యతలను పూర్తి చేయటానికి రెండు సంవత్సరాలు పట్టింది. అలా విశ్రాంత కక్ష్యలో స్థిరపడ్డాక తీర్థయాత్రల గురించి ఆలోచించ సాగాను. మొదటగా స్వరాష్ట్రంలో అంతవరకూ దర్శించకుండా ఉన్న క్షేత్రాలను, తీర్థాలను దర్శించాము.

2008 సంవత్సరం జనవరిలో ఒక ప్రాతఃకాలవేళ ఎందుకో, దైనందిన జీవితం ఏ ప్రత్యేకతా లేక నిస్తేజంగానూ, అర్థ రహితంగానూ తోచింది. ఏదైనా ప్రధానమైన తీర్థయాత్ర చేద్దామా అనే ఆలోచన కలిగింది. ఆ ఆలోచనను నా శ్రీమతితో పంచుకోగా వెంటనే కాశీ యాత్రకు మించిన యాత్ర ఏముంటుంది అక్కడికే వెళ్లి వద్దామా! అని సూచించగా చాలా సముచితంగా తోచింది. అయితే ఎలాగూ అక్కడివరకూ వెళుతున్నాం కనుక కేవలం ఒక కాశీ తోనే సరిపెట్టకుండా ఆగ్రా, మధుర, డిల్లీ, హరిద్వార్, రిషీకేష్ అయోధ్య, అలహాబాదు, గయ కూడా వెళ్ళటానికి సంకల్పించాం. తదనుగుణంగా మార్చి ఒకటవ తేదీన బయలుదేరి పద్నాలుగవ తేదీకి తిరిగి వచ్చేట్టుగా రెండు వారాలకు సరిపోయే కార్యక్రమం రూపొందించాను. ఆ సమయంలో మా అన్నగారి కుమారుడు చి| బింబాధర్ ఈటీవీ తరఫున లక్నోలో కెమెరామన్ గా పనిచేస్తున్నాడు. అతనిని సంప్రదించగా ఆగ్రా, డిల్లీ, హరిద్వార్, అలహాబాదుల పర్యటనలలో మాకు సహాయ పడవలసినదిగా ఆయా నగరాల్లో పనిచేసే తన

సహచరులను కోరాడు. ముందస్తు ఏర్పాటులో భాగంగా మొత్తం యాత్రకు ప్రణాళిక సిద్ధం చేసుకుని, రైలు ప్రయాణాలకు టిక్కెట్లు రిజర్వు చేయించాను.

**ఆగ్రా**

ఆ ప్రణాళిక ప్రాతిపదికగా 2008 సంవత్సరం మార్చి ఒకటవ తేదీ శనివారం ఉదయం గం.6.25 ని.లకు హైదరాబాదు నుండి ఆంధ్రప్రదేశ్ ఎక్స్ ప్రెస్ లో బయలుదేరి ఆ మరునాడు (2వ తేదీ ఆదివారం) ఉదయం గం.5.20 ని.లకు ఆగ్రా కంటోన్మెంటు స్టేషనులో దిగాము. రాజేష్ అనే యువకుడు స్టేషనులో వాహనంతో సహా మాకు స్వాగతం పలికి నేరుగా అతని బసకు తోడ్కొని వెళ్ళాడు. అక్కడ స్నానాలు ముగించి ముందుగా తాజమహలుకు వెళ్ళాము.

ఇది ఆగ్రా నగరానికి దక్షిణ దిశగా మూడు కిలోమీటర్ల దూరంలో యమునానది కుడి ఒడ్డున నిర్మితమై ఉన్నది. సూర్యోదయంతో ప్రారంభించి సూర్యాస్తమయం వరకు ఒక్క శుక్రవారం తప్ప ఏ రోజైనా దీనిని సందర్శించవచ్చు. ప్రవేశ రుసుములో స్వదేశీయులకు విదేశీయులకు మధ్య భారీ వ్యత్యాసముంటుంది. పదహారు సంవత్సరాల దాటి పెద్దలుగా పరిగణింపబడే (ఆ లోపు వారికి ఉచితమే) భారతీయులకు కేవలం ఇరవై రూపాయలు మాత్రమే కాగా, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక, మయన్మార్, థాయిలాండ్ దేశాలకు చెందిన పౌరులకు 510 రూపాయలు మిగతా విదేశీయులందరికీ 750 రూపాయలు వసూలు చేస్తారు. పున్నమి రాత్రులలో రాత్రి గం.8.30 ని.ల నుండి గం.12.30 ని.ల వరకు ప్రత్యేక సందర్శనకు మాత్రం భారతీయ పెద్దలకు 510, పిల్లలకు (3-15 సంవత్సరాల వయసు) 500 రూపాయలు కాగా ఏ విదేశీయులకు 750 రూపాయలు.

ఆగ్నేయాసియా ప్రాంతీయ సహకార సంఘం (South Asia Association for Regional Cooperation – SAARC) లో ప్రస్తుతం సభ్యులుగా ఉన్న ఆఫ్ఘనిస్తాన్, ఇండియా పాకిస్తాన్, బంగ్లాదేశ్ భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక దేశాలు తమ దేశాలలో ఆర్థిక వాణిజ్య పారిశ్రామిక అభివృద్ధికి పరస్పరం సహకరించుకోవటంతో పాటు, ఆయా దేశాలకు చెందిన చరిత్ర, నాగరికతలు, వివిధ కళలు, సంస్కృతులను పరిరక్షించుకోవడం ఈ సంఘం ప్రధాన లక్ష్యాలలో చేర్చబడి ఉంది. అందుచేత, ఈ దేశాల పౌరులు ఏ ఇతర దేశాలలో పర్యటించినా అప్పటికి అమలులో నున్న ఒప్పందం మేరకు ఏర్పరచుకున్న విధానానికి లోబడి వీటి ప్రవేశరుసుములు నిర్ణయించ బడతాయి. ఈ సార్క్ దేశాలే కాక వీటి పొరుగున ఉన్న మయన్మార్ (ఒకప్పటి బర్మా) థాయిలాండ్ దేశాలు ఇంకా సార్క్ లో సభ్యత్వం లేనప్పటికీ ఈ దేశాలకే సంబంధించిన ఒక ఉప ఆర్థిక సమాఖ్య The Bay of Bengal Initiative for Multi Sectoral Technical and Economic Cooperation – BIMSTEC) లో సభ్యులైనందున ఆ దేశాల పౌరులకు కూడా ఇవే నియమాలు వర్తింపజేయ బడ్డాయి.

ఆగ్రాలో నున్న చారిత్రాత్మక కట్టడాలన్నీ యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపబడి భారత ప్రభుత్వ పురావస్తు సర్వేక్షణ (Archeological Survey of Inida)అధీనంలో పరిరక్షింపబడుతూ నిర్వహింప బడుతున్నాయి. ఈ కారణం చేత వీటన్నిటికీ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఉన్నాయి. ఈ తాజమమహాలుకు ఈ ఏర్పాట్లు మరింత ప్రత్యేకం.

టికెట్లు తీసుకుని భద్రతా వలయాలను దాటుకుని 8 గంటల వుతుండగా ప్రధాన ప్రవేశ ద్వారం దాటి లోపలకు ప్రవేశించాము. కట్టడం యొక్క ప్రత్యేకతను, చరిత్రను వివరించటంతో పాటు సాహిత్యం, ఫోటోలు విక్రయించటం, అవసరమైన సందర్శకులకు ఫోటోలు తీసి తక్షణమే

అవి అందించే గైడులు ఇక్కడ ఉంటారు. సందర్శకుల అవసరాలు, శ్రేయస్సు రీత్యా ఈ గైడుల సేవలు వ్యవస్థీకృతమై ఉండటం వల్ల, ఇక్కడ, వారి ఆధిపత్యం ప్రస్ఫుటంగా కనబడుతుంది. బయటినుంచి వచ్చిన వారెవరైనా ఈ కలాపాలు చేస్తుంటే వీరు తీవ్రంగా ప్రతిఘటిస్తారు. మాతో వచ్చిన రాజేష్ కు కూడా ఈ ప్రతిఘటన ఎదురైంది. అక్కడి విశేషాలను వివరిస్తూ మమ్ములను (మా కెమెరాతో) ఫోటోలు తీస్తుండగా అతనిని మేము స్వయంగా తెచ్చుకున్న బయటి గైడుగా పొరబడి అడ్డుకున్నారు. అతను స్వయంగా మీడియాకు చెందినవాడు కూడా కావటంతో సంబంధిత అధికారులకు తన గుర్తింపును నివేదించి మమ్ములను తన కుటుంబ అతిథులుగా వివరించి మరీ వారి అనుమతి పొందవలసి వచ్చింది.

అంతవరకూ ఫోటోలు సినిమా ల్లోనూ చూడటమే తప్ప ఆ సౌందర్యం



ప్రత్యక్షంగా చూడటం అదే ప్రథమం. అందుచేతనే కాబోలు, అల్లంత దూరం నుంచి చూడగానే ప్రపంచపు అద్భుతాలలో దీనికి ఎందుకు స్థానం లభించిందో అర్థమైంది. ఆదివారం కావటంతో దేశ విదేశీ పర్యాటకులతో ఆ ప్రాంతమంతా రద్దీగానూ కళకళ లాడుతూనూ ఉంది.

ఈ ప్రాంతం విస్తీర్ణం 896.1 మీటర్ల పొడవు 300.84 మీటర్ల వెడల్పుతో మొత్తం 2,69,512.72 చదరపు మీటర్లు. అందులో కట్టడాలు నిర్మాణమై ఉన్న ప్రాంత వైశాల్యం 1,25,299.86 చదరపు మీటర్లు. ప్రధాన ప్రాంతానికి నలు దిశలా నాలుగు మహా ద్వారాలున్నాయి. ఇవి పేరుకే ద్వారాలు. కానీ ఒక్కక్కటీ ఒక్కొక్క భవనమే. వీటిలో దక్షిణ దిక్కులో ఉన్నది ప్రధాన ప్రవేశ

ద్వార భవనం. దీని పొడవు 41.2 మీటర్లు వెడల్పు 34 ఎత్తు 23.07 మీటర్లు. ఈ ప్రవేశ ద్వారానికి ముందు 'జిలౌఖానా' అనబడే సువిశాల ప్రాంగణంలో ప్రవేశిస్తాము. ఈ ప్రాంగణానికి తిరిగి తూర్పు, పశ్చిమ దిశలలో చేరోకటి ప్రవేశ మార్గాలున్నాయి. పశ్చిమ దిక్కులో నున్నది వాహనాల్లో వచ్చేవారికి ప్రవేశ ద్వారం. వాహనాలకు విశ్రమ స్థానం కూడా ఈ ప్రాంగణమే. మేము కూడా వాహనంలోనే వెళ్ళినప్పటికీ ఈ ద్వారాన్ని వాడుకోలేదు. కారు పార్కింగు రుసుము చాల ఎక్కువట.. ఇతమిద్ధంగా గుర్తులేదు. మాది అద్దె వాహనం. డ్రైవరు ఎలాగూ వాహనం వద్దే ఉంటాడు కనుక, స్వల్పమే కానీ, అధికమే కానీ, అది ఎంతయినా మనకు పార్కింగు అవసరం లేదన్నాడు డ్రైవరు. తను నిరీక్షించే ప్రదేశాన్ని చూపి, తూర్పు వైపు వీదిలో నుండి పాదచారులు 'జిలౌఖానా' లో ప్రవేశించే ప్రవేశ ద్వారం భద్రతా వలయం వద్ద మమ్ములను దింపి అతను వీడ్కోలు పొందాడు.

ప్రధాన ద్వారంలోనుంచి అసలు ప్రాంగణంలోకి ప్రవేశిస్తూనే ఆవిష్కృతమయ్యే మనోహరమైన దృశ్యంతో మనకు తెలియకుండానే ఒక విధమైన పులకింతకు లోనవుతాము. అలా మనం నిలుచున్న ప్రదేశానికి ఎదురుగా చేతికి అందుతుందా అన్నట్లుండే, తాజమహలుకు మధ్య దూరం ముప్పావు కిలోమీటరు. మధ్యలో రెండు భాగాలుగా, నీరు చిమ్మే ఫౌంటేన్లతో పొడవైన నీటి కొలను. దీనిలో నీరు ప్రవహిస్తుంది కాని స్థిరంగా ఉన్నట్లే కనబడుతుంది .

ఈ నీటి కొలనుకు ఇరు వైపులా తిరిగి ఒక్కొక్కటీ 296.31 మీటర్ల వెడల్పు, అంతే పొడవుతో రెండేసి భాగాలుగా ఉన్న ఉద్యానవనం. మొత్తం నాలుగు భాగాలుగా ఉన్న ఈ ఉద్యానవనానికి 'చార్ బాగ్' అని పేరు. ఈ ఉద్యానవనం లోని రెండు భాగాలు వాటి మధ్యస్థమై ఉన్న నీటి కొలనులు,

మొత్తంగా ఒకదాని కొకటి అద్దంలో ప్రతిబింబం వలె ఉంటాయి. ఈ రెండు నీటి కొలనుల భాగాలు, నాలుగు ఉద్యానవన భాగాలు కలిసే చోట రెండు విశాలమైన అరుగులు ఉన్నాయి. వీటిపై ఉన్న రాతి బల్లలపై కూర్చునే పర్యాటకులు తాజమహల్ నేపథ్యంలో ఫోటోలు దిగుతారు.

ఈ ఉద్యానవనాలకీ నేటి కోలనుకు మధ్యన మళ్ళీ ఇరువైపులా ఇరవయ్యేసి అడుగుల వెడల్పుతో తాజ్ మహల్ చేరుకోవటానికి పరిశుభ్రమైన కాలిబాట. ఈ కాలిబాట ద్వారా తాజ్ మహలు వద్దకు చేరుకుంటాము. పాదరక్షలు అక్కడ వదిలిపెట్టాలి. విదేశీయులకు వట్టి కాళ్ళతో నడిచే అలవాటు ఉండదు. అందుచేత వారు పాదరక్షలు విడిచే అవసరం లేకుండా ప్లాస్టిక్ సంచులను ఇస్తారు. వాటిని పాదరక్షలపైనే కాళ్ళకు తొడుక్కుంటారు. అక్కడనుంచి కొన్ని మెట్లెక్కి 56.9 మీటర్ల చొప్పున ఉన్న నలుచదరపు ప్రదేశానికి చేరతాము. ఒక విధంగా ఈ ప్రదేశం తాజమహలు పీఠం అన్నమాట. దీనికి నాలుగు మూలలా 5.65 మీటర్ల వ్యాసంతో ఒక్కొక్కటీ 56.9 మీటర్లు ఎత్తున్న నాలుగు గోపురాలు (Minarets) ఉంటాయి. ఒక్కక్క గోపురం మూడేసి భాగాలుగా మధ్యలో రెండేసి బాల్కనీలతో ఉంటాయి. వాటి పైకి మెట్లుంటాయి కానీ ప్రవేశం లేదు. మధ్యలో ఉన్న తాజమహలు భవనం మాత్రం ఉల్లిపాయ ఆకారంలో ఉండే గొడుగు (Dome) ఆకారంతో ఉంటుంది. సరిగ్గా ఆ గొడుగు క్రిందే పీఠం గర్భంలోనున్న గదిలో షాజహాన్, ముంతాజుల సమాధులు ఉన్నాయి. ఇక అక్కడికి ఎవరికీ ప్రవేశం లేదు. ఈ కట్టడం పూర్తి కాక మునుపు ఈ సమాధుల చుట్టూ స్వర్ణంతో సహా వివిధ లోహాలతో చేసిన

కమ్మీలతో ఏర్పాటు చేసిన తెర ఉండేదట. అయితే ఇప్పుడు దాని స్థానంలో పైన ఉన్న ఛత్రానికి నిమ్నంగానున్న ప్రదేశంలో ఏర్పాటు చేసిన లోహపు చట్రాల చుట్టూ పాలరాతితో నిర్మితమైన పిట్టగోడ వద్ద నిలబడి ఆ చట్రాల నుంచి సమాధులను దర్శించాలి. ఈ పీఠానికి సమాంతరంగా పశ్చిమ దిక్కున ఒక ప్రార్థనా మందిరం (మసీదు) రెండో వైపున అంటే తూర్పున 'జవాబ్' అనే మరో కట్టడం ఉన్నాయి. పరికించి చూస్తే తప్ప ఈ రెండింటి మధ్య నిర్మాణ శైలిలోనున్న తేడా తెలియదు. ఇక ఈ కట్టడానికి వెనుక వైపు అంటే, ఉత్తర దిక్కున యమునా నది తూర్పు దిక్కుగా ప్రవహిస్తూ ఉంటుంది. తాజ్ మహలుకు సమాంతరంగా నదికి ఆవల *'మెహతాబ్ బాగ్'* అనే ఉద్యానవనం ఉన్నది. అయితే రెంటికీ నడుమనున్న యమునను దాటటానికి ఏర్పాట్లేవీ లేవు. చుట్టూ తిరిగి వెళ్లి చూడవలసిననంత ప్రత్యేకత కూడా ఏమీ లేదు. తిరిగి ప్రధాన ద్వారం దగ్గరకు చేరుకొని, దానికి ఎడమవైపుగా ఉన్న భారత సంస్కృతీ ప్రదర్శన శాలలో మేరికొంత సేపు గడిపాము.

ఈ సౌధాన్ని ఒక మతానికి చెందినది గానో లేదా మరింత అనుచితంగా ఒక మరుభూమి గానో పేర్కొంటూ చేసే వివాదాస్పద వ్యాఖ్యలను విస్మరించి ఆ సౌందర్యాన్ని మాత్రమే స్వాగతించి ఆస్వాదించటంలోనే మానవుని నిజమైన ఆత్మ సౌందర్యం, సంస్కారం ఆవిష్కృతమవుతుంది. ఈ ఒక్క సంస్కార ఔన్నత్యం కారణంగానే, ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాధినేతలూ, దేశాదిపతులు మొదలుకుని పారిశ్రామిక అధిపతులు, వాణిజ్య వ్యాపార వేత్తలు ఏ రంగానికి చెందిన ప్రముఖులైనా ఈ దేశానికి రావాల్సి వస్తే, ఆగ్రా పర్యటనకు కొంత సమయం తప్పకుండా కేటాయిస్తారు. ఇక తాజమహలు విషయం ప్రత్యేకించి చెప్పనే అక్కరలేదు. ఇది చూడకుండా మిగతా దేశం ఎంత పర్యటించినా అది అసంపూర్ణం గానే పరిగణింపబడుతుంది. మొత్తం ఒక

రెండు గంటలపాటే అయినా, జీవితాంతం గుర్తుండిపోయే మధురాను భూతిని మదినిండా నింపుకుని అక్కడనుండి నిష్క్రమించాము.

అక్కడనుండి ఆగ్రాలో మరో ప్రధానమైన చారిత్రిక కట్టడం ఆగ్రా కోటకు వెళ్లాం. ఇది తాజమహలుకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో పూర్తిగా నైరుతిగా కాక దక్షిణ పశ్చిమ దిశగా ఉంది. నల్లటి అసంఖ్యాకమైన నల్లటి సన్న దోమలు మమ్మల్ని చుట్టుముట్టి స్వాగతం పలికాయి.

ఈ దుర్గం ప్రధమంగా అక్బరు చక్రవర్తిచే నిర్మింపబడినా తదుపరి కాలంలో ఆయన వారసులైన జహాంగీర్, షాజహాన్, ఔరంగజేబులు దీనిలో మార్పులు చేయటంతో పాటు అదనంగా అనేక మహళ్ళు ఇతర కట్టడాలు నిర్మించారు. ఇందులోని అన్ని కట్టడాలు గట్టి ఎఱ్ఱ రాతితో నిర్మింప బడటం విశేషం. ఒకటి 70 అడుగుల ఎత్తు మరొకటి 40 అడుగుల ఎత్తుతో రెండు వరుసల ప్రహరీ గోడల మధ్యన ఈ దుర్గం ఉన్నది. ఈ గోడల పొడవునా లోపల ఒకటి వెలుపల ఒకటి రెండు లోతైన కందకాలు ఉన్నాయి. ఆ రోజుల్లో ఈ కందకాలలోని నీటిలో భయంకరమైన మొసళ్ళు ఉండేవట. లోపలి కందకం ఆనవాళ్ళు ఇప్పటికీ ఉండగా వెలుపలి కందకం మాత్రం పూడ్చేసి దానిపై రహదారి నిర్మించారు. ఈ కోటకు ఉన్న మొత్తం నాలుగు ద్వారాల్లో రెండు శాశ్వతంగా మూతపడగా డిల్లీ గేటు, లాహోరు గేటు అనే రెండు మాత్రం వినియోగంలో ఉన్నాయి. లాహోరు గేటునే *'అమర్ సింగ్ ద్వారం'* అని కూడా పిలుస్తారు. ఇదే ప్రధాన ప్రవేశ ద్వారం. భద్రతా తనిఖీ కూడా ఇక్కడే..

ఈ ద్వారానికి ఈ పేరు రావటానికి ఆసక్తికరమైన కథ ఒకటి ప్రచారంలో ఉంది. ఒకనాడు షాజహాన్ చక్రవర్తి నిండు సభలో కొలువై ఉండగా, ఆ సభలోనే ఉన్న జోధపూర్ మహారాజైన అమర్ సింగ్ రాథోడును షాజహాన్ కోశాధికారి సలాబత్ ఖాన్ అవమానించాడట. అందుకు నిరసనగా సభనుంచి నిష్క్రమించిన అమర్ సింగును బంధించటానికి సైనికులు వెంటపడగా అమర్ సింగ్ తన గుఱ్ఱాన్ని ప్రహరీ గోడపైనుంచి దూకించే ప్రయత్నంలో గుఱ్ఱం విఫలమై కందకంలో పడి మరణించిందట. ఆ సంఘటన స్మృత్యర్థం ఆ స్థలంలో ఈ ద్వారాన్ని నిర్మించి అక్కడే అందమైన ఆ గుఱ్ఱం విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ ద్వారంలో నుంచి ప్రవేశించగానే ఆకట్టుకునేది జహంగీర్ మహల్. అక్బరు కాలం నాటినుంచి ఔరంగజీబు వరకూ అందరికీ ఇదే రాజమహలు.

దీనిలో రాణులకు వారి పరిచారికలకు ప్రత్యేకంగా 'రంగ మహలు,' ప్రజలతో ముఖా ముఖీకి 'దివాన్- ఎ -ఖాస్' అనే మరొక మందిరం ఉన్నాయి. ఇవన్నీ దర్శించాము. ఇవే కాక 'అంగూర్ బాగ్', 'మచ్చీ భవన్', రాజ వంశీయుల కొరకు ప్రత్యేకంగా ఒక మసీదు, 'మోతీ మసీదు' అని మరొకటి, అంతఃపుర స్త్రీల కొరకు 'నగీనా' మసీదు, 'తఖ్త్- ఎ -జహంగీర్' అనే జహాగీర్ సింహాసనం ఉండే ప్రదేశం మొదలైన వాటితో పాటు ఇంకా 'నౌబత్ ఖానా' 'శీష్ మహల్' 'జనానా' 'మీనా బజార్' వంటివి కూడా కోటలో భాగమే. దర్శించ దగినవే.

ముఖ్యంగా పర్యాటకులను ఆకర్షించేది షాజహాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న 'ముసమ్మన్ బుర్జ్'. ఇది మహలు యొక్క తూర్పు భాగంలో ఉన్నది. ఈ బురుజు బాల్కనీ నుంచి తాజమహలు స్పష్టంగా కనబడుతుంది. ఇక్కడనుండి ఏకాంతంగా తాజమలును తిలకిస్తూ మధుర స్మృతులలో మునిగిపోయేవాడట. తన జీవితపు చివరి రోజులలో కొడుకైన ఔరంగజేబుచే

చెరసాలలో బంధింపబడి తన తుది శ్వాసను కూడా ఇక్కడే విడిచినట్లు చెబుతారు.

ఆగ్రా కోట నుండి 'ఇత్మాదుద్దౌలా' అనే మరో చారిత్రిక ప్రదేశానికి వెళ్ళాము. జహంగీర్ భార్య నూర్జహాను తన తండ్రి మీర్జా ఘియాజ్ స్మారకార్థం నిర్మించిన అందమైన కట్టడం. ఆగ్రా కోట, తాజమహలు యమునా నదికి దక్షిణాన ఉండగా, ఇది ఉత్తర వైపున ఉన్నది. దీని సందర్శనతో ఆగ్రాలో మా పర్యటన ముగిసింది.

ఉదయం బరువైన అల్పాహారం తీసుకోవటం వల్ల ఆకలి అంతగా లేదు. అందువల్ల భోజనాల ప్రమేయం పెట్టుకోకుండా ఒకటిన్నర అవుతుండగా రాజేష్ కు వీడ్కోలు చెప్పి అదే వాహనంలో మధురకు బయలుదేరాము.

**మధుర**

మధ్యాహ్నం మూడు గంటలకు మధుర చేరాము. పౌరాణిక ప్రాశస్త్యం ఉన్న పురాతన పట్టణాలలో అతి ముఖ్యమైనది. శ్రీ కృష్ణుని ఆలయంతో ప్రసిద్ధి. భారతదేశంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నప్పటికీ వాటిలో కేవలం ఏడు అత్యంత పుణ్యప్రదమైనవిగా పురాణాలలో పేర్కొన బడినట్లు తెలుస్తున్నది. ప్రధానంగా గరుడ పురాణంలో ఇలా చెప్పబడింది.

***శ్లో॥ అయోధ్యా మధురా మాయా కాశీ కాంచీ*** హ్యవంతికా

***పురీ ద్వారావతీ జ్ఞేయా స్సప్తైతా మొక్షదాయకాః ॥***

వీటిలో మాయాపురి ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్రంలోనున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం హరిద్వార్ గానూ, 'అవంతికా' మధ్యప్రదేశ్ లోని ఉజ్జయిని గానూ, ద్వారావతీ పట్టణం గుజరాతు రాష్ట్రంలోని ద్వారకా గానూ గుర్తింపబడ్డాయి. మిగతా నాలుగూ, అయోధ్య, మధుర, కాశీ (ఉత్తర ప్రదేశ్) కంచి (తమిళనాడు) సాధారణంగా తెలిసినవే. తీవ్రవాదుల దాడుల నేపథ్యంలో అత్యంత కట్టుదిట్ట మైన భద్రతల మధ్య ఈ దేవాలయం రక్షణ దళాల ఆధీనంలో ఉన్నది. అందుచేత భద్రతా తనిఖీలు కూడా ఆ స్థాయిలో ఉంటాయి. ఇవన్నీ పాటిస్తూ లోనికి వెళ్ళాము. గర్భాలయంగా చెప్పబడిన ప్రదేశం ఒక గది లాంటిది. శ్రీ కృష్ణుడు బలరాముల విగ్రహాలున్నాయి.

చల్లగానుండే ఈ గర్భాలయంలోకి ప్రవేశంగానే కర్పూర చందనాది సుగంధాలతో మనసు అనిర్వచనీయమైన ప్రశాంతతకు లోనవుతుంది. శెలవు దినమేమో భక్తులతో రద్దీగా ఉండటంతో అక్కడ ఎక్కువ సేపు గడపలేక పోయాం. అదే ప్రాంగణంలో ఉన్న ఇతర దేవతా మూర్తులను సేవించి బయటకు వచ్చాం. అక్కడికి పదిహేను కిలోమీటర్ల దూరంలో బృందావనం ఉంది. సమయాభావం వల్ల అక్కడికి వెళ్ళలేదు.

శ్రీకృష్ణుడు గోపాలుడవటం చేత ఈ పట్టణంలో గోవులు అధికంగా ఉంటాయి. వాటిని ఇక్కడ ఎవరూ బంధించరు. కాకపోతే అవి విచ్చలవిడిగా వీధులలో తిరుగుతూ వాహనాల, పాదచారుల సంచారానికి ఆటంకం కలిగించకుండా వెదురు వాసాలతో దడులు కట్టి వాటిలో వదిలి మేత వేస్తారు. పట్టణమంతా పాలు సమృద్ధిగా లభిస్తాయి. భారీ భాండీలలో వాటిని కాచి విక్రయిస్తారు. పాల ఉత్పత్తులు కూడా విరివిగా లభిస్తాయి. ఒక దుకాణంలో

తీపి పదార్థాలు, పాలు సేవించి సమయం నాలుగున్నర అవుతుండగా రైల్వే స్టేషనుకు చేరుకొని వాహనాన్ని విడుదల చేశాం.

మధురలో సాయంత్రం గం.05.10 ని.లకు బిలాసపూర్ అమృతసర్ చత్తీస్ ఘడ్ ఎక్స్ ప్రెస్ లో డిల్లీకి బయలు దేరాలి. రెండు గంటలు ఆలస్యం కారణంగా రాత్రి గం.7.45 ని.లకు చేరవలసినది పది గంటలకు నిజాముద్దీన్ స్టేషనుకు చేరింది. బింబాధర్ నియోగించిన అతని స్నేహితులు (వారూ ETVకి చెందినవారే) ఎప్పటికప్పుడు ఫోను ద్వారా మా ట్రైను స్థితిని తెలుసుకుంటూ ఉన్నారు. అంత ఆలస్యమైనప్పటికీ, శ్రమ అనుకోకుండా స్టేషనుకు వచ్చి మమ్ములను కలిసి వెంటనే ఆటో ఒకటి మాట్లాడి ఎక్కించారు. వారు బైకు మీద అనుసరించగా న్యూడిల్లీకి చేరాము. స్టేషను ఎదురుగా ఒక మధ్య తరగతి లాడ్జీలో వసతి వారే మాట్లాడి దిగబెట్టి మరీ వెళ్ళారు. భోజనం చేసి ఆ మరునాటి డిల్లీ పర్యటనకు అవసరమయిన ఏర్పాటు అదే హోటలులో మాట్లాడి గదిలో స్థిరపడేటప్పటికి పన్నెండయింది.

## డిల్లీ

గత రాత్రి సుఖమైన నిద్ర లోపించినప్పటికీ, అవసరం రీత్యా మూడవ తేదీ వేకువనే లేచి త్వరగా తయారయి మేము బస చేసిన లాడ్జీ క్రిందనే ఉన్న రెస్టారెంటులో అల్పాహారం తీసుకుని ట్రావెల్ ఏజెంటు సూచన మేరకు సమీపంలో టూరిస్టు బస్సు బయలుదేరే ప్రదేశానికి వెళ్లాం. పర్యాటకులతో బస్సు నిండింది. పర్యటన నిర్వాహకులు నియమించిన గైడు కూడా ఉన్నారు. 8 గంటలకు బస్సు బయలు దేరింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువ జంటలతో పాటు కొందరు మా వయసు వారు కూడా ఉన్నారు. ముఖ్యంగా ఒక పదిహేను మంది తెలుగు వారి బృందం ఉంది. కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల తెలంగాణా రాష్ట్ర సమితి శ్రేణులకు చెందిన చోటా

నాయకులు. శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారు ఆ రోజు తన పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నారు. ఆయనకు సంఘీభావంగా వీరంతా డిల్లీకి వచ్చినవారు. మమ్ములను పరిచయం చేసుకుని సముచితమైన గౌరవం చూపారు. పర్యటన ఆద్యంతమూ సరదాగా చాలా సందడి చేశారు.

ఆయా ప్రాంతాల గురించి గైడు వివరిస్తుండగా పర్యటనలో ఎక్కువ భాగం బస్సులోనుండే తిలకించాము. దరియాగంజ్ ప్రాంతం మీదుగా మహాత్మాగాంధి మార్గం గుండా ఎర్రకోట సమీపం నుంచి ప్రయాణించి నప్పటికీ బస్సును అక్కడ నిలపలేదు. ఆ రోజు సోమవారం శెలవు కారణంగా ప్రవేశం ఉండదట. మొదట జవహర్లాల్ నెహ్రూ స్మారకం శాంతివనం అక్కడనుండి ఆ సమీపం లోని మహాత్ముని స్మారకం రాజ్ ఘాటుకు చేరాము. అక్కడనుంచి పార్లమెంటు భవనం వద్దకు చేరాము. ఆ మార్గంలోనే సోనియా గాంధీ నివాసము, AICC కార్యాలయం, హేమామాలిని మొదలైన ప్రముఖ పార్లమెంటు సభ్యుల నివాసాలు ఉన్నాయి. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున చాలా దూరాన్నే బస్సును నిలిపారు. అయినా పార్లమెంట్ భవన్, నార్తు బ్లాకు, సౌత్ బ్లాకు, రాష్ట్రపతి భవన్ మొదలైనవి స్పష్టంగానే తిలకించగలిగాము.

కొంతసేపు అక్కడ గడిపి ఇండియా గేటుకు చేరాము. అమర్ జవాన్ జ్యోతిని దర్శించి ఫోటోలు తీసుకుని మరికొంతసేపు గడపగా భోజన సమయమయింది. మామూలుగా పర్యటన నిర్వాహకులు వారితో అవగాహన ఉన్న హోటలుకు తీసుకువెళతారు. మన తెలంగాణా మిత్రులు అలా వీల్లేదని పట్టుబట్టి బస్సును నేరుగా తమ నాయకుడు శ్రీ చంద్రశేఖర రావు గారు

నివాసముండే తుగ్లకు రోడ్డు లోని 13 నెంబరు ఇంటికి మళ్ళించారు. బస్సు సిబ్బందితో సహా అందులోని పర్యాటకులందరికీ భోజనాలు అక్కడే ఏర్పాటు చేశారు. నిజానికి అది అయాచితం. ఎవరికయినా ఎంతో కొంత మొహమాటం ఉంటుంది కదా. అందుకే మాతో సహా బస్సు సిబ్బంది, మిగతా పర్యాటకులు ఎంత సున్నితంగా విముఖత చూపినా మా మనోభావాలను సరిగా అంచనా వేశారు కాబోలు, సంబంధించిన వారికి తగు ముందస్తు సమాచారం ఇచ్చినట్లున్నారు, బస్సు ఆగగానే అక్కడి వారు బస్సు లోపలి వచ్చి ప్రతి ఒక్కరినీ ఆహ్వానించి సాదరంగా భోజనశాలకు తోడ్కొని వెళ్ళారు. భోజనాలు చేస్తున్నంతసేపు కూడా చెంతనే ఉండి పదార్థాలు స్వీకరింపజేశారు. ఆ విధంగా ఉచితంగా వచ్చింది కదా అని దారిన పోతూ భోజనం చేశామే అనే భావన ఎవరికీ కలుగకుండా జాగ్రత్త తీసుకున్న వారి సంస్కారం ఎంతైనా అభినందించదగినది.

అప్పుడు సమయం మధ్యాహ్నం రెండున్నర అయింది. శ్రీ చంద్రశేఖరరావు గారు రాజీనామా సమర్పించి అప్పుడే వచ్చారు. మరికొంత సేపట్లో మీడియా సమావేశం జరుగబోతోంది. తెలుగు ఇతర జాతీయ చానెళ్లకు చెందిన వాహనాలు, పత్రికా ప్రతినిధులూ పెద్ద సంఖ్యలో అప్పటికే చేరుతుండగా, మాకు ఆతిథ్యమిచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేసి తిరిగి బయలుదేరాము.

భోజనాంతర పర్యటనలో తిలకించిన వాటిలో ప్రధానమైన వాటిలో కుతుబ్ మీనార్, ఇస్కాన్ మొదలైనవి ఉన్నాయి. ఆ మార్గం లోనే అఖిల భారత వైద్య సంస్థ, బహాయి విశ్వాసానికి చెందిన లోటస్ మందిరం కనబడతాయి. ఏ కారణం చేతనో ఈ లోటస్ మందిరం అప్పటికే చాలా రోజులునుంచే మూయబడి ఉన్నది. అందుచేత, లోనికి ప్రవేశించలేక పోయాం.

నేరుగా కుతుబ్ మీనారుకు వెళ్లి అక్కడ కొద్దిసేపు గడిపేసరికి సమయం అయిదు గంటలు దాటింది.

దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ ఆయా రాష్ట్ర సంస్కృతీ సాంప్రదాయాలకు చెందిన  వివిధ హస్త కళలు, చేనేత, పట్టు వస్త్ర పరిశ్రమలకూ విశిష్టమైన స్థానం ఉంటుంది. ఈ ఉత్పత్తులను ఆదరించటం అమ్మకాలను ప్రోత్సహించటం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. వీటి అభివృద్ధి కోసం ప్రభుత్వ రంగంలో ప్రత్యేకంగా సంస్థలుంటాయి .  ఆ ఉత్పత్తుల కొనుగోలుదారులలో అత్యధికులు  ఆయా రాష్ట్రాలకు వచ్చే పర్యాటకులే కనుక వీరిని ఆకర్షించే బాధ్యత ఆ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థా, వారి నియంత్రణలో పర్యటనలు నిర్వహించే ప్రైవేటు పర్యాటక సంస్థల వారిది. దీనికి ప్రతిఫలంగా పర్యాటకులు చేసే కొనుగోళ్లపై వీరికి కొంత కమీషను ఉంటుంది. ఈ క్రమంలో ప్రతి పర్యటన మార్గంలోనూ వాహనాలను ఈ ప్రదర్శన/విక్రయ శాలల వద్దకు తప్పనిసరిగా తీసుకు వెళ్ళాలి. అయితే వీటిని టూరు ప్యాకేజీలో పర్యటించే ప్రాంతాల జాబితాలో ప్రత్యేకంగా పేర్కొనరు. ఇందులో పర్యాటకుల ఇష్టాయిష్టాలకు తావు లేదు. వాటిలోనికి వెళ్ళదలచుకోకపోతే బస్సులో ఉండిపోవచ్చే తప్ప అసలు అక్కడకు తీసుకు వెళ్ళటానినే ప్రశ్నించలేము. ఈ సాంప్రదాయాన్ని పాటిస్తూ మా బస్సును కూడా డిల్లీ రాష్ట్రానికి చెందిన ప్రదర్శన/విక్రయ శాలకు తీసుకువెళ్ళారు.

బహుశా పూర్వానుభవం లేకపోవటంవల్ల కాబోలు, మన తెలంగాణా మిత్రులతో ఇది కొంత వివాదాస్పదమైంది. దీనికి బదులుగా వారు స్వామి నారాయణ్ మందిరం ఉన్న అక్షరధాం తీసుకు వెళ్లవలసినదిగా వత్తిడి చేశారు. అయితే అది టూరు ప్యాకేజీలో లేదని గట్టిగా తిరస్కరించి పర్యటనను అంతటితో ముగించి ఒప్పందం ప్రకారం సాయంత్రం ఏడు గంటలకు, ఉదయం బయలుదేరిన ప్రదేశానికి చేర్చారు.

మా బస ఒక రాత్రికి మాత్రమే ఉండటంతో ఆ ఉదయం పర్యటనకు బయలుదేరే ముందే గది ఖాళీ చేయవలసి వచ్చింది. అయితే ఆ లాడ్జి నిర్వాహకుడు, మా సామాను భద్రపరచటానికి, పర్యటన నుంచి తిరిగి వచ్చాక స్నానం చేసి దుస్తులు మార్చుకోనటానికి అదనపు రుసుమేమీ లేకుండా అవకాశం కల్పించాడు. బస్సు దిగిన వెంటనే లాడ్జీకి చేరుకొని ఆ వెసులు బాటును ఉపయోగించుకున్నాము.

ఆ రాత్రికే హరిద్వారుకు మా ప్రయాణం. మేము వెళ్ళవలసిన డిల్లీ డేహ్రాదూను 4041 నెంబరు ముస్సోరీ ఎక్స్ ప్రెస్ రాత్రి గం.9.30ని. లకు డిల్లీలోని మరో స్టేషను 'సరాయ్ రోహిల్లా' నుంచి బయలు దేరుతుంది. న్యూడిల్లీ స్టేషను నుంచి ఆ స్టేషను సుమారు తొమ్మిది కిలోమీటర్లుంటుంది. ఒక ఆటో వ్యక్తిని సంప్రతించగా ప్రయాణానికి అరగంట లోపేననీ, ఎనిమిన్నరకు బయలుదేరితే సకాలంలో స్టేషనుకు చేర్చగలననీ, వంద రూపాయలిమ్మనీ అడిగాడు. సరేనని ఒప్పు కున్నాను. అప్పుడు సమయం ఏడున్నరే అయింది. అంతసేపు వేచి ఉండటానికి కూడా ఆతనూ ఒప్పుకున్నాడు. ఆ వ్యవధిలో ఆగ్రా డిల్లీ పర్యటనలలో తీసిన ఫోటోలతో నిండిపోయిన నా కెమెరా మెమరీ కార్డులోని సమాచారాన్ని సమీప ఇంటర్నెట్ షాపులో సీడీ మీదకు మార్పించుకుని చక చకా భోజనం చేసి ఆటో ఎక్కాము. నిర్ణీత సమయానికి రైలు బయలుదేరటం తోటే మా డిల్లీ పర్యటన ముగిసింది.

## హరిద్వార్

4వ తేదీ మంగళవారం. ఉదయం గం.5.45 ని.లకు హరిద్వారులో దిగాము.ఆగ్రా డిల్లీ లలో వలెనే ఇక్కడ కూడా బింబాధర్, మాకు సహాయ పడటానికి తన సహచరుడిని నియోగించాడు. అయితే అంత వేకువనే అతను స్టేషనుకు రావలసిన అవసరం లేకుండా మా గమనాన్ని ఫోను ద్వారా

తెలుసుకుంటూ, ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇస్తూ ఉన్నాడు. ఆ క్రమంలో రైలు దిగిన వెంటనే ఇచ్చిన మొదటి సూచన, స్టేషను సమీపంలో నున్న రాజ్ డీలక్స్ హోటలుకు వెళ్ళమని. అప్పటికే సంబంధించిన వారితో మాట్లాడి గది ఏర్పాటు చేయటమే కాక మాకు అవసరమైన అన్ని సలహాలూ, సూచనలూ, సహాయమూ అందించ వలసినదిగా ఆ హోటలు వారికి చెప్పియున్నాడు. వృత్తి రీత్యా అతను మీడియా ఉద్యోగి అయినప్పటికీ, స్థానికుడు. హోటలు వారితో మాటల సందర్భంగా అతను కాస్త స్థితిమంతుడూ, పలుకుబడి కలవాడుగా అర్థమయింది. రిక్షా ఒకటి మాట్లాడుకుని హోటలుకు చేరాము. పరిచయం పూర్తయి రిజిస్టరులో నా వివరాలు నమోదు చేసుకుని గది కేటాయించారు. ఏ విధమైన అడ్వాన్సు పుచ్చుకోలేదు. గదిలో స్థిరపడి కాఫీ సేవించి స్నానాలు కూడా పూర్తయ్యాక రిసెప్షను వారికి మా యాత్రా ప్రణాళికలో రెండు రోజులు కేటాయించుకున్నామనీ ఆ సమయంలో వీలయినన్ని ప్రదేశాలు దర్శించటానికి సూచనలు కోరగా ఈ రోజువారీ యాత్రలు నిర్వహించే ప్రైవేటు సంస్థ వారి వివరాలు తెలియజేసి, ఒక కుర్రవానిని మాతో పంపించారు. అతను వెంటరాగా, సమీపంలోని ఆ యాత్రా బస్సులు బయలుదేరే ప్రదేశానికి వెళ్లి, ఉన్న వాటిలో కాస్త అనుకూలమైన సీట్లున్న బస్సులో కూర్చున్నాము.

ఇదే అధ్యాయంలో ఒక సందర్భంలో పేర్కొన్నట్లు గరుడ పురాణంలో చెప్పబడిన భారత దేశంలో అత్యంత ప్రధాన పుణ్యక్షేత్రాలలో మాయాపురి అని పేరుగల ఈ హరిద్వారు కూడా ఒకటి. దీనికి గంగాద్వార్ అనే పేరు కూడా ఉంది. నిజానికి గంగానది ఇక్కడే ప్రారంభం కాలేదు. గంగోత్రికి ఎగువన గోముఖ్ వద్ద ఉద్భవించిన భాగీరథి దేవప్రయాగ వరకూ వచ్చి, కేదార పర్వతాలలో ఉద్భవించిన మందాకినీ, బదరీ నుంచి వచ్చిన అలకనందలతో

సంగమించి అక్కడ నుంచి గంగా నదిగా ప్రస్తానం ప్రారంభిస్తుంది. ఈ దేవప్రయాగ హరిద్వారుకు 30 కిలోమీటర్ల ఎగువన ఉన్న రిషీకేష్ కు కూడా మరో 30 కిలోమీటర్ల ఎగువన ఉన్నది. అంటే హరిద్వారులో ప్రవేశించటానికి పూర్వమే సుమారు 60 కిలోమీటర్లు గంగా నదిగానే పిలువబడుతున్నది. అయినా ఈ హరిద్వారుని మాత్రమే గంగాద్వారమని ఎందుకు పెర్కొంటారో నా పరిశీలనకు అందలేదు. ఏది ఏమైనా ఈ రిషీకేశూ, హరిద్వారూ రెండూ కూడా ప్రతి హిందువూ తప్పనిసరిగా దర్శించవలసిన ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలు.

యాత్రికులతో నిండిన బస్సు ఎనిమిది గంటలకు బయలుదేరి ముందుగా మాయాదేవి ఆలయానికి వెళ్ళింది. పదకొండవ శతాబ్దానికి చెందిన ఈ దేవాలయం శక్తి పీఠాలన్నిటిలోకి పురాతనమైనదిగా చెబుతారు. అక్కడనుండి ఆనందమాయి ఆశ్రమానికి వెళ్ళాము. 1896-1982 మధ్య జీవించిన ఒక మహిళ తన బాల్యంలో బెంగాలీ వర్ణమాలలోని అచ్చులు హల్లులూ ఒకే ఒక్క రోజులో అభ్యసించటం ద్వారా అసాధారణ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించి తదనంతర కాలంలో ఆధ్యాత్మిక ప్రవచనాలతో ఆనందమాయిగా ప్రసిద్ధి పొందిన నిర్మలా సుందరి. ఈమె బోధనలకు శ్రీమతి ఇందిరా గాంధీ, ఆమె తల్లి కమలా నెహ్రూ వంటి వారు ఎందఱో ప్రభావితమైనారు. ఆశ్రమంలోనున్న ఆమె సమాధిని దర్శించి శ్రద్ధాంజలి ఘటించి అక్కడ నుంచి రిషీకేష్ ప్రయాణ మయ్యాము.

## రిషీకేష్

హిమాలయాల పాదాల చెంత శివాలిక్ పర్వత శ్రేణిలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం రిషీకేష్. కేవలం పురాతన ఆలయాలే కాక అనేక ఆశ్రమాలకు

నెలవులు. ఈ హరిద్వారూ, రిషికేశూ. అటువంటి ఆశ్రమాలలో రిషీకేష్ మార్గంలో నున్న సప్తర్షి ఆశ్రమం ప్రధానమైనది. వశిష్ట కశ్యపాదిగా అత్రి, విశ్వామిత్ర, జమదగ్ని, భరద్వాజ గౌతమ మహర్షులు తపస్సులు ఆచరించి అనేక యజ్ఞాలు, యాగాలు చేసిన ప్రదేశంగా చెప్పబడింది. ఇక్కడ గంగానది ఏడు పాయలుగా ప్రవహించటం చూస్తాము. మధ్యాహ్నం పన్నెండు గంటలకు రిషీకేష్ చేరాము.

గంగానదికి ఇరువైపులా సుమారు నాలుగేసి చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంటుంది. నదిని దాటటానికి ఉన్న రెండు ప్రధాన వంతెనలు ఒకటి రాం ఝూలా, రెండవది లక్ష్మణ ఝూలా. పట్టణానికి చెరొక చివరా ఉంటాయి. వీటికి ఏ విధమైన స్తంభాలూ ఉండవు. ఇరు ఒడ్డులపై నున్న భారీ స్తంభాలపై నుంచి వ్రేలాడే త్రాళ్ళ ఆధారంగా ఏర్పరిచిన బాట కేవలం కాలి నడకకు ద్విచక్ర వాహనాలకు మాత్రమే పరిమితం. అందుచేత, ఒక ప్రదేశంలో బస్సు దిగిపోయాం. నదికి ఇవతలవైపు ఉన్న శ్రీ సచ్చా అఖిలేశ్వర్ మహాదేవుని మందిరం మొదలైనవి దర్శించి, కాలినడకన లక్ష్మణ ఝూలా మీదుగా నదిని దాటి అవతలి ఒడ్డుకు వెళ్ళాము. అక్కడ ఉన్న ఆలయాలలో ప్రముఖంగా చెప్పుకోదగ్గది పదమూడు అంతస్తులతో పర్వత సానువుపై నిర్మితమైన త్ర్యంబకేశ్వర ఆలయం. అత్యంత ఆకర్షణీయంగా ఉంటుంది. ఆశ్రమాలలో ప్రధానమైనది శివానంద ఆశ్రమం. యాత్రికులు బస చేయటానికి దీనిలో వసతి సౌకర్యం కూడా ఉంది. ఈ ప్రాంతంలోనే ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వ గర్వాల్ మండల

వికాస్ నిగంకు చెందిన వస్తు ప్రదర్శన/విక్రయశాల కూడా ఉన్నది. దీనిలో కొన్ని రుద్రాక్షలు, ఒక పూసల హారం కొనుగోలు చేసాము.

అక్కడనుంచి జీపుల్లోను, ఆటోల్లోనూ బృందాల వారీగా రాం ఝూలా ప్రాంతానికి వెళ్ళాము. అక్కడఉన్న త్రివేణీ ఘాటులో యాత్రికులు గంగా నదిలో పుణ్య స్నానాలు చేస్తారు. సమీపంలో గీతా మందిర్ ఆశ్రమం, మరో దేవాలయం ఉన్నాయి. ఇవన్నీ తిలకించి 'చోటివాలా' హోటలులో భోజనం చేసి ఈ సారి పడవలో నదిని దాటి అక్కడ నిరీక్షిస్తున్న బస్సెక్కి సాయంత్రం అయిదు గంటలకు తిరిగి హరిద్వారు చేరాము. ఈ చరణంలో భారత మందిర్, వైష్ణోదేవీ మందిర్ మొదలైన వాటికి తీసుకు వెళ్ళారు. జమ్మూ కాశ్మీరులోని వైష్ణోదేవీ ఆలయానికి ఇది ప్రతీక. బహుళ అంతస్తులతో ఉంటుంది.

మేము రిషికేష్ లోని నడకతో శక్తి హీనులమవటంతో తోటి ప్రయాణీకులలో శక్తి ఉన్నవారు వెళ్లి తిరిగి వచ్చేవరకూ బస్సుకే పరిమితమయ్యాం. తిరిగి బస్సు బయలుదేరాక గంగా నదికి సమీపంలో బస్సు దిగి హారతి కార్యక్రమం తిలకించటానికి హరి-కి-పౌడీ కి అభిముఖంగా నదికి అవతలి వైపున అనువైన స్థలం చూసుకుని ఆసీనులమయ్యాం. ఆరు గంటలకు కార్యక్రమం మొదలైంది.

"జయ జగదీశ హరే..." అనే హారతి గీతం మార్మ్రోగుతుండగా సుశిక్షితులైన వ్యక్తులు అనేక దీపాలతో కూడిన బరువైన పరికరాన్ని సంగీతానికి అనుగుణంగా లయబద్ధంగా త్రిప్పుతూ చేసే విన్యాసాలు హృద్యంగా ఉండి చూపరులకు భక్తిపారవశ్యం కలిగిస్తుంది. ఆ కార్యక్రమం ముగిసాక

వంతెన మీదుగా గంగా నదిని దాటి భోజనం చేసి హోటలు గదికి చేరుకొని సంతృప్తికరమైన ఆ రోజును ముగించాము.

5వ తేదీ బుధవారం. హరిద్వారులో దర్శనీయ స్థలాలన్నిటినీ క్రితం రోజు బస్సు వారి టూరు ప్యాకేజీలోనే చూసేశాము. వాటిని మినహాయించి ఈరోజు మేము స్వయంగా కార్యక్రమాన్ని రూపొందించుకున్నాము. ఇందుకోసమని హోటలు వారు నాలుగు వందలకు ఆటో ఒకటి మాట్లాడి సిద్ధం చేశారు. ఎనిమిది గంటలకు బయలుదేరి ముందుగా రాందేవ్ బాబా నిర్వహిస్తున్న పతంజలి యోగ పీఠానికి వెళ్లాం. అక్కడ నుంచి నీల పర్వత శిఖరంపై నున్న చండీ దేవి ఆలయానికి వెళ్లాం. ఇక్కడ క్రీస్తు శకం ఎనిమిదవ శతాబ్దంలో ఆది శంకరాచార్యులవారు, ఈ అమ్మవారి మూల విరాట్టును ప్రతిష్టించగా 1929వ సంవత్సరంలో అప్పటి కాశ్మీరు రాజు సుచత్ సింగ్ ప్రస్తుత ఆలయాన్ని నిర్మించాడట. ఆలయం చిన్నదైనా మనోహరంగా ఉన్నది. ప్రక్కనే, అంజనా సమేతుడైన హనుమంతుని ఆలయం ఉన్నది. ఈ నీల పర్వత శిఖరం చేరుకోవటానికి మూడు కిలోమీటర్ల కాలిబాట ఉన్నది. కాని ఎక్కువమంది భక్తులు కొండ దిగువన గౌరీ శంకర్ ఆలయం వద్ద నున్నఒక స్టేషను నుండి రోప్ కారులో వెళ్లి వస్తారు. గంగా నదికి మరోవైపున హరిద్వారు పట్టణంలో, మానసాదేవి మందిరం ఉన్న మరొక చిన్న గుట్టకు కూడా ఇటువంటి సౌకర్యం ఉండటంతో భక్తులందరూ సాధారణంగా రెండు ఆలయాలను దర్శిస్తారు కనుక, మొదట దర్శించిన ఆలయం వద్దనే రెండవ దానికి కూడా రానూ పోనూ టికెట్లు తీసుకునే సదుపాయం కల్పించారు. తద్వారా రెండు సార్లు లైనులో నిలబడి టికెట్లు తీసుకునే శ్రమ తొలగించారు. ఆ మేరకు రుసుములో రాయితీ కూడా ఉన్నది.

రెంటికీ కలిపి టికెట్లు తీసుకుని పైకి వెళ్ళాము. అమ్మ వారిని , హనుమంతుని దర్శించి కొండ దిగి భోజనం చేసి మానసాదేవి ఆలయానికి వెళ్ళాము. నాలుగింటికల్లా పర్యటన కార్యక్రమం ముగించుకుని గదికి తిరిగి వచ్చాము. కొద్ది సేపు సేద తీరి మళ్ళీ హరి-కి-పౌడికి చేరాము. ఈసారి హారతి జరిగే ఒడ్డు వైపు నుంచి కార్యక్రమం తిలకించాము. తదనంతరం, అక్కడ ఉన్న మిగతా ఆలయాలను దర్శించి, రద్దీగా నున్న సన్నని వీధులగుండా కాలినడకన హోటలు చేరుకున్నాము. హోటలు ఖాళీ చేయవలసిన సమయం ఆసన్నమయింది. బిల్లు ఎంత అయిందని అడుగగా, ఏమీ ఇవ్వనవసరం లేదన్నారు. నేను ఊహించని ఈ సమాధానం చాలా ఇబ్బంది పెట్టింది. 'నన్ను ఇక్కడకు పంపినవారు చెల్లించారా?" అని అడిగాను. లేదన్నారు. 'మరి ఎవరూ చెల్లించకుండా మేము ఉచితంగా ఎలా ఉంటాము" అంటూ, నన్ను ఇక్కడకు చేర్చిన అజ్ఞాత వ్యక్తికి (బింబాధర్ స్నేహితుడు) ఫోను చేసి కృతజ్ఞతలు చెబుతూ అసలు విషయం అతనినే అడిగాను. "సరే! నేను వారితో మాట్లాడుతాను" అన్నాడు. మరుక్షణం హోటలు ఫోను మ్రోగింది. హోటలు ఉద్యోగి సంభాషణ పూర్తి చేసి, ఫోను మూసేస్తూ నావైపు చూసి "సరే! మీకు తోచినదేదో ఇవ్వండి" అన్నాడు. ఇబ్బంది కొంత సడలింది. బోర్డు మీద వ్రాసి ఉన్న రుసుము వివరాలు పరిశీలించాను. మేమున్న గదికి రోజుకు అద్దె ఎనిమిది వందలు. అంటే రెండు రోజులకు పదహారు వందలవుతుంది. పద్నాలుగు వందలు అతని చేతిలో పెట్టాను. లెక్కబెట్టి, ఆరు వందలు తిరిగి ఇచ్చేసాడు. కృతజ్ఞతలు మినహా మరేమీ చెప్పవలసిన అవసరం రాలేదు. రాత్రి గం.8.35ని.లకు బయలు దేరవలసిన డెహ్రాడూన్ వారణాసి 4266 నంబరు జనతా ఎక్స్ ప్రెస్ లో లక్నోకు వెళ్ళటానికి స్టేషనుకు చేరాము.

ఈ ట్రయిను దేహ్రాడూను నుండి రావలసి ఉన్నప్పటికీ, హరిద్వారు నుంచి రెండు స్లీపరు కోచీలు జత చేస్తారు. ఆ కోచీలు మరో ప్లాటుఫారం మీద అప్పటికే సిద్ధంగా ఉన్నాయి. పోర్టరు సహాయంతో మాకు కేటాయించబడిన బర్తులలో కుదురుకున్నాము. ఎంతగా అలిసిపోయి ఉన్నామంటే, ప్రధాన ట్రయిను ఎప్పుడు వచ్చిందో, ఈ కోచీలు దానికి ఎప్పుడు తగిలించారో కూడా తెలియనంతగా నిద్రపోయాము. టికెట్ల తనిఖీ కోసం టీటీయి తట్టి లేపేసరికి రైలు వేగంగా వెళుతున్నది.

మరునాడు నిర్ణీత సమయానికి అరగంట ఆలస్యంగా లక్నోకు చేరాము. బింబాధర్ వాహనంతో సహా స్టేషనుకు వచ్చి తన నివాసానికి తోడ్కొని వెళ్ళాడు. ఆ రోజు మహాశివరాత్రి పర్వదినం. ఉపవాసం ఉందామని నిశ్చయించుకున్నాం. అందుచేత ఫలహారం, భోజనాల ప్రసక్తి లేదు. స్నానాలు చేసి, తను ఏర్పాటు చేసిన వాహనంలో పదిన్నరకు అయోధ్యకు బయలుదేరాము. సుమారు నూటముప్పయి కిలోమీటర్లు ప్రయాణించి ఒంటి గంట అవుతుండగా అయోధ్య చేరాము.

నిర్ణయించిన ప్రదేశంలో మా రాకకై నిరీక్షిస్తున్న బింబాధర్ స్నేహితుని గుర్తించి పరిచయం చేసుకోగా అతను మా వాహనంలో ఎక్కి నేరుగా రామ మందిరానికి తీసుకువెళ్ళాడు. సుమారు ఒక కిలోమీటరు దూరం కట్టుదిట్టమైన అనేక రక్షణ వలయాలను దాటుకుంటూ విగ్రహాలుంచిన ప్రాంతానికి చేరుకున్నాం. దాదాపు పది పన్నెండు మీటర్ల దూరం నుంచే విగ్రహాలను దర్శించాలి. అక్కడ ఉన్న పూజారి భక్తులకు తీర్థం మాత్రమే ఇస్తారు తప్ప, టెంకాయలు మొదలైనవి సమర్పించటం, ప్రసాద వితరణ కానీ ఉండవు. ఈ నియమాలన్నిటినీ శిరసావహిస్తూ దర్శనం చేసుకున్నాము. బయటకు వచ్చి దశరథ మహాలుగా చెప్పబడుతున్న పురాతన భవనం,

అందులో రమణీయమైన వివిధ దేవతా మూర్తులను తిలకించి, సమృద్ధిగా ప్రవహిస్తున్న సరయూ నదీ తీరానికి వెళ్ళాము. ఆ నదిపై ఉన్న రోడ్డు వంతెన సుందరముగా ఉన్నది. దాని క్రింద స్నాన ఘాటులున్నాయి. మార్జిన స్నానమాచరించి అక్కడ కొద్ది సేపు కూర్చున్నాము. భద్రాచలంలో అపుదేపుడో పదిహేను సంవత్సరాల క్రితం ఇలాగే గోదావరి గట్టున కూర్చున్న సందర్భం జ్ఞప్తికి రాగా అదే అనుభూతికి లోనయ్యాను. రెండూ కూడా శ్రీరామచంద్రుని క్షేత్రాలే కావటం విశేషం. అక్కడకు సమీపంలో నున్న పురాతన శివాలయంలో, ముందుగా విఘ్నేశ్వరునికి పూజ చేసి తరువాత ఈశ్వరునికి అభిషేక పూజలు సమర్పించాం. అక్కడ నుంచి, భవిష్యత్తులో రామునికి నిర్మింప తలపెట్టిన ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్న ప్రాంగణానికి వెళ్ళాము.

ఆలయానికి అవసరమైన రాతి స్తంభాలు, దూలాలు, పై కప్పుకు పలకలు మొదలుకుని ప్రవేశ ద్వారంతో సహా సర్వం సిద్ధం చేసి ఉంచబడ్డాయి. అత్యంత కళాత్మకంగా ఉన్న వాటినన్నిటినీ ఆసక్తిగా తిలకించాము. ఆలయం పూర్తి స్వరూపం కూడా నమూనా రూపంలో ఏర్పాటు చేయబడి ఉంది.

ఇక్కడితో మా అయోధ్య యాత్ర కూడా పూర్తయింది. మాతో ఉన్న బింబాధర్ స్నేహితునితో కలిసి టీ సేవించి అతని వీడ్కోలు తీసుకుని

అయిదున్నరకు తిరుగు ప్రయాణమయ్యాం. నగరంలో ప్రవేశించాక ట్రాఫిక్ రద్దీ కారణంగా ఈ సారి ప్రయాణం నాలుగు గంటలకు పైగానే పట్టింది. బింబాధర్ నివాసానికి చేరేటప్పటికి తొమ్మిదిన్నర దాటింది.

**వారణాసి**

7వ తేదీ శుక్రవారం ఉదయం ఏడు గంటలకు లక్నో వారణాసి ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్ లో బయలుదేరి మధ్యాహ్నం ఒకటిన్నరకు వారణాసిలో దిగాము. వంద రూపాయలకు ఆటో మాట్లాడుకుని బెంగాలీ టోలా గల్లీలోనున్న ఆంధ్రాశ్రమానికి చేరుకోగా అక్కడ గదులు ఖాళీ లేవని చప్పారు.. ప్రక్కనే ఉన్న అన్నపూర్ణా యాత్రీనివాస్ లో రెండవ అంతస్తులో ఒక గది లభించింది. దానిలో చేరిపోయాము. దీని అధిపతి విజయనగరానికి చెందిన శ్రీ నరసయ్యగారు. అపుడపుడు సతీసమేతంగా కాశీకి వచ్చి పోతుంటారు. అలా వారు. వచ్చిన సమయంలోనే మేమూ వెళ్ళటంతో వారి పరిచయం కూడా కలిగింది. స్థానికంగా ఉంటూ నిర్వహణ చూసేవారు విజయవాడకు చెందిన శ్రీ రాంబాబుగారు. ఇద్దరూ యువకులు, ఉత్తములు మంచి సంస్కారవంతులు. (ఈ యాత్ర తరువాత మరో రెండు సార్లు కాశీ వెళ్ళినపుడు కూడా ఇక్కడే బస చేసాము. 2013 నవంబరులో మేము నాలుగవ సారి కాశీ వెళ్ళినపుడు దీని యాజమాన్యం మారిపోయింది) ఈ భవనానికి కేవలం ఇరవై గజాల దూరంలోనే అఖిల భారత బ్రాహ్మణ కరివెన నిత్యాన్నదాన సత్రం ఉన్నది. ఆ రోజుకు చివరి బంతిలో భోజనం చేసేటప్పటికి సమయం మూడు గంటలయింది. గదికి తిరిగివచ్చి కొద్దిసేపు విశ్రమించాము. అయిదు గంటలకు పరిసరాలను పరిచయం చేసుకునే క్రమంలో బయటకు రాగా ఎక్కడో వేరే రాష్ట్రంలో ఉన్నామనే భావనే కలుగలేదు. ఎందుకంటే ఆ ప్రాంతంలో బసచేసే యాత్రికులందరూ తెలుగువారే. ముఖ్యంగా యాత్రా

సంస్థలవారి బస్సులలో వచ్చేవారు. ఆ వీధిలోని దుకాణదారులు స్థానికులే అయినా, చాలామంది తెలుగు ధారాళంగా మాట్లాడుతున్నారు. టీ సేవించి మానస సరోవర్ ఘాటుకు వెళ్లి అక్కడ నుండి మెట్ల మీదుగా నడుచుకుంటూ కేదారేశ్వర ఘాటుకు వెళ్ళాము. అక్కడ చల్ల గాలిలో కొద్దిసేపు కూర్చుని కేదారేశ్వరుని దర్శించి గదికి చేరాము. కరివెన సత్రంలో రాత్రి పూట ఫలహారమే ఉంటుంది. అది తెచ్చుకుని గదిలోనే భుజించి విశ్రమించాము.

మా ఈ యాత్రా ప్రణాళికలో కాశీలో ఉండతలపెట్టిన మొత్తం అయిదు రోజులలో 8వ తేదీ రోడ్డు మార్గం ద్వారా అలహాబాదు వెళ్లిరావటానికి, 11వ తేదీ రైలు మార్గం ద్వారా గయ వెళ్లి తిరిగి వారణాసి రావటం, తుదిగా 12వ తేదీ రాత్రి గం.8.55 ని.లకు 7092 నెంబరు పాట్నా- సికిందరాబాదు ఎక్స్ ప్రెస్ లో స్వస్థలానికి బయలుదేరటానికి కార్యక్రమం ఖరారయింది. అయితే గత పది రోజులుగా నిర్విరామంగా సాగిన యాత్ర వలన కాబోలు నాకు స్వల్పంగా జ్వరం వచ్చింది. ఆ స్థితిలో అలహాబాదు ప్రయాణానికి సాహసించలేక ఆ ఉదయం ఒకసారి విశ్వేశ్వరుని దర్శనం మాత్రం చేసుకుని, మిగతా రోజంతా గదికే పరిమితమయ్యాను. సాయంకాలం బోటు ఒకటి మాట్లాడుకుని గంగానదిలో విహరించాము.

11వ తేదీ గయకు వెళ్ళటానికి గాను ఉదయం నాలుగున్నరకే స్టేషనుకు చేరుకోగా, ఉత్తరాది రాష్ట్రాలలో విద్యుచ్ఛక్తిలో తీవ్ర అంతరాయం కారణంగా రైళ్లన్నీ నిరవధికమైన ఆలస్యంతో నడుస్తున్నాయి. కొన్ని రైళ్ళు రద్దయ్యాయి. మేము వెళ్ళవలసిన 2382 నెంబరు న్యూ డిల్లీ కోల్కతా 'పూర్వ' ఎక్స్ ప్రెస్ ఎప్పుడు వస్తుందో, అసలు వస్తుందో రాదో కూడా ఎవరూ చెప్పలేని స్థితి నెలకొనగా, ఆ పరిస్థితిలో గయ వెళ్ళటం శ్రేయస్కరం కాదనిపించి ఖరారయిన టికెట్లు రద్దు చేయించాను. ఇది ఎలాగూ రద్దయింది కనుక రెండు

రోజుల క్రితం అస్వస్థత కారణంగా విరమించుకున్న అలహాబాదు పర్యటన కొనసాగిద్దామని అక్కడి క్షేత్ర పురోహితులైన శ్రీ హరి జగన్నాధ శాస్త్రి గారిని ఫోనులో సంప్రతించగా అలాహాబాదు చేరుకొనిన వెంటనే తమకు ఫోను చేయవలసినదిగా సూచించారు. ఏడు గంటలకు బస్సెక్కి పదకొండు గంటలకు అలహాబాదులో దిగి చెప్పిన విధంగా ఫోను చేయగా వారు నియోగించిన మనిషి మేము బస్సు దిగిన చోటికి వచ్చి త్రివేణీ ఘాటుకు చేర్చాడు.

అక్కడ చేయవలసిన కార్యక్రమాల విధి విధానాలు, అందుకు కాగల ఖర్చు వివరాలు తెలుసుకున్నాక, నేను తప్పనిసరిగా నిర్వర్తింపవలసిన పితృదేవతలకు పిండ ప్రదాన కార్యక్రమం, నా శ్రీమతి వేణీదానం (ఋతుక్రమం నిలిచిపోయిన సుహాసినులు చేసే ఒక విశిష్ట కార్యక్రమం. నేను సేకరించిన సమాచారం ప్రకారం ఈ కార్యక్రమం సరస్వతీ నది అంతర్వాహినిగానున్న ఒక్క అలహాబాదు త్రివేణీ సంగమంలో మాత్రమే చేస్తారు) చేయటానికి సంకల్పించు కుని, తత్సంబంధమైన రుసుములు చెల్లించి ముందుగా పడవలో వెళ్లి నది మధ్యలోని సంగమంలో స్నానం చేశాము. ఇక్కడ గంగా యమునల నీరు రెండు రంగులలో స్పష్టంగా కనిపిస్తుంది. తిరిగి ఒడ్డుకు చేరాక తలపెట్టిన రెండు కార్యక్రమాలు యథావిధిగా నిర్వర్తించేసరికి సమయం రెండున్నర అయింది. ఈ కార్యక్రమాలు నిర్వహించే వారికి శాస్త్రి గారింట్లో భోజన ఏర్పాటు కూడా ఉన్నది కానీ, కాలాతీతం అవటంతో వారికి ఇబ్బంది కలిగించటం ఇష్టం లేక నేరుగా బస్సుస్టాండుకు వెళ్లి బస్సెక్కి రాత్రి ఏడున్నరకు వారణాసి చేరాము.

ఆ మరునాడు ఉదయం మరొకసారి విశ్వేశ్వరుని దర్శనం చేసుకుని, అలాగే అన్నపూర్ణా, విశాలాక్షులనూ సేవించాము. గంగానదికి అవతలవైపునున్న వ్యాస కాశీ, తిరిగి వెనక్కు వచ్చి కాలభైరవ ఆలయం, గవ్వలమ్మ దేవాలయం, తులసీ మానస మందిర్, బెనారస్ హిందూ

విశ్వవిద్యాలయ ఆవరణలో బిర్లా వారి విశ్వనాధాలయం మొదలైనవి దర్శించి భోజనాంతరం కొంత సేపు విశ్రమించి, సాయంత్రం కొంతసేపు గంగా తీరంలో గడిపి, కేదారేశ్వరుని దర్శించాము. సామాను సర్దుకుని గది ఖాళీ చేసి ఎనిమిది గంటలకు రైల్వే స్టేషనుకు చేరాము.

అరగంటతో మొదలైన ఆలస్యం ఆరు గంటలయి తెల్లవారు ఝామున రెండు గంటలకు వచ్చిన రైలు, ఆ ఆలస్యం ఏ మాత్రం పూడ్చుకోక పోగా, ఎనిమిది గంటలకు పెంచుకొని, 14వ తేదీ తెల్లవారు ఝామున రెండు గంటలకు చేరవలసినది ఉదయం పదిన్నరకు సికిందరాబాదు చేరింది. మన చేతిలో లేని అనివార్యమైన ఈ తరహా ఇబ్బందులు మినహా రెండు వారాల యాత్ర సంతృప్తిగాను, విజయవంతంగానూ పూర్తయింది.

# రెండవ అధ్యాయం

2008 అక్టోబరు 13వ తేదీన మా కుమారుని వివాహం బెంగుళూరులో జరపటానికి నిశ్చయమైంది. తత్సంబంధమైన ప్రయత్నాలు, గృహ సంబంధమైన భారీ మరమ్మతులతో సహా ఇతర ఏర్పాట్ల దృష్ట్యా ఆ మిగిలిన సంవత్సరానికి ఇక ఏ యాత్రా తలపెట్టలేదు. వివాహం జరిగి, నూతన దంపతులు వారి వారి ఉద్యోగ విధుల్లో కుదురుకున్నాక, కొత్త సంవత్సరం జనవరి నెల కోసం మళ్ళీ తాజాగా యాత్రా ప్రణాళికలు రచించటం మొదలెట్టాను. ఈ సారి దక్షిణ భారత యాత్రతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికాం. ఈ యాత్రలో కొంతభాగం వరకూ హైదరాబాదులోనే ఉండే మా ఇద్దరు కుమార్తెలూ, ముంబాయిలో ఉండే కోడలూ, యాత్రాసాంతమూ మాతో పాటు మా కుమారుడూ రావటానికి నిర్ణయించుకున్నారు. 24వ తేదీ మధ్యాహ్నం గం.12.45 ని.లకు కింగ్ ఫిషర్ విమానంలో బయలుదేరాము. మా ఇద్దరికీ సంబంధించి, అంతకు మునుపు చేసిన విమాన ప్రయాణాలన్నీ బేగంపేటనుంచి కాగా, ఆ సంవత్సరమే ప్రారంభమైన శంషాబాదు విమానాశ్రయం నుంచి ఇదే మొదటిది.

మధ్యాహ్నం రెండు గంటలకు రేణిగుంట విమానాశ్రయంలో దిగాము. అలిపిరి చేరుకొని కొండపైకి సామాను బుక్ చేసి వాహనాన్ని మరునాడు తిరుమలకు రావలసినదిగా చెప్పి నడకతో తిరుమలకు బయలుదేరాము. ఎనిమిది గంటలకు తిరుమల చేరాము. సామాను విడిపించుకోటానికి గంట పట్టింది. రద్దీ అసాధారణంగా ఉంది. కాటేజీ కోసం చేసిన ముందస్తు ప్రయత్నాలేవీ ఫలించలేదు. సహాయం కొరకు ఏర్పాటు చేసుకున్న స్థానిక ఉద్యోగి ఒకరు (దేవస్థానం ఉద్యోగి కాదు) దేవాలయం సమీపంలో ఒక ప్రైవేటు

హోటలులో గదులు తీసి ఉంచాడు. అతనే మరునాడు సుప్రభాత దర్శనానికి టికెట్లు కూడా తెచ్చిపెట్టాడు.

**తిరుమల**

25వ తేదీ తెల్లవారు ఝామున నాలుగు గంటలకే దర్శనం క్యూ లైనులో ప్రవేశించాము. ఎంత ప్రత్యేక సేవా దర్శనమైనా గర్భాలయంలోకి ప్రవేశించటానికి రెండు గంటలకు పైగా పట్టింది. సుప్రభాత సేవ జరిగిన సుమారు ఇరవై నిముషాల పాటు స్వామి సన్నిధిలో మండపంలో కూర్చుని, తదనంతరం దర్శనం చేసుకుని ఏడున్నరకు బయటకు వచ్చాం.

అల్పాహారం చేసి గదులు ఖాళీ చేసి తిరిగి మా అధీనంలోకి వచ్చిన వాహనంలో పది గంటలకు తిరుచానూరు చేరుకున్నాం. అమ్మవారి దర్శనానంతరం తిరుత్తణి కంచిల మీదుగా ఆ రాత్రికి చెన్నై చేరుకోవలసి ఉంది. అందుచేత త్వరగా దర్శనం చేసుకోవాలనే ఉద్దేశంతో తలొక మూడు వందల చొప్పున ఆరుగురికీ మొత్తం పద్దెనిమిది వందలు చెల్లించి ప్రత్యేక దర్శనం టికెట్లు తీసుకున్నాం. అయితే యథాప్రకారం దేవస్థానం సిబ్బంది బాధ్యతా రాహిత్యం వల్ల ఆ టికెట్లు నిరుపయోగమవటమే కాక అసలు దర్శనమే చేసుకోలేక పోయాం.

టికెట్లు తీసుకునే వరకూ ఉన్న ప్రత్యేక దర్శనం క్యూ ఆ కౌంటరు నుండి బయటకు రాగానే మాయమై ఏ టికేట్టూ లేని వారు కూడా పెద్ద సంఖ్యలో చేరటంతో మా స్థితి సాధారణ లైనులో చిట్టచివర స్థిరపడింది. ఇదేమని ఎవరిని అడుగుతాము? అడిగినా పట్టించుకునే వాడెవడైనా ఉంటాడా? అయినా ఇటువంటివి సహించలేని, ప్రశ్నించే నా సహజ తత్త్వం రెచ్చగొట్టగా ఆ ప్రయత్నం కూడా చేశాను. విధి నిర్వహణలో ఉన్నది ఒక సీనియర్ అసిస్టెంటు. అతనికి విషయం వివరించగా, టికెట్టు లభింపజేసే వరకే

తన బాధ్యతయనీ, లైనును నియంత్రించే బాధ్యత తనది కాదనీ చెప్పాడు. పై అధికారుల వివరాలు ఫోను నంబరులు అడగ్గా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. విషయాన్ని పొడిగించినందువల్ల సమయం వృధా కావటం, మాటా మాటా పెరిగి మనః ప్రశాంతత చెదరటం తప్ప ప్రయోజనం లేదని తెలుసు. కానీ అతని మీద కసి తీరేదెలా? ఒక క్రూరమైన చూపుతో అది తీర్చుకుందామనుకున్నాను. అతనిలో ఏ మాత్రం సున్నితత్వం, అభిమానం ఉన్నా, ఆ చూపు అతనిని దహిస్తుందని కాకపోయినా, అభిమానవంతుడైతే ప్రవర్తనలో కొంతయినా పరివర్తన కలిగించి ఉండేది. కానీ, నా లాంటి వారినెందరిని చూసి ఉంటాడో కదా! బాగా ముదిరి పోయి ఉన్నాడేమో, అంత మందపు చర్మంలోనుంచి నా చూపు అతడి మనసు దరిదాపుల్లోకి కూడా చేరుకోలేక పోయింది. నన్నూ, నా చూపునూ లైటు తీసుకున్నాడు కాబోలు "పోరా పో! అనే భావాన్ని ఆంగికాభినయంతో మేళవించి అతనూ బదులిచ్చాడు. అంత కసి లోనూ నాకు నవ్వొచ్చింది.

ఇక అప్పటికే మా వాళ్ళు దర్శనం మీద ఆశ వదిలేసి శుభ్రంగా ఒక వారగా గట్టు మీద గోడనానుకుని కూర్చున్నారు. మా పెద్ద కుమార్తె, కోడలు ఆ దర్శనం టికెట్లపై లభించే ప్రసాదం లడ్డూల కొరకు కౌంటరు వద్ద లైనులో నిలబడ్డారు. పోనీ అవయినా అన్నీ ఇచ్చారా అంటే అదీ లేదు. వాటిలో కూడా కోత పెట్టారు. అందుకు కారణం దర్శనం టికెట్లు కొన్న వారు ప్రసాదం కోసం కూడా అందరూ లైనులో నిలబడాలట. లడ్డూల విషయంలో ఈ నియమాన్ని ఇంత ఖచ్చితంగా పాటించిన వారు, మరి ఆ టికెట్లు తీసుకున్న వారందరూ దర్శనం కూడా చేసుకున్నారో లేదో అని కూడా నిర్ధారించుకున్నట్లయితే అందరమూ దర్శనం చేసుకుని మరీ అలాగే లడ్డూల కోసం కూడా లైనులో నిలబడే వారం కాదూ? వారి ఇష్టారాజ్యం అలా ఉన్నపుడు ఎవరు మాత్రం

ఏమి చేయగలరు? పాపం, ముఖాలు చిన్నబుచ్చుకుని ఇచ్చిన ఒకటో రెండో లడ్డూలు పుచ్చుకుని వచ్చారు మా అమ్మాయి కోడలు.. ఇక అక్కడి నుంచే అమ్మవారికి నమస్కరించి పదకొండు గంటలకు బయలుదేరాం.

తిరుత్తణిలో సుబ్రహ్మణ్యస్వామి దర్శనం చేసుకున్నాక భోజనం చేసాము. గత రాత్రి సరయిన నిద్రలేమివల్లనూ, క్రితంరోజు తిరుమలకు వెళ్ళిన నడక, మరీ ప్రత్యేకించి ఉదయం ఘాటు రోడ్డు ప్రయాణం ఇవన్నీ ఒకదానికొకటి తోడై, జయలక్ష్మికి వాంతులు కలిగించాయి. తత్కారణంగా తను ఏమీ తినలేకపోయింది. మళ్ళీ ప్రయాణం కొనసాగించి అయిదున్నరకు కంచి చేరాం. దేవాలయంలోని ప్రధాన పూజారి పరిచయస్తుల ద్వారా ప్రత్యేక ప్రవేశం పొంది, సంతృప్తిగా దర్శనం చేసుకుని కామాక్షి అమ్మవారి అనుగ్రహం పొందాము. అక్కడనుండి వరదరాజ పెరుమాళ్ళును కూడా సేవించి, శరవణ భవన్ లో అల్పాహారం చేసి, మంచి కాఫీ సేవించి ఏడు గంటలకు పయనం తిరిగి కొనసాగించాము. అవటానికి 76 కిలోమీటర్లే అయినా చెన్నై నగరంలో ప్రవేశించాక ట్రాఫిక్ రద్దీ వల్ల మేము బస బుక్ చేసుకున్న చేసిన కంట్రీ క్లబ్ వారి గెస్టు హౌసు చేరే సరికి రాత్రి పది గంటలయింది.

తిరుపతినుంచి ప్రారంభించిన దక్షిణ యాత్ర ఇక్కడ నుంచి కొనసాగించవలసి ఉన్నందుననూ, వారి వారి ఉద్యోగ విధుల రీత్యా అక్కడితో యాత్రనుంచి విరమించుకుని ముందే ఖరారయిన మేరకు మా కోడలు ముంబైకి, కుమార్తెలిద్దరూ హైదరాబాదుకూ ఇక్కడ నుంచి వెనుదిరగవలసి యున్నందున చెన్నై

వెళ్ళటమే కానీ, ఇక్కడ క్రొత్తగా పర్యటించవలసినది ఏమీ లేదు. అయితే, మా పెద్ద కుమార్తె ఆడబడుచు, చిన్న కుమార్తె అత్తవారు చెన్నైలో ఉంటారు.

26వ తేదీ రిపబ్లిక్ డే నాడు ముందుగా వారివురి నివాసాలకు వెళ్లివచ్చి, అక్కడనుండి నేరుగా విమానాశ్రయానికి వెళ్లి కుమార్తెలకూ, కోడలుకూ వీడ్కోలు చెప్పి మేము తిరిగి గెస్టు హౌసుకు చేరుకున్నాం. కొంతసేపు విశ్రాంతి తీసుకుని సమీపంలోని అడయారు బీచిలో కొంతసేపు గడిపాము. తిరిగి వస్తూ మార్గ మధ్యంలో ఒక హోటలులో అల్పాహారం చేసి (తమిళనాడులో రాత్రిపూట అన్నంతో కూడిన భోజనం ఎక్కడా లభించదు) ఇడ్లీ, వడ, దోశ మొదలైన అల్పాహారాలతోనే సరిపెట్టుకోవాలి) గెస్టు హౌసు ఖాళీ చేసి ఎగ్మూరు స్టేషనుకు చేరాము.

రాత్రి గం.10.30ని.లకు 6177 A నెంబరు చెన్నై కుంబకోణం రాక్ ఫోర్ట్ ఎక్స్ ప్రెస్ లో బయలుదేరాము. మరునాడు 27వ తేదీ ఉదయం ఆరుగంటలకు తంజావూరులో దిగి స్టేషను ప్రక్కనే హోటలులో గది తీసుకున్నాము. స్నానాలు ముగించి అల్పాహారం చేసి, టాక్సీ ఒకటి మాట్లాడుకున్నాము. దక్షిణ భారత దేశంలో అత్యంత చారిత్రిక ప్రాధాన్యం ఉన్న పట్టణాలలో తంజావూరు ముఖ్యమైనది. యునెస్కో అధీనంలో పరిరక్షింపబడుతున్న అతి పురాతన దేవాలయాలు, కట్టడాలు ఇక్కడ అనేకం ఉన్నాయి. చోళుల కాలం నుంచీ అనేక రాజవంశాలు ఈ పట్టణాన్ని రాజధానిగా చేసుకుని తమ రాజ్యాలను ఏలినప్పటికీ, చోళుల కాలంలోనే అధికంగా ఈ కట్టడాల నిర్మాణం జరిగినట్లు చరిత్ర వల్ల తెలుస్తున్నది. ఆయా రాజుల ఆస్థానాలలో కళలు, సంగీత సాహిత్యాలు ఆదరణ పొంది పరిఢవిల్లాయి. ప్రసిద్ధ కర్నాటక వాగ్గేయకారుడు, భక్తాగ్రేసరుడు శ్రీ త్యాగరాజస్వామి వారి మాతామహులు శ్రీ వీణ కాళహస్తయ్య తంజావూరు ఆస్థాన వైణిక విద్వాంసులు. ఇక్కడకు

పదమూడు కిలోమీటర్ల దూరంలో కావేరీ నదీతీరాన శ్రీ త్యాగరాజస్వామి నివసించిన తిరువయ్యారు వెళ్ళాము. అక్కడ వారి సమాధి, ఆలయం దర్శించాము.

**కుంబకోణం**

అక్కడనుండి కుంబకోణం మీదుగా చిదంబరానికి బయలు దేరాము. కుంబకోణం తాలూకా ముఖ్య కేంద్రం. ఈ పట్టణంలోనూ చుట్టు ప్రక్కల ఉన్నన్ని ఆలయాలు బహుశా దేశంలోని ఏ ఒక్క ప్రదేశంలో లేవంటే అతిశయోక్తి కాదేమో! మొత్తం పదిహేడు పెద్ద ఆలయాలునాయి. ఆదికుంభేశ్వరస్వామి, సరస్వతీదేవి, రామస్వామి, చక్రపాణి, కాశీ విశ్వనాథార్, నాగేశ్వరన్, సారంగపాణి, సోమేశ్వర్ మొదలైన ఆలయాలున్నాయి. సాధారణంగా చాలా దేవాలయాల్లో నవగ్రహాలన్నీ ప్రదక్షిణ చేసే వీలుగా ఒకే మండపంలో ఉండటం చూస్తాము. అందుకు భిన్నంగా ఒక్కొక్క గ్రహదేవతకు ప్రత్యేకంగా ఆలయాలు ఈ పట్టణానికి నలుదిక్కులా ఉన్నాయి. అవి ఏదో చిన్నా చితకా మందిరాలు కూడా కావు. పెద్ద గాలిగోపురాలతో సువిశాలమైన ప్రాంగణాలతో ఉన్నాయి. ఇవన్నీ చూడాలంటే మూడు నాలుగు రోజులు కావాలి. నవగ్రహాలలో బుధ, గురు దేవాలయాలు, మిగతా వాటిలో ఆది కుంభేశ్వర, సరస్వతీ దేవి ఆలయాలు మాత్రం దర్శించి భోజనం చేసి చిదంబరానికి బయలుదేరాము.

**చిదంబరం**

మూడు గంటలకు చిదంబరం చేరాము. సాయంత్ర దర్శన వేళలు ప్రారంభమయ్యే నాలుగు గంటల వరకూ ఆ ప్రాంగణంలో గడిపి ప్రత్యేక అర్చన టికెట్లు తీసుకుని గర్భాలయంలోకి ప్రవేశించాము. భక్తి శ్రద్ధలతో నటరాజ స్వామిని సేవించాము.

ఇక్కడ పార్వతీదేవి శివకామిని పేరుతో ప్రసిద్ధి. గర్భాలయానికి వెనుక భాగంలో ఈ అమ్మవారి మందిరం ఉన్నది. పంచభూతాలైన నేల, నీరు, అగ్ని, గాలి, ఆకాశం శివతత్వంగా నెలకొన్న శైవక్షేత్రాలలో కంచిలో ఏకాంబరేశ్వరుడు, తిరుచిరాపల్లివద్ద శ్రీరంగం సమీపంలో తిరువానైక్కావిల్ అని చోట జంబుకేశ్వరుడు, తిరువన్నా మలైవద్ద అరుణాచలేశ్వరుడు, శ్రీ కాళహస్తిలో శ్రీ కాళహస్తీశ్వరుడు వరుసగా, భూమి, జల, అగ్ని, వాయు రూపాలు కాగా, చిదంబరంలోని నటరాజస్వామి ఆకాశానికి ప్రతీకలుగా ప్రసిద్ధి.

చిదంబర రహస్యంగా చెప్పబడే ఆకాశ లింగస్వరూపం గురించి పూజారి తెలుగులో వివరించారు. గర్భాలయ ప్రవేశ ద్వారం ప్రక్కన గోడ కొంత మేర ఎల్లవేళలా ఒక తెరతో కప్పబడి ఉంటుంది. ఆ తెర మానవుని మనసును కమ్మిన మాయకు సంకేతం. ఎప్పుడైతే ఈ మాయ అనే తెర తొలగుతుందో, అప్పుడు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఈ మాటలు చెపుతూ అక్కడ ఉన్న పూజారి ఆ తెరను తొలగించి ఆ గోడపై నున్న ఒక దృశ్యాన్ని వివరిస్తూ తిలకించమని చెపుతూనే, తెరను యథాపూర్వం దించుతాడు. కానీ మనకేమీ గోచరం కాదు. ఎందుకంటే ఆత్మ కానీ, దానికి సంబంధించిన జ్ఞానం కానీ భౌతికంగా కనబడేవి కాదు కదా. అదే చిదంబర రహస్యం. దీనితో ఆ రోజు పర్యటనను ముగించి సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరి ఎనిమిది గంటలకు తిరిగి తంజావూరు చేరుకొని విశ్రాంతి తీసుకున్నాము.

**తంజావూరు**

28వ తేదీ హోటలు గది ఖాళీ చేసి, మరొక టాక్సీ మాట్లాడుకుని,

ఎనిమిది గంటలకు బయలుదేరి ముందుగా ఆసియాలోకెల్లా అత్యంత పురాతనమైన సరస్వతి మహల్ గ్రంధాలయానికి వెళ్ళాము. అందులోని విశేషాలు తెలుసుకుని, అక్కడనుండి ప్రసిద్ధ బృహదీశ్వారాలయానికి వెళ్ళాము. చోళ వంశానికి మొదటి వాడైన రాజరాజ చోళునిచే ఇది క్రీస్తుశకం పదకొండవ శతాబ్దంలో నిర్మింపబడింది. పూర్తిగా గ్రానైటు రాతితో నిర్మింపబడిన మొట్టమొదటి కట్టడంగా ఇది ప్రసిద్ధి.

ప్రస్తుతం వారసత్వ సంపదగా యునెస్కోచే గుర్తింపబడి పరిరక్షింపబడుతున్నది. ఇటువంటి కొన్ని ఆలయాలలో దేవతా మూర్తులకు ధూప దీప నైవేద్యాలు మృగ్యమై కేవలం పర్యాటక ప్రాధాన్యం మాత్రమే సంతరించుకున్న ప్రదేశాలుగా ఉండటం కద్దు. కోణార్కులోని సూర్య దేవాలయం, ఎల్లోరా లోని కైలాస మందిరం ఇందుకు ఉదాహరణలు. ఈ ఆలయం మాత్రం ఇందుకు మినహాయింపు. శిల్పకళను తిలకించటానికి వచ్చే అనేకమంది విదేశీయులు సయితం భక్తితో ఈ దేవాలయాన్ని దర్శించటం చూస్తాము. గర్భాలయానికి అభిముఖంగా ఒక ప్రత్యేక మండపంలో భారీ నంది విగ్రహం ఉన్నది. లేపాక్షిలో ఉన్న నంది మాత్రమే దీనికన్నా పెద్దది.

వివిధ సంగీత వాయిద్యాల తయారీకి తంజావూరు ప్రసిద్ధి. ఇక్కడ తయారయిన వీణలకు ఒక విశిష్టత ఉన్నది. అలాంటి వాయిద్యాల విక్రయశాలలో మా కుమారుడు ఒక వేణువు కొనుక్కున్నాడు. ముఖ్యంగా

ఇక్కడ తయారయే చిత్రకళా ఖండాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. రేఖా చిత్ర పటాలపై, రంగులతో అద్దిన వివిధ దేవతల చిత్రాలలో ఆయా కళాకారుల నైపుణ్యాన్నిబట్టి జీవకళ తొణికిసలాడుతూ ఉంటుంది. వీటి ధర కూడా ఆ స్థాయి లోనే ఉంటుంది.

తమిళనాడు హస్తకళా వస్తు విక్రయశాలలో శ్రీకృష్ణుని పటమొకటి మేము కొనుగోలు చేశాము. పర్యటన ఇంతటితో ముగించి భోజనం చేసి రెండు గంటలకు ఇక్కడ బయలుదేరాము.

**శ్రీరంగం**

ప్రసిద్ధ స్వయం వ్యక్త విష్ణు క్షేత్రాలు ఎనిమిది. కాగా ఏడు తిరుమల (అంధ్ర ప్రదేశ్) శ్రీరంగం, శ్రీముష్ణం , తోతాద్రి (తమిళనాడు) లో ఉండగా నైమిశారణ్యం (ఉత్తరప్రదేశ్) బదరీ (ఉత్తరాఖండ్) పుష్కర్ (రాజస్థాన్) లు భారతదేశంలో ఉండగా ఎనిమిదవదయిన సాలగ్రామం, నేపాలులో ఉన్నది. వీటిలో ప్రధానమయినది తిరుచిరాపల్లి సమీపంలో నున్న శ్రీరంగం. ఈ సుప్రసిద్ధ దేవాలయ పట్టణం ఒకవైపు కావేరి నది మరొక వైపున 'కొల్లిదం' అనే ఉపనదికి మధ్యస్థంగా ఒక చిన్న ద్వీపంగా ఉన్నది. ఇది కుమారి జయరాం జయలలిత గారి జన్మస్థలం. ఈ నియోజక వర్గం నుంచే ఆమె తమిళనాడు శాసన సభకు ఎన్నికై, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు.

నాలుగు గంటలకు తిరుచిరాపల్లి మీదుగా శ్రీరంగం చేరాము. 156 ఎకరాలలో విస్తరించి ఉన్న విశాలమైన ప్రాంగణం. మొత్తం ఏడు ప్రాకారాలు. ఒక్కొక్క ప్రాకారానికి మూడేసి చొప్పున ఇరవై ఒక్క గోపురాలు. 237 అడుగుల ఎత్తైన ఈ దేవాలయ రాజగోపురం ఆసియా

లోనే అతి ఎత్తైన దేవాలయ గోపురం. దీనితో దాదాపు సరిసమానమైనది మరుడేశ్వర స్వామివారి దేవాలయ రాజగోపురం. ఇది కర్నాటక రాష్ట్రంలోని ఉత్తర కన్నడ (North Canara) జిల్లా అరేబియా సముద్ర తీరంలో ఒక చిన్న ద్వీపకల్పంపై ఉన్నది.

ఒక్కొక్క ప్రాకారంలోనూ వివిధ దేవతామూర్తుల ఆలయాలు చిన్నవీ పెద్దవీ కలిపి మొత్తం యాభయి వరకూ ప్రతి ప్రాకారంలోనూ ఉన్నాయి. పొడవైన వసారాలూ, మధ్య మధ్యలో విశాలమైన మండపాలూ చూపరులను విస్తుగోలుపుతాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే అద్భుతమైన శిల్పకళా నైపుణ్యానికి నిర్వచనం ఈ దేవాలయం. మొత్తం ప్రాంగణమంతా వివరంగా దర్శించాలంటే ఒక పూర్తి రోజు ఇక్కడే గడపవలసి ఉంటుంది. మాకు అంత సమయం లేదు. సాయంత్రం అయిదున్నర నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు మాత్రమే గడపగలిగాము. అవకాశం లభిస్తే మరొకసారి తీరికగా దర్శించాలనే కోరిక కలిగింది. బయటకు వచ్చి తమిళ సాంప్రదాయంలో అల్పాహారం చేసి తిరుచిరాపల్లి రైల్వే స్టేషనుకు చేరుకొని వాహనాన్ని విడుదల

చేశాం. రాత్రి గం.10.25ని.లకు 16713 నెంబరు సేతు ఎక్స్ ప్రెస్ లో రామేశ్వరానికి బయలుదేరాం.

**రామేశ్వరం**

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటయిన ఈ రామేశ్వరం బంగాళాఖాతం హిందూ మహాసముద్రం కలిసే పాక్ జలసంధిలో 'పాంబన్' అనే ద్వీపంపై ఉన్నది. ప్రధాన భూబాగానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో నున్న ఈ ద్వీపాన్ని

కలుపుతూ జలరాశిపై అద్భుతమైన రెండు సేతువులున్నాయి. ఒకటి రోడ్డు మార్గం రెండవది రైలు మార్గం. ఈ సేతువులపై ప్రయాణిస్తూ ఈ క్షేత్ర పట్టణంలో ప్రవేశిస్తాము.

28వ తేదీ ఉదయం అయిదు గంటలకు రామేశ్వరంలో దిగి ఆటోలో కరివెన సత్రానికి వెళ్లాం. గది కోసం గంటపాటు వేచి ఉండవలసి వచ్చింది. మన రాష్ట్రంలోని శ్రీశైలం ప్రధాన కేంద్రంగా పనిచేసే ఒక ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ 'అఖిల భారత బ్రాహ్మణ కరివెన అన్నదాన సత్రం'. వీరికి వారణాసి, ఆలంపూర్, షిర్డీ, భద్రాచలం, విజయవాడలతో పాటు ఇక్కడ కూడా ఒక శాఖ ఉన్నది. ఆయా క్షేత్రాలను దర్శించే భక్తులకు ప్రధానంగా భోజన సౌకర్యం కల్పించటమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యమైనప్పటికీ, కొంతమేర వసతి సౌకర్యం కూడా కల్పిస్తుంది. ఇంతకు మునుపు చేసిన యాత్రలలో భద్రాచలం, వారణాసిలలో భోజన సౌకర్యం మాత్రమే వినియోగించుకోగా, శ్రీశైలంలో వసతి సౌకర్యం కూడా వినియోగించుకున్నాము. ఆ అనుభవంతో ఇక్కడ ఉన్న ఈ సంస్థకు వెళ్ళాము. నిర్వహణా ప్రమాణం చాలా అధమ స్థాయిలో ఉందని

చెప్పాలి. గది గానీ పడకలు గానీ ఏ మాత్రం పరిశుభ్రంగా లేవు. స్నానాల గదిలో పావురాల నివాసంతో దుర్వాసన. అయితే అటు సముద్ర తీరానికి, ఇటు ప్రధాన దేవాలయానికీ నడుమ ఉండటంతోనూ, గదిలో గడపవలసిన సమయం కనీసమే కనుకనూ, ముఖ్యంగా రాత్రి బస అవసరం లేకపోవటంతోనూ ఏదో సరిపెట్టుకున్నాము

దేవాలయ ప్రాంగణంలో ఇరవైరెండు బావులలో స్నానం చేయవలసి ఉంటుంది. ఆ బావుల వద్ద నీరు తోడిపోయటానికి ఒక మనిషిని మాట్లాడుకుని ముందుగా తీరానికి వెళ్లి సముద్ర స్నానం చేసి అవే దుస్తులతో, అలహాబాదు త్రివేణీ సంగమం నుంచి తెచ్చిన గంగా తీర్థం తీసుకుని దేవాలయానికి వెళ్లాం. గర్భాలయ ప్రవేశానికి పూర్వం మళ్ళీ పైన పేర్కొన్న ఇరవైరెండు బావులలో ఒక్కొక్కదాని వద్దా, వెంట తెచ్చుకున్న మనిషి నీరు తోడి పోస్తుండగా ముగ్గురం స్నానాలు చేస్తూ గర్భాలయానికి లైనులో నిలబడ్డాము. లింగాకృతిలోనున్న మూలవిరాట్టు శ్రీ రామనాథస్వామి. దర్శనానికి ఎక్కువ సేపు వేచి ఉండే అవసరం లేకుండా గంగా తీర్థం తెచ్చుకున్నవారికోసం ఉన్న ప్రత్యేక ఏర్పాటు మేరకు మమ్ములను విడిగా కూర్చోబెట్టి స్వామికి అభిషేకం జరిపారు. తదనంతరం జరిగిన అర్చన కూడా తిలకించి స్వామిని భక్తి ప్రపత్తులతో పూజించి గర్భాలయం నుంచి నిష్క్రమించాము. ఒక వారగా దుస్తులు మార్చుకున్నాము.

ఈ ఆలయ అంతర గర్భాలయం క్రీస్తు శకం పదవ శతాబ్దంలో అప్పటి శ్రీలంక ప్రభువు పరాక్రమ బాహుచే నిర్మింపబడింది. 230 మీటర్ల పొడవు నాలుగు మీటర్ల ఎత్తుతో కళాత్మకమైన గ్రానైటు రాతి స్తంభాలతో నిర్మింపబడిన వసారా ఈ దేవాలయ ప్రత్యేకత, ప్రధాన ఆకర్షణ.

ఈ విశేషాలన్నీ తిలకిస్తూ కొంతసేపు ఆ ప్రాంగణంలో గడిపి గదికి చేరుకొని తడి దుస్తులు ఆరబెట్టి, దేవాలయం ఎదురుగానున్న హోటలులో అల్పాహారం, కాఫీ సేవించి ఆటో ఒకటి మాట్లాడుకుని స్థానికంగా చూడదగిన మిగతా ప్రదేశాలకు బయలుదేరాం. వీటిలో ముఖ్యమైనది పది కిలోమీటర్ల దూరంలోనున్న జాలర్ల గ్రామం ధనుష్కోటి. భారత మాజీ రాష్ట్రపతి డాక్టరు అబ్దుల్ కలాం గారి జన్మస్థలం. వారి నిరాండంబరమైన నివాసం రామేశ్వరం పట్టణంలో ఉన్నది. రామాయణ కాలానికి చెందిన అనేక గాథలు ఈ ధనుష్కోటితో ముడిబడి ఉన్నాయి. వాటికి సంబంధించిన ప్రదేశాలలో, సీతాకుండ్, లక్ష్మణతీర్థం, సుగ్రీవతీర్థం మొదలైనవి తిలకించి భోజన సమయానికి కరివెనకు చేరాము. భోజనం చేసి మేమిరువరం గదిలో విశ్రమించగా, మా కుమారుడు మాత్రం దుర్గంధం భరించలేక బయటనే కాలక్షేపం చేసాడు.

అలహాబాదు త్రివేణీ సంగమం నుంచి తెచ్చిన గంగాతీర్థంతో శ్రీ రామలింగేశ్వరుని అభిషేకించి ఇక్కడి సముద్ర తీరం నుంచి సేకరించిన ఇసుకను అలహాబాదు త్రివేణీ సంగమంలో నిమజ్జనం చేసి తిరిగి కాశీ విశ్వనాథుని దర్శించటం సంపూర్ణ కాశీ యాత్రగా చెప్పబడియుండటం చేత, మరొక్క సారి కాశీ యాత్ర చేసే ఉద్దేశంతో గది ఖాళీ చేయటానికి పూర్వం మళ్ళీ

సముద్ర తీరానికి వెళ్లి ఆ ఇసుకను సేకరించాము. గది ఖాళీ చేసి అయిదు గంటలకు రామేశ్వరం స్టేషను చేరుకున్నాము.

**మదురై**

గం. 5.35ని. లకు 56726 నెంబరు రామేశ్వరం మదురై పాసింజరు రైలులో బయలు దేరాము. ప్రయాణంలోనుండగా హైదరాబాదు నుండి మా పెద్ద కుమార్తె సుదామాధవి, యాత్ర ఎలా సాగుతున్నదో తెలుసుకోవటానికి ఫోను చేసింది. విశేషాలు క్లుప్తంగా వివరించి రాత్రికి మదురై చేరుతున్నామనీ, వీలయితే ఆన్ లైనులో ఏదైనా మంచి హోటలులో బస బుక్ చేయవలసినదని కోరగా, వెంటనే తమిళనాడు పర్యాటక అభివృద్ధి సంస్థ (Tamilnadu Tourism Development Corporation-TTDC)ను సంప్రదించి, వారి గెస్టు హౌసులో ఒక స్యూట్ (Suite) ను బుక్ చేసి తత్సంబంధ వివరాలను మేము మదురై చేరేలోపే అందజేసింది. ఆ గెస్టు హౌసు స్టేషనుకు దగ్గరలోనే ఉంది. ఆ విధంగా గెస్టు హౌసు వెదుక్కొనే శ్రమ తప్పించటమే కాక విలువైన సమయం కూడా మిగిల్చింది.

తొమ్మిదిన్నరకు రైలు దిగి నేరుగా గెస్టు హౌసుకు వెళ్లి బుకింగు తాలూకు వివరాలు చెప్పగానే మూడు పడకల విశాలమైన గది కేటాయించారు. సౌకర్యంగా ఉంది. పెద్ద ఖరీదు కూడా కాదు. అనుబంధంగా రెస్టారెంటు కూడా ఉన్నది. అల్పాహారం చేశాము. బాగా అలిసిపోయి ఉన్నామేమో సుఖమైన నిద్ర పట్టింది.

దక్షిణ భారత దేశంలో ముఖ్యంగా తమిళనాడులో అత్యంత ప్రసిద్ధి చెందిన దేవాలయాలు నాలుగు. అవి కంచి, శ్రీరంగం, రామేశ్వరం, మదురై. ఇక్కడ పార్వతీ దేవి మీనాక్షి దేవిగా భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నది. తమిళనాడులో వైగా నదికి దక్షిణ తీరాన క్రీస్తు శకం ఏడవ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మితమవగా 1310వ సంవత్సరంలో మాలిక్ లాపూర్ అనే దుష్టుని దురాక్రమణలో ధ్వంసమైంది. తిరిగి 1559-1600 సంవత్సరాల మధ్య అప్పటి నాయక రాజుల కాలంలో ఆ వంశపు ప్రథమ రాజు విశ్వనాథ నాయకునిచే పునరుద్ధరింపబడింది.

ఆ నమూనా 1623-55 సంవత్సరాల మధ్య తిరుమల నాయక అనే రాజుచే మరింత విస్తృత పరచ బడింది. అందులో వసంతోత్సవం కోసమని ప్రత్యేకంగా వసంత మండపాన్నీ, 'కిలికూట్టు' అనే చిలుకల మండపాన్నీ (లాస్యంగా మడచిన మీనాక్షి అమ్మవారి కుడి చూపుడు వ్రేలిపై రాచిలక ఉండటం గమనార్హం) అనంతర కాలంలో మంగమ్మాళ్ అనే రాణి గారు పుష్కరిణి చుట్టూరా వసారాలను, మీనాక్షీ నాయకర్ మండపాన్నీ నిర్మింపజేశారట.

వైశాల్యంలోనూ, శిల్పకళా నైపుణ్యంలోనూ, మిగతా ఆలయాలేవీ దీనికి ఏమాత్రం తీసిపోనప్పటికీ, ఇతర విశిష్టతల రీత్యా ఇది మరి కొంత ప్రత్యేకత సంతరించుకున్నది. పురాతన మదురై నగరమే ఇందుకు ఉదాహరణ. ఈ నగర నిర్మాణం, శాస్త్రీయమైన నగర ప్రణాళికా సూత్రాలతో పాటు, దేవాలయాలకు సంబంధించిన ఆగమ, శిల్పకళా శాస్త్రాలను కూడా అనుసరించి ఉండటం ఆసక్తి కలిగించే అంశం. ఈ ప్రాంగణం వెలుపలి ప్రాకారానికి నాలుగు దిక్కులా నాలుగు గోపురాలున్నాయి. ప్రతి గోపురానికి అభిముఖంగా ఒక ప్రధాన రహదారి ఉంటుంది. నగరంలో ఏ మారుమూల ఏ

చిన్న వీధిలోనయినాసరే నిలబడి దేవాలయ స్థూల దిశ తెలుసుకుని ఆ దిశ మరల్చకుండా అటు వెళితే చాలు. ఎన్ని మలుపులు తిరిగినా ఆ మార్గం ఈ నాలుగు గోపురాలలో ఏదో ఒకదాని ఎదురుగా ఉన్న ప్రధాన వీధిలోకి చేరుస్తుంది. 'All Roads Lead to The Temple' అన్న నానుడి ఇక్కడ అక్షరాలా వర్తిస్తుంది.

ఈ ప్రాంగణంలో మొత్తం 35,000 శిల్పాలు ఉండవచ్చని ఒక అంచనా. మొత్తం గోపురాలు పద్నాలుగు. ప్రధాన రాజగోపురం ఎత్తు 170 అడుగులు. స్వామివారి, అమ్మవారి విమాన గోపురాలు స్వర్ణమయం చేయబడ్డాయి. ప్రపంచ అద్భుతాల గణన కోసం వచ్చిన ప్రతిపాదనలలో మొదటి ముప్పైలో స్థానం పొందిన అతి సుందరమైన ప్రాచీన హిందూ దేవాలయాలలో ప్రధానమైనది. తప్పనిసరిగా దర్శించవలసినది. సంవత్సరం పొడవునా భక్తులతో కళకళ లాడుతూ ఉంటుంది.

30వ తేదీ ఉదయాన్నే బయలుదేరి ముందుగా ఈ ఆలయానికి వెళ్ళాము. ఆ రోజు శుక్రవారం. మిగతా రోజులకంటే రద్దీ మూడింతలు అధికంగా ఉన్నది. లైనులో గంటకు పైగా నిలబడి సంతృప్తికరమైన దర్శనం చేసుకున్నాము. ఆ తరువాత సుందరేశ్వర స్వామిని సేవించాము.

అద్భుతమైన శిల్పాలను తిలకిస్తూ దాదాపు మూడు గంటలు గడిపాము. ఈ దేవాలయాలన్నిటిలోనూ ఫోటోగ్రఫీ నిషేధం అని బోర్డులున్నప్పటికీ కొన్నిటిలో చూసీ చూడనట్లే ఉంటారు. రామేశ్వరం లోనూ, చిదంబరం లోనూ ఒకింత కఠినంగా ఉండగా శ్రీరంగంలో కొంత ఉదారంగా ఉన్నారు. ఇక్కడ మాత్రం దర్శనం ముగించుకుని

బయటకు వస్తూ పుష్కరిణి లోని స్వర్ణ కమలాన్ని, పెద్ద కెమేరాతో మెరుగైన కోణంలో మరింత స్పష్టంగా తీసే ప్రయత్నంలో భద్రతా సిబ్బందికి దొరికిపోయాను. అప్పటికి అది తీయటం పూర్తయిందనుకోండి. అది వేరే విషయం. ఈ సందర్భంలో ఒక విషయం ముచ్చటించుకోవటం సముచితం.

ఏ యాత్రికులూ, పర్యాటకులైనా జీవితంలో ఒకసారి మాత్రమే ఇటువంటి ప్రదేశాలు దర్శించ గలుగుతారు. ఆ జ్ఞాపకాలను చిరస్మరణీయం చేసుకోవాలనే కాంక్ష ఉంటుంది. అది సహజం కూడా. ఇందుకు ఫోటోలు, వీడియోలకు మించిన సదుపాయం లేదు. ఇటువంటి చారిత్రిక ప్రదేశాలపై శాస్త్రీయ పరిశోధన చేసే విద్యార్థులకు, చిత్ర సంపుటాలను, గ్రంథాలను రచించి ప్రచురించే వారికి ఫోటోలు సేకరించటం అవసరమే కాదు అది వారి హక్కు కూడా.

పది పదిహేను సంవత్సరాల క్రితం వరకూ నాణ్యమైన కెమెరాలు ఔత్సాహికులకు అందుబాటులో ఉండేవి కావు. తక్కువ ధరలో లభించినా ఫిల్ముతో కూడిన వీటి నిర్వహణ ఖర్చుతో కూడిన వ్యవహారంగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సెల్ ఫోనులతో పాటు, అరచేతిలో ఇమిడిపోయే పరిమాణంలో నాణ్యమైన డిజిటల్ కెమెరాలు సామాన్యులకు సయితం అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఫోటోగ్రఫీపై నిషేధం గురించి ఆలోచిస్తే, దేవాలయాలలోని మూల విరాట్టులను ఫోటోలు తీయటాన్ని నిషేధించటం అర్థం చేసుకోవచ్చు. అసలు ప్రాంగణంలోనే ఇది నిషేధించటం సమంజసంగా తోచదు. పైగా ఇటువంటి నిషేధానికి చట్టబద్ధత కూడా లేదు. నిషేధానికి చట్టబద్ధమైన ప్రాంతాలు, పరిస్థితులు సందర్భాలు వేరే ఉంటాయి.

అయితే 'కాదేదీ కవితనర్హం' అనే విధంగా తీవ్రవాదం, విధ్వంసక చర్యలు పెచ్చు పెరిగి ప్రేలుడు పదార్థాలు అమర్చటానికి కెమెరాలు సులువైన, అనుమానించలేని సాధనాలవటంతో ఇతర కారణాలకంటే భద్రతా కారణాల రీత్యా ఈ నిషేధం తప్పనిసరి అవుతోంది. కాశీ, మధుర, సోమనాథ్ మొదలైన కొన్ని ప్రముఖ పుణ్య క్షేత్రాలపై ఇప్పటికే దాడులు జరిగాయి. మరికొన్ని, తీవ్రవాదుల హెచ్చరికలలో ఉన్నాయి. ఇటువంటి చోట్ల కఠినమైన భద్రతా చర్యలు తీసుకోవలసినదే.

అదే సమయంలో నిషేధాన్ని అమలు చేయటంలో కొంత విచక్షణ, విజ్ఞతలను పాటించటం కూడా అవసరం. ఉదాహరణకు పార్లమెంటు మీద దాడి జరిగింది. అలా అని పార్లమెంటులోకి సెల్ ఫోనులను నిషేధించటం సాధ్యం కాదు కదా. ఈ భద్రతా చర్యల లక్ష్యం నిషేధిత వస్తువులు లోనికి ప్రవేశించకుండా నిరోధించటమే అయితే బోర్డు పెట్టినంత మాత్రాన ఆ లక్ష్యం నెరవేరదు. ఎందుకంటే దుస్సాహసికుడు ఎపుడూ పకడ్బందీ పథకంతో ఆ ప్రయత్నం చేస్తాడు. అటువంటివారిని గుర్తించే పటిష్టమైన నిఘా, యంత్రాంగం లేకుండా ప్రతి భక్తుడినీ అనుమానించటం సరికాదు.. కనుక దేవాలయ ప్రవేశానికి పూర్వం యాత్రికుల వద్ద కెమెరాలు, సెల్ ఫోనులు, లోపలకు అనుమతింపబడని ఇతర వస్తువులు ఏమయినా ఉంటే వారు దర్శనం ముగించుకుని తిరిగి వచ్చే వరకూ ఆ వస్తువుల భద్రతకు తగిన ఏర్పాట్లు చేయాలి. ఇది ఖర్చుతో కూడుకున్న పని కనుక ప్రత్యామ్నాయంగా 'ఫోటోగ్రఫీ నిషేధం' అని బోర్డులు పెట్టి చేతులు

దులుపుకుంటారు. దీనివల్ల, ఈ నిబంధనని అతిక్రమించినవారు సిబ్బంది యొక్క దయాదాక్షిణ్యాలకు గురి అవుతున్నారు. కొన్ని సందర్భాలలో ఇది అవినీతికి సయితం ఆస్కారమిస్తుంది. చాలా సందర్భాలలో భద్రతా వైఫల్యానికి ఇదే మూలమవుతుంది. అందుచేత వీటికి ప్రత్యేకించి క్లోకు రూములను నిర్వహించే అవకాశం లేని చోట్ల సెల్ ఫోనులను, కెమెరాలను క్షుణ్ణంగా పరీక్షించి అనుమతించవచ్చు. సిబ్బంది కూడా ఎవరు ఎటువంటి వారు అనేది నిశితంగా గమనిస్తూ యాత్రికుల పట్ల సానుభూతి తోనూ, సంయమనంతోనూ వ్యవహరించాలి. అలాగే, ఇటువంటి బోర్డులున్న చోట, యాత్రికులు కూడా కొంత జాగ్రత్తగా ఉండాలి. ఇటువంటి సందర్భాలలో కొందరు యాత్రికులు సిబ్బందితో ఘర్షణ పడిన సంఘటనలు చూశాము. మాకు సంబంధించినంతవరకూ ఇటువంటి నియమాలను గౌరవిస్తూ సిబ్బందికి సహకరించాము. అభ్యంతరం పెట్టిన చోట్ల కూడా సౌమ్యంగానే చెప్పారు తప్ప, నోరు చేసుకోవటం, కెమెరా లాక్కోవటం వంటి చర్యలు ఎక్కడా తారస పడలేదు. అందుకు వారందరూ అభినందనీయులే.

ఏ దేవాలయంలోనయినా నిషేధాన్ని లోపల మాత్రమే కొంతవరకైనా అమలు చేయగలరు కానీ రాజగోపురాలు మొదలైన వాటిని బయటనుంచి తీసే అవకాశమున్న చోట్ల ఏ నిషేధమూ పనిచేయదు. కెమెరాలు పూర్తిగా నిషేధమున్న ఉజ్జయిని, ఓంకారేశ్వర్ మొదలైన చోట్ల సయితం ఆ దేవాలయాలను ఇలా బయటినుంచే తీశాను. సోమనాథ్ ఆలయాన్ని మేము బస చేసిన హోటలు చివరి అంతస్తు పైకెక్కి తీశాను. ఇక్కడా, రామేశ్వరం లోనూ రాజగోపురాలు మరమ్మతుల్లో ఉన్నందున తడికలతో కప్పి ఉంచటంతో వాటి ఫోటోలు తీసుకునే అవకాశం లభించలేదు. ఇది ఈ యాత్రలో కొంత అసంతృప్తి కలిగించిన అంశం.

మళ్ళీ అసలు యాత్రలోకి వద్దాం. మధ్యాహ్నం ఆరగింపుల నిమిత్తమై సముదాయంలోని ఆలయాలన్నీ మూసేవరకూ ఆ ప్రాంగణంలో గడిపాము. అందరినీ బయటకు పంపుతుండగా పన్నెండు గంటల ప్రాంతంలో బయటకు వచ్చాము. మదురై అనగానే యాత్రికుల భావనలు, మీనాక్షీ అమ్మవారు, ఆ దేవాలయం చుట్టూనే ఉంటాయి. అందుకు వ్యతిరేకంగా మనసులను ఆకర్షించగలిగినది ఆ నగరంలో మరేదీ లేదంటే అతిశయోక్తి కాదు. ఆ భావన మదిలో పదిలపరుచుకుని, ఆటో అతను తీసుకెళ్ళిన ఒక మంచి హోటలులో రుచికరమైన భోజనం చేసి గెస్టు హౌసుకు చేరాము. మరి కొంత సేపట్లో కన్యాకుమారికి ప్రయాణం. అవకాశం ఉన్నంతసేపు విశ్రాంతి తీసుకుని స్టేషనుకు చేరాము.

ఇటువంటి సుదీర్ఘ యాత్రలలో తరువాత మజిలీ చేరుకోవటానికి రాత్రి ప్రయాణం చేయవలసి వచ్చినా, ఆ మజిలీలోని బసకు ఏ అర్ధరాత్రి వేళో చేరవలసి వచ్చినా నిద్ర సరిగా లేకుంటే ఆ ప్రభావం మరునాటి పర్యటన మీద తీవ్రంగా ఉంటుంది. శారీరకంగా బలహీనపడటమే కాక మానసికంగా ఉత్సాహం సన్నగిల్లి ప్రతి చిన్న విషయమూ చిరాకు కలిగిస్తుంది. తత్ఫలితంగా యాత్రను ఆస్వాదించలేము.

గం.4.35 ని.లకు రావలసిన 6127 నెంబరు చెన్నై ఎగ్మూరు గురువాయూరు ఎక్స్ ప్రెస్ (ఈ యాత్రలో ఇదే రైలులో మరో సారి కూడా ప్రయాణిస్తాము) గంట ఆలస్యంగా వచ్చింది. ఇక్కడ నుండి నాగర్ కోయిలుకు అయిదు గంటలు ప్రయాణం. అక్కడనుండి పదహారు కిలోమీటర్లే అయినా స్టేషను బయటికి వచ్చి వాహనం ఏర్పాటు చేసుకుని కన్యాకుమారి చేరుకోవటానికి ఏ అర్ధరాత్రో అయి చాలినంత నిద్ర లభించదేమో నని భయపడ్డాము. కానీ ఆలశ్యం పూడ్చుకుని నాగర్ కోయిలుకు నిర్ణీత

సమయానికే చేరింది. వెంటనే టాక్సీ మాట్లాడుకుని పదిన్నరకు కన్యాకుమారి చేరుకున్నాం. మధ్యాహ్నం మదురైలో చేసిన భోజనం బరువు ఇంకా దిగలేదు. సూర్యోదయ దృశ్యాన్ని తిలకించేందుకు వేకువనే లేవవలసిన అవసరం దృష్ట్యా తిండి విషయం ఆలోచించకుండా గదిలో ప్రవేశించిన వెంటనే పడకలేశాము.

**కన్యాకుమారి**

కన్యాకుమారి భారత ద్వీపకల్పం దక్షిణ కొసన చివరి భూభాగం. అఖండ హిందూ మహాసముద్రం తూర్పు భాగమైన బంగాళా ఖాతం, పశ్చిమ దిక్కున ఉన్న అరేబియా సముద్రానికి సంధి. మామూలుగా సూర్యోదయం, అస్తమయం ఏ దేశంలోనయినా ఏ ప్రాంతంలోనయినా చూడగలగటం అతి సామాన్య విషయం. ఇందులో ఆశ్చర్యం ఏముంది? కన్యాకుమారిలో మాత్రం సూర్యోదయానికి, అస్తమయానికి పెద్ద ప్రత్యేకతే ఉన్నది. ఇక్కడ దక్షిణ దిక్కుగా నిలబడితే కేవలం కంటికి కనబడని మన తల వెనుక వైపు సూటిగా ఉన్నప్రాంతం తప్ప మన తల త్రిప్పగలిగినంత మేర సముద్రమే కనిపిస్తుంది. అంటే మనం నిల్చున్న బిందువు కోణం 360 డిగ్రీలు అయితే, అందులో సుమారు మూడు వందల డిగ్రీలు నీరు, గరిష్టంగా అరవై డిగ్రీల మేర మాత్రమే భూమి అన్నమాట. భూమి మీదనుంచి ఇటువంటి అద్భుత దృశ్యం ఏ విదేశంలోనయినా ఉందేమో కానీ, అండమాన్, నికోబార్, లక్షద్వీప్ దీవులు కాకుండా, భారత దేశంలో ప్రధాన భూభాగం మీద మాత్రం మరే ప్రాంతంలోనూ కనబడదు. ఈ కారణంగా సూర్యాస్తమయాలు రెండూ సముద్రంలోనే వీక్షించే వీలవుతుంది.

ఇక పట్టణం విషయానికి వస్తే ఇది మహా పట్టణమూ కాదు అలా అని గ్రామమూ కాదు. పురపాలక సంఘం కూడా కాదు. కేవలం నగర పంచాయతీ.

2001 సంవత్సరం గణన ప్రకారం ఈ పట్టణ జనాభా 19,678. జిల్లా కన్యాకుమారి పేరునే ఉన్నా ముఖ్య పట్టణం మాత్రం నాగర్ కోయిల్. భూభాగపు సగటు ఎత్తు 0 అడుగులు. అంటే సముద్ర మట్టానికి దాదాపు సమానంగా ఉంటుందన్నమాట. 98.6 శాతం అక్షరాస్యులే. తిరిగి వారిలో 40 శాతం పట్టభద్రులు. ప్రధాన జీవనాధారం చేపల వేట. ఆ తరువాత పర్యాటక రంగం. రైల్వే స్టేషను మొదలుకుని ప్రధాన వీధులతో సహా పట్టణమంతా పరిశుభ్రంగానూ, సుందరంగానూ ఉంటుంది.

31 వ తేదీ శనివారం తెల్లవారు ఝామున అయిదు గంటలకే లేచి బీచికి వెళ్ళాము. కొన్ని వేలమంది అప్పటికే అక్కడకు చేరుకున్నారు. తూరుపు సముద్రంలో వెలుగు రేకలు ఇంకా ప్రారంభం కాలేదు. సముద్రంలో కొంచెం ఆగ్నేయ దిశగా ఒక రాతి గుట్టపై వివేకానందుని స్మారక భవనం, ఆ ప్రక్కనే మరో గుట్టపై ప్రముఖ తమిళ కవి తిరువళ్ళువార్ భారీ విగ్రహం కనబడుతున్నాయి.

సూర్య భగవానుడు తన దినచర్య ప్రారంభిస్తూ సముద్రంలో నుంచి వస్తున్నాడా అన్న భ్రాంతిని కలిగిస్తూ, కొద్ది కొద్దిగా పైకి వస్తూ జనసమూహం చేతుల్లోనున్న కెమెరాలలో చిక్కుకుంటున్నాడు. పది నిముషాల తరువాత పూర్తిగా పైకి వచ్చిన దృశ్యం ఆవిష్కృతమవగానే ప్రజలందరూ ఆనందాశ్చర్యాలతో కేరింతలు కొట్టారు. మరికొందరు సముద్రంలో పుణ్యస్నానాలు చేశారు. గదికి తిరిగివచ్చి స్నానాదులు పూర్తయ్యాక

అల్పాహారం చేసి ఆటో ఒకటి మాట్లాడుకుని పదకొండు కిలోమీటర్ల దూరంలో నున్న సుచీంద్రంకు వెళ్ళాము.

అనసూయ అనే భక్తురాలి పాతివ్రత్యాన్ని పరీక్షించ గోరి, త్రిమూర్తులు, సన్యాసి వేషాలలో ఆమె వద్దకు వెళ్లి భిక్ష అడగటం, ఆమె భిక్ష వేయటానికి సిద్ధపడగా దుస్తులు ధరించిన గృహిణుల నుండి తాము భిక్ష స్వీకరించలేమని తిరస్కరించటం, అప్పుడు ఆమె తన పాతివ్రత్య మహిమతో ఆ ముగ్గురినీ శిశువులుగా మార్చిన పురాణగాథ జరిగిన ప్రదేశంగా చెప్పబడింది.

ఈ గాథ నేపథ్యంలో త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు వారి వారి దేవేరుల సమేతంగా ఇక్కడ ఒక సుందరమైన ఆలయం ఉన్నది. తెల్లటి రాజగోపురం, పుష్కరిణి, చుట్టూ కొబ్బరి మొదలైన పచ్చని చెట్లూ, పరిశుభ్రమైన ఆలయ పరిసరాలు, మొత్తం ఆ ప్రాంతమంతా మనోహరంగా నుండి మనసుకు ఆహ్లాదాన్నీ, ప్రశాంతతనూ కలిగిస్తుంది. సుమారు ఒక గంట పాటు గడిపి తిరిగి కన్యాకుమారికి బయలుదేరాం. కొబ్బరి తోటలు ఎంత విస్తారంగా ఉన్నప్పటికీ, నీటి బొండాలు మాత్రం మహా ప్రియం. మన వైపు ఆరు ఏడు రూపాయలుంటే ఇక్కడ పదిహేను రూపాయల పైమాటే.

భోజనానంతరం కొద్ది సేపు విశ్రమించి వివేకానంద స్మారకం, తిరువళ్ళువార్ విగ్రహాలను దర్శించటానికి బయలుదేరాము. టికెట్లు తీసుకున్న పిదప స్టీమరు ఎక్కటానికి లైను చాలా పొడవుంది. క్రమశిక్షణ లేని కొందరు మలయాళీ యువకులు లైనులో నున్నవారిని త్రోసుకుంటూ పోవటమే కాక మహిళల పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించసాగారు. బాధితులు

మౌనంగా భరిస్తున్నారే కానీ వారిని వారించలేకపోతున్నారు. ఆ మౌనమే వారిని ప్రోత్సహించినట్లుంది, ఎక్కడో వెనుక నుండి యాభై అరవై మందిని దాటుకుంటూ మా వరకూ వచ్చేటప్పటికి వారి ఆగడం మితి మీరింది. అలా రెచ్చిపోతున్న వారిని కిరణ్ ధైర్యం చేసి అడ్డుకునే ప్రయత్నం చేయగా వారు తీవ్రంగా ప్రతిఘటించారు. బుద్ధిగా ఉంటారా, చర్య తీసుకోమంటారా అని పోలీసు సహాయానికై ఫోను తీశాడు. ఈ చొరవతో స్ఫూర్తి పొందిన బాధితులు, ముఖ్యంగా కొందరు మలయాళీలు కిరణుకు అండగా నిలబడగా వాళ్లు తగ్గటమే కాక అప్పటికి ఎంతమందినైతే దాటుకుంటూ వచ్చారో వారందరూ వెళ్ళేవరకూ ప్రక్కకు తప్పుకోక తప్పింది కాదు. మా వంతు రాగానే బోటులో కూర్చుని పది నిముషాల ప్రయాణంతో ముందుగా వివేకానంద స్మారక భవనాన్ని చేరుకున్నాము.

1892వ సంవత్సరం డిసెంబరు లో శ్రీ వివేకానందుడు తీరానికి అర కిలోమీటరు దూరంలో నున్న ఈ గుట్ట వద్దకు ఈదుకుంటూ చేరి అక్కడే ధ్యానం చేస్తూ ఆత్మ సాక్షాత్కారం పొందాడు. తదనంతర కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సంచరించి మానవాళికి అవసరమైన ఆధ్యాత్మిక జ్ఞాన జ్యోతులను ప్రసరింప జేశాడు. ఆ మహనీయుని స్మారకార్థం ఆ గుట్టపై నిర్మింపబడినదే ఈ భవన సముదాయం. ఇది రెండు ప్రధాన భాగాలుగా ఉంటుంది. ఒక భాగంలో ధ్యానమందిరంతో పాటు పరివ్రాజక భంగిమలో నున్న వివేకానందుని విగ్రహం, మరొక దానిలో గ్రంథాలయం, నిర్వహణ కార్యాలయం, భద్రతా స్థావరం మొదలైనవి ఉన్నాయి. 2004 డిసెంబరు 26న వచ్చిన సునామీ తాకిడికి ఈ

సముదాయం పాక్షికంగా దెబ్బతినగా సకాలంలో మరమ్మతులు చేసి పూర్వ వైభవాన్ని పునరుద్ధరించారు.

ఉత్తరాయణం ప్రవేశించి ఒక పక్షం రోజులే అయింది. అందుచేత సూర్యభగవానుడు ఇంకా దక్షిణ దిశ లోనే ఉన్నాడు. అందుచేత భూమి కొసకు ఆగ్నేయ దిశలో ఈ గుట్టకు కొద్దిగా దక్షిణ వైపున ఉదయం సూర్యోదయం దర్శనమవగా, అస్తమయాన్ని ఈ గుట్ట నుంచే పశ్చిమ నైరుతి దిక్కులో తిలకించాము.

సూర్యాస్తమయం పూర్తికాగానే అదే బోటులో ఆ ప్రక్కనే తిరువళ్లువార్ విగ్రహం ఉన్న రెండో గుట్టకు తీసుకువెళ్ళారు. 133 అడుగుల ఎత్తైన ఈ విగ్రహం చూడగానే ఎవరు ఈ మహానుభావుడు? ఏమిటి ఈయన విశిష్టత? అనే సందేహాలు ప్రతి పర్యాటకుని మదిలో మెదలి, ఆ విశేషాలు తెలుసుకోవాలనే కుతూహలం సహజంగానే కలుగుతుంది.

ద్రావిడ భాషలలో అతి పురాతన మైన ఒక గ్రంధం 'తిరక్కురాళ్' ఇది మొత్తం మూడు భాగాలుగా 133 అధ్యాయాలుగా 1330 ద్విపదలతో (రెండు చరణాల ఛందోబద్ధమైన లఘు పద్యాలు) ఉంటుంది. క్రీస్తు పూర్వం రెండు అయిదు శతాబ్దాల మధ్య 'తిరువళ్లువార్' అనే మహాకవి దీనిని రచించాడు. భూమి దున్నటం నుంచీ రాజ్య పరిపాలన వరకూ,

ప్రతి అంశాన్నీ స్పృశిస్తూ, శ్రమైక జీవనంలోని మాధుర్యం వస్తువుగా సాగే ఈ గ్రంధం 'తమిళ వేద' మనీ 'పొయ్యమొళి' (పోల్లుబోని సూక్తి) యనీ 'దివ్య గ్రంధ' మనీ నేటికీ కీర్తింపబడుతున్నది. ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న, మాజీ

రాష్ట్రపతి డాక్టరు అబ్దుల్ కలాం గారు పార్లమెంటులో చేసిన తన అధ్యక్షోపన్యాసాలతో సహా ఏ ఇతర సమావేశాలలో ప్రసంగాలలోనూ, తన రచనలలోనూ 'తిరక్కురాళ్' లోని సూక్తులను విస్తృతంగా ఉటంకిస్తారు. తమిళనాడుకే చెందిన మరొక మాజీ రాష్ట్రపతి శ్రీ ఆర్.వెంకటరామన్ గారు, తాను కేంద్ర ఆర్థిక మంత్రిగా, రక్షణ మంత్రిగా ఉన్నపుడు మరొక సుప్రసిద్ధ తమిళ కవి సుబ్రహ్మణ్య భారతితో పాటు 'తిరువళ్లువారు' ను కూడా ఉదహరించేవారు.

'తిరక్కురాళ్' లోని 133 అధ్యాయాలకు ప్రతీకగా మొత్తం 133 అడుగుల ఎత్తుతో ఈ నిర్మాణం రూపొందించబడింది. కృత్రిమంగా బలోపేతం చేయబడిన రాతిపై ఏర్పాటు చేసిన శిలాపీఠం ఎత్తు 38 ఆడుగులు కాగా దానిపై అసలు విగ్రహం ఎత్తు 95 అడుగులు. ఈ ప్రతిష్టాత్మక నిర్మాణం కూడా అనేక బాలారిష్టాలను చవి చూసింది. 1979 సంవత్సరంలో అప్పటి ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయిచే శంఖుస్థాపన పొందినప్పటికీ, విగ్రహ రూపకల్పన 1990 వరకుగానీ ప్రారంభ కాలేదు. అది కూడా మధ్యలోనే నిధులలేమి వల్ల మరికొంత కాలం నిలిచిపోయింది. 1992 లో తిరిగి ప్రారంభమయి, ప్రముఖ శిల్పి, తెలుగు తేజం డాక్టరు గణపతి స్థపతి గారి నేతృత్వంలో 1997లో పూర్తయినప్పటికీ మరో మూడు సంవత్సరాల తదుపరి 2000 సంవత్సరం జనవరి ఒకటవ తేదీన జాతికి అంకితం చేయబడింది. అంటే, దీనిని మీము దర్శించిన ఈ రోజుకు సరిగ్గా తొమ్మిది సంవత్సరాల ఒక్క నెలన్నమాట. అక్కడ కూడా కొంత సేపు గడిపి చీకటి పడుతుండగా ఆ రోజుకు చివరి ట్రిప్పులో తీరానికి తిరిగి చేరుకున్నాము. కన్యాకుమారి పట్టణంలో మరొక ప్రధాన ఆకర్షణ దేవి కన్యాకుమారి ఆలయం.

***"కాత్యాయనియై విద్మహే కన్యకుమారి ధీమహి తన్నో దుర్గే ప్రచోదయాత్"*** అని ఈ శక్తి స్వరూపిణిని గాయత్రీ మంత్ర పూర్వకంగా స్తుతిస్తారు. ఈ అమ్మవారు ఇక్కడ భగవతీదేవిగా కూడా పూజలందుకుని భక్తులను అనుగ్రహిస్తున్నది. వివేకానందుడు తన తపస్సు అనంతరం గురువైన రామకృష్ణ పరమహంస ఆదేశం మేరకు ఈ అమ్మవారి సన్నిధి లోనే తన ప్రపంచ యాత్రకు నిర్ణయించు కున్నాడట. శ్రీ రామకృష్ణ పరమహంస మరో ఇద్దరు శిష్యులు స్వామి బ్రహ్మానంద, స్వామి నిర్మలానంద కూడా ఈ అమ్మవారిని సేవించి తరించినవారే. కుడి చేతిలో జపమాల ధరించిన ఈ అమ్మవారు చల్లని చూపులను సూటిగా ప్రసరింపజేస్తూ భక్తులను సమ్మోహన పరుస్తుంది. ఆ రూపం చూస్తూ ఉంటే అక్కడనుంచి ఒక పట్టాన కదలబుద్ధి కాదు. ఇక చిమ్మచీకట్లో సయితం దివ్య కాంతులు వెదజల్లే అమ్మవారి ముక్కుపుడక గురించి వర్ణించాలంటే నాబోటి అతి సామాన్యునికి సాధ్యమయ్యే పని కాదు. సంతృప్తికరమైన అమ్మవారి దర్శనంతో అనుగ్రహింపబడి, భోజనం చేసి హోటలు గదికి చేరుకోవటంతో ఇక్కడ కూడా మా పర్యటన ముగిసింది.

ఫిబ్రవరి ఒకటవతేదీ తెల్లవారు ఝామునే లేచి గది ఖాళీ చేసి ఉదయం గం.5.30 ని.లకు 6382 నెంబరు కన్యాకుమారి ముంబై ఎక్స్ ప్రెస్ లో బయలుదేరి ఎనిమిది గంటలకు తిరువనంతపురంలో దిగాము. అక్కడ దిగగానే మేము ఎదుర్కొన్న మొదటి సమస్య భాష. అక్షరాస్యులు సయితం మన భావాన్ని గ్రహించగలరు తప్ప ఆంగ్లంలో సంభాషించ గలిగినంత పరిజ్ఞానం ఉండనందున, వారు అదే భాషలో సమాధానం చెప్పినా వాళ్ళం

చెబుతున్నారో ఒకపట్టాన మనకు అర్థం కాదు. అలాగే ఏదో శ్రమపడి ఆటో మాట్లాడుకుని స్టేషను సమీపంలోని ఒక హోటలుకు చేరుకోగలిగాము. గదిలో స్థిరపడి అదే హోటలుకు అనుబంధంగా ఉన్న రెస్టారెంటులో అల్పాహారం తీసుకున్నాము. పదార్థాలు రుచిగానే ఉన్నా వాటిలో వాడిన (కొబ్బరి) వంట నూనెలు మనకు అలవాటు లేనందువల్ల కాబోలు తక్షణమే ప్రభావం చూపటంవల్ల నేను స్వల్పంగా అస్వస్తతకు గురయ్యాను. ఏవో మందులు వాడి కొంత ఉపశమనం పొందగలిగినప్పటికీ, పూర్తి స్వస్తత చేకూరలేదు. ఉదయం కన్యాకుమారిలో బయలుదేరటానికి మునుపే స్నానాలు చేసిఉన్నాం కనుక వెంటనే అనంత పద్మనాభస్వామి ఆలయానికి వెళ్ళాము.

**తిరువనంతపురం**

"దేవుడు వరమిచ్చినా పూజారి అనుమతివ్వలేదు" తెలుగునాట బహుళ ప్రచారంలో నున్న ఈ నానుడి బహుశః ఈ ప్రసిద్ధ ఆలయంలోనే పుట్టి ఉంటుందని నా ప్రగాఢ విశ్వాసం. ఏ దేశంలోనయినా అది ఏ మతానికి చెందినదైనప్పటికీ ప్రార్థనా మందిరాలలో, ఆలయాలలో ఆయా ప్రాంతాలు, సాంప్రదాయాలు, ఆచారాలను బట్టి కొన్ని నియమాలు ఉంటాయి. ఇందులో ఆక్షేపించవలసినది ఏమీ లేదు. అయితే భక్తులు అవి పాటించటానికి అవసరమైన సదుపాయాలు కల్పించటం ఆయా దేవస్థానాల యాజమాన్యాల బాధ్యత. ఉదాహరణకు తిరుమలలో శ్రీ వేంకటేశ్వరుని దర్శించగోరే ఇతర మతస్తులు ఆలయ ప్రవేశానికి పూర్వం ఆలయంలో నున్నంత సేపూ వేంకటేశ్వరుని మీద విశ్వాసం కలిగి ఉంటాననీ, ఆలయ ఆచారాలూ, సాంప్రదాయాలూ పాటిస్తాననీ ఒక ప్రతిజ్ఞా పత్రం మీద సంతకం చేయాలి. అలాంటివారు ఈ లాంచనాలు పూర్తిచేయటానికి తగు ఏర్పాట్లుంటాయి. అదే విధంగా సిక్కు మతానికి చెందిన గురుద్వారాలలో

ప్రవేశించేటప్పుడు తలపై విధిగా ఒక వస్త్రం ఉంచుకోవాలి. ఇది అక్కడి నియమం. అలాగే దేశంలోని అనేక హిందూ దేవాలయాలలో ప్రవేశానికి దుస్తులకు సంబంధిన కొన్ని నియమాలుంటాయి. పురుషులకు శరీర పైభాగంలో ఏ ఆచ్ఛాదనా లేకపోవటం ఇటువంటి నియమాలలో ఒకటి. మరికొన్ని చోట్ల పురుషులైతే భారత సాంప్రదాయ దుస్తులైన ధోవతి, పైన ఉత్తరీయం (కండువా) స్త్రీలయితే కేవలం చీరలు, లేదా చుడీదార్ లాంటివి (ప్యాంట్లు, షర్టులు ధరించే ఆధునిక యువతులు కొందరుంటారు కనుక) మాత్రమే ధరించాలనే నియమాలు ఉంటాయి. ఆయా దేవాలయాలకు వెళ్ళినపుడు ఆ నియమాలను పాటించటం ప్రతి భక్తుని విధి. ఇదెందుకు పాటించాలి? 'నేను పాటించను' అనే మనస్తత్వం ఉన్నవారు ఆ ఆలయం లోనికి వెళ్ళే ప్రయత్నం చేయకపోవటమే మంచిది. ఇక్కడ వరకూ వచ్చి లోనికెందుకు రాలేదు అని ఏ దేవుడూ అడగడు.

ఇక్కడ కూడా ఆలయ ప్రవేశం చేయాలంటే పురుషులు కేవలం ధోవతి మాత్రమే ధరించాలనే నియమం ఉంది. లుంగీ లాగా చుట్టుకున్నా ఫరవాలేదు. అంతవరకూ బాగానే ఉంది. మా విషయంలో ఈ ఆచారాన్ని పాటించటానికి మేము సిద్ధమైనా ప్రవేశం లభించలేదు. అయితే అది ఈ ఆలయంలోనున్న ఆచారాన్ని ప్రశ్నించి నందువల్లనో లేదా అది పాటించటానికి తిరస్కరించినందు వల్లనో

కాదు. నిజానికి ఈ నియమం గురించి మాకు ముందే స్పష్టమైన అవగాహన ఉంది. అందుకే నేనూ మా కుమారుడూ చెరొక ధోవతీ వెంట తీసుకువెళ్ళాం కూడా. కానీ అవి ధరించిన తరువాత, అప్పటివరకూ మా ఒంటిమీదనున్న

ప్యాంట్లు, షర్టులు వాటి జేబుల్లోనున్న సెల్ ఫోనులు, పర్సులు ఇతర విలువైన వస్తువులూ ఎక్కడ ఉంచాలి? పోనీ వాటిని వేరే సంచీలో వేసుకుని వెంట తీసుకువెళ్ళే వీలుకూడా లేదాయే! ఇంతకీ మమ్మల్నేమన్నారంటే –

ఆ దేవాలయం మెట్లపైనే దుస్తులు మార్చుకోవాలట! వదిలినవి ఎంత అమూల్యమైనా క్లోకురూములో ఒక మూల పడేసిపోవాలట. వాటి భద్రతకు తమ బాధ్యత ఏమీలేదట! భక్తులు ఎంత పురుషులైనా బహిరంగంగా దుస్తులు మార్చుకోవటం సభ్యత కాదు కదా! ఇదేమని అడిగాము. అంతే! ఇద్దరు ముగ్గురు దాడి చేసినంత స్థాయిలో మాటలతో విరుచుకు పడ్డారు. భాష సమస్య వల్ల పూర్తిగా అర్థం కాకపోయినప్పటికీ 'మా మేలు కోసం ఈ దైవ దర్శనానికి వచ్చారా? ఈ నియమం పాటిస్తే లోనికి వెళ్ళండి లేదంటే బయటకు పొండి అనే తాత్పర్యం మాత్రం బోధ పడింది. భగవంతుని పట్ల మా భక్తినీ, స్వీయ మత ఆచారాల పట్ల మా గౌరవాన్నీ, నిబద్ధతనూ ఎవరూ శంకించ లేరు. ఈ విషయంలో వీరు మా ముందు అజ్ఞానులు, మరుగుజ్జులు. దేవాలయ యాజమాన్యం బాధ్యతా రాహిత్యాన్నీ, మమ్ములను అగౌరవపరచిన సిబ్బంది తెంపరితనాన్నీ విశదీకరించటం కోసమే ఇదంతా చెప్పవలసివస్తున్నది.

ఇటువంటి నియమాలున్న ఆలయాలలో సాధారణంగా కొన్ని మినహాయింపులుంటాయి. ఉదాహరణకు ఇదే కేరళ రాష్ట్రంలో శ్రీకృష్ణుని ఆలయం ఉన్న సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం గురువాయూరు. అక్కడ కూడా ఇటువంటి నియమమే ఉన్నది. కానీ, పురుషులు ప్యాంటుపైనే ధోవతి చుట్టుకుని షర్టు విప్పేసి భుజాన వేసుకుని లోనికి వెళ్ళవచ్చు. ఈ నియమం తెలియకకానీ, లేదా ఏ కారణంచేతనయినా ధోవతి వెంట తెచ్చుకోకపోతే,

దేవాలయం వెలుపల దుకాణాలలో శుభ్రంగా ఉతికి మడతలు పెట్టిన ధోవతులు అద్దెకు లభిస్తాయి.

ఈ నియమాన్ని ఇంత ఖచ్చితంగా అమలు చేస్తున్న ఈ ఆలయ నిర్వాహకులకు, దర్శనం చేసుకుని తిరిగి వచ్చేవరకూ భక్తుల దుస్తులు, విలువైన వస్తువులకు భద్రత కల్పించవలసిన బాధ్యత లేదా? ప్రపంచంలోనే అనంతమైన సంపన్నుడు కదా ఈ స్వామి! భక్తులకు ఈ మాత్రం కనీస సౌకర్యం కల్పించలేరా? గలరు. కానీ కల్పించరు. ఎందుకంటే ఇదేమీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆలయం కాదు. ఈనాటికీ, ఇది ట్రావెంకూరు రాజకుటుంబీకుల అధీనంలో ఉండటమే ఇందుకు కారణం. ఈ ఆలయ నేలమాళిగలలో మూలుగుతున్న అనంత సంపద రాశులకు సంబంధించిన వివాదం దేశ అత్యున్నత న్యాయస్థానానికి సయితం ఎటువంటి సవాలుగా పరిణమించిందో వర్తమాన కాలంలో మనం చూస్తూనే ఉన్నాం కదా! అతి సామాన్యులం ఇక మనం ఏం చేయగలం?

నా శ్రీమతి మాత్రం ఈ నియమేమేదీ తనకు వర్తించదు కనుక దర్శనం చేసుకువస్తానని కథానాయిక లెవెల్లో బయలుదేరింది. లోపల అనేక దేవతా మూర్తులున్నాయట. విద్యుద్దీపాలు లేవట. మూలవిరాట్టుకు ఎటువెళ్ళాలో దారి చూపే నాధుడు లేడు. పోనీ ఎవరినయినా అడుగుదామా అంటే భాష సమస్య. దీనితో ఆమె కూడా దర్శనం లేకుండానే నిస్సహాయంగా తిరిగి వచ్చింది. ఆ స్వామి మాకు అనుమతి ఇవ్వలేదనుకుని మెట్లమీదనుంచే నమస్కరించి వెనుదిరిగాము.

హోటలుకు తిరిగి వచ్చి భోజనం చేసి కొద్ది సేపు విశ్రమించి నాలుగు గంటలకు ఆటో మాట్లాడుకుని కోవలం బీచికి వెళ్ళాము. తిరువనంతపురానికి దక్షిణ దిశగా పదహారు కిలోమీటర్ల దూరంలో నున్న ఈ బీచి దేశపు పశ్చిమ

తీరంలో నున్న బీచిలన్నిటిలోకీ సుందరమైనది, అత్యంత పరిశుభ్రమైనదిగా ప్రసిద్ధి. వరుసగా రెండవ రోజు సముద్రంలో సూర్యాస్తమయం తిలకించాము. ఆహ్లాదకరమైన వాతావరణంలో సుమారు రెండు గంటలు గడిపి మరొక ఆటోలో ఎనిమిది గంటలకు తిరిగి తిరువనంతపురం వచ్చి భోజనానంతరం గది ఖాళీ చేసి స్టేషనుకు చేరుకున్నాము. గం.11.35 ని. 6127 నెంబరు చెన్నై ఎగ్మూరు గురువాయూరు ఎక్స్ ప్రెసులో (రెండు రోజుల క్రితం ఇదే ట్రైనులో మదురై నుంచి నాగర్ కోయిలు వరకూ ప్రయాణించాము) ఎర్ణాకుళం బయలుదేరాము.

ఫిబ్రవరి రెండవ తేదీ తెల్లవారు ఝామున నాలుగు గంటలకు ఎర్ణాకుళంలో దిగాము. యాత్రా ప్రణాళిక ప్రకారం ఇక్కడ దిగిన తరువాత తెల్లవారేవరకూ కాలక్షేపం చేసి నేరుగా ఆది శంకరాచార్యుల వారి జన్మస్థలమైన కాలడికి వెళ్లి సాయంత్రానికి తిరిగి ఎర్ణాకుళం చేరుకోవలసి ఉన్నది. కానీ అప్పటికే వారం రోజులుగా నిర్విరామంగా సాగుతున్న యాత్ర ఒంట్లో శక్తిని క్రమంగా హరిస్తున్నది. బడలిక ప్రభావం చూపుతున్నది. మా స్థితిని గమనించిన కిరణ్ కాలడి ప్రయాణం విరమించటానికి ప్రతిపాదించాడు. మేమూ ఆమోదించాం. యథాప్రకారం స్టేషనులో ఒకచోట మమ్ములను కూర్చోబెట్టి సమీపంలో నున్న హోటళ్ళ వివరాలు కనుక్కుని ఆటో ఒకటి తెచ్చాడు. అందుబాటులో నున్న దానిలో దిగి ఒక నాలుగు గంటలపాటు నిద్రించాము. కాలడి ప్రయాణం యథావిధిగా ఉన్నట్లయితే అది పూర్తయ్యాక తిరిగి ఎర్ణాకుళం వచ్చి, సాయంత్రం ఐలాండ్ ఎక్స్ ప్రెసులో బెంగుళూరు మీదుగా మైసూరు వెళ్లి అక్కడ ఒక రోజు ఉండి తిరిగి బెంగుళూరు మీదుగా కిరణ్ ముంబయికి మేము హైదరాబాదుకు వెళ్ళాలి. ఎలాగూ ప్రణాళిక భంగమైంది కనుక, మరికొంత కుదించి ఒకరు ఒక వైపుకూ, మరొకరు మరో

వైపుకూ కాకుండా మేము కూడా తనతో పాటు ముంబయి వచ్చి ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకుని హైదరాబాదు వెళ్ళటానికి ప్రణాళికకు తుది సవరణ చేశాడు.

ఆ విధంగా బెంగుళూరులో ఒకరోజు బస కూడా రద్దయింది. ఇక చేయవలసిందల్లా ఇక్కడనుండి నేరుగా మైసూరు చేరుకోవటమే. బస్సు ఒకటే మార్గం. ఐలాండ్ ఎక్స్ ప్రెసులో నిర్ధారింపబడిన టికెట్లు ఉపయోగపడవు. సరే ఆ టికెట్లు రద్దు చేసి వాటి స్థానే మైసూరుకు బస్సు టికెట్లు తీసుకునే పనిలో నేను నిమగ్నమవగా, కిరణ్ తన భార్య ద్వారా బెంగుళూరు నుండి ముంబయికి విమాన టికెట్లు బుక్ చేసే పనిలో పడ్డాడు. మైసూరు బస్సు రాత్రి ఎనిమిది గంటలకు. అప్పటి వరకు ఇక్కడ ఉండక ఎలాగూ తప్పదు కనుక హోటలు రూముకి పరిమితమయ్యే బదులు, ఏమయినా చూడదగినవి ఉన్నాయేమో తెలుసుకోమన్నాను. హోటలులో ఉన్న టూరిస్టు డెస్కు వారిని సంప్రతించగా కేరళ రాష్ట్ర సముద్రతీరం పొడవునా సముద్రపు ఎదురు నీటితో అసంఖ్యాకమైన ప్రవాహాలు, కాలువలూ ఉంటాయనీ పచ్చని ప్రకృతి ఒడిలో ప్రశాంతమైన వాతావరణంలో అలాంటి నీటిలో పడవ ప్రయాణం ఆహ్లాదాన్నీ, ఆనందాన్నీ కలిగించి మంచి పర్యాటక అనుభూతిని కలుగజేస్తాయనీ వివరించారు.

ఎట్టి పరిస్థితిలోనూ, సాయంత్రం ఆరు గంటలకల్లా తిరిగి రాగలిగే అటువంటి ప్రదేశం ఒకటి తెలియజేసాడు. ఇంకేం. మనిషికి ఎనిమిది వందల చొప్పున ముగ్గురికీ రెండు వేల నాలుగు వందలు అక్కడే చెల్లించి భోజనానంతరం రెండు గంటలకు వారు ఏర్పాటు చేసిన వాహనంలో

బయలుదేరాము. ఒక గంట ప్రయాణించి  అసలు ప్రదేశానికి చేరుకోగా అక్కడి నిర్వాహకులు కొబ్బరి నీళ్ళతో స్వాగతించి కొద్దిసేపటికి పడవ ఎక్కించారు. కనిపించిన విశేషాన్నల్లా ఎప్పటి కప్పుడు మా వెంట ఉన్న గైడు వివరిస్తుండగా ఆ విహారం రెండు గంటలపాటు ఆహ్లాదంగా సాగింది. విహారానంతరం పడవ నడిపిన వ్యక్తికీ, గైడుకీ కృతజ్ఞతలు తెలియజేసి నిర్ణీత సమయానికి హోటలుకు తిరిగివచ్చాము. వెంటనే గది ఖాళీ చేసి భోజనం చేసి ఎనిమింటికి బస్సులో మైసూరుకు బయలుదేరాము.

తెల్లవారు ఝామున నాలుగు గంటలకు గజగజ లాడిస్తున్న చలిలో మైసూరు బస్సు స్టాండులో దిగాము. కొద్ది దూరంలోనే ఉన్న ఒక హోటలులో గది తీసుకుని కొద్దిసేపు నిద్రించాము. స్నానాలు చేసి అల్పాహారం కూడా చేసి వాహనమొకటి మాట్లాడుకుని ముందుగా మైసూరు ప్యాలెసు, అక్కడ నుండి శ్రీరంగపట్నం వెళ్లి శ్రీరంగనాథ స్వామిని దర్శించుకుని హోటలు చేరుకున్నాము. భోజనానంతరం మరో వాహనంలో చాముండి దేవిని దర్శించుకుని తిరిగి హోటలు చేరుకొని ఆ రోజుకు స్వస్తి పలికాము. నాలుగవ తేదీ ఉదయం గం. 6.45 ని.లకు 16215 నెంబరు చాముండీ ఎక్స్ ప్రెస్ లో మైసూరులో బయలుదేరి గం.9.40 ని.లకు బెంగుళూరులో దిగి వెంటనే టాక్సీ మాట్లాడుకుని నేరుగా విమానాశ్రయానికి చేరాం.

సరిగ్గా పన్నెండు గంటలకు ఎయిర్ ఇండియా విమానం గాల్లోకి లేచింది. ఒకటిన్నరకు ముంబయిలో  దిగి విమానాశ్రయం బయటకు వచ్చేసరికి మా కోడలు స్వాగతం పలికి ఆశ్చర్య పరచింది. ఆశ్చర్యం ఎందుకంటే, తను మూడు రోజుల క్రితమే వారం రోజుల ఆఫీసు పని మీద డిల్లీ వెళ్ళింది. బెంగుళూరులో ముందు అనుకున్న మా ఒక రాత్రి బసకు హోటలు గది ఏర్పాటు, కార్యక్రమంలో మార్పు వల్ల తరువాత ఆ బస రద్దుకు,

ముంబయికి మా విమాన ప్రయాణ ఏర్పాట్లు అన్నీ తను డిల్లీ నుంచే చేసింది. ఆ విషయం మాకూ తెలుసు. సరే మేము కూడా వస్తున్నాము కదానని, డిల్లీలో కార్యకలాపాలను వాయిదా వేసుకుని సరిగ్గా మేము మైసూరులో చాముండీ ఎక్స్ ప్రెసులో బయలుదేరిన సమయానికి తను డిల్లీలో బయలుదేరి మేము బెంగుళూరు చేరే లోపలే తను ముంబయికి వచ్చేసింది. తన కోరిక మేరకు, మా కుమారుడు ఈ విషయం ఉద్దేశపూర్వకంగానే మాకు చెప్పలేదు. అందుకే ఆశ్చర్యం.

నాలుగు రోజులు సంపూర్ణంగా విశ్రాంతి తీసుకుని తొమ్మిదవ తేదీ మధ్యాహ్నం కోణార్కు ఎక్స్ ప్రెస్ లో ముంబైలో బయలుదేరి మరునాడు ఉదయం నిజగృహానికి చేరటంతో సంపూర్ణ కాశీ యాత్రలో మొదటి ఆవృతం పూర్తయింది. మళ్ళీ కాశీ వెళ్ళాలి.



# మూడవ అధ్యాయం

## రైలు గొలుసు లాగాను

రామేశ్వరంలో సేకరించిన ఇసుకను త్రివేణీ సంగమంలో నిమజ్జనం చేసి మరొకసారి కాశీ విశ్వేశ్వరుని సేవించి యాత్రను సంపూర్ణం చేయటానికి సన్నాహాలు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 2009 సంవత్సరం మార్చి తొమ్మిదవ తేదీన 7091 నెంబరు పాట్నా ఎక్స్ ప్రెసులో రాత్రి గం.10.00 లకు సికిందరాబాదులో బయలుదేరాము. 11వ తేదీ తెల్లవారు ఝామున గం.1.20 ని.లకు చేరుకోవలసినది గంట ఆలస్యంగా సుమారు రెండున్నరకు అలహాబాదు చేరింది. బింబాధర్ సహోద్యోగి ఒకరు స్టేషనుకు వచ్చాడు. నాలుగవ నెంబరు ప్లాటుఫారం మీద బండి ఆగింది. రెండు సూటుకేసులూ ఒక బ్యాగూ బెర్తు క్రింద గొలుసుతో తాళం వేయబడి ఉన్నాయి. ట్రైను స్టేషను చేరటానికి మునుపే దిగటానికి సిద్ధంగా ఉంటాం కదా! తగినంత ముందుగానే లేచాము కూడా. తాళం చేతులు ఉంచిన చేతి సంచీ జయలక్ష్మి దగ్గర ఉండవలసినది ఎంత వెతికినా కనబడలేదు. ఎవడో దొంగ వెధవ లేపేసాడని తెలుసుకోటానికి ఎక్కువ సేపు పట్టలేదు. అలహాబాదు మరో గంటలో చేరతామనగా గట్టిగా ఒక కునుకు పట్టింది. ఆ సమయంలో ఇది జరిగింది కాబోలు. ఎంత లబోదిబోమన్నా గొలుసుకు వేసిన తాళం తెరుచుకోదుకదా! ఇంకా నయం, తాళం వేయబట్టే కదా అవయయినా భద్రంగా ఉనాయి. లేకుంటే అవి కూడా గోవింద కొట్టేవి కావూ?

ట్రైను అక్కడ ఇరవై నిముషాలు ఆగుతుంది. మమ్ములను రిసీవు చేసుకోవటానికి వచ్చిన మిత్రుడు స్థానికుడు పైగా మీడియాకు చెందిన వాడు. అతనికి విషయం క్లుప్తంగా వివరించి, అతనిని అక్కడ ఉండమని చెప్పి గార్డు కోసం వెళ్లాను. ఆయన కనబడలేదు. సమయం వృధా చేయకుండా

తిరిగి మిత్రుడితో కలిసి ఒకటవ నంబరు ప్లాటుఫారం మీద నున్న కార్యాలయానికి వెళ్లి డ్యూటీలోనున్న డిప్యూటీ స్టేషను మేనేజరుకు విషయం చెప్పాము. మాకు కావలసిన సహాయం ఏమిటో తెలుసుకునే ప్రయత్నం కూడా చేయకుండా తాను ఏమీ చేయలేననీ పైగా ప్రయాణీకుల వస్తువుల చోరీ విషయం పోలీసుల పరిదిలోనిది కనుక తాను జోక్యం చేసుకోననీ చెప్పాడు. అయితే పోలీసులు వచ్చి, నా సమస్యను పరిష్కరించే వరకూ రైలు బయలుదేరకుండా చూడవలసినదని అభ్యర్ధించాను. అదీ కుదరదన్నాడు. తన నిర్ణయం పర్యవసానమేమిటో ఊహించే శక్తి కూడా అతనికి లేదన్నమాట. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్ళను అధిగమించే సామర్ధ్యలేమి అతని సమాధానంలో స్పష్టంగా కనబడింది. సరే! నేను లగేజి దించుకోకుండా రైలు ఎలా బయలు దేరుతుందో చూద్దామని మనసులో తీర్మానించుకుని అదే ప్లాటుఫారం మీద ఉన్న రైల్వే పోలీసు స్టేషనుకు వెళ్లాం.

నిద్రపోతున్న పోలీసును మేల్కొలిపి విషయం వివరిద్దామంటే అతను ఆ అవకాశం ఇస్తేనా? నిద్రమత్తులోనే యక్ష ప్రశ్నలతో కాలహరణం చేయటమే కాక సహనాన్ని పరీక్షిస్తున్నాడు తప్ప అసలు సమస్యను గానీ, అందులోని గాంభీర్యాన్ని కానీ గ్రహించటానికి సిద్ధంగా లేడు. ఈ లోగా రైలు బయలుదేరటానికి సిద్ధంగా ఉన్నదన్న ప్రకటన వెలువడుతోంది.

స్నేహితుడిని అక్కడ ఉండమని చెప్పి నాలుగవ నంబరు ప్లాటుఫారం మీదకు పరుగెత్తాను. నేను ఇంకా ఓవర్ బ్రిడ్జి మీద ఉండగానే రైలు బయలుదేరింది. బ్రిడ్జి దిగేటప్పటికి ఎదురుగా కదులుతూ ఉన్న కోచీలో ఎక్కి అందులోనుంచి నా లగేజీ ఉన్న కోచీలోకి మారి, అలారం గొలుసు లాగాను. బండీ ఆగిపోయింది. అక్కడ ఉండవలసిన నా శ్రీమతి లేదు. రైలు బయలుదేరక మునుపే దిగిపోయిన ఆమె సమయస్ఫూర్తిని మనసులోనే

అభినందిస్తూ, ప్లాటుఫారం మీద ఆమె నిలుచున్న చోటికి వెళ్లి తీవ్ర ఆందోళనలోనున్న ఆమెను ఊరడించి, తిరిగి ఇద్దరమూ కోచీ వద్దకు వచ్చాము.

రైలును తిరిగి బయలుదేరదీయాలంటే అలారం గొలుసు లాగిన కోచీని గుర్తించి ఎవరు లాగారో సమస్య ఏమిటో తెలుసుకుని ఆ సమస్యను పరిష్కరించాలి. అలా కాకుండా నిర్లక్ష్యంగా మళ్ళీ బయలుదేరదీస్తే పర్యవసానాలకు స్టేషను మేనేజరు, ఆ రైలుకు సంబంధించిన ఇద్దరు గార్డులు, పోలీసులు అందరూ బాధ్యత వహించవలసి ఉంటుంది. పోయిన సంచీతో పాటు జయలక్ష్మి ఫోను పోయింది కానీ నా ఫోను నా వద్దనే ఉండటంతో అది బతికిపోయింది. అదృష్టం! ఫోను చేసి మిత్రుడికి పరిస్థితి వివరించగా పోలీసుల విషయం తాను చూసుకుంటాననీ, ఆ స్థితిలో అక్కడ నుంచి కదలవద్దనీ సూచించాడు.

కొద్ది నిముషాల తరువాత గార్డు వచ్చి ఏమయిందని అడిగాడు. బాధితుడినీ, బాధ్యుడినీ కూడా నేనే కనుక జరిగింది చెప్పాను. ఆ విషయం తనకు ముందుగా తెలియజేయాలి కానీ బయలుదేరిన రైలును ఇలా నిలపటం సరికాదు కదా అన్నాడు. ఒక పౌరుని తీవ్రమైన సమస్యను అత్యవసరంగా పరిష్కరించవలసిన ఒకానొక అసాధారణమైన సందర్భంలో, ప్రజా బాహుళ్యంతో ముడివడిన ఒక మౌలిక వ్యవస్థలోని కీలక విభాగాలమధ్య సమన్వయలేమి, అలసత్వం, అసమర్ధతను ప్రతిబింబించిన ఒక సన్నివేశం అది.

“అయ్యా! రైలు ఆగగానే నేను మీ వద్దకే వచ్చాను. తమరు లేరు. స్టేషనులో చెబితే పోలీసులకు చెప్పమన్నారు. ఈ లోగా రైలు బయలుదేరింది. గత్యంతరం లేక ఆపాను. సరే! ఇంతకీ నా సమస్యకు పరిష్కారం మీ వద్ద

ఉన్నదా లేదా?" అన్నాను. ఇంతలో, బయలుదేరిన రైలు ఎందుకు ఆగిందని ఆయనను ఫోనులో ఎవరో అడుగుతున్నారు కాబోలు. వారికి సమాధానం చెబుతున్నాడు. కాశీ వెళ్ళే ప్రయాణీకులలో సికిందరాబాదు నుండి మాతో ప్రయాణించిన కొందరు తెలుగువారు కల్పించుకుని సమస్యను త్వరగా పరిష్కరించి అసలే ఆలస్యంగా నడుస్తున్న రైలును సత్వరం బయలుదేరదీయ వలసినదిగా ఒత్తిడి చేశారు. అంతకు కొద్ది నిముషాల ముందు తన నిస్సహాయతను, రైలును నిలపటానికి కూడా అశక్తతను వెలిబుచ్చిన డిప్యూటీ స్టేషను మేనేజరు వచ్చాడు. అక్కడ నన్ను చూస్తూనే "ఇప్పుడు నన్నేం చేయమంటారు" అన్నాడు. "డ్యూటీలోనున్న మీ కార్మికులెవరినైనా రప్పించి తాళం పగులగొట్టించి నా లగేజి విడిపించండి" అన్నాను సూటిగా. ఆ పరిస్థితిలోనున్న నా లాంటి ప్రయాణీకునికి అంతకన్నా కావలసిన గొప్ప సహాయం మరేముంటుంది?

నిత్యమూ కొన్ని వందల రైళ్ళ రాకపోకలను నియంత్రిస్తూ, వాటిలో ప్రయాణించే వేలాది మంది శ్రేయస్సు, భద్రత ముడివడియున్న విధులు నిర్వహించే అంతటి ఉన్నత స్థాయి అధికారికి ఈ మాత్రం ఆలోచన తట్టకపోవటం, సమయస్ఫూర్తి, చాకచక్యం లేకపోవటమూ, పైగా నన్నేం చేయమంటారు అనే బేలతనం ప్రదర్శించే అధికారులు ఉండటం మొత్తం భారతీయ రైల్వే ప్రయాణీకుల దౌర్భాగ్యం. ఇంత చిన్న సమస్యను పరిష్కరించలేని వారు ఇంతకంటే పెద్ద విపత్తు జరిగితే ఏం చేస్తారు? పైగా నేనేదో పెద్ద నేరం చేసినట్లు ఈ రాద్ధాంతమూ, పంచాయతీ ఏమిటి? ఇదే అతనితో చెబుతూ గట్టిగా నిలదీశాను.

రెండు క్షణాలు ఆలోచించి వాకీ టాకీలో ఎవరినో పిలిచాడు. అతను వచ్చాడు నింపాదిగా. నాకు కావలసిన పనిని డిప్యూటీ స్టేషను మేనేజరు

స్వయంగా అతనికి పురమాయించాడు. అతను వచ్చినంత సేపు కూడా నిలవకుండా, పై అధికారి అనే కనీస విధేయత కూడా కనబరచకుండా "అది నా పని కాదు" అని వెళ్లబోతున్నాడు. ఇక ఈ బ్రతిమలాటలతో పని కాదని నిశ్చయించుకుని అప్పటికే వెనుదిరిగిన అతని చేతిలోనున్న సుత్తిని నేనే గుంజుకుని, ఒక్క గెంతుతో కొచీలోకీ వెళ్లి తాళం మీద ఒక్క దెబ్బ వేశానో లేదో అది రెండు ముక్కలై ఊడి పడింది. చకచకా గొలుసు విప్పేసి ఆ సూటు కేసులూ, బ్యాగూ బయటకీడ్చి, సుత్తి అతని చేతిలో పెట్టి 'థాంక్స్' అన్నాను. ఈ హఠాత్పరిణామాన్ని నిశ్చేష్టులై చూస్తూఉన్న ఆ ఇద్దరితో "మీ పని మీరు చేసుకోవటానికి నిబంధనల మేరకు ఇంకా నేనేమి చేయాలి" అన్నాను.

నిజానికి సమస్య నాది. గొలుసు లాగి బండి ఆపినందుకు మూలకారణమైన ఆ సమస్య, అది పరిష్కారమైన తీరు మొదలైన క్రమమంతా నమోదు చేసి, నేను సంతృప్తి చెందినట్లు అంగీకారంగా సంతకం చేస్తే తప్ప రైలు మళ్ళీ బయలుదేరటానికి వీల్లేదు. ఇదంతా ఎవడు చేస్తాడులే అనుకున్నారో ఏమో ఈ తతంగమేదీ లేకుండానే బండి లాగించేసారు.

బయటకు వెళ్లటానికి ఒకటవ నంబరు ప్లాటుఫారం మీదకు వచ్చి, లగేజీతో సహా నా శ్రీమతిని ఒక అరుగుమీద కూర్చోబెట్టి పోలీసు స్టేషనుకు వెళ్లాను. ప్రయాణీకుల అజాగ్రత్త గురించి కాబోలు నా మిత్రుడికి బోధిస్తున్నాడు పోలీసు. ఏదో తన సహచరుడికి బాబాయినయినందుకు అతని అభ్యర్థన మేరకు నాకు సాయం అందించటానికి వచ్చిన మిత్రునికి ఈ విధమైన అనుభవం ఎదురవటం నాకు చాలా ఇబ్బంది కలిగించింది. ఆ పోలీసు ప్రవచనాన్ని నిస్సహాయంగా ఆలకించటం తప్ప అతను మాత్రం ఏమి చేయగలడు?

లోనికి వెళుతూనే కంటబడిన ఆ దృశ్యాన్ని చూసి "ఇంతకీ నా ఫిర్యాదు విషయం ఏమి చేశారు" అని అడిగాను. “రైలు వెళ్ళిపోయింది కదా! మీ సామాను తెచ్చుకోలేదా” అని ఎదురు ప్రశ్నించాడు సానుభూతి ప్రదర్శిస్తూ. "ఇరుక్కుపోయిన లగేజి సమస్యతో కాదు కదా నేను మీ వద్దకు వచ్చింది? రైలులో దొంగలు అంత విచ్చలవిడిగా తిరుగుతుంటే మీ బాధ్యత ఏమిటని కదా నేనడిగేది? పోయిన నా సంచీలో ఉన్నవి ఒక సెల్ ఫోను, రెండు చార్జర్లు, నా శ్రీమతి కళ్ళజోడు, ఖరీదైన కొన్ని మందులు మీ దృష్టిలో అల్పమైనవే కావచ్చు. మీరు ఆ దొంగను పట్టుకుని అవి మాకు అందజేయగలరని ఆశ మాకు ఎలాగూ లేదు. కనీసం ఫిర్యాదు కూడా తీసుకోరా? అని నిలదీశాను. "అలాగా! అయితే అవి ఏ స్టేషనులో పోయాయో ఆ స్టేషనుకు సంబంధించిన రైల్వే పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయండి అన్నాడు. "భలే దెబ్బ కొట్టాను కదూ" అని తన అతి తెలివికి తానే అభినందించుకుంటున్నాడు. అతనికి నిద్ర మత్తు ఇంకా వదలలేదని, వదిలించవలసిన సమయం ఆసన్న మయిందని గ్రహించి "మే ఉదారమైన సలహాకు ధన్యవాదాలు. తప్పకుండా అలాగే చేస్తాను. అయితే అంతకంటే ముందు గంట నుంచీ ఇక్కడ మన మధ్య జరిగినదంతా వ్రాసి సంతకం పెట్టి ఇస్తాను దాని మీద మీరు ఇప్పుడు చెప్పిన సలహా వ్రాసి ఇవ్వండి" అన్నాను. 'అలా ఎందుకు?' 'అలా ఎందుకు?' అని గాభరా పడ్డాడు. "ఎందుకేమిటి? మీరు చెప్పినట్లు మరో స్టేషనుకు వెళతాను. అక్కడ ఉండేది కూడా మీ సోదరులే కదా! ‘మీరు అలహాబాదు పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసి ఉండవలసినది’ అనరా? అప్పుడు మరి వారికి ఇది చూపోద్దూ?” అంటూ అమాయకత్వం ప్రదర్శించాను. ఆతను తేరుకొని ప్రతిస్పందించే వ్యవధి ఇవ్వకుండా మరొక అస్త్రం వదిలాను. సెల్ ఫోను చేతిలోకి తీసుకున్నాను. “చూడండి! మీ విధి నిర్వహణలో మీ ధర్మం నెరవేర్చటానికి

మీకేదో అవరోధం ఉన్నట్లుంది. అందుకని ఈ ప్రాంతం మొత్తానికి సంబంధించిన, మీ, పై అధికారులతో ఇప్పుడే మాట్లాడుతాను. వారు ఎలా చెబితే ఇద్దరమూ అలా చేద్దాం" అంటూ ఆ అధికారుల పేర్లు, హోదాలు, ఫోను నంబరులు వ్రాసి ఉన్న బోర్డు చూపించాను. అంతే. అంతకు మునుపు ఒక్క సుత్తి దెబ్బతో సూటు కేసుల గొలుసుకేసిన తాళం ఎలా ఊడిపడిందో, అతని నిద్రమత్తు కూడా అలాగే వదిలింది. అంతేకాదు. అప్పటివరకూ గోడనానుకుని బల్ల మీద కాళ్ళు జాపుకుని సగం పడుకుని ఉన్న భంగిమ మారిపోయి టోపి నెత్తిమీదకు, లాఠీ కర్ర చేతిలోకి వచ్చి తన అధికార స్థానంలో నిఠారుగా కూర్చోబెట్టింది. తను చెబుతుండగా మా స్నేహితుడు హిందీలో వ్రాసి సాక్షి సంతకం చేయగా, నా వివరాలు స్వయంగా వ్రాసి సంతకం చేశాను. తనూ సంతకం చేసి ఒక ప్రతిని అందించాడు. ఈ ప్రహసనాలన్నీ ముగిసే సరికి తెల్లవారుతున్నది.

స్టేషను రోడ్డులోనున్న 'సన్ లైట్' హోటలుకు వెళ్లి గది తీసుకున్నాం. మాకు సహాయంగా వచ్చిన అతనికి మా అజాగ్రత్త వల్ల కలిగిన అసౌకర్యానికి విచారం వెలిబుచ్చగా అతను కూడా సహృదయంతో స్వీకరించి తగు రీతిలో స్పందించాడు. ఇక ఆ రోజు హోలీ కనుక తలపెట్టిన కార్యక్రమాలేవీ సాధ్యపడవు. అందుచేత విశ్రాంతి తీసుకోవలసినదనీ, తాను మరునాడు వాహనం తీసుకువస్తాననీ చెప్పి అతను వెళ్ళిపోయాడు. ఈ హోలీ, ఈ కోలాహలం, తత్ఫలితంగా కలిగే ఈ అసౌకర్యం ఏ మాత్రం ముందే ఊహించినా ఈ రోజు ఈ ప్రయాణం పెట్టుకుని ఉండేవాడినే కాదు. అతను చెప్పిన దానిని బట్టి చూడగా రోజంతా గదిలో బందీలుగా ఉండిపోవటమే కాక ఉపవాసం కూడా చేయవలసి వచ్చేట్టుంది. ఉదయం టీ కూడా అతి కష్టం మీద ఒక సారే లభించింది. నా శ్రీమతి కోసం బీపీ మందులైనా కొనాలి కదా. ఆ దుకాణాలు

కూడా తెరువలేదు. నా వద్దనున్న ఒక్క సెల్ ఫోనులో బ్యాటరీ స్థాయి మందగిస్తున్నది. చార్జరేమో దొంగోడు ఎత్తుకు పోయే. దీనికి పని చేసే చిత్రమైన పిన్నుగల చార్జరు హోటలు వారెవరివద్ద కూడా లేకపోయే.

స్నానం చేసి క్రిందకు వచ్చి హోటలు రిసెప్షనులో ఏమిటి మాగతి అని అడుగుతుండగా అక్కడ లాంజిలో కూర్చుని ఎవరితోనో మాట్లాడుతూ హుందాగా ఉన్న ఒక మధ్య వయస్కుడు నన్ను సాదరంగా తన చెంతకు పిలిచాడు. కూర్చోబెట్టి తనను పరిచయం చేసుకున్నాడు. అతను ఆ హోటలు అధిపతి. వృత్తి రీత్యా అడ్వొకేటు. స్థానికంగా చిన్న రాజకీయ నాయకుడు కూడా. నా వివరాలు తెలుసుకున్నాడు. ఎవరికో ఫోను చేసి ముందుగా నా ఫోనుకు సరిపడే చార్జరు తెప్పించాడు. మా భోజన సమస్యను సరిగ్గా అంచనా వేశాడు. ఆ హోటలులో పని చేసే సిబ్బంది కొందరు తమ కోసం వంట చేసుకునే వారుంటారు కాబోలు. ఒకతనిని పిలిచి మా భోజనం అతనికి పురమాయించి, ఆ బిల్లుతో హోటలుకు సంబంధం ఏమీ లేదని, అతను అడిగినంతో లేదా మాకు తోచినదేదో ఇవ్వమని చెప్పి సమస్యను చిటికలో పరిష్కరించాడు.

ఉదయం రైలులో ఎదుర్కొన్న సమస్య, ఈ సమస్య ఒకదానికొకటి అవి పరిష్కారమైన తీరు గమనిస్తే ఎంత భిన్నత్వం! నిజానికి భోజనం సమస్యకన్నా రైలులో సూటుకేసుల సమస్య చాలా చిన్నది. అంత చిన్న సమస్యను పరిష్కరించగలిగిన యంత్రాంగం, మందీ మార్బలం, అధికారం ఇన్ని ఉన్న రైల్వే వారి వెంటపడినా, ప్రాధేయపడినా కనీస సహాయం కూడా చేయలేదు సరికదా అవసరం లేని కాలయాపనకు, తీవ్రమైన ఆందోళనకు, మానసిక ఒత్తిడికి, గురి చేశారు. నా ప్రస్తుత సమస్యతో హోటలు అధిపతికి ఏ మాత్రం సంబంధం లేదు. "అయ్యా! మీరు ఈ హోటలు అధిపతి కదా! నా సమస్య ఇది. మీరు స్థానికులు కదా, దయచేసి సాయం చేయండి అని నా

అంతట నేనే అడిగి ఉంటె "సారీ! నేనేమీ చేయలేను" అని ఉండవచ్చు. "అది నా పని కాదు" అని రైల్వే కార్మికుడు చెప్పిన సమాధానం, మాకు భోజనం సిద్ధం చేయటానికి అంగీకరించిన ఈ హోటలు ఉద్యోగి చెప్పి ఉండవచ్చు. తమ తమ విధుల పట్ల అంకిత భావం, ఈ మానవతా విలువలు సహజంగా ఉండాలి కానీ, ఇవి ఆ రైల్వే అధికారులకు, క్రింది స్థాయి ఉద్యోగులకు ఏ విద్యార్హతలు, శిక్షణ మాత్రం ఇవ్వగలవు!

12వ తేదీ ఉదయం మాట ఇచ్చిన ప్రకారం ఆరున్నరకల్లా మిత్రుడు ఒక ఆల్టో కారు తీసుకువచ్చాడు. అప్పటికే మేము స్నానాలు చేసి సిద్ధంగా ఉన్నాం. రామేశ్వరం నుంచి తెచ్చుకున్న ఇసుకను తీసుకుని నేరుగా త్రివేణీ సంగమానికి వెళ్లాం. క్రితం సారి వచ్చినపుడు క్రతువులు చేయించిన పురోహితుడే ఉన్నారు. వారి సూచనల మేరకు సంగమంలో స్నానం చేసి సమంత్రపూర్వకంగా ఇసుకను అక్కడ నిమజ్జనం చేసి తిరిగి ఒడ్డుకు చేరాము. పురోహితులకు చెల్లించవలసినది చెల్లించి, వివిధ దానాల నిమిత్తం మరికొంత చెల్లించి దుస్తులు మార్చుకుని సమీపంలో నున్న హనుమంతుని ఆలయానికి వెళ్ళాము. సాధారణంగా ఆంజనేయ స్వామిని నిలబడిన భంగిమలో కాకుండా ఇక్కడ శయనించి ఉండటం చూస్తాము.

పది గంటలకు హోటలుకు వచ్చి తడి దుస్తులు ఆరబెట్టుకుని అల్పాహారం చేసి నగర పర్యటనకు వెళ్ళాము. నెహ్రూ కుటుంబీకుల నివాసం 'ఆనంద భవన్' తిలకించి శక్తి పీఠాలలో ఒకటైన మాధవేశ్వరీ అమ్మవారిని దర్శించి భోజన సమయానికి హోటలుకు చేరుకున్నాము. అలహాబాదు వచ్చిన పని పూర్తయింది. కొంత సేపు విశ్రమించి సాయంత్రం ప్రక్కనే ఉన్న అలహాబాదు ప్రధాన వీధిలో కొంత సేపు నడిచి వచ్చాము. రాత్రి గం.10.48 ని. లకు 12398 నెంబరు మహాబోధి ఎక్స్ ప్రెస్ లో గయకు ప్రయాణం.

**గయ**

13వ తేదీ ఉదయం ఆరు గంటలకు గయ చేరుకున్నాము. పితృదేవతలకు పిండప్రదాన కార్యక్రమాల నిమిత్తం దేశం నలుమూలల నుండి వేలాది మంది ఇక్కడకు వస్తూ ఉంటారు. వారిని ఆకర్షించటానికి, ఆ కార్యక్రమాలు చేయించే ఆయా పురోహితులు గయకు వచ్చే ప్రతి రైలు వద్దా తమ ప్రతినిధులను ఉంచుతారు. అలా చేసినందుకు ఆ పురోహితులు వారు తీసుకునే రుసుములో వీరికి కొంత కమీషను ఇస్తారు. ఈ కార్యక్రమాల కోసం ఇక్కడకు వచ్చేవారు, ఇంతకు మునుపు ఈ కార్యక్రమాలు ఇక్కడ నిర్వహించి ఉన్న బంధువులు, మిత్రుల ద్వారా తగిన సమాచారం సేకరించి ముందస్తు ఏర్పాట్లు చేసుకుని తద్వారా స్టేషనులో వీరి బారినపడకుండా జాగ్రత్త పడవచ్చు. కానీ ఎందుకో చాలామందికి మరి ఈ ఆలోచన రాదో, లేక మరే కారణమో తెలియదు కానీ అలా చేయరు. ఫలితంగా వంద రూపాయలు అయ్యే చోట అయిదు వందలు ఖర్చు చేస్తారు. రైలు దిగగానే, యధాప్రకారం ముగ్గురు నలుగురు మమ్ములనూ చుట్టుముట్టారు. మేము ఆ కార్యక్రమం గురించి రాలేదని సున్నితంగా చెపుతూ వారందరినీ తప్పించుకుని స్టేషను ఎదురుగా సన్నటి వీధిలో ఉన్న ఒక హోటలులో గది తీసుకున్నాము.

ఇక్కడ తప్పనిసరిగా నిర్వహింపవలసిన ఈ కార్యక్రమం నిజానికి నేను గత సంవత్సరమే నిర్వర్తించవలసినది. కానీ అప్పుడు వారణాసి గయ మార్గంలో రైళ్లన్నీ నిరవధికమైన ఆలస్యంగా నడుస్తున్నదువల్ల నిశ్చయమైన ప్రయాణం కూడా చేయలేకపోయాను. ఈ సారి ప్రయాణమైతే సాధ్యపడింది కానీ కార్యక్రమం నిర్వర్తించటానికి కుదరలేదు. కొద్ది మాసాల క్రితం కుమారుని వివాహ రూపంలో ప్రధానమైన శుభకార్యం నిర్వహించి ఉన్నాము. పితృ దేవతలకు పిండప్రదానం కూడా తక్కువ పుణ్య కార్యమేమీ కాదు.

అయినప్పటికీ, శ్రాద్ధ విధులకు సంబంధించినది అవటం చేత మనసు అంగీకరించలేదు. అందుచేత ఈ సారికి విష్ణుపాద దర్శనం, శక్తి పీఠాలలో ఒకటైన మంగళగౌరీ అమ్మవారి దర్శనానికి మాత్రమే పరిమితం అవుదామని అనుకున్నాం.

స్నానాలయ్యాక ముందుగా ఈ రెండు దేవాలయాలను దర్శించి అదే ఆటోలో అక్కడకు పన్నెండు కిలోమీటర్ల దూరంలో నున్న బుద్ధ గయకు వెళ్ళాము. అక్కడ దర్శించవలసినవన్నీ దర్శించి అక్కడే భోజనం కూడా చేసి మూడు గంటలకు తిరిగి గయకు చేరాము. రాత్రికి పూర్తిగా విశ్రాంతి తీసుకున్నాము.

**వారణాసి 2**

14వ తేదీ వేకువ ఝామున లేచి స్నానాలు చేసి హోటలు గది ఖాళీ చేసి నాలుగింటికల్లా స్టేషనుకు చేరాము. గం.04.35 ని.లకు 15209 నెంబరు 'మహాబోధి' సూపర్ ఫాస్టు ఎక్స్ ప్రెసులో వారణాసికి బయలుదేరాము. క్రితం సారి మేము వారణాసి వచ్చినపుడు యాదవ్ అనే ఆటో అతను పరిచయమైనాడు. మంచివాడు. కాశీ వచ్చేవారెవరైనా ఉంటే ముందుగా వివరాలు తెలియజేస్తే తన సేవలు అందించగలనని తన ఫోను నంబరు ఇచ్చి ఉన్నాడు. ఈ సంవత్సర కాలంలో అలా నాకు తెలిసిన ఒకరిద్దరికి అతను అందుబాటులో ఉన్నాడు. మా ట్రైను మొఘల్ సరాయి చేరగానే అతనికి ఫోను చేశాను. గం.08.40ని.లకు వరుసగా రెండవ సంవత్సరం వారణాసిలో దిగాము. స్టేషను బయటకు వచ్చేటప్పటికి యాదవ్ సిద్ధంగా ఉన్నాడు. పూర్వపు అన్నపూర్ణా యాత్రీ నివాస్ లోనే గది లభించింది.

ఈ సారి ఇక్కడ తొమ్మిది రోజులు ఉండటానికి సంకల్పించు కున్నాం. తదనుగుణంగా ప్రతి రోజు ఏదో ఒక సమయంలో విశ్వేశ్వరుని

దర్శనం చేసుకోవటం, వీలయినన్ని సార్లు గంగా స్నానమాచరించటం, సాయంత్రం వేళల్లో వివిధ ఘాటుల్లో జరిగే హారతి కార్యక్రమాన్ని తిలకించటం, మేము బస చేసిన యాత్రీ నివాసుకు సమీపంలోనున్న కేదారేశ్వరుని సన్నిధిలో గడపటం నిత్యకృత్యంగా పెట్టుకున్నాం.

వీటికి అదంగా ఒక రోజు కాలభైరవ దర్శనం చేసుకున్నాము. 23వ తేదీ ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రం సారనాథ్ దర్శించాము. ఇది వారణాసి పట్టణానికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఉదయం కానీ, సాయంత్రం గానీ ఒక్క పూటలో ఆటోలో వెళ్లిరావచ్చు. బౌద్ధ స్తూపాలూ, మందిరాలూ , ఆరామాలూ తప్పక చూడదగినవి. బౌద్ధ మతస్తులు అధికంగా ఉండే జపాన్, థాయిలాండ్, మయన్మార్, మలేసియా, సింగపూర్ వంటి ప్రాచ్య ఆసియా దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు, భక్తులు అసంఖ్యాకంగా ఇక్కడకు వస్తారు.

ఈ రోజుతో చూస్తూ చూస్తూ తొమ్మిది రోజులూ అలా గడిచిపోయాయి. 24వ తేదీనే బయలుదేరవచ్చు. కానీ వారానికి రెండు రోజులే నడిచే మేము వెళ్ళవలసిన 7091నెంబరు పాట్నా సికిందరాబాదు ఎక్స్ ప్రెస్ ఆ మరునాడు మాత్రమే ఉంది. (ఇప్పుడు ఇది ప్రతి రోజూ ఉంది) ఆ విధంగా మరి రెండు రోజులు అదనంగా కాశీలో ఉండే అవకాశం లభించింది. 25వ తేదీ రాత్రి బయలుదేరి, 27వ తేదీ నిర్ణీత సమయానికి మూడున్నర గంటల ఆలస్యంతో ఉదయం అయిదున్నరకు సికిందరాబాదులో దిగి ఏడు గంటలకు స్వగృహం చేరాము. ఆ రోజు ఉగాది. పండుగకని ఆ క్రితం రోజే ముంబై నుంచి వచ్చిన మా కుమారుడూ కోడలూ, పదిహేను రోజులనుంచీ తాళం వేసి ఉండి దుమ్మూ ధూళితో నిండిన ఇంటిని యధాశక్తి సంస్కరించి, మామిడాకులూ, పుష్పతోరణాలతో అలంకరించి, ఆటో దిగిన వెంటనే కమ్మటి కాఫీతో మాకు స్వాగతం పలికారు.

# నాలుగవ అధ్యాయం

***కావేరికా నర్మదాయో పవిత్రే సమాగమ సజ్జన తారణాయ***

***సదైవమాం ధాతృపురీ వసంతం ఓంకార మీశం శివమేక మీడే|***



చాలా కాలం క్రితం చూసిన శ్రీశైలంతోసహా పై మూడు యాత్రలలో ద్వాదశ జ్యోతిర్లింగాలలోని శ్రీశైలం, రామేశ్వరం, వారణాసిలతో కేవలం మూడే ఉండగా మిగతా తొమ్మిదింటిని కూడా ఎందుకు చూడలేము అనే ఆలోచన వచ్చిందే తడవుగా అందుకు తగిన ప్రణాళిక రూపొందించటంలో నిమగ్నమయ్యాను. అంతకు మునుపు చేసిన మూడు ప్రధాన యాత్రల నుంచి, ఎన్ని ప్రదేశాలు తిరిగాం అన్నది ముఖ్యం కాక, ఎన్ని రోజులు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సౌఖ్యంగా యాత్ర చేయగలిగాం అన్న దానికి

ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంటుందని అనుభవపూర్వకంగా గ్రహించాను. ఆ దృష్ట్యా, ఈ వయస్సులో సర్వసాధారణంగా కలిగే అధిక రక్తపోటు, మధుమేహం (Diabetes) లాంటివి అదృష్టవశాత్తు లేనప్పటికీ మా వయసుకి, ఆరోగ్య స్థితికి, శరీరసామర్థ్యానికి ప్రయాణకాలంతో సహా పది పన్నెండు రోజులకు మించని యాత్ర మాత్రమే సరిపడుతుందని నిర్ధారించు కుని ఈ కాలపరిమితిలో మూడు గాని నాలుగు గాని ఒక క్రమంలో ఉండే క్షేత్రాల దర్శన సాధ్యమని ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చాము. ఆ కోణంలో మిగిలిన జ్యోతిర్లింగాలను పరిశీలనచేయగా మధ్యప్రదేశ్ లోని, ఓంకారేశ్వర్, ఉజ్జయిని క్షేత్రాలు, గుజరాతులోని సోమనాథ్, నాగేశ్వర జ్యోతిర్లింగాలు ఈ సమయ చట్రంలో ఇముడుతాయని తోచింది. తదనుగుణంగా సమగ్రమైన ప్రణాళిక సిద్ధంచేసి ముందుగా ప్రయాణ టికెట్లు రిజర్వు చేయించాను. 2010 జనవరి 21వ తేదీన హైదరాబాదు నుంచి ఆంధ్రప్రదేశ్ ఎక్స్ ప్రెసులో బయలుదేరి నాగపూర్ మీదుగా మరునాడు తెల్లవారు ఝామున ఇండోరు చేరుకున్నాము. ఈ యాత్రలోనే మొదటిసారిగా నా శ్రీమతి తీవ్ర అనారోగ్యానికి గురయ్యింది.

జనవరి 22న ఇండోరునుండి ఉదయం 8 గంటలకు బయలు దేరి 84 కిలోమీటర్లు ప్రయాణించి ఓంకారేశ్వర్ చేరాము. కాలిబాట వంతెన మీదుగా గాని, బోటులోగాని, నర్మదా నదిని దాటి, అవతల ఒడ్డున ఉన్న ఓంకారేశ్వరుడిని దర్శించుకోవాల్సిన క్రమంలో పడవలు నిలిచి ఉండే రేవుకు సమీపంలో ఆగిన కారు నుంచి 'మేము' దిగాం అనంటం కన్నా 'నేను' దిగాను అనటం సముచితం. ఎందుకంటే దురదృష్టం ఏమిటోగాని, నా శ్రీమతి కారు దిగలేకపోయింది. ఎలాగో దిగినా అడుగు వేయలేక పోతోంది. సాధారంగా తరచూ కలిగే తిమ్మిరి లాంటిదేమోననుకున్నాను. అటువంటిదేమీ కాదని

తీవ్రమైన బాధ పడుతోందని గ్రహించి ఏమయిందని ఆందోళనగా అడిగాను. కానీ కారణమేమిటో అమెకైనా తెలిస్తేగా? దాదాపు కుప్ప కూలిపోయే స్థితిలో ఉంది. నేనొక చెయ్యి, డ్రైవరు మరో చేయి పట్టుకుని ముందు ఒక రాతి మీద కోర్చోబెట్టాము. ఆ తరువాత అతికష్టం మీద ఎలాగో రేవు వద్దకు చేర్చి బోటులో కూర్చోపెట్టాము. అవతల ఒడ్డుకు చేరిన తరువాత కూడా ఇదే పరిస్థితి. దేవాలయం చేరటానికి వందకు పైగా మెట్లు ఎక్కాల్సి ఉంది. ఆ స్థితిలో అది అసాధ్యమేకాక అసలా ప్రయత్నం కూడా దుస్సాహసమే. పోనీ వెనుదిరుగుదామా అంటే అందుకూ మనసొప్పలేదు. కర్తవ్య దిశ లేని స్థితిలో అక్కడే కూలబడి ఉన్నాం. ఆ ఓంకారేశ్వరుడే స్వయంగా పంపించాడా అన్నట్లుగా ఇద్దరు వ్యక్తులు ప్రత్యక్షమై 'డోలీ కావాలా' అని అడిగారు. ఎక్కడో కేదార్, యమునోత్రి, వంటి సుదీర్ఘమైన పర్వత యాత్రలలో ఉంటాయని విన్నాము కానీ, ఈ స్వల్ప దూరానికి కూడా ఇటువంటి సదుపాయాలు ఉంటాయని ఊహించలేదు. ఏ మాత్రం తడవులేకుండా వారు అడిగినంతకు ఒప్పుకుని పైకి వెళ్ళాము.

ఆ రోజు నర్మదా నదికి ఉత్సవమట. తిరుణాల జరుగుతున్నది. రద్దీ విపరీతంగా ఉంది. ఆలయ అధికారులకు పరిస్థితి వివరించాను. నిర్ధారిత రుసుము చెల్లించిన మీదట ప్రత్యేక దర్శనానికి అనుమతించారు. నిజానికి అక్కడ ప్రత్యెక దర్శన విధానమంటూ ఏమీ లేదు. ఇచ్చిన డబ్బు విరాళం క్రింద రాసుకుని రసీదు ఇచ్చి దర్శనం చేసుకున్న భక్తులు గర్భాలయంలోనుంచి బయటకు వచ్చే మార్గంలో ఎదురుగా లోనికి వెళ్ళమన్నారు. దర్శనం చేసుకుని బయటకు వచ్చి భక్తులు అభ్యంతరం చెప్పసాగారు. దేవస్థానం వారి అనుమతితోనే మేము అలా చేస్తున్నప్పటికీ అలా వెళ్ళమని అనుమతి ఇచ్చిన దేవస్థాన సిబ్బంది ఎవరూ మాకు

సహాయంగా రాలేదు. అలాంటి అపరాధ భావంతోనే ఏదో దర్శనం అయింది అనిపించుకుని , అదే రీతిలో నదిని దాటి తిరిగి కారు వద్దకు చేరి మధ్యాహ్నం రెండు గంటలవుతుండగా ఇండోరుకు తిరిగి వచ్చాము. హోటలుకయితే చేరాము, కానీ ఏమీ పాలుబోవటం లేదు. భోజనం కూడా చేయబుద్ధి కాలేదు.

యాత్రలో ముందుకు పోవటానికేగాని, మధ్యంతరంగా వెనుదిరగ వలసిరావటం ఊహించలేం కదా! ఒక దశలో స్థానిక డాక్టరును సంప్రదించుదామా! అని అనుకున్నాము. కానీ, మానవత్వం, సేవాతత్త్వం లుప్తమై ప్రతిదీ వ్యాపారమయమై కేవలం ధనార్జనే పరమావధిగా మారిన ఈ రోజుల్లో ఎవరిని నమ్మగలం? ఆ డాక్టరు ఈ దుర్గుణాలేవీ లేనివాడై, పరిస్థితిని సరిగ్గా అర్థం చేసుకుని చేతనైతే, తక్షణ ఉపశమనం కోసం మందులు ఇచ్చి తదుపరి చికిత్సకై తగు సలహా ఇస్తే ఫరవాలేదు, మా నిస్సహాయస్థితిని అవకాశంగా తీసుకొని లేని జబ్బును ఆపాదించి, తక్షణమే ఏ కార్పొరేటు ఆస్పత్రిలోనో చేరకపోతే ప్రాణాలకి ముప్పని భయపెడితే? అలా అని పరిస్థితిని తేలిగ్గానూ తీసుకోలేము! ఈ స్థితి దేనికి సంకేతమో? ముందు ముందు ఇంకా తీవ్రమైతే? ఎవరు ఆదుకుంటారు? మీమాంసలో మునిగి పోయాం. అందుకే సంఘర్షణ. ఏమయినా ఆ పరిస్థితిలో సాధ్యమైనంత త్వరగా స్వస్థలానికి క్షేమంగా చేరుకోవటమొక్కటే తక్షణ కర్తవ్యంగా తోచింది. రైల్వేగైడు శోధించాను. ఇండోరు నుంచి హైదరాబాదుకు నాగపూర్ మీదుగా తప్ప నేరుగా రైలు సౌకర్యం లేదు. నాగపూర్ 607 కిలోమీటర్లు 11 గంటల ప్రయాణం. అక్కడనుంచి సికిందరాబాద్ మరో 577 కిలోమీటర్లు. పది గంటలు ప్రయాణం. మా స్వస్థలం తరువాత భద్రమైనది మా కుమారుడుండే ముంబయి. అది 749 కిలోమీటర్లు. పదమూడు గంటలు ప్రయాణం. నేరుగా వెళ్ళటానికి

ఇండోరులో మధ్యాహ్నం గం. 3.50 ని.లకు బయలుదేరి మరునాడు ఉదయం గం.6.35 ని.లకు ముంబాయి చేరే ఒకే ఒక ట్రయిను 'అవంతిక' ఎక్స్ ప్రెస్. కానీ ఆ రోజుకు అది వెళ్ళిపోయి ఉంటుంది. అయినా సరే, ఈ సమాచారంతో సమీపంలోని రైల్వే రిజర్వేషన్ ఆఫీసుకి వెళ్లాను. నాగపూర్ మీదుగానైనా సరే హైదరాబాదుకుగాని, నేరుగా ముంబాయికిగాని, ఏ రైల్లోనూ, ఏ క్లాసులోనూ, ఏ కోటాలోనూ, తత్కాల్లో కూడా ఖాళీలు లేవు. సమయం సాయంత్రం ఏడవుతోంది.

తప్పనందువల్ల, అయిష్టంగానే మా కుమారుడికి పరిస్థితి వివరించాం. ఈ సమాచారంతో ఆందోళనకుగురై వెంటనే రంగంలోకి దిగి మరో పది నిముషాల్లో ఫోనుచేసి, ఆ రోజుకు సమయం మించిపోయినందువల్ల ఆ మరునాటికి హైదరాబాదుకు గానీ ముంబయికి గానీ ఎక్కడకు లభ్యమయితే అక్కడకు విమాన ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లూ, అందుకు సిద్ధంగా ఉండవలసినదనీ, ఆ రాత్రికి ఎలాగో గడపవలసినదిగానూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలియజేస్తూ ఉండవలసినదనీ కోరాడు. సరే! తిరుగు ప్రయాణమే తథ్యమైంది కనుక, ఇక ఆ రాత్రి ఇండోరులో నుండక తప్పని పరిస్థితి.

కానీ, కార్య ప్రణాళికలో ఇండోరులో పగలు గడప వలసిన సమయం అధికంగా లేనందుచేతనూ, ముఖ్యంగా రాత్రి బస అవసరం అసలే లేకపోవటం తోనూ, ఆ రోజు ఉదయం ఇండోరులో దిగిన వెంటనే స్టేషను దగ్గరలో, కేవలం స్నానాలు చేసి దుస్తులు మార్చుకోవటానికే కనుక అందుబాటులో ఉన్న ఏదో తక్కువ తరగతి హోటలుతో సరిపుచ్చాము. రాత్రి బసకు ఏ మాత్రం యోగ్యంకాదు. పరిశుభ్రంగాకూడా లేదు. సౌఖ్యంగా రాత్రికి ఉండాలంటే తక్షణమే కాస్తంత మెరుగైన మరొక హోటలు చూసుకుని మారటం

అవశ్యం. ఆ క్రమంలో ముఖ్యంగా అప్పుడున్న పరిస్థితిలో ఎంతో కొంత శ్రమ భరించకా తప్పదు. అప్పటికి మేము ఇండోరు నుండి ఉజ్జయిని వెళ్ళవలసిన భిండ్ ఎక్స్ ప్రెస్ బయలుదేరే సమయం (రాత్రి గం.8 15 ని) దగ్గరబడుతోంది. ఈ రెండు పట్టణాలమధ్య రోడ్డు మార్గం 55 కిలోమీటర్లు (రైలు మార్గం 'దేవస్' జంక్షను మీదుగా 80 కిలో మీటర్లు) మరునాటి తిరుగు ప్రయాణానికి ఉజ్జయిని నుండి రెండు గంటల లోపునే నేరుగా ఇండోరు విమానాశ్రయానికి చేరే వీలున్నది. ఎలాగూ ఖరారయిన బెర్తులే కనుక మరి కాస్త శ్రమకు సిద్ధపడి, రాత్రికి ఉండే ఆ హోటలేదో ఉజ్జయినిలోనే చూసుకోవచ్చు కదానని ఉజ్జయిని వెళ్ళటానికి నిశ్చయించుకున్నాము. రూము ఖాళీ చేసి దగ్గరలోనే ఉన్న స్టేషనుకు నడిచేవెళ్ళాము. ఆశ్చర్యం. ఆ మధ్యాహ్నం ఉన్న, పూర్తిగా చేతులమీద మోయవలసినంత తీవ్రత ఇప్పుడు లేదు. కొంత శ్రమ పడి నప్పటికీ, ప్లాటుఫారం మీద, ఓవరుబ్రిడ్జీ మీద నా ఆసరాతో తనే స్వయంగా నడవగలిగింది. రైలులో కూర్చున్నాం. బయలుదేరింది.

ఈ రుగ్మత, ఇలా తాత్కాలికమే అయితే ఎంత బాగుండును అనిపించింది. అంతలోనే యాత్రపై మళ్ళీ ఆశ, వెనుదిరిగే విషయమై పునరాలోచన. సరే! అసలే ఆందోళనలో ఉన్నాడు కదా అని, అదే విషయాన్ని వెంటనే పిల్లవాడికి తెలియజేసాం. మా వలెనే కొంతవరకు ఉపశాంతి పొందినప్పటికీ అంతటితో తృప్తిపడక, అప్పటివరకు చేస్తున్న విమాన ప్రయాణ ఏర్పాటుకు స్వస్తిపలికి, మధ్యే మార్గంగానూ, ముందస్తు ఉభయ తారకంగానూ ఉండేవిధంగా మరో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి మేము ఉజ్జయిని చేరేలోపే తెలియజేశాడు.

ముందుగా నిర్ణయించబడిన ప్రణాళిక ప్రకారం, మరునాడు ఉజ్జయిని మహాకాళేశ్వరుని దర్శనం, ఇతర దర్శనీయ స్థలాలు, ఆలయాలు దర్శించిన

తరువాత, ఉజ్జయినిద్వారా వెళ్ళే జబల్పూర్ సోమనాథ్ ఎక్స్ ప్రెస్ లో రాత్రి గం. 11. 05 ని.లకు సోమనాథ్ కు బయలుదేరవలసి ఉంది. దానిలో కూడా ఖరారైన బెర్తులే. దైవదర్శనం, ఇతర దేవాలయాలు చూసినా, చూడకపోయినా కూడా విమాన ప్రయాణం విరమించుకున్న కారణంగా, ఈ ట్రయిను తప్ప ఉజ్జయిని నుంచి బయటపడే మార్గం ఎలాగూ లేదు. ఆ మార్గంలో ఉన్న ఒక పెద్ద జంక్షను వడోదర. ఉత్తరాది నుండి ముంబాయి వెళ్ళే రైళ్లన్నీ ఈ జంక్షను ద్వారానే వెళ్ళాలి. అటువంటి రైళ్ళలో మధ్యాహ్నం గం. 12.05 ని.లకు వడోదరలో బయలుదేరి అదేరోజు సాయంత్రం గం. 6.05 ని.లకు ముంబయి చేరే జమ్మూ తావి - బాంద్రా, 'స్వరాజ్ ఎక్స్ ప్రెస్' ఒకటి. దానిలో రెండు AC టూ టీర్ టికెట్లు లభించగా వెంటనే బుక్ చేసి మెయిల్ చేసాడు. మేము ప్రయాణించే సోమనాథ్ ఎక్స్ ప్రెస్ ఉదయం గం. 5.40 ని. లకు వడోదర చేరుతుంది. ఆ సమయానికి ప్రయాణం ముందుకు సాగించటం అసాధ్యం అనిపిస్తే, అక్కడ దిగిపోయి స్టేషను దగ్గరలో అనుకూలంగా ఉండే ఏదయినా హోటల్లో దిగి స్థానిక ఇంటర్నెట్ కేఫ్ లో నా మెయిల్ బాక్స్ లోని ఇంటర్నెట్ టికెట్లు డౌన్ లోడు చేసి ప్రింటు తీయించుకుని అదే మధ్యాహ్నం తాను టికెట్లు బుక్ చేసిన ఆ 'స్వరాజ్ ఎక్స్ ప్రెస్' అందుకోవాలి. ఆ విధంగా ఎప్పటికప్పుడు ఆరోగ్య స్థితిని సమీక్షించు కుంటూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడానికి స్వేచ్ఛ, తగినంత సమయం, వెసులుబాటు, కల్పించాడు.

రాత్రి గం. 9.55 ని.లకు ఉజ్జయిని చేరుకుని స్టేషను దగ్గరలోనే హోటలులో గది తీసుకున్నాము. తెల్లవారు ఝామున 4 గంటలకు మహాకాళేశ్వరునికి భస్మాభిషేకం ఉంటుంది. ప్రతి భక్తుడు తప్పని సరిగా చూడవలసిన ఘట్టం. ఏమయినా సరే, అది చూడాలని నిశ్చయించుకున్నాం.

రెండు గంటలకే మేల్కొని, స్నానాలు చేసి, ఆ దేవాలయంలో, ప్రత్యేకించి ఆ దర్శనానికి, తప్పనిసరి అయిన సంప్రదాయ దుస్తులు (ధోవతి, పైన ఉత్తరీయం) ధరించి ముందురోజు రాత్రి స్టేషను నుంచి వచ్చిన ఆటో వ్యక్తినే రమ్మని 3 గంటలకల్లా దేవాలయానికి వెళ్ళాము. జనవరి నెల. చలి

బాగా ఎక్కువగా ఉంది. రెండు గంటలకు పైగానే క్యూలో నిల్చోవాల్సివచ్చింది. అయినా తాను భరించింది. అనుమతించ గానే లోనికివెళ్లి ఆ భస్మాభిషేకం ఆద్యంతం కనులారా వీక్షించాము. ఆ తరువాత గర్భగుడిలోకి వెళ్లి స్వామివారిని సేవించాము. గం. 6.30 అవుతుండగా తిరిగి బసకు చేరుకొని దుస్తులు మార్చుకుని, అల్పాహారం చేసి అదే ఆటోలో ఉజ్జయినిలోని ఇతర దర్శనీయ స్థలాలన్నిటిని కూడా చూడగలిగాము. హోటలుకు తిరిగి వచ్చాక భోజనాంతరము పూర్తిగా విశ్రాంతి తీసుకున్నాము. ఆ రాత్రికే సోమనాథ్ కు ప్రయాణం.

ఆ సోమనాథుని దయవల్ల వడోదరలో దిగే అవసరం ఏర్పడలేదు. 24 తేదీ సాయంత్రం గం. 5.50 ని.లకు నేరుగా సోమనాథ్ చేరుకొని దేవస్థానం దగ్గరలోనే ఉన్న 'అశాపూరా' హోటలులో గది తీసుకున్నాము. సుదీర్ఘ ప్రయాణం, ముఖ్యంగా ఆరోగ్య స్థితి విసిరిన సవాలుతో కలిగిన మానసిక ఒత్తిడి అనుభవించటం చేత తీవ్రంగా అలిసిపోయాము. వేడినీటి స్నానం చేసి టీ త్రాగి కొద్దిసేపు విశ్రమించిన తరువాత శరీరాలు కొంత శక్తిని కూడదీసుకున్నాయి.

ఆ తరువాత ఆలయ ప్రాంగణానికి వెళ్ళాము. ఈ ప్రాంగణం రెండు భాగాలుగా ఉంటుంది. ముందర భాగం సుమారు అరచదరపు కిలోమీటరు విశాలమైన ఖాళీ ప్రదేశం. చుట్టూ ప్రహరీగోడ. మధ్య మధ్యలో తగినన్ని ప్రవేశ ద్వారాలు. దీనిలో ఒక ప్రక్క పాదరక్షలు, సెల్ ఫోనులు, కెమెరాలు, బ్యాగులు మొదలైన దేవాలయంలోనికి అనుమతించ

బడని వస్తువులు భద్రపరుచుకునే క్లోకు రూము. ఇది పూర్తిగా ఉచిత సేవ. డబ్బులు ఇచ్చినా పుచ్చుకోరు. మరో వైపు ప్రధాన ఆలయంలోకి వెళ్ళటానికి ద్వారం. ఇది పేరుకే ద్వారం కానీ కళాత్మకమైన భవనం. దీని పేరు విజయ్ ద్వార్. ఈ ద్వారం ఎదురుగా ఎత్తైన పీఠంపై సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహం. ఈ దేవాలయం పటిష్టమైన భద్రతావలయంలో ఉన్నది. ప్రతి భక్తుడినీ క్షుణ్ణంగా పరీక్షించాకగానీ లోపలికి అనుమతించరు. ఆ 'విజయ్' ద్వారం వద్దనే భద్రతా తనిఖీ. ఇది దాటి లోనికి వెళ్ళగానే బ్రహ్మాండమైన ఆలయం దర్శనమిస్తుంది. రద్దీ ఎక్కువగా లేదు. అలా వెళ్లి సోమనాధుని దర్శనం చేసుకున్నామో లేదో ఏమిటో అలసటంతా మాయమై, శరీరానికి మనసుకీ అనిర్వచనీయమైన ఒక ప్రశాంతత చేకూరినట్లు అనిపించింది. కొంత సేపు అక్కడ కూర్చున్నాము. దేవాలయం వెనుక మరో ఖాళీ ప్రదేశంలో ఒక గ్యాలరీ ఉన్నది. సోమనాధ దేవాలయ చరిత్ర, అది గురయిన దాడులు, పునరుద్ధరణ క్రమం మొదలైన అంశాలతో దృశ్య శ్రవణ రూపకం ప్రదర్శిస్తారు. దర్శనమయ్యాక ఈ ప్రదర్శన తిలకించాము.

అనంతరం బయటకు వచ్చి దక్షిణ భారత భోజనం లభించే ప్రదేశంగా చెప్పబడిన ఒక హోటలుకు వెళ్ళాము. భోజనం ఏమీ బాగాలేదు. దక్షిణభారత భోజనం బాగుంటుందట ఈ రోజు అది భుజిద్దామని వేరే రాష్ట్రాల వారెవరైనా ఇటువంటి నకిలీ హోటలుకు వెళితే మనమూ, మన భోజనమూ చులకనకు గురికావటం తధ్యం. ఎవరి సంస్కృతీ సాంప్రదాయాలను వారే ఆచరించాలి గానీ, అనుకరించాలని ప్రయత్నిస్తే ఫలితం ఇదిగో ఇలాగే ఉంటుంది. తినాలి కనుక ఏదో తిన్నామనిపించి గదికి తిరిగి వచ్చి విశ్రాంతి తీసుకున్నాము.

25వ తేదీ సోమవారం. ఈశ్వరునికి ప్రియమైన రోజు. ఉదయాన్నే వెళ్లి ఒకసారి దర్శనం చేసుకుని కొద్దిసేపు గడిపాము. బయటకువచ్చి ఆటో మాట్లాడుకుని స్థానికంగా చూడదగిన ప్రదేశాలకు వెళ్ళాము. వెరావల్ సమీపంలో శ్రీకృష్ణుడు అవతారం చాలించినట్లుగా చెప్పబడిన ప్రదేశం మొదలైనవి దర్శించాము. ఇంకా ఏవేవో ప్రదేశాలు చూపాడు కానీ అవేవీ అంత ప్రముఖంగా చెప్పుకోదగ్గవి కావు. సాయంత్రం మరోసారి దర్శనం చేసుకున్నాము. ఇప్పటి దేవాలయం పునర్నిర్మింపబడటానికి పూర్వం, దాడుల్లో ధ్వంసమైన ఆలయాలలో ఉన్న శివలింగం, ఇతర మూర్తులతో ఇండోరు మహారాణి అహల్యాబాయిచే పునర్నిర్మింపబడిన పురాతన సోమనాథాలయం ఈ ప్రాంగణానికి మరో ప్రక్కన ఉన్నది. రెండు అంతస్తులతో ఉండే ఈ ఆలయాన్ని కూడా భక్తులందరూ అంతే భక్తి శ్రద్ధలతో దర్శిస్తారు. మేమూ అలాగే దర్శించాం. ఆ తరువాత టూరిస్టు బస్సులు నడిపే ఒక సంస్థ కార్యాలయానికి వెళ్లి మరునాడు ద్వారక వెళ్ళటానికి బస్సు టికెట్లు కొనుక్కుని భోజనం చేసి గదికి చేరాము.

## ద్వారక

26వ తేదీ.గణతంత్ర దినోత్సవం. సోమనాధ పట్టణంలోని కూడళ్ళన్నీ త్రివర్ణమయమై దేశభక్తి గీతాలతో మార్మ్రోగుతున్నాయి. ఆ కోలాహలం మధ్య ఉదయం ఏడు గంటలకు ద్వారకకు బయలు దేరాము. 230 కిలోమీటర్ల దూరం ఆసాంతం సముద్ర తీరంవెంట అయిదు గంటలు ప్రయాణం. అయితే సముద్రం మాత్రం అక్కడక్కడ కొంత మేర మాత్రమే కనబడుతుంది. బస్సు స్థితి, అందులో మాకు లభించిన సీట్లు అంత సౌఖ్యంగా లేనందున ఆశించినంతగా ప్రయాణాన్ని ఆస్వాదించలేక పోయాం. వాయుశక్తితో విద్యుతుత్పత్తి చేసే సంస్థల వారి గాలి ఫంకాల భారీ స్తంభాలు దారికిరువైపులా కనుచూపు మేర కొన్ని వేలు కనబడతాయి. ఆ మార్గంలోనే మహాత్మా గాంధీ జన్మస్థలం పోరుబందరు వస్తుంది. అక్కడ బస్సు కొద్ది సేపు నిలిచింది. మధ్యాహ్నం ఒంటి గంటకు ద్వారక చేరి బస్సు స్టాండు సమీపంలో 'రాధిక' హోటలులో గది తీసుకుని అందులో చేరిపోయాము.

28వ తేదీ తెల్లవారు ఝామున రాజ్కోట్ నుంచి సికిందరాబాదు వారానికి రెండు రోజులే నడిచే ట్రైను అందుకోవటానికి 27వ తేదీ రాత్రికి రాజ్కోట్ చేరుకోవాలంటే ద్వారకలో మధ్యాహ్నం ఒంటిగంటకు 19006 నెంబరు ఒఖా ముంబై సౌరాష్ట్ర మెయిలులో ద్వారక నుంచి టికెట్లు ఖరారయి ఉన్నాయి. ఆ రీత్యా ఇక్కడ అందుబాటులో ఉన్న సమయం సరిగ్గా ఇరవై నాలుగు గంటలు. దానిలో రాత్రి సమయం పోగా ఆ రోజు సగం మరునాడు ఉదయం సగం రోజు మాత్రమే మిగిలింది. హోటలు కుర్రవాడు చూపించిన హోటలులో భోజనం చేసి విశ్రాంతి ప్రసక్తి లేకుండా వెంటనే ఆటో మాట్లాడుకుని పర్యటనకు బయలుదేరాం.

ద్వారక చిన్న పట్టణం. చూడదగిన ప్రదేశాలన్నీ ఏడెనిమిది

కిలోమీటర్ల లోపే ఉన్నాయి. స్వామి నారాయణ మందిరం (అక్షరధాం) గాయత్రీ మందిరం, ఇస్కాన్, శంకరాచార్యుల వారి ద్వారకా పీఠం మొదలైనవి దర్శించి అక్కడనుంచి సముద్ర ద్వీపస్థంభం(Light House) చూసి సూర్యాస్తమయం తిలకించటానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వ్యూ పాయింటుకు వెళ్లాం. ఈ పట్టణం భారత భూభాగంలో పూర్తి పశ్చిమంలో ఉండటంతో ఇక్కడ సాయంత్రం ఏడు గంటల వరకూ సూర్యుడుంటాడు. సూర్యాస్తమయమైన తరువాత గదికి చేరుకొని తేనీటితో సేద తీరి ద్వారకాధీశుని ఆలయానికి వెళ్ళాము.

గరుడ పురాణంలో పేర్కొనబడిన భారతదేశంలోని ప్రధాన పుణ్యక్షేత్రాలలో ద్వారక ఒకటి. వీటి గురించి ఈ గ్రంధంలోనే ప్రథమ అధ్యాయంలో విపులీకరించాను. ద్వారావతి అని కూడా పిలువబడే ఈ పట్టణ ప్రశస్తి, స్కంద, విష్ణు పురాణాలతో పాటు మహాభారతంలో ప్రముఖంగా కనబడుతుంది. క్రీస్తు శకం పదహారవ శతాబ్దంలో చాళుక్య శైలిలో నిర్మింపబడిన ఈ దేవాలయం దేశంలోని పురాతన ఆలయాలలో ఒకటి. ఈ ఆలయానికి ఉత్తర వైపున మోక్షద్వారమనీ, దక్షిణవైపున స్వర్గద్వారమనీ రెండు ప్రధాన ద్వారాలున్నాయి. దక్షిణ వైపు ద్వారం ఎదురుగా మెట్ల బాట గోమతీ నదీతీరానికి దారి తీస్తుంది. భారతదేశం లోని ఆలయాలలో వలె ఇక్కడ పెద్ద గాలి గోపురాలు ఉండవు. అరవై రాతి స్తంభాలపై నిర్మించిన 52 మీటర్ల ఎత్తైన నిజగోపురం క్రిందనే గర్భాలయం ఉంది. ప్రక్కనే ఉన్న మరొక చిన్న గోపురం క్రింద మండపం ఉన్నది. అదే ప్రాంగణంలో దేవకీ వసుదేవులు, రేవతీ

బలరాములు, సుభద్ర, సత్యభామ శ్రీ కృష్ణుని మనుమడైన అనిరుద్ధునికి చిన్న ఆలయాలున్నాయి.

ప్రవేశానికి పటిష్టమైన భద్రతా తనిఖీ తప్పనిసరి. అలాగే సెల్ ఫోనులు, కెమెరాలు కూడా అనుమతించరు. అవి భద్రపరచటానికి ఏర్పాట్లున్నాయి. నామమాత్రపు రుసుము చెల్లించాలి. ఈ లాంచనాలు పూర్తి చేసుకుని లోనికి వెళ్ళేటప్పటికి సాయంత్రపు హారతి సమయం సమీపిస్తున్నది. ద్వారక పేరు వినగానే, ఆయన రాజధాని అయినందున భక్తుల భావనలు శ్రీ కృష్ణుని చుట్టూనే తిరుగుతాయి. నేను కూడా, ఇది శ్రీ కృష్ణుని ఆలయమనీ, పిల్లనగ్రోవి ఊదుతూ వెనుక గోవుతో ఏ పాలరాతితోనో విగ్రహం ఉండవచ్చని ఊహించాను. కానీ రెండున్నర అడుగుల ఎత్తున్న విగ్రహం నల్లరాతితో చేయబడ్డది.

ఈ స్వామి కళ్యాణ నారాయణుడు. శంఖు, చక్రం, గద కమలాలతో చతుర్భుజుడై కళ్యాణ ఆహార్యంలో దర్శనమిస్తాడు. అమ్మవారు రుక్మిణీ దేవి. హారతి కార్యక్రమం ముగిసే వరకూ స్వామి సన్నిధిలోనుండి, తదనంతరము క్యూలో గర్భాలయంలోకి వెళ్లి మరింత సమీపంలో దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించి, అదే ప్రాంగణంలోనున్న మిగతా ఆలయాలను కూడా దర్శించి తొమ్మిది గంటలకు బయటకు వచ్చాము.

## నాగేశ్వర్

మరునాటి పర్యటనలో నాగేశ్వర జ్యోతిర్లింగ క్షేత్రం, ద్వారక పట్టణానికి 30 కిలోమీటర్ల దూరాన ఒఖా సమీపంలోనున్న భేట్ ద్వారక మాత్రమే ఆ రోజు దర్శించవలసినవి. ఇవి రెండూ పూర్తయ్యాక ద్వారక తిరిగి వచ్చి ఒంటి గంటకు రాజ్కోటుకు బయలుదేరాలి. హోటలు రిసెప్షను వారితో ఈ పర్యటనకు టాక్సీ విషయమై మాట్లాడుతున్నాను. భేట్ ద్వారకకు అరగంట

సముద్ర ప్రయాణం ఉంటుంది. అయితే వెళ్లి రావటానికి సరిగ్గా ఎంత సమయం అనేది ఇతమిత్థంగా అంచనా వేయలేము. అది ఆయా బోట్లు నడిపేవారిపై ఆధారపడి ఉంటుంది. అందుచేత భేట్ ద్వారకా సందర్శన పూర్తయిన పిదప రైలు అందుకోవటానికి 30 కిలోమీటర్లు వెనుకకు ద్వారక వచ్చే అవసరం లేకుండా అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒఖాకు వెళితే మేము ద్వారకలో ఎక్కవలసిన రైలు అక్కడే ఎక్కవచ్చని తద్వారా భేట్ ద్వారకాలో గడపవలసిన సమయం కొంత అదనంగా లభిస్తుందని సూచించాడు. సముచితమైన ఈ సలహాను కృతజ్ఞతతో స్వాగతించి మరునాడు ఉదయం ఆరు గంటలకే గది ఖాళీ చేసి వెంటనే బయలుదేరేటట్లు నిర్ణయించుకున్నాం.

27వ తేదీ ఏడు గంటలకు ద్వారకలో బయలుదేరాము. ముందుగా పట్టణ శివారులోనున్న రుక్మిణీదేవి ఆలయానికి వెళ్ళాము. అమ్మవారిని దర్శించుకుని భేట్ ద్వారక వెళ్ళే మార్గంలో శ్రీ కృష్ణుడు గోపికలకు ముక్తిని ప్రసాదించిన ప్రదేశంగా చెప్పబడిన 'గోపీ తలాబ్' అని చిన్న కొలనుకు వెళ్లాం. ఇందులో మట్టి అత్యంత మృదువుగా లేత గోధుమ వర్ణంలో ఉంటుంది. ఆ మట్టి మెత్తగా ఉండగానే, కడ్డీలుగా చేసి ఎండబెడితే గట్టిగా తయారవుతాయి. కొంచెం చందనపు సుగంధం ఇస్తుంది. అందుచేత వాటిని 'గోపీ చందన్' పేరుతో దుకాణాలలో విక్రయిస్తారు. అక్కడ కూడా రుక్మిణీదేవి ఆలయం ఉన్నది. అక్కడ నుండి నాగేశ్వర్ జ్యోతిర్లింగ క్షేత్రం వద్దకు చేరాము.

ప్రశాంత ప్రభాతవేళ నాగేశ్వరాలయంలో అసలు రద్దీయే లేదు. ఇక్కడ కూడా దుస్తులకు సంబంధించిన నియమం ఉన్నది. అయితే అది దేవాలయ ప్రవేశానికి కాదు. గర్భాలయంలోకి వెళ్ళాలంటేనే పురుషులు ధోవతి ధరించవలసి ఉంటుంది.

నా వద్ద ధోవతి ఉన్నది కానీ అది కారులో సూటుకేసులో ఉండటం వలన తెచ్చుకుని మార్చుకోవటానికి అవకాశం లభించలేదు. స్వామివారి దగ్గరకు వెళ్లి స్పర్శించలేక పోయినప్పటికీ, దగ్గరనుంచి సంతృప్తిగానే దర్శించాను. తగినంత సమయం లభించినట్లయితే అభిషేకం కూడా చేసి ఉండేవారం. జయలక్ష్మి స్వామివారి చెంతకు వెళ్లి మరింత దీర్ఘమైన దర్శనం చేసుకున్నది. ఆ ప్రక్కనే పార్వతీ అమ్మవారు ఉన్నది.

**భేట్ ద్వారక**

అక్కడనుండి భేట్ ద్వారకకు వెళ్ళటానికిగాను ఒఖా రేవుకు వెళ్లాం. ఇది పెద్ద ఓడ రేవు. అతి పెద్ద సరుకు రవాణా నౌకలు సయితం ఆగి ఉన్నాయి. ఇక్కడే మనకు టెన్షను మొదలవుతుంది. ప్రయాణం అరగంటపాటే అయినా వంద మందిని తీసుకువెళ్ళే సామర్థ్యం ఉన్న ఒక్కొక్క బోటూ ప్రయాణీకులతో నిండే వరకూ బయలుదేరదు. మన వరకే చిన్న సైజు మర పడవ మాట్లాడుకోవచ్చు గానీ ఇందులో మోసానికి ఆస్కారమెక్కువ. మనం మాట్లాడుకున్న వ్యక్తి నిజాయితీ పరుడైతే ఫరవాలేదు, లేకుంటే మనకోసమని ఒప్పుకుని, డబ్బు ముందే తీసుకుని కూడా వేరే ప్రయాణీకుల కోసం చూస్తాడు. ఈ లోగా పెద్ద బోటు బయలేదేరుతుంది. రెంటికీ చెడిన వారమవుతాము. అందుచేత కొంత సాహసానికి సిద్ధపడి పెద్దబోటులోనే ఎక్కాం. త్వరగానే బయలు దేరింది. సముద్ర ప్రయాణం ఆహ్లాదంగా ఉంటుంది. ముఖ్యంగా అసంఖ్యాకంగా ఉండే సముద్ర నీటికొంగల సందడి. బోటులో నున్న

ప్రయాణీకులు విసిరే ఆహారపు గింజలను నీటిలో పడేలోపు గాలిలోనే అవి ముక్కుతో అందిపుచ్చుకుంటూ చేసే విన్యాసాలు విచిత్రంగా ఉంటాయి. వాటి రెక్కల చప్పుడు మనం ప్రయాణించే బోటు ఇంజను శబ్దాన్ని మింగేస్తుంది.

అవతల ఒడ్డుకు చేరాక ప్రధాన మందిరాలు ఆలయాలు ఉన్న చోటికి కిలోమీటరు పైనే నడవాలి. అలాగే వెళ్లాం. కానీ తిరిగి ఒడ్డుకు చేరి సకాలంలో స్టేషనుకు చేరాలనే ఆత్రుతలో ఏదీ సరిగా చూడలేక పోయాము. పైగా మేము వెళ్ళిన సమయానికి, అంతరంగ సేవల నిమిత్తం ప్రధాన ఆలయాలు మూసిఉన్నాయి. కొంచెం సేపు నిరీక్షించి శ్రీకృష్ణుని దర్శనం మాత్రం చేసుకుని బయలుదేరి తిరిగి తీరం చేరాము.

**గృహోన్ముఖం**

పన్నెండు గంటలకు ఒఖా స్టేషనుకు చేరి వాహనాన్ని విడుదల చేశాం. నిర్ణీత సమయానికి రైలు బయలుదేరి సాయంత్రం అయిదు గంటలకు రాజ్ కోట్ చేర్చింది. స్టేషనులోనే రైల్వే విశ్రాంతి గది తీసుకున్నాము. దగ్గరలో ఎక్కడా పరిశుభ్రమైన భోజన హోటలే లేదు. స్టేషను ఎదురుగా ఏవో హోటళ్ళున్నాయి కానీ, వాటి వంటశాలలన్నీ రోడ్డు మీదే. అంతా దుమ్ము ధూళి మయం. స్టేషను రెస్టారెంటులోనే దొరికినదేదో తిని పడకలేశాం. అసలే రైల్వే స్టేషను. ప్రతి నిముషం రెండు నిముషాలకూ రైలు ఇంజనులు ఘీంకరిస్తుంటే నిద్ర ఏం పడుతుంది! ఎందుకైనా మంచిదని నాలుగు గంటలకు అలారం పెట్టుకుని అలాగే లేచి స్నానాలుకూడా చేసి ప్లాటుఫారం మీదకు దిగాం.

17017 నెంబరు రాజ్కోట్ సికిందరాబాదు ఎక్స్ ప్రెస్ 28వ తేదీ గురువారం నిర్ణీత సమయం అయిదు గంటలకు బయలుదేరి ముప్ఫయి ఒక్క గంటల సుదీర్ఘ ప్రయాణం తరువాత మరునాడు 29వ తేదీ శుక్రవారం ఉదయం

పదకొండు గంటలకు సికిందరాబాదు చేరింది. పన్నెండున్నరకు స్వగృహం చేరాము.

ఈ యాత్రతో ఏడు జ్యోతిర్లింగాల దర్శనం లభించింది. ఆరోగ్యపరంగా తీవ్ర సమస్యలు ఎదురైనప్పటికీ, సంకల్పబలంతోనూ, భగవంతుని దయవల్లా మొత్తానికి మరొక యాత్ర విజయవంతంగా ముగించాము. ఇంటికి చేరుకున్న రోజు సాయంత్రమే డాక్టరును సంప్రదించాం. అనేక సందర్శనలు, పరీక్షల తరువాత కూడా రోగనిర్ధారణ కాలేదు. ఔషధసేవనం తాత్కాలిక ఉపశమనానికి మాత్రమే ఉపయోగ పడింది. చివరకు ఆ జబ్బు 'సయాటిక' అని నిర్ధారణ అవటంతో అందుకు తగిన వైద్యం ప్రారంభించటం జరిగింది. కాళ్ళు, కీళ్ళ వాపులు, భరింపరాని నొప్పులతో కొన్నిసార్లు సాధారణ నడక సైతం సాధ్యంకాని పరిస్థితి ఈ వ్యాధి లక్షణం. పైగా ఒక దశలో నున్న స్థితి మరో క్షణం ఉండదు. అలా రెండు నెలలు గడవగా పరిస్థితి క్రమంగా మెరుగు పడసాగింది. ఇంకా అయిదు జ్యోతిర్లింగాల దర్శనం మిగిలే ఉందిగా!

ఓంకారేశ్వర్ వద్ద నర్మదా నది దృశ్యం

అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా,హిమాలయోనామ నగాధిరాజః
పూర్వాపరౌ వారినిధీ విగాహ్య స్థితః పృథివ్యా ఇవ మాన

*(కాళిదాసు కుమార సంభవం)*

*'ధవళ శోభ'* **నీలకంఠ శిఖరం**

# అయిదవ అధ్యాయం

**తదుపరి యాత్ర**

తలపెట్టిన బృహత్యాత్రపై మళ్ళీ ఉత్సాహం నెలకొంది. అందులో ముఖ్యమైనది అతి దుర్లభమైనది కేదార్ జ్యోతిర్లింగయాత్ర. సాధారణంగా ఈ యాత్ర చేయదలచినవారు, కేవలం కేదార్ తోనే సరిపుచ్చరు. ' చార్ ధాం' అని పిలువబడే ఈ యాత్రలో గంగోత్రి, యమునోత్రి, బదరీనాథ్ కూడా తప్పనిసరిగా ఉంటాయి. వీటిలో,యమునోత్రి (12 కి.మీ) కేదార్ (14 కి.మీ) నడకతో కూడిన యాత్రలు మరీ దుర్లభమైనవి. అటువంటి ఈ 'చార్ ధాం' యాత్ర, పూర్తి ఆరోగ్యం లేకుండా చేయటం ఎంతటి ధైర్యస్తుడికయినా సాహసమే. ఏదయినా జరుగరానిది జరిగితే అందుకు పూర్తి బాధ్యత నాదే అవుతుంది. అయితే ఇంతటి సుదీర్ఘ యాత్ర అనుకున్నదే తడవుగా చేపట్టటం సాధ్యపడదు కదా! కనీసం మూడు నెలల వ్యవధి తప్పనిసరి. అప్పటికి పరిస్థితులు అనుకూలించక పోతాయా అన్న విశ్వాసంతో ప్రతిపాదనలను కుటుంబ సభ్యుల ముందు, వారి ఆమోదం కోసం ఉంచాను. మా కుటుంబ సభ్యులంటే, హైదరాబాదులో ఉండే మా ఇద్దరు కుమార్తెలు, ముంబైలో ఉండే కుమారుడు, కోడలు. వీరు నవదంపతులు. మొదటిగా సముచితమైన సలహా ఇచ్చింది మా కోడలు లక్ష్మి. ఆమె సలహా మేరకు 'చార్ ధాం' లేదా 'చతుర్ధామ' యాత్రగా పిలువబడే గంగోత్రి, యమునోత్రి, కేదార్ నాథ్, బదరీనాథ్ ల నుంచి గంగోత్రి, యమునోత్రిలను మినహాయించి కేదార్ నాథ్, బదరీనాథ్ లకు పరిమితంచేసాను. మిగిలిన వారు కూడా ఈ సూచనను హర్షించి మాకు అవసరమైన మనోధైర్యాన్ని కల్పించారు. తదుపరి, మా కుమారుడు కోడలు కూడా మాతో రావటానికి నిశ్చయించుకున్నారు. ఈ సమాచారాన్ని అందుకున్న హైదరాబాదులోనే ఉండే వారి ఆప్తమిత్రుడు

రవిశంకర్ అతని అర్ధాంగి సుప్రియ కూడా తేదీల అనుకూలతకు లోబడి మాతో చేరటానికి ఉత్సాహం చూపారు. ఇంకేం కావాలి? రెట్టించిన ఉత్సాహంతో మొత్తం ఆరుగురు సభ్యుల బృందానికి యాత్రా ప్రణాళిక రూపొందించటంలో నిమగ్నమయ్యాను. తేదీలు నిర్ణయించే విషయమై మా కోడలు కుమారుడు, అంతకు మునుపే నాకు స్వేచ్ఛనీయగా రవి, సుప్రియలు జూన్ 20వ తేదీ నుంచి జూలై 3 వరకు వారికి అనువుగా ఉంటుందని తెలిపారు. కోడలు, కుమారుడు కూడా హైదరాబాదుకు చేరుకొని అందరమూ కలిసే బయలుదేరదామని మొదట అనుకున్నాం. కానీ అంత ముందుగా వారు ఆ అవకాశాన్ని నిర్ధారించలేకపోవటంతో, వారిద్దరికీ ముంబైనుంచి, రాజధాని ఎక్స్ ప్రెస్ లో డిల్లీకి, హైదరాబాదునుంచి వెళ్ళే మా నలుగురికి, సికిందరాబాదునుంచి ఆ మధ్య కొత్తగా ప్రారంభింపబడిన నాన్ స్టాప్ ఎక్స్ ప్రెస్, 'దురోంతో' (Duronto)లో నిజాముద్దీన్ కి, తిరిగి డిల్లీ నుంచి హరిద్వార్ వెళ్ళటానికి డెహ్రాడూన్ జన శతాబ్ది ఎక్స్ ప్రెస్ లో మొత్తం ఆరుగురికి , వారానికి రెండు రోజులే నడిచే దురోంతో అందుకోవటానికి జూలై 2 తేదీ శుక్రవారానికి డిల్లీ చేరేవిధంగా తిరుగుప్రయాణానికి అవే రైళ్ళలో అదే క్రమంలో రిజర్వేషన్లు చేశాను.

ఆ తరువాత, యాత్రపై సమగ్రమైన అవగాహనకోసం, అంతకు ముందు చేసిన యాత్రలలో, ముఖ్యంగా కాశీలో, ఈ తీర్థ యాత్రలపై సేకరించిన సీడీల వీక్షణతోపాటు, ఇంటర్నెట్ ద్వారా ఆయా ప్రదేశాల నైసర్గిక స్వరూపం, దూరాలు, యాత్రకు అనుకూలమైన కాలం, వాతావరణం మొదలైన వాటిపై పరిశీలన చేసి కొంత సమాచారం సేకరించాను. అయినప్పటికీ అంతకుముందు ఈ యాత్ర చేసియున్న వారి అనుభవాలతో కూడిన సమాచారం ఇంకా ఉపయుక్తంగా ఉంటుందన్న

ఆలోచనతో ఆ దిశగా ప్రయత్నం సాగించాను. ఈ క్రమంలో, ఒక్క మానస సరోవర్ తప్ప అమరనాథ్ తో సహా అన్ని యాత్రలూ చేసిన మా కుటుంబ ఆప్తమిత్రులు శ్రీమాన్ శ్రీమత్తిరుమల వాసుదేవాచార్యులుగారు తమ అనుభవాల నుంచి విశేషమైన సమాచారాన్ని అందించారు. ముఖ్యంగా వారి మాతామహులు 1952 సంవత్సరంలో చేసిన బదరీ యాత్ర విశేషాలు వ్రాసుకున్న సంపుటాన్ని చూసి అప్రతిభుడినే అయినాను. ఆరోజుల్లో ఆమె ఆ యాత్ర చెయ్యడమూ, దానికి తానే స్వయంగా అక్షరరూపం ఇవ్వడమూ ఒక ఎత్తయితే అప్పటికి కేవలం నెలల శిశువైన శ్రీ ఆచార్యుల వారు దానిని ఇప్పటి వరకూ రక్షించుకుంటూ, నా లాంటి వారికి దర్శన భాగ్యం కల్పించడమూ మరొక ఎత్తు.

శ్రీ ధర్మవరపు బుచ్చిపాపరాజుగారు 2008లో ఈ యాత్ర చేసి రచించి, స్వయంగా ప్రచురించిన గ్రంథం ద్వారానూ, వారి ముఖతఃనూ మంచి సమాచారం లభించింది. యాత్ర పూర్తయిన తరువాత నేనున్నూ అటువంటి గ్రంథం వ్రాయాలని వారు ఆకాంక్షించటమేకాక తమ గ్రంథం తదుపరి ముద్రణ నిమిత్తమై కొన్ని ఫోటోలు కావాలని కూడా కోరారు. మా యాత్ర ప్రారంభానికి కేవలం కొద్ది రోజులముందే వీరు పరమపదించటం, యాత్ర పూర్తి అయిన పిదప, నా అనుభవాలను వారితో పంచుకునే అవకాశం లేకపోవడం పెద్ద విషాదం.

'అంబే' కంపెనీ వారి 'నాలుగు క్షేత్రాలయాత్ర' వీడియో, శ్రీ మైధిలీ వెంకటేశ్వరరావుగారి 'జ్యోతిర్లింగదర్శిని', వీరిదే ప్రత్యేకంగా 'హరిద్వార్, రిషికేశ్, కేదార్ నాథ్, బదరీనాథ్ క్షేత్రాలదర్శిని' గ్రంథాలు ఉపయుక్తంగా ఉన్నాయి. ఇవిగాక, అంతకు ముందు కేవలం ఆరు మాసాల క్రితమే తొమ్మిది మంది సభ్యుల బంధుకుటుంబాల బృందంతో ఈ యాత్ర చేసేన వేదమూర్తులు డాక్టర్

రేమెళ్ల అవధానులు (వీరు శ్రీ వేదభారతి సంస్థ వ్యవస్థాపకులు. 'భక్తి' టీవీ ఛానెల్ లో 'వేదగణితం', తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్లో 'వేదవిజ్ఞానం' కార్యక్రమాలద్వారా సుపరిచితులు, సుప్రసిద్ధులు) గారి అముద్రితగ్రంథం 'మా చతుర్ధామ యాత్ర' విశేషంగా ఉపయోగపడ్డాయి.

కేవలం సమాచారం సేకరించడమేకాక, ఆ గ్రంథంలో వారు ప్రస్తావించిన అనేక యాత్రాస్థలాలు, ధామాలు, సంగమాల (ప్రయాగలు) పై, వాటి వాటి పౌరాణిక, ఆధ్యాత్మిక వైశిష్ట్యాలపై వారి నుంచి స్వయంగా అనేక విషయాలు గ్రహించాను. ఆవిధంగా సేకరించిన సమాచారాన్ని ఆధారం చేసుకుని, హరిద్వారు వరకూ చేయగలిగిన రైలు ప్రయాణం మినహాయిస్తే, రోడ్డు మార్గంలో హరిద్వార్ నుంచి బయలుదేరి తిరిగి హరిద్వార్ చేరేవరకు అందుబాటులో ఉన్న మొత్తం పదకొండు రోజులకు, రోజువారీగా ప్రణాళిక తయారుచేసి

(1) తప్పని సరిగా దర్శించవలసిన క్షేత్రాలు, ప్రదేశాలు

(2) సమయానుకూలంగా చూడవలసిన ప్రదేశాలు,

(3) సమయాభావంతో విస్మరించదగినవి

గాను వర్గీకరించి కంప్యూటర్ లో నిక్షిప్తం చేసాను.

ఆ సమయంలో కిరణ్, 'గూగుల్ వేవ్' (Google wave) అనే సందర్భానికి తగిన ఒక అంతర్జాలాధారిత (Internet-based) వ్యవస్థ నొక దానిని ఏర్పాటు చేసాడు. దీని ద్వారా ఎంతమందైనా ఏదైనా సమాచారాన్ని ఒకే సమయంలో సమిష్టిగా కాని, వ్యక్తిగత పరస్పరంకాని సమాంతరంగా పంచుకోవచ్చు. సమాచార అంతరానికి, నిర్ణయ ప్రక్రియలో జాప్యానికి తావులేనటువంటి ముఖ్యమైన వ్యవహారాలలో ఇది ఎంతో విప్లవాత్మకమైన సదుపాయంగా చెప్పుకోవచ్చు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని,

ప్రణాళికలో మార్పులు చేర్పులు చేయటానికి గాను తగు సూచనలు చేయవలసినదిగా బృందంలో మిగతా సభ్యులందరినీ కోరగా, ఆ క్రమంలో కిరణ్, లక్ష్మిలు కేదార్ నాథ్ నుంచి 8 కి.మీ దూరంలో నున్న 'వాసుకీ తల్' అనే ప్రదేశాన్ని, బదరీ మార్గంలో నున్న గోవింద ఘాట్ నుండి 20 కి మీ దూరంలో హిమాలయ పర్వత సానువుల్లో నున్న సహజ 'పుష్పవన లోయ' (Valley of Flowers)ను ప్రణాళికలో చేర్చవలిసినదిగా సూచించారు. అలాగే, రవి సుప్రియలు కూడా ప్రధానమైన తీర్థయాత్రా క్రమానికి భంగం కలుగని విధంగా జోషిమట్ వద్ద ఆసియాలోకెల్లా అత్యంత పొడవైన రోప్ వే (Cable Car Ride) లో విహారానికి వీలు కల్పించ వలసినిదిగా కోరారు. ఈ సూచనలన్నిటిని మన్నిస్తూ వారి వారి కోరికల మేరకు ప్రణాళికను సవరించి సమగ్రంగా తయారు చేసాను. ఒకవైపు ఇదంతా చేస్తూనే మరొకవైపు జయలక్ష్మికి వైద్య పరీక్షలు, ఔషధ సేవనం, క్రమం తప్పకుండా కొనసాగించడంతో పాటు దైనందిన కార్యక్రమాల నుండి తగినంత విశ్రాంతి కల్పించటంతో ఆరోగ్యంలో గణనీయమైన మెరుగుదల కనిపించ సాగింది.

## ఏర్పాట్లలోసభ్యుల పాత్ర

పెద్ద బృందాలతో వృత్తిపరంగా యాత్రలు నిర్వహించేవారు, భోజన, రవాణా సౌకర్యాలకు మాత్రమే బాధ్యత వహిస్తారు. ముఖ్యమైన వసతితో సహా మిగతా అన్ని ఏర్పాట్లు యాత్రికులే స్వయంగా చేసుకోవలసి ఉంటుంది. ఈ విషయంలో యాత్ర నిర్వాహకుల ప్రమేయంకానీ సహాయం కానీ నామమాత్రం. ఒకే కుటుంబం మొత్తంగా ఆ యాత్రా బృందంలో ఉంటే వీటన్నిటికీ ఆ కుటుంబపెద్ద బాధ్యత వహిస్తాడు. అయితే మావలె స్వీయ బృందంగా వెళ్ళే సందర్భంలో ఎవరో ఒకరు మాత్రమే బాధ్యత తీసుకుని మిగతా వారు నిమిత్త

మాత్రులుగా ఉండే వీలులేదు. కేవలం ఆర్థికపరమైన విషయంలోనే కాక మిగతా అన్ని విషయాలలో కూడా అందరూ సమానంగా బాధ్యత వహించవలసి యుంటుంది.

ఇటువంటి యాత్రలలో కానీ, విహార పర్యటనలలో కానీ, వసతి సౌకర్యం అత్యంత ప్రధానమైనది. 'గర్వాల్ మండల్ వికాస్ నిగమ్ లిమిటెడ్' (GMVN) ఉత్తరాఖండ్ ప్రభుత్వ పర్యాటక అభివృద్ధి సంస్థ. ఈ సంస్థకు, మధ్య తరగతి నుంచి సంపన్నుల వరకు వివిధ వర్గాలకు, ఎవరి ఆర్థిక స్థోమతుకు తగినవిధంగా, వారికి అనుకూలంగా ఉండే విశ్రాంతి గృహాలు ఆ రాష్ట్రమంతటా విస్తారంగా ఉన్నాయి. అద్దె విషయానికి వస్తే, ఈ వసతి గృహాలలో మధ్యతరగతి 'ఎకానమీ' గదికి రోజుకు రు.800. ఇదే వసతికి ప్రైవేటు హోటళ్ళలో వెయ్యి రూపాయలకు పైనే ఉంటుంది. చిన్న లాడ్జీలలో రు. 500కు వసతి లభిస్తుంది కానీ వాటిల్లో కంటే వైశాల్యం, గాలి, వెలుతురూ, పరిశుభ్రత, ఇతర సౌకర్యాల విషయంలోఈ గెస్టుహౌసులు ఎంతో మెరుగ్గా ఉంటాయి. విస్తృతంగా వసతి గృహాలు నిర్వహించే ఇటువంటి, అందునా ప్రభుత్వ రంగానికి చెందిన ఒకే ప్రముఖ సంస్థ ద్వారా, ముందే వసతి నిర్ధారించుకున్నందువల్ల చేరిన ప్రతి ప్రదేశంలోనూ బస వెతుక్కొనే శ్రమ, సమయం మిగులుతాయి. అన్ని విశ్రాంతిగృహాల్లోనూ రెస్టారెంట్లు అనుబంధంగా ఉంటాయి కనుక, ప్రత్యేకించి ఏదయినా ప్రదేశంలో ఫలానాచోట భోజనం చేద్దామని ముందే నిశ్చయించుకుంటే తప్ప భోజన, పానీయాలకు వేరే హోటళ్ళు వెదుక్కుంటూ వెళ్ళే అవసరం ఉండదు. వీటిలో పనిచేసే సిబ్బంది ఆ రంగానికి సంబంధించిన విద్యార్హతలు కలిగి ఉండటమే కాక సుశిక్షితులు, అనుభవజ్ఞులు కూడా అయి ఉండటంచేత వృత్తి నైపుణ్యం కలిగి

ఉంటారు. అత్యుత్తమ నిర్వహణాసామర్థ్యంతో, బాధ్యతాయుతమైన పర్యవేక్షణలో యాత్రికులకు గౌరవ మర్యాదలతో ఆతిథ్యమిస్తారు.

ఈ ప్రయోజనాలన్నీ దృష్టిలో నుంచుకుని కిరణ్, ముంబై నుండే ఈ సంస్థ ద్వారా, మేము బసచేయవలసిన అన్ని ప్రదేశాలలోను, ఏ అనూహ్యమైన కారణం చేతనైనా ఆ సమయానికి బస నిర్ధారించుకున్న ప్రదేశానికి నిర్ణయించుకున్న సమయానికి చేరలేకపోతే ముందు జాగ్రత్తగా కొన్ని ప్రత్యామ్నాయ గెస్టుహౌసు ప్రదేశాలలో సయితం, అవసరం లేని సందర్భంలో రద్దు చేయించుకునే వెసులుబాటు ఉంచుకుని అదనంగా గదులు రిజర్వు చేయించాడు. (ఇక నుంచీ ఈ వసతి గృహాల ప్రసక్తి ఎప్పుడు వచ్చినా క్లుప్తంగా 'నిగం' గెస్టు హౌసు అని పేర్కొంటాను).

ఇక పర్వతాలను అధిరోహించటానికి అవసరమైనవి ప్రత్యేక దుస్తులు ఇతర వస్తువులు. ఉదాహరణకు తాము రోజూ ధరించే చీరల బదులు, డ్రస్సులు, చెప్పుల బదులు కాన్వాస్ బూట్లు మొదలైనవన్న మాట. దక్షిణ భారత సాంప్రదాయ కుటుంబాల వారు, మరీ ముఖ్యంగా మహిళలు తమ దైనందిన జీవితంలో ఇవి వాడరు. అయినా ఈ యాత్రకు ఇవి తప్పనిసరి. బృందం మొత్తానికి అవసరమైన వీటి సమీకరణ చేపట్టింది మా కోడలు లక్ష్మి. ఈమె ఔత్సాహిక పర్వతారోహకురాలు కూడా. ఇంతకు పూర్వమే, ఆఫ్రికా ఖండం, టాంజానియాలోని ప్రసిద్ధ పర్వతశ్రేణిలోని 'కిల్మింజారో' శిఖరారోహణచేసిన అనుభవం ఆమెకుంది. రవిశంకర్ తన వంతుగా బృందంలోని అందరినీ శారీరకంగా ఆరోగ్యపరంగా సదా సన్నద్ధంగా ఉంచటానికీ, అనుకోకుండా ఎదురయ్యే ఆరోగ్య అవరోధాలను అధిగమించేందుకు అవసరమైన మందులు అందుబాటులో నుంచే పని చేపట్టాడు. ఇక అతని భార్య సుప్రియ, మొత్తం యాత్రకు ఆర్థిక వ్యవహారాల

నిర్వాహకురాలు. అంతవరకూ ఎవరెవరు ఏ ఏ పద్దు క్రింద ఎంతెంత ఖర్చు చేసినదీ ఆమెకు 'గూగుల్ వేవ్' ద్వారా తెలియజేయటం తోనే ఆమె పాత్ర మొదలైందన్నమాట నా మటుకు నేను మొత్తం కార్యక్రమ రూపకల్పన చేయటంతో పాటు రైల్వే రిజర్వేషన్లు చేసాను.

ఈ సందర్భంలో ఒక విషయం ప్రస్తావనార్హం. సుదీర్ఘమైన యాత్రలకు సంబంధించి రైలు ప్రయాణాలకు ముందస్తుగా టిక్కెట్లు రిజర్వేషను చేసుకోవలసి ఉంటుంది. సాంకేతిక విజ్ఞానం అతి వేగంగా వర్ధిల్లుతున్న ఈ రోజుల్లో ఏ రోజుకైనా, ఏ రైలులోనైనా, దేశంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఇంట్లో కూర్చునే ఆన్ లైనులో ప్రయాణపు టిక్కెట్లు పొందగలిగే సౌకర్యం ఉంది. అయితే దీనికి పరిమితులున్నాయి. ముఖ్యంగా అవి కేవలం క్రెడిట్ కార్డు ద్వారాగానీ ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారాగానీ మాత్రమే పొందగలిగే అవకాశం ఉంటుంది. ఆ క్రెడిట్ కార్డు నాకు లేదు. ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా చేసుకోవచ్చు. కానీ టిక్కెట్లు పొందిన పిదప, ప్రయాణంలో మార్పు చేసుకున్న సందర్భంలోనూ, లేదా మరే ఇతర కారణాల వల్లనైతేనేమీ కొన్న టిక్కెట్లు రద్దు చేసుకోవలసి వస్తే, చెల్లించిన సొమ్ము తిరిగి రాబట్టుకోవటానికి చాలా సమయం పట్టటమే కాక అది అందేవరకూ క్రమం తప్పకుండా పర్యవేక్షించుతూ ఉండాలి. మరీ ముఖ్యంగా సర్క్యులర్ టికెట్ తీసుకున్నందువల్ల టికెటు నిజ రుసుములో లభించే రాయితీ, ఆ టికెట్టు వినియోగించుకోవటానికి గడువు పరంగా లభించే స్వేచ్ఛ వంటి ప్రయోజనాలు ఈ తరహా బుకింగులకు వర్తించవు. ఎటొచ్చీ ఒక్క 'సీనియర్ సిటిజెన్' రాయితీలో మాత్రమే ఏ మార్పూ ఉండదు.

ఈ సంక్లిష్టతలనుంచి విముక్తికోసమై నేను రైల్వే రిజర్వేషను కార్యాలయంపైనే ఆధార పడతాను. ఇంతకు మునుపు చేసిన యాత్రలలో

వృత్తాకార దిశగా చేసిన అన్ని ప్రయాణాల్లోనూ కనిష్టంగా నాలుగు నుంచి అత్యధికంగా ఎనిమిది రైలు ప్రయాణాలు ఉన్నాయి. రెండు వారాలపాటు వివిధ రైల్వే మండలాల్లో సాగే ఈ ప్రయాణాలకు సంబంధించి అన్ని రైల్వేగైడులు మనకు అందుబాటులో ఉండవు. ఆలిండియా గైడు ఉంటుంది గానీ అవసరాన్ని అది సంపూర్ణంగా తీర్చజాలదు. ముఖ్యంగా రెండు ప్రదేశాల మధ్య ఒకటి కంటే ఎక్కువ రైలు మార్గాలు, ఆయా మార్గాల్లో రోజూ నడిచేవి కాకుండా వారంలో కొన్ని రోజులు నడిచేవి, కొన్ని సందర్భాలలో ప్రత్యేక రైళ్ళు ఉన్నప్పుడు రైల్వే సిబ్బంది మాత్రమే మనకు అనుకూలమైన రైలునిగాని, మార్గాన్నిగానీ సూచించగలరు తద్వారా ఆయా ప్రదేశాల్లో గడపవలసిన అవసరాలను బట్టి అనుకూలమైన రైలును, సమయాన్ని ఎంచుకునే వీలుంటుంది.

ఈ విషయంలో నాకు స్వయంగా అత్యుత్తమ సేవలు అందించిన, ఇంకా అందిస్తూ ఉన్నవారు శ్రీ పంచాగం చలపతిబాబు గారు. ప్రయాణీకుల అవసరాల పట్ల అంకితభావంతో, తన విధులపట్ల నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులలో వారిని ముందుగా పేర్కొనవలసి ఉంటుంది.

కేవలం ఒక ప్రభుత్వోద్యోగి తన విధులను తాను నిర్వర్తిస్తుంటే ఇంత ప్రశస్తి అవసరమా అనే సందేహం కలుగవచ్చు. అది సహజం కూడా. అయితే ఎవరైనా ఈ విషయమై రైల్వే రిజర్వేషను కార్యాలయాలకు ఏదో ఒక ప్రయాణానికి కాక ముఖ్యంగా ఇటువంటి సుదీర్ఘ యాత్రలకు సంబంధించిన సందర్భాలలో రిజర్వేషను కార్యాలయానికి వెళ్ళినపుడు తమకు ఎదురైన అనుభవాలను జ్ఞప్తికి తెచ్చుకుంటే ఒక సాధారణ ఉద్యోగి విషయమై ఈ ప్రస్తావన ఎందుకు అవసరమో బోధపడుతుంది. ఈ గ్రంథంలోనే మరొక అధ్యాయంలో వేరొక ప్రభుత్వరంగ సంస్థ (BSNL) సిబ్బంది యొక్క బాధ్యతా

రహిత, నిర్లక్ష్య వైఖరివల్ల నేను పొందిన అసౌకర్యం గమనార్హం. వారు కూడా బాధ్యత గల ఉద్యోగులే కదా. ఆ సందర్భాన్ని అంత విస్తృతంగా ప్రస్తావించి ఈ ప్రశంశను ప్రస్తావించకపోవటం నా సంస్కారాన్ని ఏ విధంగానూ ఇనుమడింప జేయదు గదా!

అందుచేత, ఈ సందర్భంగా వారు చేస్తున్న సేవలను, ఈ కార్యాలయాలకు కార్యార్థులై వచ్చే పౌరులు తాము పొందిన సేవకు, అది అందించిన ఆ ఉద్యోగి పట్ల కృతజ్ఞులై ఉండవలసిన అవసరాన్ని ఈ ప్రస్తావన ద్వారా చెప్పదలచుకున్నాను. ఇంకా అనేకమంది నాలాంటి ప్రయాణీకులకు శ్రీ చలపతిబాబుగారు ఇలాగే సేవలు అందిస్తూ, అనేక పదోన్నతులు పొంది, విధి నిర్వహణలో తన తోటి ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగానూ, ఆదర్శవంతంగానూ ఉండాలని, తమ ఉన్నతాధికారుల నుంచి కూడా ప్రశంశలు పొందాలని ఆ విధంగా వారిని సంపూర్ణంగా అనుగ్రహించాలని ఆ సర్వేశ్వరుని ప్రార్థిస్తున్నాను.

**సన్నాహక యాత్ర**

అనుకున్న తేదీ రానే వచ్చింది. జూన్ 20వ తేదీన మేము నలుగురం సికింద్రాబాద్ స్టేషను నుండి మధ్యాహ్నం గం. 1.30 ని.లకు 'దురోంతో' ఎక్స్ ప్రెసులో బయలుదేరగా అదేరోజు సాయంత్రం గం 4.40 ని.లకు కిరణ్, లక్ష్మిలు ముంబై సెంట్రల్ నుండి రాజధాని ఎక్స్ ప్రెసులో బయలుదేరారు. 21వ తేదీ ఉదయం న్యూఢిల్లీలో వారే ముందుగా దిగారు. మధ్యాహ్నం గం.3.25 ని.లకు న్యూఢిల్లీ నుంచి జన్ శతాబ్దిలో హరిద్వారుకి బయలుదేరాలి పూర్తి రోజంతా కాకపోయినా ఢిల్లీలో గడపవలసిన సమయం గణనీయంగానే ఉంది. అందుచేత ఉదయమే ఢిల్లీ చేరుకున్న వారు, ముందుగా చేసుకున్న ఏర్పాటు మేరకు, కిరణ్ సహాధ్యాయి, రవికి కూడా మిత్రుడు, దక్షణ ఢిల్లీలోని

వసంత్ కుంజ్ లో నివాసముండే మాధవరావు ఇంటికి చేరుకున్నారు. గం.10.35 ని.లకు నిజాముద్దీన్ చేరుకున్న మేము కూడా వారింటికి చేరాము. మాధవరావు అతని గృహిణి నందితల ఆతిథ్యాన్ని స్వీకరించి తిరిగి న్యూఢిల్లీ స్టేషను నుంచి బయలుదేరి రాత్రి గం.7.30 ని.లకు హరిద్వారు చేరాము. ఉదయం, సాయంత్రం గంగామాతకు హారతి కార్యక్రమాలు నిర్వహింపబడే ప్రధాన ప్రదేశం 'హరి-కి-పౌడి' అనే ప్రాంతంలోనే మేము రూములు బుక్ చేసుకున్న రాజ్ డీలక్స్ హోటలు ఉంది. (2008లో మొట్టమొదటి సారి మేము హరిద్వారు వెళ్ళినపుడు కూడా ఇదే హోటలులో ఉన్నాము) మేము చేరినది ఆ హారతి ముగిసే సమయం కావడంతో యాత్రికులతో రద్దీ ఎక్కువగా ఉంటుంది కనుక ఆ సమయంలో, ఆ మార్గంలో ఏ విధమయిన మోటారు వాహనాలను అనుమతించరట. అయితే, కాకతాళీయంగా, స్టేషన్ నుంచి ఆ హోటలు నడవగలిగినంత దూరంలో మాత్రమే ఉండటంతో ఒక రిక్షాలో సామాను, మరో దాంట్లో జయలక్ష్మిని మరికొంత సామాను ఎక్కించి, మిగతా అందరం నడకతో అనుసరించాము. రూముల్లో స్థిరపడ్డాక, బయటకు వెళ్లి అల్పాహారాలు చేసి తిరిగి రూములకు చేరుకున్నాము. అదే హోటలులో నున్న ట్రావెల్ డెస్క్ ద్వారానే కిరణ్ వాహనం బుక్ చేసి ఉన్నాడు. నిగం సంస్థ కూడా వాహనాలను సమకూరుస్తుంది కాని, రుసుములో భారీ వ్యత్యాసం వల్ల ప్రయివేటు ట్రావెల్సును ఆశ్రయించ వలసివచ్చింది. సంబంధిత వ్యక్తితో మాట్లాడి మరునాడు ఉదయం గం.8.00 లకు బయలుదేరుదామని నిర్ణయించాము.

**ప్రధానయాత్ర**

జూన్ 22. ఉదయమే స్నానాదికాలు ముగించుకుని రూములు ఖాళీచేసి ఎనిమిదింటికల్లా సిద్ధంగాఉన్న వాహనంలో భగవన్నామ స్మరణతో

బయలుదేరాము. అరగంట ప్రయాణించిన తరువాత రిషికేశ్ కు కొంచెం ముందుగా రోడ్డు ప్రక్కనే ఉన్న ధాభాలో అల్పాహారాలు స్వీకరించాం.

పదార్థాలు అంత గొప్పగా లేవు. అలా ఉండాలని ఆశించలేము కూడా. అసలు మనకి అనువైన పదార్థాలే లేవు. పరాటాలు, నంజుకోటానికిగాను వివిధ కూరగాయలతో చేసిన 'అచార్' (ఊరగాయ). అంతే. సరే! తిరిగి ప్రయాణం కొనసాగిస్తున్న కొద్దీ మనం ప్రయాణిస్తున్న ఎత్తు పెరగటం స్పష్టంగా తెలుస్తున్నది. కిలోమీటర్ల తరబడి పూర్తిగా ఘాట్ రోడ్డే. సమతల ప్రాంతమే కనబడదు. కారు కిటికీల్లోంచి చూస్తూ ఉంటే, మార్గానికి ఒక వైపు ఇంకా ఎత్తైన పర్వతాలు, మరోవైపు లోయలు. ఆ లోయల అడుగున నిరంతరం ఏదో ఒక నది. లోయలకు ఆవలి వైపున కొండలపై మనం ప్రయాణించి వచ్చిన లేదా ప్రయాణించబోయే ఘాట్ రోడ్డు. వాటిమీద పిల్లలు ఆడుకునే కార్ల పరిమాణంలో చీమల బారుల్లాగా చిన్నవి పెద్దవి రకరకాల వాహనాలు. ఏమి అద్భుత దృశ్యాలు! ఒక్క క్షణం రెప్పవాల్చితే ఏ అనుభూతి కోల్పోతామోనన్నంత రమణీయత.

మొట్టమొదటి ప్రముఖ ప్రదేశం దేవప్రయాగ. ఇది భాగీరథి అలకనందల సంగమ స్థానం. ఆకుపచ్చ రంగులో భాగీరథి నీరు, స్వచమైన అలకనంద నీటిలో కలిసి అఖండ గంగా వాహినిగా ప్రస్థానం ప్రారంభించటం చూస్తాము. ఈ సంగమం మనం ప్రయాణిస్తున్న రోడ్డుకు చాలా దిగువలో ఉంటుంది. కాలిబాట వంటిదేదీ లేదు. అందుచేత సమీపించి నీరు తాకటానికి సాధ్యపడలేదు. అవతలి ఒడ్డున దేవప్రయాగ పట్టణం, అందులో స్నాన

ఘట్టాలు ఉన్నాయి. కానీ, అక్కడకు చేరుకోవటానికి చుట్టూ చాలాదూరం ప్రయాణించాలి.

శ్రీనగర్ పట్టణం ఇంకా పది కిలోమీటర్లు ఉందనగా ఓ రిసార్ట్ లోని రెస్టారెంటులో భోజనాలు చేసాము. ఈ యాత్ర మొత్తానికే అది అతి ఖరీదైన భోజనం. మా ఆరుగురికి ఒకరోజు మొత్తానికి అల్పాహార, భోజన పానీయాలకు అంచనా కేటాయింపు రు. 1800 కాగా ఈ ఒక్క బిల్లే రు. 1200/- అయింది. బిల్లుకట్టిన తరువాత అంత అవసరం లేదనిపించింది. అలా అని చవుకగా ఏది దొరికితే అది తినాలని కాదు. ప్రత్యేక సందర్భాలలో తప్ప కేవలం ఆకలి తీరటానికి మనం ప్రతిరోజూ స్టార్ హోటళ్లకు వెళ్ళం కదా! బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా ఖర్చులను సాధ్యమైనంతవరకు అదుపులో నుంచుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించుకున్నాం.

ప్రయాణంలో తరువాతి ప్రముఖ ప్రదేశం రుద్రప్రయాగ. మందాకినీ నది అలకనందలో సంగమించే ప్రదేశమిది. ఈ సంగమం కూడా కనువిందు చేస్తుంది. అలా ప్రయాణిస్తూ ప్రకృతి దృశ్యాల గురించి కబుర్లు చెప్పుకుంటూ 'అగస్త్యముని', 'కుండ్', 'గుప్తకాశి', 'ఫాటా'ల మీదుగా సాయంత్రం ఏడు గంటలకు గౌరికుండ్ చేరాము. ఒక గంట ముందే చేరుకోవలసియున్నా శ్రీనగర్ లో BSNL కార్యాలయంలో (ఆ కథ ఏమిటో ఇదే అధ్యాయంలో మరో సందర్భంలో తెలుసుకుంటారు) ఈ గంట కాలం వృధా అయింది.

కేదార్ నాథ్ వెళ్ళటానికి వాహనాలు ప్రయాణించదగిన మార్గం గౌరికుండు వద్ద ఆగిపోతుంది. అందువలన వాహనాన్ని అక్కడే వదలి వేయాలి. ఇలాంటి వాహనాల విశ్రమస్థానం గౌరీకుండుకు కొద్దిదూరం లోనే ప్రత్యేకంగా ఉంది. వాహనం దిగి సామాను దింపుకున్నాము. తిరుగు ప్రయాణానికి సిద్ధంగా ఉండవలసిన స్థానం, సమయం, డ్రైవర్ 'విపిన్' కు

వివరించింది లక్ష్మి. అతను సౌమ్యుడు, వినయశీలి. చెప్పిన వివరాలను శ్రద్ధగా గ్రహించి వీడ్కోలు తీసుకున్నాడు. గౌరికుండ్ మరొక గంటలో చేరతామనగా, కాలాతీతమైన మధ్యాహ్న భోజనం వల్లనో, ఎత్తులోకి వెళ్ళిన కారణంగా ప్రాణ వాయువు తగ్గుదలతో శరీరంలో కలిగిన మార్పుల వల్లనో నాకు స్వల్పంగా అస్వస్థత (Altitude sickness) కలిగింది. పర్యవసానంగా వాహనం దిగిన తరువాత వాంతి అయింది. వెంటనే రవి ఇచ్చిన మందులు వేసుకుని ఉపశమనం పొందాను. ఈలోగా కిరణ్, మేము బస చేయవలసిన నిగం గెస్టు హౌసును కనుక్కుని, సామానుకోసం ఒక పోర్టరుని జయలక్ష్మి కోసం ఒక డోలీ (ఈ వాహన వివరణ తరువాత పేజీలలో విపులంగా చూస్తారు) ని తీసుకువచ్చాడు. ఈ బస్టాండ్ నుంచి కేదార్ వెళ్ళే ప్రధాన ప్రదేశం (Trecking Take Off) సుమారు రెండు కిలో మీటర్లు ఉంటుంది. అక్కడే గుఱ్ఱాలు, డోలీలు పల్లకీలు బయలుదేరుతాయి. నడక కూడా అక్కడనుంచే ప్రారంభం అవుతుంది. ఆ ప్రదేశానికి వెళ్ళే మార్గం మధ్యలోనే ఒక కిలోమీటరు దూరంలో నిగం గెస్టుహౌసు ఉంది. సన్నటి వీధి. ఎత్తు పల్లాల దారి. అక్కడక్కడ మెట్లు, ఇరువైపులా దుకాణాలు, వాటిలో కొనుగోలుదార్ల సందడి, దాటుకుంటూ గెస్టుహౌసు చేరాము. ముందే బుక్ చేసుకున్న ఆధారాలు చూపించాక గదులు కేటాయించబడ్డాయి. ఉష్ణోగ్రత 10 డిగ్రీలు ఉంది. మన హైదరాబాద్ సగటు ప్రమాణంతో పోలిస్తే చలి ఎక్కువనే చెప్పాలి. ఎవరి రూముల్లో వారు స్థిరపడి కొద్దిసేపు సేద తీరిన పిదప గెస్టుహౌసుకు అనుబంధంగా ఉన్న రెస్టారెంటులో రోటీలు, భాజీలతో రాత్రి భోజనాలు తేలికగా ముగించి పది గంటల కల్లా ఆ రోజుకు స్వస్తి పలికాము.

జూన్ ఇరవైమూడో తేదీ. స్నానాదికాలు ముగించుకుని, అల్పాహారాలు పూర్తి చేసుకునేటప్పటికి ఉదయం తొమ్మిది గంటలయింది.

వర్షాన్ని, చలిని ఎదుర్కోనటానికి అవసరమైన దుస్తులు, ఆహార పదార్థాలు, నీటి బాటిళ్ళు ఎవరికివారు వెంటతీసుకువెళ్ళే వీలుగా బ్యాగుల్లో సర్దుకున్నాము. బృందం మొత్తానికి రెండు రాత్రుల బసకు సరిపడా దుస్తులు ఇతర అవసరమైన వస్తువులన్నీ వేరే బ్యాగుల్లో సర్ది పోర్టరుకు అప్పగించి, మిగతా సామానంతా గెస్టుహౌసువారి క్లోక్ రూములో భద్రపరచి పదిన్నర ప్రాంతంలో గుఱ్ఱాల స్టాండుకు చేరుకున్నాము. కొన్ని వందల గుఱ్ఱాలు, వాటిని నడిపేవారు, పల్లకీలు, డోలీలు మోసేవారు, వీటన్నిటినీ పర్యవేక్షించే కార్యాలయం, పైనుంచి వచ్చేవారు, వెళ్ళేవారు ఇలా ఆ ప్రదేశమంతా కోలాహలంగా ఉంది.

సముద్ర మట్టానికి గౌరికుండ్ 1982 మీటర్ల ఎత్తులో ఉండగా కేదార పర్వతశ్రేణిలో కేదారేశ్వరక్షేత్రం 3584 మీటర్ల ఎత్తులో ఉంది. పైకి వెళ్ళటానికి అయిదు పద్ధతులు ఉన్నాయి. అవి 1. నడక, 2. గుఱ్ఱాలు 3.పల్లకి, 4.డోలీ, 5. హెలికాప్టరు. ఏ పద్ధతిలో వెళ్ళినా గౌరికుండ్ నుంచే మొత్తం 1602 మీటర్ల ఎత్తు ఎక్కాలన్న మాట. ఈ రెండు ప్రదేశాల మధ్య నేరుగా ఆకాశ మార్గ దూరం (Nautical distance) అయిదు

కిలోమీటర్లు ఉంటుంది. భూ మార్గం ఏట వాలుగా పర్వతాలు దాటుతూ అనేక మలుపులు తిరుగుతూ ఉండటంతో ఈ దూరం పదిహేను కిలోమీటర్లు ఉంటుంది. ఎక్కవలసిన ఎత్తుకు ప్రయాణించవలసిన దూరం మధ్య నిష్పత్తి 1:9.36. అంటే సగటున ఒక మీటరు ఎత్తు ఎక్కటానికి 9.36 మీటర్లు ప్రయాణించాలన్నమాట మలుపులు కనిష్టంగా 6 డిగ్రీలు, గరిష్టంగా 45 డిగ్రీలతో సగటున 25.5 డిగ్రీల కోణంలో ఉంటాయి. నడక కానీ, డోలీలు

పల్లకీలకు గానీ, ప్రయాణం కనీసం అయిదు నుంచి ఆరు గంటలు పడుతుంది. గుఱ్ఱాలయితే నాలుగు గంటల్లో వెళతాయి.

సాధారణంగా ఓపిక, శక్తి, ఆసక్తి కలవారు ముఖ్యంగా యువతీ యువకులు నడవటానికే ఇష్టపడతారు. మధ్య వయస్కులయిన స్త్రీ పురుషులు గుఱ్ఱాలను ఎంచుకుంటారు. నిజానికి ఇవి, మనకు మామూలుగా తెలిసిన బండ్లులాగే గుఱ్ఱాలు కావు. గుఱ్ఱానికి గాడిదకు మధ్యన ఒక సంకర జాతి. ఈ హిజ్రా (Mules) జాతికి స్వయంగా పునరుత్పత్తి సామర్థ్యం ఉండదు. కొన్ని ప్రాంతాలలో వీటినే కంచర గాడిదలని కూడా పిలుస్తారు. పర్వత ప్రాంతాలలో మానవులను చేరవేయటానికి, సరకుల రవాణాకు మాత్రమే ఈ జంతువులు ఉపయోగ పడతాయి. ఉత్తరాఖండులోని పర్వత ప్రాంత వాసులు, సమీప ఇతర రాష్ట్రాలవాసులు ముఖ్యంగా గిరిజనులు, ఇంకా టిబెట్, నేపాల్ తదితర పొరుగుదేశాల కాందిశీకులు ఈ జంతువులను వేలంపాటల్లో కొనుక్కొని వాటిమీద ఉపాధి పొందుతారు. ఒక్కక్క జంతువు, దాని వయసు, దారుడ్యాన్ని బట్టి అరవైవేల నుంచి లక్షన్నర వరకు ధర పలుకుతుందట. ఇక వీటి అద్దె ఆయారోజుల్లో రద్దీనిబట్టి ఉంటుంది. కనీసంగా అయిదు వందలుంటుంది. అవసరాన్ని బట్టి ఒక వైపునకు గాని, రాను పోనూగాని మాట్లాడుకోవచ్చు. వీటి ఒప్పందాలు అక్కడ ఉన్న దీనికి సంబంధించిన కార్యాలయంలోగాని నేరుగా గుఱ్ఱాల వారితోగాని చేసుకోవచ్చు. ఆఫీసులో ఒప్పందం చేసుకుంటే ఒక ప్రయాణానికికాని, రానుపోనుకాని, మొత్తం రుసుము ముందుగానే చెల్లించాలి. నేరుగా గుఱ్ఱాల వారితో ఒప్పందం కుదుర్చుకుంటే, ప్రతి ప్రయాణం పూర్తి అయిన తరువాత చెల్లించవచ్చు. ఏ పద్ధతిలో చేసుకున్నా తిరుగు ప్రయాణంపై స్పష్టత లేనప్పుడు ముఖ్యంగా ఆఫీసులో ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంలో ఒక వైపునకు మాట్లాడు

కోవటమే మంచిది. ఎందుకంటే ఏ కారణంచేతనైనా అనుకున్న దానికంటే ముందుగా తిరుగు ప్రయాణమైతే మనం మాట్లాడుకున్న మనిషిని కానీ గుఱ్ఱాన్నికానీ గుర్తించే వీలు ఉండదు. తిరుగు ప్రయాణానికి కూడా మాట్లాడుకున్నందువల్ల రుసుములో రాయితీ కానీ, మరో ప్రయోజనం కానీ ఎలాగూ ఉండదు. గుఱ్ఱం దొరకదేమో నన్న సంశయానికి అంతకన్నా తావు లేదు.

పల్లకీ విషయానికి వస్తే, రెండు పొడవాటి చెక్కల మధ్య ఒక కుర్చీ అమర్చి ఉంటుంది. వెనుకా ముందూ ఈ చెక్కలు కలిసినచోట అమర్చబడిన కాడి లాంటి మరో రెండు దుంగలను భుజాలపై నుంచుకుని నలుగురు వ్యక్తులు

ఈ పరికరాన్ని మోస్తారు. స్థూలకాయులకు వృద్ధులకు ఇది అనువుగా ఉంటుంది. వీటికి రుసుము కూడా ఎక్కువ. అందులో ప్రయాణీకునికి బీమా కూడా కలిసి ఉంటుంది. నిజరుసుము ప్రయాణీకుని బరువును బట్టి ఉంటుంది. అందుకోసం ముందుగా ప్రయాణీకుని బరువు తూచి, పేరు ఇతర సంక్షిప్త వివరాలు వ్రాసి ఒక చిన్న పత్రం ఇస్తారు. ఆ పత్రాన్ని మరో గవాక్షంలో చూపిస్తే యాత్రికుని చిరునామా, గుర్తింపు వివరాలు కంప్యూటర్లో నమోదు చేసుకుని నిర్ణయించిన రుసుము తీసుకొని, ముద్రించబడిన మరో పత్రం ఇచ్చి పల్లకీమోసే నలుగురి బృంద నాయకుడికి అప్పగిస్తారు.

ఆ మనిషి గుర్తింపు కార్డుని తీసుకుని మన దగ్గర ఉంచుకోవాలి ఒప్పందం కుదుర్చుకున్న ప్రయాణం అది ఒకవైపునకు గాని రెండువైపులకు గాని పూర్తిఅయిన తరువాత మాత్రమే ఆ కార్డుని అతనికి తిరిగి ఇవ్వవలసి యుంటుంది. అలా మనం తిరిగి ఇచ్చిన గుర్తింపు కార్డుని ఆఫీసులో చూపించిన మీదటనే మననుంచి ముందుగా వసూలు చేయ బడిన రుసుమును అతనికి అందజేస్తారన్న మాట. ఇటు యాత్రికుల భద్రతకు అటు కార్మికుల శ్రేయస్సుకు, ఎటువైపునుంచి కూడా ఒప్పంద ఉల్లంఘనకు గానీ , మోసానికి, విశ్వాస ఘాతానికి గానీ తావులేని పటిష్టమైన ఏర్పాటు.

నాలుగో పద్ధతి 'డోలీ'. ఇది కేవలం కాళ్ళులేని కుర్చీ ఆకారంలో

దృఢమైన వెదురుతో చేయబడిన ఒక బుట్ట. దీనిలో మనిషిని కూర్చోబెట్టి వీపు మీద మోసుకు పోతారు. కూర్చున్న మనిషి వీపు మోసే మనిషి వీపు పరస్పరం ఆనుకుని ఉండే విధంగా ఈ బుట్ట రూపొందించబడి ఉంటుంది. పిల్లలకు, సామాన్లకు అనువుగా ఉంటుంది. దీని రుసుము కూడా ఒక వైపుకి అయిదు వందలుంటుంది.

అయిదో పద్ధతి హెలికాప్టరు. పై నాలుగింటిలో ఏదిగాని సరిపడనివారు, శ్రీమంతులు, సమయాభావరీత్యా ఒత్తిడిలో ఉన్నవారి సౌలభ్యం కోసం పవన్ హాన్స్, దక్కన్ ఏవియేషన్ సంస్థలవారు ఈ సేవలను

నిర్వహిస్తున్నారు. గౌరికుండ్ కు 15 కిలో మీటర్ల ముందు ఫాటా' అనే ప్రదేశంలో నున్న హెలిపాడ్ నుంచి ఈ సదుపాయం ఉంది.

కేదారులో హెలిపాడ్ నుంచి దేవాలయానికి రెండు కిలోమీటర్లు ఉంటుంది. ఈ దూరం ఎవరయినా నడవాల్సిందే. ఒక వైపు ప్రయాణపు కనీస రుసుము 3500 రూపాయలు. ఇది కూడా రద్దీని బట్టి మారుతూ ఉంటుంది. ఇందులో ఒక సంక్లిష్టత ఉంది. కేదార్ పర్వతాలలో వాతావరణం ప్రతీక్షణం మారుతూ ఉంటుంది. చలి అయితే ఎప్పుడూ ఉండేదే.

సాధారణంగా ఎక్కువ ఆటంకం కలిగించేవి దట్టమైన మేఘాలు. చిన్న చినుకులో, ఒకమోస్తరుగానో, ఉన్నట్లుండి భారీగానో వర్షం కూడా దాదాపు ఎప్పుడూ పడుతూనే ఉంటుంది. కానీ, నేలమీద ప్రయాణానికి ఇవి పెద్ద ఆటంకాలు కావు. సాధారణ వర్షాన్ని గుఱ్ఱాలు,పల్లకీలు, డోలీల వాళ్ళు లెక్క చేయరు. హెలికాప్టరు అలాకాదు. వాతావరణం పూర్తిగా అనుకూలంగా ఉంటే తప్ప ఎగరటానికి అనుమతి ఉండదు. తీరాచూస్తే అది ప్రయాణంచేసే ఆకాశ మార్గం గరిష్టంగా 20 కిలో మీటర్లు మాత్రమే. ఒకసారి పైకి లేచిందంటే అయిదు నిమిషాలలోపే గమ్యంలో దిగుతుంది. అయితే అది ఎగురవలసిన, దిగవలసిన ఆ ఐదు నిముషాల సమయం ఏదో నిర్ణయించేది, మాత్రం సాక్షాత్తు ఆ కేదారేశ్వరుడే. అందుచేత ఎన్ని వేలు పోసినా మనం అనుకున్న సమయానికి దర్శనం చేసుకుని తిరిగి రాగలమన్న పూచీ లేదు. రెండు వైపులకు ఇదే పరిస్థితి. పైగా, ఒకసారి డబ్బు చెల్లించిన తరువాత రద్దు

చేసుకోవటం అంటూ ఉండదు. వేరే మార్గం చూసుకుంటే ఈ డబ్బు వదులుకోవలసినదే.

గుఱ్ఱాల స్టాండుకు చేరిన పిదప మేమిద్దరం చెరొక పల్లకీలోనూ, మిగతావారు కాలినడకన వెళ్ళేటట్లు నిశ్చయించుకున్నాము. ముందుగా, లక్ష్మి ప్రధాన బుకింగ్ కౌంటర్ వద్ద వరుసలో నిలబడగా, కిరణ్ మమ్మల్ని బరువు తూకం వేయించే పనిలో నిమగ్నమయాడు. చాలా కాలం తరువాత మా బరువు ఎంతో తెలుసుకునే అవసరం ఈ సందర్భంగా కలిగింది నేను 70 కిలోలు నా శ్రీమతి 55 కిలోలు తూగాము. రెండు పల్లకీలకుగాను వెళ్ళటానికి రు.2700/- వసూలు చేసారు. గం.11.30 లకు మా పల్లకీలు బయలుదేరాయి. నిర్ణయించబడిన కార్యక్రమం ప్రకారం మధ్యాహ్నానికే కేదార్ నాథ్ చేరుకొని సాయంత్రమే దర్శనం కూడా పూర్తికావలసి ఉన్నప్పటికీ, ఉదయం అనుకున్న సమయానికి బయలుదేర లేకపోయాం.

బుకింగ్ రసీదు మీద, వారికి చెల్లించటానికిగాను ఎంత వసూలు చేయబడిందో మనం చెపితేగాని స్వయంగా తెలుసుకోలేనంత నిరక్షరాస్యులు ఆ బోయీలు. అయినా, పల్లకీలు మోస్తున్నంతసేపు వారు కేదారేశ్వరుడి నామస్మరణ చేయడం మాకు అబ్బుర మనిపించింది.

వాతావరణం మరీ అంత చలిలేకుండా ఆహ్లాదంగా ఉంది. పేరుకి పల్లకీయే అయినా, అవసరం ఏమయినప్పటికీ, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించియుండగానే ఆ విధంగా నలుగురిచేత మోయించుకునే స్థితి అనేక ఆలోచనలను, వైరాగ్యాన్ని ఆవిష్కరించింది. వచ్చేపోయే యాత్రికులు, మనతోపాటు ప్రక్కనే గలగల మంటూ సోయగాలొలుకుతూ ప్రవహించే మందాకినీ, మొత్తంగా ఆ ప్రకృతి సౌందర్యం, ఇతర ఆలోచనలను, భావాలను క్రమంగా దూరం చేసాయి కొద్ది దూరం పోయాక అప్పటివరకూ

సంచీలోనున్న కెమేరాతీసి చేతులకు పని కల్పించాను. మొదటి అవతరణ 'జంగంబాడి' అనే చిన్నగ్రామం. బోయీలతో కలిసి మేము కూడా చాయి తాగాము. మేము తిరిగి బయలుదేరే సమయానికి నడకతో వస్తున్న మావాళ్ళు కనబడ్డారు. వాళ్ళు ఒక్కరొక్కరే రావటం మా పల్లకీలు లేవటం ఒకేసారి జరిగింది. ఆ విధంగా దాదాపు ప్రతి గంట ప్రయాణానికి ఒకచోట ఆగుతూ అక్కడక్కడ టీ సేవిస్తూ సాగాము. మధ్యలో ఒకచోట బోయీలు భోజనాలు చేసారు. ఒప్పందంలో లేనప్పటికీ, సౌజన్య పూర్వకంగా ఆ ఖర్చు మేమే భరించాము. మేము మాత్రం లక్ష్మి ఇచ్చిన సూచనలు, చేసిన ఏర్పాట్ల మేరకు ఎండు ఫలాలు (Dry Fruits) బ్రెడ్, బిస్కట్టులతో నీరు అధికంగా తాగుతూ సరిపుచ్చాము.

అలా ప్రయాణం సాగిస్తుండగా సన్నగా వర్షం మొదలైంది. 'రామ్ బార' అనే ఊరు వచ్చేసరికి కుంభవృష్టిగా మారింది. ఒక పెద్దులో పల్లకీలు దిగాయి. అప్పటికి చలి దుస్తులు ధరించే ఉన్నాం. వాటిపైన వర్షపు దుస్తులు ధరించటానికి అనువైన ఆశ్రయం వెంటనే లభించనందువల్ల ఆ లోపునే పూర్తిగా తడిసిపోవటంతో ఇక వాటి ప్రయోజనమే లేకపోయింది. పైగా, 'రామ్ బార' నుంచి ఉష్ణోగ్రత వేగంగా పడిపోవటం గమనిస్తాము. పర్యవసానంగా, క్షణాలు గడుస్తున్న కొద్దీ చలి తీవ్రత పెరుగుతుంది. మార్గం ముందుకంటే ఎక్కువ ఏటవాలుగా ఉండి మలుపులు కూడా ఎక్కువ కోణంలో వెంట వెంటనే ఉంటాయి. అలా సుమారు 4 కిలోమీటర్లు ప్రయాణించగా 'గౌరుర్ చట్టి' అనే ఊరు వచ్చింది. అక్కడ కూడా కొంచెం సేపు పల్లకీలు దింపారు. అక్కడ నుంచి పెద్దలోయ మీదుగా కేదారేశ్వర ఆలయం, ఊరు లీలగా కన్పించాయి మార్గం అక్కడ నుంచి సమతలంగా ఉంది.

'గౌరుర్ చట్టి' నుంచి సమతల కేదార్ మార్గం

కేదార్ లో సాయంత్రం 6 గంటలకు దిగేటప్పటికి మా పరిస్థితి వర్ణనాతీతం. అప్పటికి చాలాసేపటి నుంచే చలినుంచి రక్షణకోసం వేసుకున్న ఉన్ని దుస్తులు, కాళ్ళకు చేతులకు, వేసుకున్న ఉన్ని తొడుగులతో సహా పూర్తిగా తడిసి పోయి ఉన్న వాటితో ఉన్నాము. ఉష్ణోగ్రత సున్నా డిగ్రీలు. ఆ రాత్రికి మైనసుకు కూడా పడిపోయింది 63 సంవత్సరాల జీవితంలో అటువంటి వాతావరణస్థితిని ఎదుర్కొనటం అదే ప్రథమం. నా శ్రీమతి పరిస్థితి ఇంకా దయనీయం. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి. మేము బస చేయవలసిన నిగం గెస్టుహౌసు అక్కడికి ఒక కిలోమీటరు దూరం ఉంటుంది. నడక మినహా వేరే ఏ సౌకర్యం లేదు. మా వెంట తెచ్చుకున్న రెండు సంచులు నేనే తగిలించుకుని, ఒక చేతితో ఆమెను పట్టుకుని, అడుగులో అడుగు వేసుకుంటూ, అక్కడక్కడ ఆగుతూ ఒక గంట తరువాత ఎలాగో గెస్టుహౌసుకు చేరాము. కాని గదుల రిజర్వేషనుకు సంబంధించిన వివరాలేమీ మా దగ్గర లేవు. అవి పిల్లల వద్ద ఉన్నాయి. వాళ్లింకా ఎంత దూరంలో ఉన్నారో ఎప్పటికి చేరుకుంటారో తెలియదు. మేనేజరు మా మాటలు విశ్వసించి, పరిస్థితిని అర్థం చేసుకుకుని, వెంటనే ఒక స్యూట్ (Suite) లోకి అనుమతించాడు. స్థిమితంగా సోఫాల్లోనయితే కూర్చున్నాం. కాని ఏం లాభం? మార్చుకోవటానికి బట్టలేవీ? లగేజీని మరొక పోర్టరుకు అప్పగించాం కదా! అతను ఎప్పటికి చేరేనో ఏమో? గడగడా వణికి పోతున్నాము. ఈలోగా ఆ

మేనేజరే వేడివేడిగా టీ పంపించాడు. కప్పులు పట్టుకుంటానికి కూడా చేతులు సహకరించటం లేదు. అక్కడే టేబులు పైనున్న కొవ్వొత్తి నొకదానిని (అక్కడ ఉన్నదే ఆ ఒక్కటి అడిగితె మరి కొన్ని ఇచ్చే వాళ్ళేమో కానీ ఆ ఆలోచన రాలేదు) వెలిగించి ఆ వేడితో చేతుల వరకు స్వాధీనంలోకి తెచ్చుకుని టీ త్రాగాము. ఆ తరువాత పిల్లలు, వారితో పాటే లగేజీ తెచ్చిన పోర్టరు రావటం జరిగింది.

ఈ అనుభవం నేర్పిందేమంటే, ఈయాత్ర చేసేవారు, వర్షపు దుస్తులేమైనాగాని, చలినుంచి రక్షణకుమాత్రం రెండు లేదా మూడు జతలు తీసుకువెళ్ళటమే కాకుండా ఒకటి తడిసిపోతే మరొకటి సిద్ధంగా కూడా ఉంచుకోవాలి. అలాగే ఒక చిన్న రూంహీటరు కూడా తీసుకువెళితే మంచిది. ఇక్కడ విద్యుత్తు, నాణ్యంగాను, సమృద్ధి గాను ఉండదు. వోల్టేజి అధమ స్థాయిలో ఉంటుంది. అయినప్పటికీ చేతుల వరకూ, కొంతవరకూ శరీరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకోవటానికి ఇది ఉపకరిస్తుంది. సులభంగా తీసుకువెళ్ళే పరిమాణంలో ఒకవేళ ఈ వస్తువు లభ్యంకాని పక్షంలో, మహిళలు, ముఖ్యంగా ఉద్యోగినులు తమ జుట్టును త్వరగా ఆరబెట్టు కోవటానికి వాడే సాధారణ ఉపకరణం (Hair Drier) అయినా ఈ సమస్యను చాలావరకు పరిష్కరిస్తుంది.

మిగతా మత విశ్వాసాలలో స్నానానికి సంబంధించిన నియమాలు నాకు తెలియవు కాని సనాతన ధర్మంలో మాత్రం నాకు తెలిసినంత వరకూ దైవదర్శనానికి వెళ్ళే ముందు స్నానమాచరించటం అత్యంత ప్రధానం. ఆరోగ్యం సహకరించకపోతేనూ అనివార్యమైన మరే ఇతర కారణాల వల్లగానీ స్నానమాచరించలేకపోతే అది వేరే విషయం. తగిన వసతులు ఉండి కూడా కేవలం చలి కారణంగా స్నానం చేయకుండా దైవదర్శనానికి వెళ్ళటంలో

ఔచిత్యం ఉండదు సరికదా భగవంతుని పట్ల అపచారం కూడా. ఈ యాత్రలపై నేను చదివిన ఒక పుస్తకంలో ఆ రచయిత్రి ఇదంతా చాదస్తంగా తీసిపారేస్తూ అటువంటి పట్టింపులేవీ పెట్టుకోవద్దని సలహా ఇచ్చారు. కానీ మనసుండాలే కానీ అందుకోవటానికి అవకాశాలు తప్పకుండా ఉంటాయి. స్నానం తప్పనిసరి కనుకనే వేడి నీటి కోసం బాత్ రూముల్లో గీజర్లు ఉంటాయి. తక్కువ వోల్టేజి కారణంగా అనువయినపాళ్ళలో నీటిని సిద్ధం చేయటానికి అవి చాలా సమయం తీసుకుంటాయి. సరిపడా వేడెక్కాయికదా అని కుళాయి తిప్పితే, వాతావరణ ప్రభావం వల్ల తీరా బాల్చీలో పడీపడగానే చల్లగా అయిపోతాయి. అందుకని అవి బాల్చీలో పడేలోపే మగ్గులో పట్టుకుని ఒంటిమీద పోసేసుకుంటూ సలక్షణం గానూ, సంపూర్ణంగానూ స్నానంచేసే శుభ్రమైన దుస్తులు ధరించి శుచిగా దైవదర్శనానికి వెళ్ళవచ్చును. పట్టు బట్టలైతే మరీ సంప్రదాయబద్ధంగా ఉంటాయి. (ఇటువంటి సందర్భాలలో తమిళ మహిళలు పట్టుచీరలే ధరిస్తారు). ఇటువంటి ఇబ్బందిని ముందుగానే ఊహించినవాడనై మొత్తం యాత్రలో ఎక్కడా కూడా దేవాలయ ప్రవేశానికిపూర్వం ఈ స్నాన నియమానికి భంగం వాటిల్లకుండా ఉండేందుకుగాను, మా బృంద అవసరాన్ని దృష్టిలో నుంచుకుని మూడు వాటరు హీటర్లు తీసుకువెళ్ళాం. యాత్రాసాంతమూ అవి ఎంతో ఉపయోగ పడ్డాయి. ఈ గ్రంథం చదివిన వారు మా అనుభవాలను గ్రహించి, ఈ ఏర్పాట్లు చేసుకుంటే నా కృషి ఫలించినట్లే. మరొక సూచన. ఎటువంటి పరిస్థితులలోనూ, ఎంత ఉత్సాహం ఉన్నప్పటికీ మందాకినీ నదిలో మాత్రం స్నానానికి సాహసించ కూడదు. ఆ చల్లదనానికి శరీరంలోని రక్తం చిక్కబడి ప్రసరణలో సమస్యలు ఏర్పడి తక్షణమే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. (మాకు తెలిసిన కుటుంబంలోని ఒక ఇల్లాలు గంగోత్రిలో ఇలాంటి

అఘాయిత్యమే చేసి ప్రాణం మీదకు తెచ్చుకుని భగవంతుని దయతో బయటపడింది) పవిత్ర జలం కనుక తలపై జల్లుకుని మార్జన స్నానం చేయవచ్చు.

అందరం స్థిమితంగా స్థిరపడ్డాక గెస్టుహౌసు తాలూకు రెస్టారెంట్ మనిషి వచ్చి రాత్రి భోజనానికి ఆర్డరు తీసుకుని వెళ్ళాడు. అతను చెప్పిన సమయానికి భోజనశాలకు వెళ్లి భోజనాలు ముగించి ఎవరి గదుల్లో వారం విశ్రాంతికి ఉపక్రమించాం.

**కేదారేశ్వరుని దర్శనం**

24 వ తేదీన వేకువ ఝామునే లేచి నేను ముందుగా తయారై క్షేత్ర పురోహితులయిన శ్రీ విద్యాసాగర్ అవస్థి, శ్రీ రవి అవస్థి గార్లను ఫోనులో సంప్రదించగా, వారు గెస్టుహౌసుకు వచ్చి, పూజాది కార్యక్రమాల

| ఫోనునంబర్లు |
|---|
| **09557042215 * 0456532816 * 09411158955** |

విధివిధానాలను వివరించారు. ఈ లోగా మిగిలిన వారందరూ కూడా సిద్ధమయ్యారు. అందరం 8 గంటలకు దేవాలయం చేరుకుని ఆలయ ప్రవేశానికి అనుమతి కోసం నిరీక్షించాము. యాత్రికులతో రద్దీ ఎక్కువగానే ఉంది. ప్రత్యేక ద్వారం ద్వారా మమ్ములను లోనికి తీసుకువెళ్ళారు. అక్కడి అర్చక బృందం నమక, చమకాదులతో స్వామి వారికి,మాచే స్వయంగా అభిషేకం చేయించారు. దేవాలయ ప్రవేశానికి మునుపు అక్కడి దుకాణాలలో కొనుగోలుచేసిన పూజా ద్రవ్యాలతోపాటుగా, హైదరాబాదునుంచి తీసుకువెళ్ళిన బిల్వదళాలతో కేదారేశ్వరుని సంతృప్తిగా సేవించుకున్నాం. నా శ్రీమతి తాను హైదరాబాదు నుండి ప్రత్యేకంగా ఎంతో భక్తి ప్రపత్తులతో భద్రంగా, తెచ్చుకున్న ఆవునేతి వత్తులను టెంకాయ చిప్పలలో (ఇవి కూడా తను వెంట

తెచ్చుకున్నవే) నుంచి ఆలయ ధ్వజస్థంభం వద్ద తనతోపాటు మా అందరిచేత కూడా దీపాలు పెట్టించింది. ఈ కార్యక్రమమంతా ముగించుకుని, దర్శనము, అభిషేకము, పూజ చేయించిన పురోహితులకు యధాశక్తి దక్షిణలు సమర్పించుకొని సమయం పది గంటలవుతుండగా బయటకు వచ్చాము.



## Espresso కాఫీ

లక్ష్మి, సుప్రియలు అక్కడ దుకాణాలలో పర్యటిస్తుండగా, కిరణ్, ప్రకృతిని ఫోటోలు తీసే కార్యక్రమంలో నిమగ్నమయ్యాడు. ఈ లోగా రవి కళ్ళు ఎదురుగా ఉన్న టీ స్టాల్ వద్ద 'ఎస్ ప్రెస్సో' (Espresso) కాఫీ అనే బోర్డుపై పడ్డాయి. అప్పటికి నాలుగు రోజులుగా అందరమూ కూడా మంచి కాఫీకి ముఖం వాచి ఉన్నామో ఏమో, 'కాఫీ' అనే అక్షరాలు చూడగానే అతనికి ప్రాణం లేచివచ్చినదై ఏకంగా ఆరు కాఫీలకు ఆర్డర్ పడేశాడు. మొదటి కప్పు నాకే అందింది. తీరా గుటక వేద్దును కదా, దుర్భరం. నేను స్పందించి వాళ్ళను హెచ్చరించేలోపే నా శ్రీమతి, రవిల చేతికి కూడా కప్పులందాయి. నా ప్రయత్నం లేకుండానే ఫలితం వాళ్ళకూ అనుభవమైంది. సుప్రియ వస్తూనే "ఎలా ఉంది కాఫీ" అంది. రవి సరస సంభాషణా చతురుడు. మంచి హాస్యప్రియుడు. ఎంతటి గంభీర సందర్భాన్నయినా, ఏదో చతురోక్తితోనో,

ఛలోక్తితోనో మనసులు తేలిక పరచి హాయిగా నవ్వుకునేట్టు చేయగలడు. సుప్రియ ఇలా అడుగుతుందని బహుశా ముందే ఊహించి ఉన్నాడో ఏమో, 'బ్రహ్మాండంగా ఉంది. ఇటువంటిది ఇంతకు ముందెప్పుడూ నువ్వు తాగి ఉండవు, ఇక తరువాత తాగలేవు కూడా!' అంటూ శ్లేషాలంకారం సంధించాడు. పాపం ఆ అమ్మాయి నిజమేననుకుని కప్పు అందుకుని పెదవులకు తాకించిందో లేదో 'ఛీ' అంటూ అతని వంక కోపంగా చూసింది. కొద్ది క్షణాలపాటు ఆహ్లాదాన్ని కలిగించి వినోదాన్ని వడ్డించిన చక్కని సన్నివేశం. మిగతా కాఫీలు వద్దు అని చెప్పేలోపే అన్నీ రానేవచ్చాయి. అవన్నీ అలాగే వదిలేసి రు. 150/- సమర్పించుకుని బయట పడ్డాము.

మిగతా వారందరూ ఆ విషయం అక్కడితో వదిలి వేసినప్పటికి నా అలవాటు ప్రకారం, కాఫీ ఆ విధంగా ఉండటానికిగల కారణాలపై తత్వ విచారణ చేయగా తెలిసింది ఏమిటంటే, ఆ ప్రదేశాల్లో పాడిపశువులు చాలా తక్కువ. అక్కడక్కడా పొట్టిగానుండే ఆవులు కనపడతాయి. వాటి సంఖ్య చాల స్వల్పం. వాటి నుండి లభ్యమయ్యే పాలు బహుశా అక్కడ నివసించే ప్రజల గృహావసరాలకే సరిపోతాయి కాని, హోటళ్ళలో వినియోగానికి చాలినంత సమృద్ధిగా లభించవు. ఆ సమీప సానువుల్లో పచ్చిక బయళ్ళు విస్తారంగా ఉన్నప్పటికీ, శీతాకాలంలో దేవాలయంతో సహా ఆ ప్రాంతాలన్నీ మంచుతో కప్పబడి నివాసయోగ్యం కానప్పుడు, ప్రజలను తరలించి, తాత్కాలిక ఆవాసాన్ని కల్పించినంత సులువుగా పశుగణాన్ని తరలించటం వాటికి గ్రాసం సమకూర్చటంలోని సంక్లిష్టతలు, పాడి ఒక పరిశ్రమగా అభివృద్ధి కాకపోవటానికి కారణమై ఉండవచ్చని తోచింది. ఈ పాల లభ్యత లేనందువల్లనే అక్కడెక్కడా కూడా పాలు అమ్మరు. తత్కారణంగా పెరుగు కాని మజ్జిగ కాని లభింపవు. టీ విరివిగా వాడతారు కనుక అందుకు

పాలపొడిని వాడతారు. కాఫీకి కూడా అదే వాడటం వల్ల రుచికరమైన కాఫీకి మూలపదార్థమైన పాల స్వచ్ఛతలో అవసరమయిన కనీస స్థాయీ ప్రమాణం పాటించక పోవటం వల్ల ఆ కాఫీ అలా ఉందని అర్థమయింది.

**ప్రణాళికకు ప్రథమ భంగం**

కేదార్ లో ప్రధాన కేదారేశ్వర ఆలయం తప్ప, ఇతర దర్శనీయ స్థలాలేవీ లేనందుననూ, వాతావరణంలో అనిశ్చితివల్లనూ, సాధారణంగా కేదారేశ్వరుని దర్శనం ముగిసాక ఎవరైనా వీలయినంత త్వరగా గౌరికుండుకు ప్రయాణమవుతారు. కానీ మా విషయంలో నిర్ణయించుకున్న కార్యక్రమం ప్రకారం మేమిరువరం కేదార్ లో విశ్రమిస్తుండగా, మిగతా నలుగురు కేదార్ నుంచి మరో 551 మీటర్ల ఎత్తులో 8 కిలోమీటర్ల దూరంలోనున్న *'వాసుకీ తలో'* అనే ప్రదేశానికి వెళ్లిరావాలి. ఇందుకోసమే కేదారులో రెండవ రాత్రి కూడా ఉండటానికి కార్యక్రమం రూపొందింది. ఆ పర్వతశ్రేణి లోని అద్భుతమైన *'చౌకంబా'* శిఖరంపై స్ఫటిక స్వచ్ఛమైన నీటితో అలరారే సరస్సు ఉన్న ప్రదేశమే ఈ *'వాసుకీతలో'*. అంత సుందరమైన ప్రదేశమే అయినప్పటికీ, తీర్థ ప్రాశస్త్యం కాక కేవలం పర్యాటక ప్రాధాన్యం మాత్రమే ఉన్న కారణంగా ఎక్కువమంది యాత్రికులు ఆకర్షితులు కారు.

యదార్థానికి ఈ రోజు మేము చేసుకున్న దర్శనం నిన్నటి రోజు కార్యక్రమంలోనే ఉంది. కాని, నిన్న గౌరికుండులో బయలుదేరే సమయానికే మూడుగంటలు వెనుకపడ్డాం. పైగా అయిదు గంటలు అంచనా వేసుకున్న పల్లకీ ప్రయాణం దాదాపు ఏడు గంటలు పట్టింది. నడిచివచ్చిన పిల్లలకు కూడా అంతే సమయం పట్టటంతోనూ, కేదారులో వాతావరణానికి శరీరాలు అలవాటు పడడటానికి మరికొంత సమయం పట్టటంతోనూ క్రితంరోజు అసలు దర్శనంపై దృష్టినే పెట్టలేక పోయాము.

ఆ నాలుగైదు గంటల నికర విలంబం ఈ రోజుకు కొనసాగి, ఇప్పుడు ప్రభావం చూపిస్తున్నది. అప్పటికే సమయం పదకొండు గంటలు కావస్తున్నది. అప్పుడు బయలుదేరి 'వాసుకీతల్' వెళ్లి వారు చీకటి పడే లోపు ఎలాగూ తిరిగి రాలేరు. ఒకవేళ నిర్విరామంగా నడిచే సాహసం చేసినా, అక్కడ గడపడానికి సమయం మిగలదు సరికదా రాను పోను 16 కిలోమీటర్ల నడక వల్ల తప్పని ప్రయాస ప్రభావం మరునాడు గౌరికుండుకు నడక మీదను, విరామానికి అవకాశం లేని తదుపరి ప్రయాణంపైననూ పడవచ్చుననే సంశయంతో ఆ యాత్రను నిరుత్సాహంతో విరమించుకున్నారు.

ప్రత్యామ్నాయంగా, కార్యక్రమంలో లేని, కేదార క్షేత్ర పాలకుడు అయిన కాలభైరవస్వామిని దర్శించుకున్నారు. ఈ ఆలయం కేదారేశ్వరుని ఆలయం ఉన్న పర్వతానికి ఎడమ వైపుగా మరో పర్వత సానువుపై సుమారు 200 అడుగుల ఎత్తున మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. వారు తిరిగి రాగానే గదులు ఖాళీచేసి, యధాపూర్వం, లగేజీని పోర్టరుకు అప్పగించి నడకతో గెస్ట్ హౌసు నుండి బయలుదేరాము. మధ్యలో మందాకిని నది వద్ద ఆగి మార్జన స్నానాలుచేసి గుఱ్ఱాల స్టాండుకు చేరాము. ఈసారి మేమిద్దరం గుఱ్ఱాలను ఆశ్రయించాం. మిగిలిన నలుగురూ నడక ఎంచుకున్నారు. గౌరీకుండు మరో రెండు కిలోమీటర్లు ఉందనగా ఏ కారణం చేతనో (Reverse Altitude sickness?) గుఱ్ఱంపై నుండగానే నాకు కళ్ళు తిరిగాయి. గుఱ్ఱం ఆపించి ప్రక్కనే హోటలులో అరుగుపై కొంచెంసేపు విశ్రమించాను. అయినా పరిస్థితిలో మార్పులేదు. అటువంటి అత్యవసర

సమయంలో వాడవలసిన మందులు రవి ఏర్పాటుచేసి నా సంచీలో అందుబాటులో ఉంచినప్పటికీ, అనేక రకాలయిన ఇతర మందులలో ఈ మందు ఏదో స్పురణకు రానందువల్ల ప్రయోజనం పొందలేక పోయాను. ఏ మందు ఏ సందర్భంలో వాడాలో కూడా ఒక చిన్న కాగితంమీద వ్రాసుకుని ఆ మందులతో పాటే ఉంచుకుని ఉంటే బాగుండేది. కదూ! తిరిగి ప్రయాణం సాగించిన తరువాత కూడా గుఱ్ఱం మీదకంటే నడకే సుఖమనిపించి మళ్ళీ గుఱ్ఱం దిగి, చివరి ఒకటిన్నర కిలోమీటరు అదే కొనసాగించాను. ముందుగా మేమే గౌరీకుండు చేరుకున్నాము. అంతకు ముందు అనుభవంతో ఈ రోజు సామాన్లు తెస్తున్న పోర్టరును వెనుకా ముందూ కాకుండా మమ్మల్నే అనుసరించమన్నాం. గౌరీకుండు చేరేటప్పటికి సమయం గం. 6.00 అయింది. నిగం గెస్టుహౌసులో అంతకు రోజు ముందు రాత్రి ఉన్న ఎవరి గదులు వారికే కేటాయించబడ్డాయి. నాకు 100 డిగ్రీల జ్వరం. చలి సరే సరి. పిల్లలు వచ్చాక ఏవో మందులు ఇచ్చారు. నేను గదిలో ఉండిపోగా వారు స్థానికంగా చూడదగినటువంటి ఉష్ణ నీటికుండం, పార్వతిదేవి ఆలయం మొదలైనవి దర్శించి బసకు తిరిగివస్తూ మన ఫలహారాలైన ఉప్మా, ఇడ్లీలు, వడలు, దోశలు లభించే చోట వారికి హితవైనవి భుజించి అప్పటి నా పరిస్థితికి అనువైనదని వారికి తోచినదేదో నాకూ తెచ్చారు.

25వ తేదీ ఉదయమే కేదారులో బయలుదేరి గౌరికుండ్ మీదుగా సాయంత్రానికి జోషిమఠ్ చేరవలసి ఉండగా, 'వాసుకీతల్' యాత్ర విరమించుకున్న కారణంగా క్రితం రోజు సాయంత్రమే గౌరికుండుకు తిరిగి వచ్చినందున సమయపాలనలో కొంత వెసులుబాటు లభించింది. ఈ వెసులుబాటు వల్లనూ, ముఖ్యంగా గతరాత్రి నాకు కలిగిన స్వల్ప అస్వస్థత నేపథ్యంలోనూ ఉరుకులు పరుగులు లేకుండా కొంచెం తాపీగా నిద్రలేచి

బయలుదేరే వీలుకలిగింది. ఉదయం గం. 7.00 లకు గౌరీకుండు బస్సు స్టాండుకు చేరుకున్నాము. అప్పటికే ఇచ్చిన ఆదేశాలమేరకు సిద్ధంగా ఉన్న వాహనంలో సామాను ఎక్కించి ప్రయాణమయ్యాం. నిర్ణీత సమయానికంటే మూడు నాలుగు గంటలు ముందుగా బయలుదేరాం. కనుక, యాత్రా ప్రణాళికకు తుదిమెరుగులు దిద్దే సమయంలో రవి సుప్రియల కోరిక 'ఆలీ'లో కేబుల్ కార్ విహారం గుర్తు చేసాడు కిరణ్. నిజమే! అనుకున్నట్లు ఏ 11 గంటలకో బయలుదేరితే సాయంత్రం ఆరున్నరకు కదా జోషీమట్ చేరుకోవాలి? కానీ అంతకంటే చాలా ముందుగానే బయలుదేరాం కనుక ఏ నాలుగు గంటలకో జోషీమట్ చేరుకోగలిగి ఆ కార్యక్రమం కూడా ఆ రోజే పూర్తి చేసుకుంటే మిగిలిన రోజులలో వత్తిడి తగ్గి మరింత నింపాదిగా యాత్ర సాగుతుందని భావించాము. పనిలో పనిగా ముందుగా నిర్ణయించ బడనప్పటికీ మార్గమధ్యంలో ఉన్న "త్రియుగీ నారాయణ" క్షేత్రాన్ని దర్శించటానికి ప్రతిపాదించాను. ఇది సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు దగ్గరుండి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిపించిన ప్రదేశంగా చెప్పబడింది. తప్పనిసరిగా దర్శించవలసినంత ప్రాధాన్యత ఉన్న ప్రదేశమే. కానీ సమయాభావం కారణంగా విస్మరించదగినవాటి జాబితాలో చేరింది. ప్రధాన మార్గంలో, గౌరీకుండు నుంచి 5 కిలోమీటర్ల దూరంలో నున్న సోన్ ప్రయాగ నుంచి కుడివైపునకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే ఈ క్షేత్రం ఉంది. పెద్ద దూరమూ కాదు, సమయాభావమూ లేదు. ఏ విధంగా చూసినా అసాధ్యం కాదు. కానీ డ్రైవరు ఇచ్చిన సమాచారం ఇందుకు భిన్నంగా ఉంది. ఎంత ముందస్తుగా బయలు దేరామని అనుకున్నా రెండు గంటల కంటే తేడా లేదు. అతను చెప్పిన ప్రకారం ఈ క్షేత్రాన్ని దర్శించి తాజాగా అనుకున్న సమయానికి జోషిమట్ చేరలేము.

ఏ దేశంలోనయినా రోడ్డుపై ప్రయాణించే వాహన సగటు వేగాన్ని ఆ రోడ్డు యొక్క హోదా, దాని స్థితి నిర్ణయిస్తాయి. భారతదేశంలో ఇటువంటి అత్యున్నత హోదా గలవి (స్వర్ణ చతుర్భుజి) ఎక్స్ ప్రెస్ రహదార్లు. వీటిపై సగటు వేగం గంటకు వంద కిలోమీటర్లు. నాలుగు లేన్ల రహదార్ల మీద 80 కి.మీ ఉంటే, డివైడర్లు లేని మామూలు జాతీయ హోదా రహదార్లపై ఇది 60 కిలోమీటర్లుగా ఉంటుంది. రాష్ట్ర రహదారులు, జిల్లా స్థాయిలో నిర్వహింపబడే ఇతర రహదార్లపై ఈ వేగం 30 కిలోమీటర్ల లోపే. స్వరాష్ట్రంలో తరచూ ప్రయాణించే రహదార్ల మీద కాకుండా ఇతర రాష్ట్రాలలో రోడ్డు మీద వ్యక్తిగత వాహనాల్లో ప్రయాణాలకు ప్రణాళికలు వేసుకునే సందర్భంలో ఒక ఊరినుంచి మరొక ఊరుచేరటానికి పట్టే సమయం అంచనా వేసుకోవటానికి, తదనుగుణంగా భోజన విరామాలను, రాత్రిబసలను నిర్ణయించుకోవటానికి రహదార్ల గురించిన ఈ అవగాహన ఉపకరిస్తుంది. రుద్రప్రయాగ నుండి గోవిందఘాట్ వరకు, డిల్లీ సమీపంలోని ఘజియాబాద్ నుండి బదరీనాథ్ మీదుగా భారత దేశ సరిహద్దు గ్రామం 'మానా' వరకూ కూడా జాతీయ రహదారులే. అయినప్పటికీ, పూర్తిగా పర్వత ప్రాంతాలయినందున ఈ మార్గాల్లో సగటు వేగాన్ని గణించటానికి పైన పేర్కొన్న ప్రాతిపదికలేవీ పనికిరావు.

తరచూ ప్రకృతి వైపరీత్యాలకు నెలవైఉండే ఉత్తరాఖండులోని చార్ ధాం రహదార్ల నిర్వహణ ప్రత్యేక నైపుణ్యంతో కూడుకుని ఉంటుంది. అందుకనే దేశంలోని ఇతర జాతీయ రహదార్లను "భారత జాతీయ రహదార్ల సంస్థ" (National Highways Authority of India- NHAI) నిర్మించి, నిర్వహిస్తుండగా, వీటిని మాత్రం ప్రత్యేకంగా "సరిహద్దు రహదార్ల

సంఘటన్" (Border Roads Organisation) అనే మరొక సంస్థ నిర్వహిస్తుంది.

వర్షాకాలంలో ఈ రహదార్ల నిర్వహణ పెనుసవాలుతో కూడుకున్న వ్యవహారం. ప్రధానంగా ఈ మార్గాల్లో ప్రమాదాలు రెండు విధాలుగా ఉంటాయి. మొదటిది రహదారికి లోయవైపుకి సంబంధించింది కాగా, రెండవది పర్వతం వైపుకు సంబంధించినది. మొదటిది, అత్యంత భయంకరమైనది. ఈ తరహా ప్రమాదంలో రహదారి కొన్ని మీటర్ల మేర ఉన్నదున్నట్లు లోయ వైపుకు (Land Slides) జారిపోతుంది. ఆ సమయంలో దురదృష్టవశాత్తు ఆ బిందువులో ఏవయినా వాహనాలుంటే పర్యవసానం ప్రత్యేకించి చెప్పక్కర లేదు. జాగ్రత్తగా గమనించినట్లయితే, ఇంతకు మునుపు జరిగిన ఇటువంటి సంఘటనల తాలూకు గుర్తులు స్పష్టంగా చూడవచ్చు. రెండవ రకం, రహదారి మీదకు పర్వతం వైపు నుంచి పెద్ద బండలు దారికి అడ్డంగా పడటం (Rock Falling). ఈ ప్రమాదాలను సాధ్యమైనంత ముందుగా పసిగట్టి, మార్గంలో వాహనాల రాకపోకలను నియంత్రించటంలోనూ, సంఘటన జరిగిన వెంటనే అవసరమయిన సహాయ కార్యక్రమాలు నిర్వహించటంలోనూ, మార్గానికి మరమ్మత్తులు చేయటంలోనూ, ఈ సంస్థ అసాధారణమయిన సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని కలిగి ఉంటుంది. ముఖ్యంగా దారిపై కొండ చెరియలు విరిగి పడినపుడు క్షణాల మీద వాటిని తొలగించి రాకపోకలను పునరుద్ధరించ టానికి, మార్గంపొడవునా నిర్ణీత ప్రాంతాలలో అత్యాధునికమైన సమాచార వ్యవస్థతో అనుసంధానింపబడి సంసిద్ధంగా నున్న సిబ్బందితో పాటు బుల్ డోజర్లు విశ్రమింపజేసి యుండటం చూస్తాము. మేము గౌరీకుండులో బయలు

దేరి జోషిమట్ వైపు వెళ్తుండగా అభిముఖంగా వచ్చే మార్గంలో రుద్రప్రయాగకు కొంచెం ముందుగా ఇటువంటి స్వల్ప సంఘటన జరిగినట్లు, తత్కారణంగా రాకపోకలను రుద్రప్రయాగ నుంచి మళ్ళించినట్లుగా సమాచారం అందింది. ఈ యాత్రకు ప్రణాళికా రచనచేస్తున్నప్పుడు ఈ అంశాలన్నిటినీ దృష్టిలోపెట్టుకుని, సగటు ప్రయాణవేగం కేవలం గంటకు 20 కిలోమీటర్లుగా తీసుకోవటం జరిగింది. ఇప్పటివరకూ ఈ సూత్రం భంగ పడలేదు.

అయినప్పటికీ ఈ కోణంలో మరొకసారి ఆలోచించగా మా డ్రైవరు చెప్పింది సముచితంగానే తోచింది. ఎందుకంటే, ఆ రోజు నిర్ణయమైన రాత్రి బస జోషిమట్ లో. గెస్టుహౌసు బుకింగ్ కూడా అయిపోయింది. అనివార్య మయిన ఇటువంటి మరే కారణం చేతనయినా ప్రయాణంలో అంతరాయం కలిగి కాలయాపన జరిగితే (అలా జరిగింది కూడా) రాత్రి బస ప్రదేశం ఇంకా ముందుకు జరిగి ఆ మేరకు మరునాడు ప్రయాణించవలసిన దూరం పెరగటమేకాక మొత్తం తదుపరి యాత్రపై ఆ ప్రభావం పడవచ్చు. ఈ కారణాలతో త్రియుగీనారాయణ క్షేత్రదర్శన ఆలోచన విరమించుకోవలసి వచ్చింది. ప్రయాణం కొనసాగిస్తూ గుప్తకాశిలో ఆగి అల్పాహారం తీసుకున్నాము. ఇక్కడ నుంచే బదరీ వైపు వెళ్ళటానికి మార్గం ఎడమ వైపుకు చీలుతుంది. నేరుగా వెళ్తే రుద్రప్రయాగ, శ్రీనగర్, దేవప్రయాగ మీదుగా మళ్ళీ రిషికేశ్ చేరతాము.

**ఓఖిమట్**

తరువాత మజిలీ ఓఖిమట్. చాల ప్రసిద్ధమైన క్షేత్రం. శీతాకాలంలో ఆరునెలల పాటు ఆలయం మూసివేసిన సమయంలో కేదారేశ్వరుడు ఇక్కడే విడిదిచేసి ఉంటాడు. శ్రీ కృష్ణుని మనుమడైన అనిరుద్ధునికి బాణాసురుని కుమార్తె ఉషతో వివాహమయిన ప్రదేశంగా చెప్పబడింది. శ్రీరాముని కంటే

కొన్నితరాల ముందువాడై షట్చక్రవర్తులలో ఒకరుగా గుర్తింపబడిన మాంధాత పన్నెండు సంవత్సరాలు ఇక్కడ తపస్సు చేసాడట.

***"యత్రోషా అనిరుద్ధశ్చ చిత్రలేఖా చతతు సర్వే***
***ఓంకారేశ్వరస్తథా దేవీ బారాహీ చండికా తథా***
***రాజర్షిశ్చాపి మాంధాతా తిష్ఠంత్యేతే వరప్రదా***
***దర్శనాత్పూజనాదేషాం లభతే వాంఛితం ఫలం.***

మందిరం గోడలపై రంగులతో వ్రాయబడిన వాటిలో ఒకటయిన ఈ శ్లోకం ద్వారా ఈక్షేత్రాన్ని దర్శించి పూజించినవారి మనోవాంఛితాలు నెరవేరుతాయని ఈ క్షేత్ర మహాత్మ్యంగా చెప్పబడింది.

దేవాలయ ముఖద్వారం, ఓఖిమట్

ఈ దేవాలయం గోపురంమీద "నీలకంఠ" అని, దేవస్థానం కార్యాలయభవనం మీద "శ్రీ జగద్గురు నీలకంఠ లింగభవన్" అని కన్నడలిపిలో వ్రాసి ఉండటం గమనిస్తాము. అంతేకాదు. ఇక్కడ పూజారులు కన్నడ మూలాలవారు. వీరు ఇప్పటికి కన్నడం మాట్లాడగలరు. లక్ష్మి వారితో కన్నడంలో ఆత్మీయంగా సంభాషించింది. తద్వారా మాకు అదనపు గౌరవం ఒనగూడింది. మానవ సంబంధాలలో రక్తసంబంధం తరువాత ప్రాంతీయ, భాషాభిమానాలే కదా గొప్పవి!

ఆ ఆలయంలోనున్న దేవతామూర్తులను దర్శించి తీర్థ ప్రసాదములను స్వీకరించి, పూజారుల ఆశీస్సులు పొంది మళ్ళీ ప్రయాణం సాగించాం. అక్కడ నుండి 25 కిలోమీటర్లు ప్రయాణించాక ఒక అంతరాయం. రోడ్డుపై తారు పరిచే భారీయంత్రం, రోడ్డురోలర్లు, లారీలు, ఇతర వాహనాలు, కార్మికులు, రోడ్డు మరమత్తు పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఏకకాలంలో ఆ పనికి, యధావిధిగా రాకపోకలకు అవకాశం లేదు. అందువల్ల పని జరుగుతున్న ప్రదేశానికి ఇరువైపులా సుమారు రెండేసి కిలోమీటర్ల మేర వాహనాలు గంటకు పైగా నిలిచి పోయాయి. అయితేనేం? బహు సుందరమైన ప్రదేశం, ఆహ్లాదకరమైన వాతావరణం. మినీ స్విట్జర్లాండ్ అని పిలుస్తారట. అలా అని బోర్డులు కూడా కనబడ్డాయి. వాహనాలు దిగి విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించాం. ఫోటోలు కూడా తీసుకున్నాము. అక్కడికి 5 కిలోమీటర్ల దూరంలో చోప్టా అనే పట్టణం లాంటి గ్రామం ఉంది.

**ఒక అల్పజీవి ప్రహసనం**

తిరిగి బయలుదేరి, చోప్టాలో నెమ్మదిగా ప్రయాణిస్తుండగా ఒక హోటలువద్ద వాహనాన్ని ఆపించింది లక్ష్మి. టీ తాగాలనిపించిందేమో ననుకున్నాం. కాని వాహనం దిగే ప్రయత్నమేదీ చేయకుండా ఆ హోటలు వంటశాలనుండి కొంచెం ఉప్పు తేవలసినదిగా డ్రైవరును కోరింది. మాకేమీ అర్థం కాలేదు. ఒకింత ఆందోళనకు గురయ్యాం కూడా. తక్షణమే ఆమెకు కావలసిన ఉప్పు వచ్చింది. మేము ఉత్కంఠతో చూస్తుండగా తన కుడికాలి బూటు, మేజోడు అప్పటికే తొలగించుకుని ఉన్నదేమో, చీలమండవద్ద ఆ ఉప్పు కొంచెం జల్లింది. అంతే! ఆ జీవి ఒక్కసారి పట్టువిడిచి క్రిందపడింది అప్పటికి అరగంటకు పైగా తన రక్తాన్ని పీల్చేసిన ఒక జలగ. దాన్ని

పట్టుకుని మాకు చూపిస్తూ కారు కిటికీలోంచి బయటకు విసిరేసింది. ఇంతకూ జరిగిందేమిటంటే!

అంతకుముందు, రోడ్డు మరమ్మత్తు కారణంగా ఆగినచోట విహరిస్తుండగా ప్రక్కన సెలయేటి ఒడ్డున కూర్చుని పాదాలు కొద్దిసేపు నీటిలో ఉంచిందట. ఆ సమయంలో తను ఈ జలగ పాలిట పడ్డది. అప్పటినుంచీ పైకి చెప్పకుండా బాధను ఎలా భరించినదీ వివరించటంతో, ఆమె మనో నిబ్బరానికీ, సమయస్ఫూర్తికీ, సందర్భపాలనకీ అభినందించకుండా ఉండలేకపోయాము.

చోప్టా దాటిన తరువాత, 'మండల్' అనే మరొక ఊరు, ఆపై, చమోలి జిల్లా కేంద్రమయిన 'గోపేశ్వర్'. ఆ ప్రాంతంలోకెల్లా అతి సుందరమైన ప్రముఖ పట్టణం. మేము దర్శించి వచ్చిన కేదార్ రుద్రప్రయాగ జిల్లాలో ఉండగా బదరీ, సిక్కుల ముఖ్య యాత్రాస్థలం హేమకుండ్ సాహెబ్, ప్రపంచ ప్రసిద్ధ సహజ 'పుష్పవన లోయ ' ఈ చమోలి జిల్లాలో ఉన్నాయి. వాహనం ఆపకుండానే నగర అందాలను వీక్షిస్తూ ముందుకు సాగాము. తరువాత 'చమోలి' పట్టణం. తిరుగు ప్రయాణంలో ఇక్కడ ఒక రాత్రి బస చేయవలసి ఉంది. అది కూడా దాటగానే, 'బిరాహీ' అనే గ్రామం వద్ద అలకనందా నది ఒడ్డున నిగం గెస్టుహౌసు. దీని ప్రస్తావన యాత్ర తిరుగు ప్రయాణంలో మరొకసారి మళ్ళీ చూస్తాము. సమయం మూడు దాటింది. ఆకలి వేస్తున్నప్పటికీ ఎందుకనో అప్పటివరకూ ఎవరూ బయటపడి ఆ ప్రస్తావన తీసుకురాలేదు. అయినా తప్పదు కదా! కిరణే చొరవ తీసుకుని వాహనాన్ని గెస్టుహవుసు లోకి మళ్ళించాడు. అందులో రెస్టారెంట్ కూడా ఉంది. కాని, అప్పటికే అది మూసేశారు. ఆ ఎదురుగానే ఉన్న మరో ప్రయివేటు రిసార్ట్ లోని 'ఉపవన్' అనే రెస్టారెంట్లో భోజనాలు చేసాము. భోజనానంతరం మళ్ళీ బయలుదేరి సుమారు 40 కిలోమీటర్లు ప్రయాణించి గం. 5.15 ని.లకు

జోషిమట్ లోని కేబుల్ కార్ స్టేషనుకు చేరాము. అయితే చివరి కారు 5 గంటలకే వెళ్లి పోయినందువల్ల ఇక ఆ రోజుకు అది సాధ్యపడలేదు.

**జోషిమట్**

తిరిగి ప్రధాన యాత్రలోకి వస్తే, జ్యోతిర్మఠం అని కూడా పిలువబడే ఈ జోషిమట్ కు పౌరాణికంగా చాలా ప్రాముఖ్యత ఉంది. కేదారేశ్వరునికి ఓఖిమట్ ఏ విధంగా శీతాకాల విడిదో, బదరీనాథునికి ఈ జోషిమట్ అలా శీతాకాల విడిది. క్రీ.శ. 8వ శతాబ్దంలో అదిశంకరులు దేశం నాలుగు దిక్కులా నెలకొల్పిన పీఠాలలో దక్షిణాన శృంగేరి, తూర్పున గోవర్ధన పీఠం(పూరీ), పశ్చిమాన శారదా పీఠం (ద్వారక) కాగా నాలుగవది ఉత్తరాన ఈ జ్యోతిర్మఠం.

మేము బస చేసిన గెస్టుహౌసుకు అత్యంత సమీపంలోనే ఈ శంకరమఠం ఉంది. 26వ తేదీ ఉదయం గం. 6.00లకే సిద్ధమై ముందుగా ఈ మఠాన్ని దర్శించాము. ఇక్కడ అమ్మవారు శారదాదేవి. అంత ప్రాతః సమయానికే మనోహరముగా అలంకరింపబడిన అమ్మవారి ప్రసన్నమైన దర్శనంతో అనుగ్రహింపబడినాము. అనిర్వచనీయమైన మధురానుభూతి సమ్మిళితమైన సంతృప్తితో ఆ రోజు ప్రయాణాన్ని మొదలెట్టాము.

**బదరీ ప్రయాణం**

ఉదయం గం.8 అవుతుండగా గోవిందఘాట్ చేరాము. బదరీ నుంచి వచ్చే వాహనాలకు దారి ఇచ్చేందుకుగాను బదరీ వెళ్ళే వాహనాలన్నీ సుమారు గంట పాటు నిలిచి పోయాయి. తిరిగి బయలు దేరాక 26 కిలోమీటర్ల ప్రయాణం నెమ్మదిగా సాగింది. గెస్టుహౌసుకు చేరేటప్పటికి సమయం పది గంటలయింది. ఇది ప్రధాన దేవాలయానికి చేరువలోనే ఉంది. మధ్యాహ్నం గం 12 లకు గాని రూములు ఖాళీకావని చెప్పారు. ఈ యాత్రలోని అన్ని ప్రదేశాలలోని గెస్టుహౌసుల్లోనూ, ప్రైవేటు రిసార్ట్స్ లోను, లాడ్జిలలో

మధ్యాహ్నం 12 గంటలకు చెకౌట్ టైము. అంటే మనం ఎన్ని గంటలు ఉన్నామనేదానితో నిమిత్తం లేకుండా రూములో దిగిన సమయం తరువాత వచ్చే మొదటి మధ్యాహ్నం 12 గంటలకు రోజుగా పరిగణించి నిర్ణీత రుసుము వసూలు చేస్తారన్నమాట.

నిర్ణయింపబడిన ప్రణాళిక ప్రకారం నేను మాత్రమే నిర్వహింప వలసిన కార్యక్రమం పితృ దేవతలకు పిండ ప్రదాన కార్యక్రమం. పిండ ప్రదాన క్రతువులో ముఖ్యమయిన పిండాలకు అవసరమయిన అన్నం బదరీనాథుని ప్రసాదం రూపంలో లభిస్తుంది. ఈ అన్నాన్ని 'భోగం' అంటారు. అయితే దీనికోసం దేవస్థానానికి నిర్ధారిత రుసుము చెల్లించాలి. ఈ కార్యక్రమం చేయించే పురోహితులే దీన్ని సమకూరుస్తారు. అందుకు కావలసిన విచారణ చేయగా, ఈ కార్యక్రమాలకు ఒకరోజు ముందుగాని, లేదా అదేరోజు ఉదయం 9 గంటల లోపుగాని ఈ ఏర్పాట్లు చేసుకోవలసి ఉంటుందని తెలిసింది. అప్పటికే పదకొండు గంటలవుతోంది. ఇక ఆ రోజుకు ఆ కార్యక్రమం సాధ్యపడదని తేలిపోవటంతో, సరే! ఉదయం జోషీమట్ లోనే స్నానాదికాలు చేసి ఉన్నాం కనుక, బదరీనారాయణుని దర్శనమన్నా చేసుకుందామని సంకల్పించుకుని దేవాలయానికి చేరుకున్నాం. మరో నిరుత్సాహం. దర్శనానికి వేచియున్న భక్తుల శ్రేణి కొస ఎక్కడో జాడలేనంత పొడవుగా ఉంది. దర్శనం చేసుకుని ఎప్పుడు బయటపడతామో ఊహించడం సాధ్యంకాలేదు. అయినప్పటికీ అత్తగారిని వెంటబెట్టుకుని బయలు దేరింది లక్ష్మి. మిగతా నలుగురమూ నదికి ఇవతల ఒడ్డున వంతెన ప్రక్కనేఉన్న హోటలులో కూర్చున్నాము. పది నిముషాలు గడిచిందో లేదో నా మొబైల్ పై లక్ష్మి సంక్షిప్త సందేశం. "అత్తగారు నిలబడలేక పోతున్నారు. లైనులోనుండి నిష్క్రమించాం. మీరెక్కడున్నారు?" ఈ సందేశం చూస్తూండగానే వంతెనపై నడుస్తూ హోటలు కిటికీలోంచి వారు

కనబడ్డారు కూడా. ఇక ఆ ప్రయత్నానికి కూడా తాత్కాలికంగా స్వస్తిపలికాం. జయలక్ష్మికి తక్షణమే విశ్రాంతి అవసరమయింది. వెంటనే ఆంధ్రాశ్రమంలో మా ఇద్దరికీ ఒక గది తీసుకుని అక్కడ చేరిపోయాం. మిగతా వారు నిగం గెస్ట్ హౌసుకు వెళ్ళారు. అందరికీ మధ్యాహ్న భోజనం మాత్రం ఆంధ్రాశ్రమంలోనే. భోజనాంతరం కొంచెంసేపు విశ్రమించిన పిదప ఆంధ్రాశ్రమం మేనేజర్ శ్రీ కృష్ణమూర్తి (ఫోను నెంబరు 09319170256) గారి ద్వారా దేవాలయంలో ప్రత్యేక దర్శనాల వివరాలు సేకరించి తిరిగి దేవాలయ ప్రాంగణానికి వెళ్ళాను.

సాయంత్రం గం 4 నుండి రాత్రి 10 గంటలవరకు గంటకొకటి చొప్పున మొత్తం ఆరు ప్రత్యేక హారతి కార్యక్రమాలు, ఆయా సమయాల్లో ప్రత్యేక దర్శనాలు ఉన్నాయి. వాటి వివరాలు –

| | | |
|---|---|---|
| (1) | కర్పూరహారతి | రు. 211 |
| (2) | చాందీ హారతి | రు. 421 |
| (3) | స్వర్ణహారతి | రు. 491 |
| (4) | అష్టోత్తరహారతి | రు. 521 |
| (5) | విష్ణు సహస్రనామహారతి | రు. 561 |
| (6) | విష్ణుసహస్రనామపారాయణ హారతి | రు . 701 |
| (7) | శ్యామగీతగోవిందహారతి | రు. 1401 |

ఈ రుసుములన్నీ ఒక జంటకు వర్తిస్తాయి. వీటన్నిటికీ రిజర్వేషన్ సౌకర్యం ఉన్నందువల్ల నేను వెళ్ళిన సమయానికి స్వర్ణహారతికి మాత్రమే మూడు టికెట్లు మినహా మిగతా అన్నీ మరునాటికి కూడా బుక్ అయిపోయాయి. మేము సరిగ్గా మూడు జంటలమే కదా! మరి

బదరీనాధుని అనుగ్రహంకాక మరేమిటి? వెంటనే రుసుము చెల్లించి మూడు టికెట్లు తీసుకున్నాను.

**'మానా' గ్రామ పర్యటన**

ఈ సమయంలో మావాళ్ళు ఒక గైడు సాయంతో బదరీకి మూడు కిలోమీటర్ల దూరంలో నున్న భారతదేశ చిట్టచివరి గ్రామం 'మానా'కు వెళ్లివచ్చారు. తిరిగివచ్చిన పిదప వారు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ గ్రామానికి 'మణిభద్రపురం' అనే పేరు కూడా ఉంది. ఈ గ్రామవాసులు గంధర్వజాతికి చెందినవారుగా చెపుతారు. వీరు ఊలు దారాలతో దుస్తులు, సుందరమైన వస్తువులు తయారుచేస్తారు. అక్కడికి ముప్పై కిలోమీటర్ల దూరంలో టిబెట్ (చైనా) సరిహద్దు ఉంది. కేవలం భారత సరిహద్దు చిట్ట చివరి గ్రామంగానే కాక దీనికి ఇంకా అనేక ప్రత్యేకతలున్నాయి.

భారత దేశంలోని చాలా మారు మూల గ్రామాలలో గొట్టాల ద్వారా రక్షిత మంచి నీరు సరఫరా వ్యవస్థ ఉండదు. అలాంటి గ్రామాల్లో స్త్రీలు సామాజిక బావుల వద్ద బట్టలు ఉతుక్కోవడం, గృహావసరాలకు, త్రాగటానికి మంచి నీరు తెచ్చు కోవటం సాధారణ దృశ్యం. అటువంటిదే కానీ దేశంలో మరెక్కడా కనబడని మరొక ప్రత్యేకత ఇక్కడ కనబడుతుంది. అవే సామాజిక పొయ్యిలు (Community Choolas). ఈ 'మానా' గ్రామంలో గృహిణులు ఇంటి నుంచి పిండిని తెచ్చుకుని బృందాలుగా చేరుకొని కబుర్లు చెప్పుకుంటూ ఈ పొయ్యిల్లో రొట్టెలు చేసుకోవడం చూస్తాము. అంటే వీటికి అవసరమైన ఇంధనం సమకూర్చటం, వాటిని నిర్వహించటం అన్నీ సమిష్టిగానే చేస్తారన్నమాట.

మారుమూల సరిహద్దు గ్రామమయినందున ప్రకృతి సిద్ధమైన రామణీయతతో పాటు సహజంగా ప్రజల సాంప్రదాయిక గ్రామీణ జీవనాన్ని ఊహిస్తాము. అందుకు భిన్నంగా దేశంలోని మిగతా పర్యాటక స్థలాల మాదిరిగానే ఇక్కడ కూడా స్థానికులు తమ సాంప్రదాయ వృత్తులకంటే పర్యాటకుల అవసరాలకు అనువైన వ్యాపారాలపైనే అధికంగా ఆధారపడడం చూస్తాము.

వేదవ్యాసుడు మహాభారత రచన చేసిన స్థలం వ్యాసగుహను ఇక్కడ చూడవచ్చు. వ్యాసమహర్షి చెపుతుండగా మహాభారతాన్ని లిఖించిన విఘ్నేశ్వరుని యొక్క' గణేశ గుహ' కూడా ఇక్కడ ఉంది. పాండవుల స్వర్గారోహణ మొదలైంది కూడా ఇక్కడే. అక్కడ 'భీమ్ పూల్' గా పిలువబడే ఒక సేతువును చూస్తాము. నిజానికి ఇది మామూలు వంతెనవలె కనబడదు. అది ఒక కొండ.

పాండవుల స్వర్గారోహణ మార్గంలో పరవళ్ళు తొక్కుతూ ఉధృతంగా

ప్రవహిస్తున్న సరస్వతి నదిని దాటటానికి ద్రౌపది శ్రమ పడుతుండగా ఆమె సౌకర్యంకోసం భీముడు ఒక కొండను ఆ నదికి అడ్డంగా పడేశాడట. అక్కడికి మరో రెండు కిలోమీటర్ల దూరంలో ద్రౌపది పరమపదించిన స్థలం ఉంది. అక్కడే ద్రౌపది విగ్రహం, ఆలయం ఉన్నాయి. అక్కడ నుంచి పాండవులు స్వర్గారోహణ పర్వంలో ఒక్కరొక్కరుగా పరమపదించిన ప్రదేశాలు వరుసగా వస్తాయి. అవన్నీ కూడా చూడవలసిన స్థలాలే అయినప్పటికీ సమయాభావం వలన మా వాళ్ళు పర్యటనను ఆ గ్రామం తోనే ముగించారు.

ఆ కొండపై నుండి ద్రౌపది సులభంగా నదిని దాటి వెళ్ళగా, భీముడు వేసిన ఆ కొండ క్రిందికి అదృశ్యమైన సరస్వతీ నది మాత్రం అక్కడనుండి అంతర్వాహినిగా ప్రవహించడం ప్రారంబించిందిట. ఆ కారణంగానే, అలహాబాద్ లోని త్రివేణి సంగమం (ప్రయాగ) లో గాని ఆ నది సంగమించే మరే ఇతర ప్రయాగల్లో కాని ఈ నది నీటిని మనం చూడలేము. శీతాకాలం బదరీ చుట్టుప్రక్కల ప్రాంతాలన్నీ మంచుతో కప్పబడినప్పుడు ఉత్తరాఖండ్ ప్రభుత్వమే ఈ గ్రామ ప్రజలకు 'చోప్టా'లో ఆశ్రయం కల్పిస్తుందట. ఇక్కడున్న వారిలో కొందరికి చొప్టాలో స్వంత ఆస్తులు కూడా ఉంటాయట.

**బదరీనారాయణ దర్శనం**

***బహూని సంతి తీర్థాని దివి భూమౌ రసాతలే***

***బదరీ సదృశం తీర్థం న భూతం భవిష్యతి***

(స్కంద పురాణం)

వారు 'మానా' నుంచి తిరిగి వచ్చేటప్పటికి, దర్శనానికి దేవాలయంలో ఉండవలసిన సమయం, స్థలం తెలియజేశాను. అందరం అయిదు గంటలకల్లా ఆలయానికి చేరుకోగా నిష్క్రమణ మార్గం ద్వారా మమ్ములను లోనికి అనుమతించారు. అప్పటికి 'చాందీ' హారతి ఇంకా జరుగుతూ ఉంది. కొద్ది సేపు వేచిఉన్నాక గర్భాలయంలోకి ప్రవేశించాం. అలా

ప్రతి దర్శనానికి పాతిక నుంచి ముప్పై జంటలకు మాత్రమే ప్రవేశం పరిమితం. ఆ పరిమితిలోనే టికెట్లు కూడా ఇవ్వడం జరుగుతుంది. ఆ క్రమంలో అందరం స్వామివారి సన్నిధిలో ఆసీనులమయ్యాం.

విధినిర్వహణలో నున్న అర్చకులు ముందుగా అక్కడ ఉపస్థితమై ఉన్న అన్ని జంటల నామములు గోత్రములు అందరికి వినబడే లాగున చదివారు. ఆ తరువాత అర్చన జరిగింది. చివరగా హారతి, ఆపై మంత్ర పుష్పంతో దర్శనం ముగిసింది. ఈ స్వామికి తులసి మాలలు అత్యంత ప్రీతికరం. అక్కడ లభించే ఈ మాలలు కూడా ఎంతో పరిమళ భరితంగా ఉంటాయి. కల్పాంతకంలో విష్ణుమూర్తియున్న యోగముద్రే శ్రీ బదరీ నారాయణ విగ్రహమని క్షేత్ర పురాణంలో చెప్పబడింది. శ్రీ మహా విష్ణువు దశావతారాలలో తొమ్మిదవదయిన బుద్ధావతారంలో గౌతమ బుద్ధుడు కూడా ఇదే ముద్రలో ఉంటాడు కనుక, బౌద్ధమతస్థులు ఈ స్వామిని బద్రీవిశాల్ అని పిలుస్తారు. కానీ బౌద్ధమతంలో విగ్రహారాధనకు యోగ్యత లేదు. బుద్ధుడు విష్ణుమూర్తి దశావతారాలలో ఒకటని కూడా అసలు వారు విశ్వసించరు. అందుచేత బౌద్ధేతరులైన హిందువులు చేసే ఈ విధమయిన అనవసర ప్రచారంలో ఏమంత ఇంపు తోచదు.

శ్రీమన్నారాయణుడు యోగముద్రలో పీఠంపై అసీనమైఉన్న విగ్రహం చాలా ఆకర్షణీయంగా ఉంటుందని చెప్పగా వినటం, గ్రంధాలలో చదవగాను తెలుసుకోవటం తప్పితే, విగ్రహం చిన్న పరిమాణంలో ఉండటంతోను, ముఖ్యంగా తులసి, ఇతర భారీ పుష్ప మాలలతో అలంకరణ పూర్తిగా ముంచేయటంతోనూ స్వామి రూపం అసలేమీ ప్రస్ఫుటం కాలేదు. అందుచేత స్వయంగా చూసి తరించే భాగ్యం కలుగలేదు. అయితే గర్భాలయం చుట్టూ ప్రాకార ప్రాంగణంలో నెలకొల్పబడిన వివిధ దేవతా మూర్తుల

విగ్రహాలలో ప్రసన్నమైన వదనంతో ధ్యానముద్రలో నున్న బదరీ నారాయణుని మూర్తి దర్శనం ఎంతో సంతృప్తిని ఆనందాన్ని కలిగించింది. ఆ ప్రక్కనే లక్ష్మీదేవి ఆలయం ఉన్నది. నా శ్రీమతి అప్పటికప్పుడు ఒక చీర తెప్పించి కుంకుమార్చనతో అమ్మవారికి సమర్పించింది. మరికొంతసేపు ఆ ప్రాంగణంలోనే గడిపి బయటకువచ్చి ఆలయం నేపథ్యంలో కొన్ని గ్రూపు ఫోటోలు దిగాం.

బదరీనాధుని ఆలయం వెనుక నీలకంఠ పర్వతం ఉంది. ఆ పర్వతం నుండి వేడినీరు నిరంతరమూ ప్రవహిస్తూ మూలవిరాట్టు క్రిందనుంచి ఎడమవైపుగా వచ్చి దేవాలయానికి ఎదురుగా దిగువలో ప్రవహిస్తున్న అలకనందలో కలుస్తుంది. ఈ నీటికి, స్త్రీ పురుషులకు వేర్వేరుగా రెండు కుండాలు నిర్మించి వాటిలో ఎల్లప్పడూ ఒకే మట్టంలో నిలువ ఉండే విధంగానూ మిగతా నీరు కొంత కుళాయిలలోకి మిగతాది నదిలో కలిసే విధంగానూ ఏర్పాటు చేయబడి ఉంది. ఈ కుండాలలోను, కుళాయిల వద్ద, భక్తులు, వారివారి ఆసక్తిని, అవకాశాన్ని బట్టి స్నానమాచరిస్తారు. పిండ ప్రదాన కార్యక్రమాలు చేసేవారికి ఇందులోస్నానం తప్పనిసరి. ఆ రీత్యా మరునాడు నేను పూర్తి స్నానం చేయవలసి ఉన్నప్పటికీ, మేమిద్దరమూ కుళాయిలవద్ద మార్జన స్నానం చేసాము. నదినిదాటి ఇవతలకు వచ్చి అక్కడ దుకాణాలను దర్శిస్తూ మార్గానికి ఇరువైపులా ఉన్న సాధువులు

బిక్షకులకు దానాలు చేస్తూ మరికొంత సేపు ఆ పరిసరాల్లో గడిపి ఫలహారాలు తీసుకుని ఎవరి బసలకు వారు చేరుకున్నాం.

ఆ మరునాడు నేను చేయవలసిన కార్యక్రమాల నిర్వహణ కోసం క్షేత్ర పురోహితులు శ్రీ లవకుమార్ జ్ఞానీ (ఫోను నెంబరు: 09634438417) గారిని సంప్రదించగా, వారు మా బసకువచ్చి కార్యక్రమానికి సంబంధించిన వివరాలు తెలిపి నన్ను మరునాడు ఉదయం 9 గంటలకు దేవాలయం ప్రక్కనే అలకనంద నది ఘట్టాల వద్దకు రావలసినదిగా కోరారు. మొత్తం కార్యక్రమానికి సుమారు రెండు గంటల సమయం పట్టవచ్చని తెలిపారు. అలా ఆ రోజు, నిర్వహింపవలసిన ముఖ్యమైన కార్యక్రమపరంగా అసంపూర్తిగా ముగిసింది.

క్రితం రోజు కార్యక్రమాలన్నీ అనుకున్న విధంగా పూర్తి అయి ఉండినట్లయితే, నిర్ణయించబడిన కార్యక్రమం ప్రకారం అందరం ఈ రోజు ఉదయమే బయలుదేరి గోవిందఘాట్ చేరుకొని వాహనాన్ని అక్కడ విడిది చేయించి పుష్పవనలోయ (Valley of Flowers) వెళ్ళటానికి గాను సాయంత్రం లోపు ఏ రెండు మూడు గంటలకో గాంఘ్రియా, అనే గ్రామానికి చేరుకోవాలి. పుష్పవన లోయకు వెళ్ళటానికి ఈ గాంఘ్రియా 'పీఠస్థానం' (Base Camp). మరునాడు అక్కడనుండే పుష్పవనానికి వెళ్ళాలి. ఈ గాంఘ్రియా, గోవిందఘాటు నుండి 14 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడినుండి పుష్పవనం 6 కిలోమీటర్లు. అందుచేత నా కార్యక్రమం పూర్తి అయిన తరువాత బయలుదేరితే సమయం చాలకపోవచ్చు. పైగా బదరీ గోవిందఘాటుల మధ్య గేటు సిస్టం (One way traffic) అమల్లో ఉంటుంది. ఉదయం 8 గంటలలోపు, పది పన్నెండు గంటలమధ్య, తిరిగి మధ్యాహ్నం రెండు గంటల తరువాత మాత్రమే బదరీ నుండి బయటకు వెళ్ళే అవకాశం ఉంది. అందువల్ల ఏ కారణం చేతనైనా నా కార్యక్రమం ఆలస్యమై అందరం

పన్నెండు గంటలలోపు బయలుదేరలేకపోతే సమయ పాలనపరంగా తరువాత యాత్రకు భంగం వాటిల్లే అవకాశం ఉంది. అందుచేత, నా వరకు ఆ పర్యటన నుంచి విరమించుకోవడానికి సిద్ధపడ్డాను. ఆ ప్రకారం నేను మరో రెండు రోజులు బదరీలోనే ఉండిపోయి, వారు పుష్పవన లోయ విహారం ముగించుకుని గాంఫ్రియా నుంచి తిరిగి గోవింద్ ఘాట్ వచ్చే సమయానికి నేను గోవిందఘాట్ చేరుకొని వారితో కలవాలి. అయిష్టంగా నయినా అందరూ ఇందుకు అంగీకరించక తప్పలేదు. ఆ విధంగా వాళ్ళు ఉదయం ఏడు గంటలలోపే గెస్టుహౌసు ఖాళీచేసి ఆంధ్రాశ్రమానికి వచ్చి నా శ్రీమతిని కలుపు కుని గోవిందఘాటుకు వెళ్ళిపోయారు. కొద్దిసేపటి తరువాత నేనున్నూ నా కార్యక్రమ నిమిత్తం అలకనందా ఘట్టాలకు వెళ్ళాను.

ఈ కార్యక్రమం జరిగే ప్రదేశం నున్నటి బండలు పరచబడి చాలా పరిశుభ్రంగా ఉంది. ఉష్ణనీటి కుండంలో స్నానమాచరించిన వెంటనే కార్యక్రమం మొదలైంది. నది ఒడ్డున ముందుగా శ్రీ లక్ష్మినారాయణుని పూజ చేయించారు. అక్కడే మరొక చోట బ్రహ్మకపాల శిల ఉంది. అక్కడ పిండ ప్రదాన క్రతువు చేయించారు. పిండాలను ఆ శిలకు తాకించి తదనంతరం అలకనందలో నిమజ్జనం చేయటంతో ఆ క్రతువు సంపన్న మయింది. ఈ మొత్తం కార్యక్రమమంతా 11 గంటలలోపే పూర్తయింది. ఆంధ్రాశ్రమానికి తిరిగి వచ్చి మావాళ్ళ స్థితి ఏమిటో తెలుసుకుందామని డ్రైవరుకు ఫోను చేసాను. వారిని గోవిందఘాటులో దించేసి గం. 8.45 ని.లకే తాను తిరిగి బదరీకి వచ్చినట్లుగా తెలిపాడు. నాలో పునరాలోచన మొదలైంది. గోవింద్ ఘాట్ వెళ్ళటానికి గంట సేపు కూడా పట్టలేదన్న మాట. గేటు మూసే లోపు బయటపడి 12 గంటలకల్లా అక్కడకు చేరుకోగలిగానా, వెంటనే గుఱ్ఱమో, పల్లకినో మాట్లాడుకుని, ఎలాగూ అక్కడ సాయంత్రం ఏడు గంటలవరకూ

వెలుతురు ఉంటుంది కనుక చీకటిపడే లోపు ఒంటరిగా గాంఫ్రియా చేరుకోలేనా అని ఆలోచించాను. ఇదే విషయం డ్రైవరును అడగగా సానుకూలంగా స్పందించాడు. గది ఖాళీ చేసి ప్రయాణానికి సిద్ధమయ్యేసరికి వాహనం రానే వచ్చింది. వెంటనే బయలుదేరి గోవిందఘాట్ చేరుకున్నాను. నేను ఈ విధంగా నిర్ణయం మార్చుకున్నట్టు వారికి తెలియచేయటానికి సెల్ ఫోన్ లు పని చేస్తేగా?

## BSNL వారి నిర్వాకం

పర్యావరణ పరిరక్షణ విధానంలో భాగంగా భారత ప్రభుత్వం, పర్వత అటవీ ప్రాంతాలలో విస్తృతంగా విద్యుదయస్కాంత ధార్మిక తరంగాలను అధిక స్థాయిలో విసర్జించే సెల్ ఫోన్ టవర్ల నిర్మాణాన్ని, నిర్వహణను నియంత్రిస్తుంది. తదనుగుణంగా Telecom Regulatory Authority of India (TRAI) ద్వారా సెల్ ఫోన్ సేవలు నిర్వహించడానికి ప్రభుత్వరంగ సంస్థ అయిన 'భారత్ సంచార్ నిగం లిమిటెడ్' (BSNL)కు పూర్తి స్థాయిలోనూ, మిగాతా ప్రయివేటు సంస్థలకు పరిమితంగానూ అనుమతినిస్తుంది. ఈ కారణంగా ప్రముఖ యాత్రా స్థలాలైన యమునోత్రి, గంగోత్రి, కేదార్, బదరీలతోపాటు, శ్రీనగర్, గౌరికుండ్, గోపేశ్వర్, చమోలి, జోషిమట్ వంటి పట్టణాల్లో BSNLతో పాటు ఎయిర్ టెల్, ఐడియా, డోకోమో, వోడాఫోన్ వంటి కంపెనీల సేవలు పొందగలిగినప్పటికీ, ఆ తరంగాలు ప్రసరించే పరిధి ఆయా పట్టణ ప్రాంతాలకే పరిమితమై ఉంటాయి. అందువల్ల నిరంతరంగా ఈ సౌకర్యం పొందాలంటే BSNL కనెక్షన్ తప్పనిసరి. నాలుగు సంవత్సరాల క్రితం దక్షిణ కర్నాటకలోని బందీపూరులోనూ, వాయువ్య తమిళనాడులోని మదుమలై అడవులలోనూ పర్యటన చేస్తున్నప్పుడు ఎదురైన అనుభవం నేపథ్యంలో, ఈ యాత్ర ఏర్పాట్లలో భాగంగా మా బృందంలో ఎవరివద్దా ఈ BSNL కనెక్షను

లేకపోవడంతో ముందు జాగ్రత్తగా, అదనంగా Cell One (BSNL) కనెక్షను తీసుకున్నాను. అంతటితో ఊరుకున్నానా? ఎవరెవరైతే నాకు ఫోన్ చేసే అవకాశం ఉందో, వారందరికీ సగర్వంగా ఈ నంబరు, చాటింపు స్థాయిలో ఇచ్చాను. అయితే 'తాళం వేసితిని, గొళ్ళెం మరిచితిని' అనే సామెత లాగ BSNL వారు కనెక్షనైతే ఇచ్చారు కానీ, వేరే రాష్ట్రాలలో ముఖ్యంగా హిమాలయా పర్వత ప్రాంతాలలో వినియోగార్థమై ఈ కనెక్షను ప్రత్యేకంగా తీసుకుంటున్నట్లు దరఖాస్తులో స్పష్టంగా పేర్కొనటమే కాక సిబ్బందికి మౌఖికంగా తెలియజేసినప్పటికీ రాష్ట్రం బయట కూడా పనిచేసే రోమింగ్ సౌకర్యం మాత్రం కల్పించలేదు. ఇది నాకు తెలియదు. ఆ ఫోనుకు తెలుసు కదా! ఫలితంగా మేము ప్రయాణించిన 'దురోంతో' ఎక్స్ ప్రెస్ ఆదిలాబాదు జిల్లా దాటిందో లేదో ఇది మూగపోయింది. కనెక్టివిటీ సమస్యేమో ననుకున్నాను. అయినా మిగతా ఏ సర్వీసులో లేని ఈ సమస్య అందునా BSNLకు చెందిన దీన్లో ఏమిటో మొదట్లో అర్థం కాలేదు. డిల్లీలో దిగిన తరువాత వేరే నంబర్లకు ఫోను చేసినవారు ఈ ఫోనుకేమయింది అని అడుగుతుంటేగాని అసలు విషయం బోధపడలేదు. ఇక అప్పటి నుంచీ హైదరాబాదులో BSNL కస్టమర్ కేర్ వారితో ఇతర ఫోన్లనుండి మాట్లాడటానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. అందుకు సంబంధించిన సరయిన వ్యక్తి దొరికితేనా? సరే! పవిత్రమైన మనసుతో ప్రశాంతంగా చేయవలసిన యాత్రలో దీని గురించే ఆలోచిస్తూ మనసు పాడుచేసుకోవటం ఎందుకులే అని అప్పటికి ఊరుకున్నాను.

ఆ మరునాడు హరిద్వార్ నుండి గౌరికుండ్ వెళ్ళేమార్గంలో శ్రీనగర్ పట్టణం సమీపిస్తుండగా ప్రతి కిలోమీటరుకు ఒక పది చొప్పున దారి పొడవునా ఒక సినీ తార ఫోటోతో 'BSNL Connecting India' అనే

నినాదంతో ప్రచార హోర్డింగులు అట్టహాసంగా కనిపించాయి. ఆ ఫోను పుణ్యమా అని అప్పటివరకూ సలక్షణంగా ఉన్న నేను ఉన్నట్టుండి దేశంతో డిస్కనెక్ట్ (Disconnect) అయిపోయిన నేపథ్యంలో ఆ బోర్డులు చూస్తుంటే ఆవేశం పెల్లుబకగా ఆగ్రహం కట్టలు తెంచుకుంది. శ్రీనగర్ పట్టణంలో ఆ సంస్థ కార్యాలయం వద్ద ఆగి, లక్ష్మిని వెంటబెట్టుకుని వారి సహాయం అర్థించాను. నాకు కలిగిన అసౌకర్యాన్ని సహృదయంతో గ్రహించినవారైనప్పటికీ పరిష్కారం వారి పరిధిలో లేనందున హైదరాబాదులో సంబధించిన కార్యస్థానం వారితో వారి ఫోనుల నుంచే నన్ను మాట్లాడించారు. అయినా ఫలితం శూన్యం. నా సమస్యను తీర్చలేదు సరికదా కనీసం సౌమ్యమైన సమాధానం కూడా కరువైంది. ఒక వినియోగదారుని సమస్యని సానుభూతితో అర్థం చేసుకుని, ఎంతో ఔదార్యం చూపవలసిన ఒకానొక అసాధారణ సందర్భంలో నేను చవిచూసిన ఉదాసీనత వారి బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ట.

BSNL ఆంగ్ల అక్షరాలకు విస్తృత సమాసంగా (Best Spoken National Language' -*బెస్ట్ స్పోకెన్ నేషనల్ లాంగ్వేజ్*) 'అత్యుత్తమంగా మాట్లాడబడే జాతీయ భాష' అని అర్థం వచ్చేట్టుగా (Tag Line) ప్రచారంలో ఆర్భాటంగా పేర్కొంటారు. అలాంటి సంస్థలో పనిచేసే అందరూ కాకపోయినా నా విషయంలో తారసపడిన ఆ ఒకరిద్దరి అనాగరికతకు, సంస్కారహీనతకు సరితూగే తత్త్వం, లౌక్యమూ లేని నా దుర్బలత్వానికి, భాషాదౌర్బల్యానికి, అట్టివారితో వ్యవహరించవలసివచ్చిన దౌర్భాగ్య స్థితికీ, నన్నునేనే నిందించుకున్నాను. ఇటువంటి అనుభవం అంతకు ముందు ఇంకెవరికైనా కలిగి ఉండవచ్చు, అందరికీ కలిగి యుండకపోనూవచ్చు. ఒకవేళ ఈ అనుభవం కలిగిన వారెవరైనా ఆ సందర్భాన్ని, సంబంధించిన పై స్థాయివారి దృష్టికి తీసుకువెళ్లి యుండినట్లయితే నా విషయంలో అది పునరావృతమై

ఉండేది కాదేమో? నాకయితే కలిగింది కదా! ఈ తరువాత నయినా మరొక వినియోగదారునికి ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా ఉండాలంటే నేనే ఏదయినా చేయటం నా కర్తవ్యంగాను, బాధ్యతగాను గుర్తించి, హైదరాబాద్ తిరిగి వచ్చాక నా ఫోన్ కనెక్షన్ ఉన్న ఆ సంస్థ దక్షిణ మండలం పరిధి అత్యున్నత అధికారి అయిన జనరల్ మేనేజరు శ్రీ సత్యనారాయణగారిని కలిసి వారిదృష్టికి ఈ విషయం వ్రాతపూర్వకంగా తీసుకువెళ్లాను. నేను వారినుంచి ఏ విచారమూ, సానుభూతీ ఆశించి వెళ్ళలేదు. నిజానికి అవేవీ నాకు జరిగిన అసౌకర్యాన్ని పరిహరించ జాలినవి కూడా కావు. ఏదో ఒక ఫిర్యాదు పోస్టులో పడేసో మెయిలుచేసో ఊరుకొవచ్చు. తత్భిన్నంగా వారిని స్వయంగా కలవటంలో నా ఉద్దేశాన్ని స్పష్టం చేసాను.

అయినప్పటికీ, అసలు విషయంలోని గహనాన్ని వారు ఏ మాత్రం గ్రహించినట్లు నాకు అనిపించలేదు. వారి అధికార పరిధిలో ఋజువర్తనను, విధి నిర్వహణలో ఖచ్చితత్వాన్ని పాటించటానికి ఉన్న అవరోధాలు, పరిమితులు ఏమిటో నాకు తెలియదు. కాని, జరిగినదానికి బాధ్యులను గుర్తించి వారిపై తగు చర్య తీసుకోవడానికి గాని, వినియోగదారుల పట్ల సిబ్బంది వ్యవహరించ వలసిన తీరు, వారితో సంబంధాలను మెరుగుపరిచే దిశగా గైకొనదగిన తక్షణ, దీర్ఘకాలిక చర్యల ఆవశ్యకత గురించి గాని, వారు ఏ విధమైన ఆసక్తి, శ్రద్ధ కనబరచకపోవటం వారితో నా సమావేశం మిగిల్చిన నిరుత్సాహం.

ఏ యాత్రలో నాకు అవసరమయిన రోమింగ్ సౌకర్యం కల్పించలేదో, ఆ యాత్ర పూర్తి అయిన సరిగ్గా పదిరోజులకు, అది కూడా, అదే విషయంపై ఫిర్యాదుతో వారి జనరల్ మేనేజరుగారి సమక్షంలో నున్న సమయంలోనే ఆ

సౌకర్యం, కల్పింపబడినట్లు నా ఫోనుపై సందేశం రావటం కొసమెరుపు. అపుడు నాకు ఆ సౌకర్యం కాదు కదా అసలు ఆ కనెక్షనే అవసరం లేదు.

అందుచేత నా ఈ అనుభవాన్ని గ్రహించిన వారెవరైనా ఇటువంటి యాత్రలు తలపెట్టినప్పుడు ఒకవేళ BSNL కనెక్షను అప్పటికే ఉన్నా లేదా ఇందుకోసం ప్రత్యేకంగా తీసుకున్నా రోమింగ్ సౌకర్యం కల్పించబడిందో లేదో ముందే నిర్ధారించుకుని బయలు దేరటం మంచిది. అలాగే, యాత్రలో ఫోన్ కు సంబంధించి ఏమైనా సమస్యలు ఏర్పడితే ఎవరిని సంప్రదించాలో వారి పేర్లు, హోదా, ఫోన్ నంబర్లు దగ్గర ఉంచుకోవటం మంచిది.



# విహార యాత్ర

## గాంఘ్రియా ప్రయాణం

సిక్కు మత గురు పరంపరలో పదవవాడైన శ్రీ గురుగోవింద్ సింగ్ హేమకుండ్ అనే ప్రదేశంలో తపస్సు చేసాడని విశ్వాసం. ఏడు శిఖరాల మధ్యస్థమై ఉన్న ఈ హేమకుండ్ ఒక సుందరమైన సరస్సు. దాని ప్రక్కనే నక్షత్రాకారంలో అందమైన గురుద్వారా ఉంది. ఇది సిక్కు మతస్థులకు ఎంతో పవిత్రమైన ప్రసిద్ధ యాత్రాస్థలం. శ్రీరామచంద్రుని అనుంగు సోదరుడైన లక్ష్మణుడిని సాధారణంగా శ్రీరామపరివారంలో మాత్రమే చూస్తాము. అటువంటిది ఈ హేమకుండులో లక్ష్మణుడు తపస్సు చేసాడని పురాణాలలో (మార్కండేయ) చెప్పబడియుండటం చేత, ఇక్కడ లక్ష్మణునికి ప్రత్యేకంగా ఆలయం ఉంది. ఇది గురుద్వారాకు అభిముఖంగా హేమకుండ్ సరస్సుకు మరో వైపున ఉంది. ఆదిలాబాదు జిల్లా సిర్పూర్ లోనూ, ఖజరహో (మధ్యప్రదేశ్) లోనూ లక్ష్మణుడికి ఆలయాలు ఉన్నట్లుగా తెలుస్తున్నది) హిమాలయాలలోని స్వచ్ఛమైన నీటి వనరుల సమీపంలో మాత్రమే ఉండే అరుదైన, అతి సుందరమూ పరిమళ భరితమూ అయిన బ్రహ్మకమలాలు' ఇక్కడ కూడా దర్శనమిస్తాయి. ఈ పుష్పాలు సంవత్సరంలో ఒకసారి అది కూడా రాత్రిపూట మాత్రమే వికసిస్తాయి. అందుకని దీనిని రేరాణి (Night Queen) అని కూడా పేర్కొంటారు.

ఇంత ప్రసిద్ధమైన ఈ హేమకుండుకు గాంఘ్రియా అనే గ్రామం పీఠస్థానం (Base Camp). ఇక్కడ నుంచి ఉత్తర వాయవ్యంగా ఐదు కిలో

మీటర్ల దూరంలో ప్రపంచ ప్రసిద్ధమయిన సహజ పుష్పవన లోయ ఉంటే ఉత్తర ఈశాన్యంగా ఐదు కిలోమీటర్ల దూరంలో హేమకుండ్ సాహెబ్ ఉంది. 'వాహేగురూ' 'సత్యేనాం' అనే గురునామస్మరణతో ప్రతినిత్యం వేలాదిమంది సిక్కు వృద్ధులు, యువతీయువకులు, బాలబాలికలు బృందాలుగా గాంఫ్రియా మీదుగా హేమకుండ్ చేరుకుంటారు. ఈ గాంఫ్రియా వెళ్ళటానికి 'గోవింద ఘాట్' ముఖద్వారం. ఆ రీత్యా జోషీమట్-బదరీ ప్రధాన రహదారికి రెండు కిలోమీటర్లు లోపలగానున్న ఈ గోవిందఘాట్ ప్రాముఖ్యత సంతరించుకుంది. వాహనాలు ఇక్కడివరకు మాత్రమే వెళతాయి కనుక గౌరికుండులో వలె ఇక్కడనే వాహనాలను వదిలివేయాలి. కేదారులో కంటే ఇక్కడ యాత్రికుల రద్దీ ఎక్కువ. తత్కారణంగా వాహనాల సంఖ్య కూడా ఎక్కువే. వీటి విశ్రమానికి బహుళ అంతస్తులతో కొన్ని వందల వాహనాలను ఒకేసారి ఇముడ్చుకోగల విశాలమైన అనేక భవన సముదాయాలున్నాయి. అవి కూడా సరిపోక, బదరీ ప్రధాన రహదారిలో సయితం కిలోమీటర్లమేర ఈ వాహనాలు నిలిచి యుంటాయి. వాటి డ్రైవరులకు విశ్రాంతిశాలలు ఉన్నాయి. ఇక్కడ కూడా ఒక గురుద్వారా ఉంది.

ఇక్కడనుండి గాంఫ్రియా 14 కిలోమీటర్లు. కేదార్ నాథ్ కంటే ఇక్కడ పల్లకీల రుసుములు చాలా ఎక్కువ. కేదార్ నాథ్ లో రెండు పల్లకీలకు 2700 రూపాయలు మాత్రమే చెల్లించగా ఇక్కడ ఒక్క పల్లకీకే ఆరువేలు అడిగారు. ఆ కార్మికులు కూడా తగినంతమంది లేరు. పది నిముషాలకు పైగా నిరీక్షంచగా ఒక్క మనిషి దొరికాడు. బహుశా మిగతా ముగ్గురిని సమకూర్చు కోవాలో ఏమో బయలుదేరటానికి సమయం కావాలన్నాడు. ఇక గుఱ్ఱాల అద్దె బేరం ఒకింత వింతగా ఉంది. ప్రతి గుఱ్ఱం వ్యక్తికీ రెండు గుఱ్ఱాలుంటాయి. మనం ఇద్దరం ఉంటే ఎలాగూ రెండు గుఱ్ఱాలు మనమే మాట్లాడుకుంటాం.

కాని ఇప్పుడు నా లాగా ఒక్కరే ఉంటే? అద్దె రెండు గుఱ్ఱాలకు చెల్లించాల్సిందే. ఆ విధంగా నేనొక్కడినే రెండు గుఱ్ఱాలకుగాను రానూపోనూ మాట్లాడుకుని మొత్తం రూ. 1800 లు ఆఫీసులోనే చెల్లించి మధ్యాహ్నం ఒకటిన్నరకు గోవింద్ ఘాట్ లో బయలుదేరాను.

ఆ మార్గంలో ప్రయాణం ఆద్యంతం అత్యంత ప్రమాదభరితంగా తోచింది. కేదార్ లో వలెనే ఈ మార్గంలోనూ ఒక వైపు పర్వతం మరో వైపు లోయలు. లోయ అడుగున అక్కడ మందాకినీ నది ఉంటే, ఇక్కడ లక్ష్మణగంగా నది, ఎత్తుగా పెరిగిన వృక్షాలతో దట్టమైన అడవులు. అయితే, కేదార్ మార్గంలో బాటకు లోయవైపు అంచున బలమయిన ఇనుపకమ్మీలతో ఏర్పాటయిన రక్షణ వ్యవస్థ ఉంది. ఇక్కడ అటువంటి ఏర్పాటు ఏదీ లేదు. పైగా గుఱ్ఱాలు ఇరువైపుల ప్రయాణంలోనూ లోయవైపే నడుస్తాయి. ఈ జంతువులు తమ ఎదురుగా మరో గుఱ్ఱమో, వ్యక్తో వస్తున్నప్పుడు తల భాగం మాత్రమే ప్రక్కకు తిప్పుతాయి తప్ప మిగతా శరీరదిశను మార్చవు. పాదచారులు పొరపాటున ఇటు వైపుగా నడిస్తే తాము తప్పుకుని ఎదురుగా వచ్చే గుఱ్ఱానికి దారి ఇచ్చేక్రమంలో బాట అంచుకు వెళ్లి జారిపోయే ప్రమాదం ఉంది. అందుకని వారు పర్వతం వైపునే నడవాలని అడుగడునా హెచ్చరిక బోర్డులు ఉంటాయి. మానవుడైతే సాధ్యమైనంతవరకు తనకు తగిన రక్షణ తనే తీసుకుంటాడు. మరి జంతువుకు అటువంటి విచక్షణ ఉంటుందా అని ఆలోచిస్తే భయంతో ఒక్క సారి ఒళ్ళు జలదరిస్తుంది. ఈ కారణం చేత అవి మరీ అంచుకు వెళ్ళినప్పుడు వాటిపై నున్నవారు భయంతో హాహాకారాలు చేస్తారు. మొదట్లో ఒక కిలోమీటరు వరకు నాకూ భయం కలిగింది. పైగా బయలుదేరిన తరువాత కొద్ది దూరంవరకు నా గుఱ్ఱాన్ని పట్టుకు నడిపిన వ్యక్తి అప్పటి వరకు ఖాళీగా వెంటవస్తున్న రెండో గుఱ్ఱంపై ఇద్దరు సిక్కుబాలలను

ఎక్కించడంతో అతను నా గుఱ్ఱాన్ని వదలి ఆ గుఱ్ఱాన్ని నడిపించసాగాడు. భయం వేస్తున్నప్పటికీ, ఆ బాలలవలె నేను కూడా కేకలు వేయలేను కదా! అప్పటికీ నా వంతు ప్రయత్నంగా, అది మరీ అంచునకు వెళ్తున్నట్టు అనిపించినప్పుడల్లా అప్రయత్నంగా చేతిలో ఉన్న కళ్ళెపు ఎడమ తాడును శక్తి మేరకు గుంజుతూ ఉన్నాను. స్టీరింగో. హ్యాండిలో తిప్పితే తిరగటానికి అదేమన్నా కారా, స్కూటరా? జంతువే కదా! దానికి జ్ఞానం ఎక్కడిది? అని, భావించిన అసలు నా జ్ఞానమేపాటిదో నెమ్మదిగా బోధపడింది.

మనిషికైతే నడిచేటప్పుడు తన అడుగు ఎక్కడ పడుతుందో కనబడుతుంది. కాని చతుష్పాద జంతువుకు తన కాళ్ళు, ముఖ్యంగా వెనుక కాళ్ళు ఎక్కడ పడేదీ కనబడదు కదా! మరి అటువంటప్పుడు అన్ని వందల జంతువులు ప్రతినిత్యం ప్రయాణించేటప్పుడు ఎన్నిమార్లు వాటి కాళ్ళు జారాలి, ఎన్ని, వాటిపై నున్న మనుషులతో సహా లోయల్లో పడిపోయి ఉండాలి? ఇన్ని సంవత్సరాలలో ఇప్పటి వరకు, మనుషులు నడిపే వాహనాలు లోయల్లో పడ్డాయేమోకానీ, వీటి విషయంలో ఒక్కటంటే ఒక్కటి కూడా అలాంటి సందర్భం లేదంటే భగవంతుడు ఆ జంతువులకు ప్రసాదించిన జ్ఞానం కాక మరేమనుకోవాలి. మానవుడిని సృష్టించిన ఆ పరమేశ్వరుడే కదా ఆ మానవుడికి సేవ చేయమని ఆ జంతువుని కూడా సృష్టించింది. అలాంటప్పుడు మనిషికి కల్పించిన ఆత్మరక్షణ జ్ఞానాన్ని ఆ జంతువులకు మాత్రం కల్పించడా? తన భద్రతకు తగిన జాగ్రత్త తనకు తెలుసునని గ్రహించకపోవటమే నా అజ్ఞానమని అప్పటికిగాని తెలుసుకోలేక పోయాను. మనసులో ఎప్పుడైతే ఈ ఆలోచన మొదలైందో, ఇక భయం పటాపంచలవటమే కాక, ఆ జంతువులపై కరుణతో కూడిన కృతజ్ఞతాభావం ఏర్పడసాగింది. నాలో ఈ భావం ఏర్పడి ఎప్పుడయితే స్థిరపడిందో,

మిగతా వారికి కూడా మరిలాంటి ధైర్యమే కలిగిందో, అలవాటు పడ్డారో లేక మరే ఇతర కారణమో వివరించలేను కాని, వారి హాహాకారాలు మాత్రం మరి వినిపించలేదు.

ఇక, ప్రకృతి అందాలను కెమెరాలో బంధిస్తూనూ సెలయేళ్ళు, జలపాతాల చలన సోయగాలను వీడియో తీయటం ద్వారానూ ప్రయాణాన్ని ఆస్వాదించాను. అయిదు కిలోమీటర్ల తరువాత 'పూల్నా' అనే సుందరమైన గ్రామం.అక్కడ టీ సేవించటానికి విరామం. మరో నాలుగు కిలోమీటర్లు పోయాక 'భ్యూందర్' అనే మరో సుందరమైన గ్రామం. అక్కడా విరామం. ఈ గ్రామం దాటాక అక్కడివరకూ మనకు కుడివైపున వస్తూన్న లక్ష్మణగంగా నదిని దాటి దూరంగా ప్రయాణిస్తూ ఉంటాం. అందువల్ల ఇక అది మనకు కనబడదు. అయితే అందుకు పర్యాయంగా మార్గం శిలాభూయిష్టమై ప్రయాణం దుర్లభం అవుతుంది. పెద్ద బండలను దాటటానికి ఒక్కక్కసారి గుఱ్ఱం స్వల్పంగా పైకెగిరి దూకుతుంది. ఊహించటానికే ఒళ్ళు గగుర్పొడిచే మునుపటి అంత కాకపోయినా ఇది మరోరకం భయం. అయితే కింద పడితే ఎక్కిన గుఱ్ఱంతో సహా ఆనవాలు కూడా దొరక్కుండా గల్లంతైపోవటానికి ప్రక్కన లోయగాని నదిగాని లేదుగా! అది కొంత ఉపశమనం. గుఱ్ఱం అలా ఎగిరినప్పుడు పట్టు కోల్పోతే అక్కడే క్రింద పడతాం. మహా అయితే కాలో చెయ్యో విరుగుతుంది, లేదా ఏ బుర్రో పగులుతుంది. అంతకు మించిన మరో అపాయానికి అవకాశం లేదు. కేవలం కర్మఫలం, భగవంతుని దయ (Destiny) తప్ప జీవితంలో అత్యంత అరుదుగా ఎదురయ్యే అసాధారణమైన పూర్వపు సందర్భాన్ని మినహాయిస్తే, ఇటువంటి సాధారణ సందర్భాలలో ఆ మాత్రం ప్రమాదం కూడా జరక్కుండా సూక్ష్మ స్థాయితో నిమిత్తం లేకుండా స్థూలస్థాయిలో శరీరానికే స్వీయ రక్షణకు అవసరమైన నిర్ణయం తీసుకునే

అధికారం ఉండే విధంగా మానవ మస్తిష్కంలోని సహజ అసంకల్పిత ప్రతీకార చర్య అనే ఒక ఉపవ్యవస్థ (Reflex activity mechanism) ఏర్పాటై ఉంటుంది. అయితే దీనికీ ఒక మినహాయింపు ఉంది. కొన్నిసార్లు మానవ సహజమైన అహం, సామాన్య వివేకాన్ని అడ్డుకుని ఈ అసంకల్పిత ప్రతీకారచర్య వ్యవస్థను సయితం పని చేయనివ్వదు. ఆ స్థితిలో పూర్వసంకల్పిత ఆత్మరక్షణ వ్యవస్థ (Default Self Defence Mechanism) పైచేయి తీసుకుని సహజ అసంకల్పిత ప్రతీకార వ్యవస్థను నిర్వీర్యం చేస్తుంది. తత్ఫలితమే నిత్య జీవితంలో మనం ఎదుర్కొనే లేదా తరచూ చూసే అనేక ప్రమాదాలు. తిరిగి దీనికి కూడా కర్మఫలాన్నే ఆపాదించవచ్చు. తప్పు కూడా లేదు. కానీ ఆ సమయంలో తమ పొరపాటునో, అజాగ్రత్తనో ఎవరూ పరిగణించరు. జరిగిన దానికి మొదటిగా ఎదుటి వారిని, అది గుఱ్ఱం కావచ్చు, దాన్ని నడిపే వ్యక్తి కావచ్చు, వాహనం విషయంలోనయితే దాన్ని నడిపే అవతల వాళ్ళను, బాధ్యులుగా చేసి నిందించటమే మానవ నైజం. ఈ విధంగా ఆలోచిస్తూ ఉండగానే మార్గంలో బండ రాళ్ళ దశ కూడా దాటాను. చివరి కిలోమీటరూ పూర్తిగా సమతలమైన మైదాన మార్గమే.

గమ్యం చేరాక అక్కడ గుఱ్ఱాలు ఆగే ప్రదేశం దగ్గర నన్ను దిగమన్నాడు. గుఱ్ఱం మీద నుంచే "నిగం' గెస్టు హౌసుకు ఎటువెళ్ళాలి" అని అక్కడ గస్తీ విధుల్లో నున్న స్థానిక ఉద్యోగి ఒకరిని నాకు తెలిసిన హిందీలో అడిగాను. అతడు నాకు సమాధానం ఇవ్వటానికి బదులుగా, గుఱ్ఱం వ్యక్తితో వాళ్ళ భాషలో ఒకింత కటువుగా ఏదో చెప్పాడు. అతని శరీర భాషను బట్టి, నన్ను గెస్టుహౌసు దగ్గర దింపమని ఆజ్ఞాపించినట్లు అర్థమయింది. తీరా చూస్తే, అది అర కిలోమీటరు దూరం కూడా లేదు. సుఖంగా నడవగలిగి ఉండేవాడిని ఆ మధ్యలోనే, పబ్లిక్ ఉపగ్రహ (Satellite) టెలిఫోన్ బూత్

ఉంది. లక్ష్మి, రవి ఫోన్ చేసుకోవటానికి అక్కడున్నారు. కొంచెం దూరం నుంచే లక్ష్మి గుఱ్ఱంపై వస్తున్న నన్ను పోల్చుకుని "రవీ! అదుగో మామగారు వస్తున్నారు'. అంది. “నీ మొహం. ఎవర్నిచూసి మీ మామగారు అనుకుంటున్నావో, కార్యక్రమం పూర్తిచేసుకుని ఆయనెప్పుడు రావాలి” అని రవి అంటూండగానే నేను దగ్గరకే వచ్చేశాను. సరే! మా వాళ్ళు కనిపించారు కదా అని గుఱ్ఱం దిగి పోదామనుకుంటే, అతను దిగనిస్తేనా? మిమ్మల్ని గెస్టుహౌసు వద్ద దింపమని హవల్దార్ గారు చెప్పారు. మధ్యలో మరెక్కడా దిగటానికి వీలు (సౌకర్యమైన అరుగులాంటి ప్రదేశం) లేదు. అందుకని మీరు అక్కడే దిగవలసి ఉంటుంది, అక్కడ మాత్రమే దింపుతాను అని నిక్కచ్చిగా చెప్పాడు. అలాగే దింపి అప్పటికి మూడో రోజున తిరుగు ప్రయాణానికి మళ్ళీ రమ్మని చెప్పగా సరేనని వెళ్ళిపోయాడు.

అనుకోని నా రాకతో మిగతా ముగ్గురినీ కూడా ఆశ్చర్య పరచేందుకు రవి సూచన మేరకు, సరిగ్గా అతను చెప్పినప్పుడు వారున్న గదిలో ప్రవేశించటానికిగాను, ద్వారం ప్రక్కనే నిలబడ్డాను. అప్పటికి ఈ శాల్తీలన్నీ అక్కడికి చేరుకొని సుమారు గంటన్నర మాత్రమే అయిందిట. చలినుండి పూర్తి రక్షణ కలిగించే పరుపు మందంలోనుండే దుప్పట్లు లాంటి రజాయిల్లోదూరి కబుర్లు చెప్పు కుంటున్నారు. ఇంతకీ ఆ కబుర్లు ఏమిటట? ప్రయాణం గురించే! జయలక్ష్మి కుమారుడితో అంటోంది. “మీ నాన్న రాకపోవటమే మంచి దయిందిరా! కేదార్ నుంచి తిరిగి వచ్చేటప్పుడే ఆ గుఱ్ఱం ప్రయాణం సరిపడక నానా ఇబ్బంది పడ్డారు.పాపం! ఈ ప్రయాణం ఇంకేం చేసేవారు? ”అంటూండగా రవి సైగ చేయగానే నేను ప్రత్యక్షం. ఇక వారి ఆశ్చర్యానికి అంతు లేదు. నా నిర్ణయాన్నిహర్షించి అభినందించారు.

## పుష్పవనలోయ (The Valley of Flowers) పరిచయం

***'మాతాచ పార్వతీ దేవీ పితాదేవో మహేశ్వరః"*** అని దైవస్తుతి. ఈ జగత్తుకే తల్లిదండ్రులైనటువంటి పార్వతీ పరమేశ్వరులు నివాసముండే ప్రాంతంగా విశ్వసించి హిమాలయాలలోని ఈ ప్రాంతాన్ని 'దేవభూమి' గా పేర్కొంటారు. 'చార్ ధాం' గా పిలువబడే యమునోత్రి, గంగోత్రి, కేదార్ నాథ్, బదరీనాథ్, ఉండే ఈ ప్రదేశం ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని గర్వాల్ మండలంలో ఉంది. గంగ, యమున, సరస్వతి, మందాకినీ, అలకనంద, లక్ష్మణగంగ లాంటి అనేక నదులు ఈ ప్రాంతంలో ఉద్భవించి ఒక దానితో మరొకటి సంగమిస్తూ తమ పరీవాహక ప్రాంతంలోని మైదాన క్షేత్రాలను సస్యశ్యామలం చేస్తూనూ, ప్రజల దాహార్తిని తీరుస్తూనూ సజీవంగా ప్రవహిస్తూ ఉంటాయి.

బదరీనాథుని ఆలయం వెనుక నున్న నీలకంఠ పర్వతానికి సుమారు పది కిలోమీటర్ల దూరంలో ప్రాచ్యాగ్నేయ దిశగా 'భ్యూందర్' అనే సుందరమైన గ్రామం. ఆ గ్రామ సమీపంలో ఒక అద్భుతమైన లోయ. ఆ లోయలో ఇంకా అద్భుతమైన ఒక పుష్పవనం. ఆ గ్రామ ప్రజలు ఆ వనాన్ని పార్వతీదేవికి అత్యంత ప్రీతికరమైనదిగా భావిస్తారు. ఆ గ్రామం పేరు మీదనే ఆ లోయకు 'భ్యూందర్ లోయ' అనే పేరు.

1931 వ సంవత్సరంలో *ఫ్రాంక్ యస్. స్మిత్, ఆర్. యల్. హోల్డ్స్ వర్త్* అనే ఇరువురు బ్రిటన్ జాతీయులు, హిమాలయ పర్వతశ్రేణి లోని 'కామేత్' శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి తిరిగి వస్తుండగా భారీ వర్షం వల్ల వారు ప్రయాణించవలసిన దారి మూసుకుపోగా యాదృచ్ఛికంగా ఈ లోయకు

చేరారు. ఆ లోయలోని అద్భుతమైన వన సౌందర్యానికి ముగ్ధులై, ఆ ఇద్దరిలో మొదటివాడైన *ఫ్రాంక్ యస్. స్మిత్* 1937 లో ఈ ప్రాంతాన్ని పునః దర్శించాడు. స్వదేశం తిరిగి వెళ్ళాక ఆ మరుసటి సంవత్సరం తన అనుభూతులతో నిండిన అనుభవాలతో గ్రంధాన్ని రచించి దానికి ***"పుష్పవన లోయ"*** (*The Valley of Flowers)* అని నామకరణం చేసి ప్రచురించాడు. భారత సైన్యంలో పర్వత ప్రాంతాల పరిశోధకుడు, విద్యాధికారిగా పనిచేసిన మరొక ఆంగ్లేయుడు *కల్నల్ ఎడ్మండ్ స్మిత్* 1862 సంవత్సరంలోనే ఈ లోయను కనిపెట్టినట్టు 1985 సంవత్సరంలో ఒక వాదన పైకి వచ్చినప్పటికీ అందుకు సంబంధించిన విశ్వసనీయ చారిత్రిక ఆధారాలు లేనందున, నిస్సందేహంగా ఈ లోయ కనిపెట్టిన ఘనత పూర్తిగా *ఫ్రాంక్ స్మిత్* కే చెందుతుంది. తన గ్రంధంలో ఈ లోయ గురించి ఆయన ఈ విధంగా వ్రాసుకున్నాడు.

"I hope generously, my ignorance must judge for myself whether the Bhyundar Valley deserves its title the 'Valley of Flowers', others will visit it, analyze it and probe it, but whatever their opinions, to me it will remain the 'Valley of Flowers' a valley of peace and perfect beauty where the human spirit may find repose. In all my mountain wanderings I had not found a more beautiful flower than the 'Primula' seen here.

***"భ్యాందర్ లోయగా మాత్రమే ప్రపంచానికి తెలిసిన ఈ ప్రాంతానికి "పుష్పవన లోయ"గా పునఃనామ కరణం చేయటం ఒకవేళ నా అజ్ఞానమైతే, అందులోని సామం జస్యాన్ని, ఔచిత్యాన్ని, భవిష్యత్తులో ఈ లోయను దర్శించే వారు నిర్ణయిస్తారని వినమ్ర పూర్వకంగా***

***విశ్వసిస్తున్నాను. ఎవరి అభిప్రాయలు ఏమైనప్పటికీ మానవునికి పరిపూర్ణ మైన మానసిక ప్రశాంతతను ప్రసాదించగలిగిన ఈ వనం నా మటుకు నాకు ఎప్పటికి "పుష్పవన లోయ' గానే మిగిలి పోతుంది. ఈ వనంలో దర్శనం ఇచ్చిన 'ప్రిమ్యులా' సంతతికి చెందిన ఈ పుష్పం కంటే సుందరమైన పుష్పాన్ని నా సుదీర్ఘ పర్వత యాత్రలలో మున్నెన్నడూ చూడలేదు."***

Valley of Flowers' గ్రంధం ద్వారా ఈ పుష్ప విశేషాలకు ఆకర్షింపబడిన ఇంగ్లండులోని "రాయల్ బొటానికల్ గార్డెన్స్ క్యూ"కు చెందిన *'జోన్ మార్గరెట్ లేగ్గే'* అనే మహిళ అరుదైన పుష్ప జాతుల అంకురాలను సేకరించే క్రమంలో 1939 సంవత్సరంలో ఈ లోయను దర్శించింది. అలా వనంలో విహరిస్తూ తనకు అవసరమైన మొక్కలను సేకరిస్తుండగా ప్రమాద వశాత్తు కాలుజారి లోయలోపడి నిస్సహాయ స్థితిలో ప్రాణాలు కోల్పోయింది. ఆమె స్మృత్యర్థం అక్కడ నెలకొల్పబడిన శిలాఫలకంపై ***"ఎక్కడ నుండి నాకవసరమైన ఆసరా లభిస్తుందో ఆ పర్వత శిఖరాల ఔన్నత్యం వైపు చూస్తూనే ఉంటాను."*** అని చెక్కబడిన వాక్యం హిమాలయాల పట్ల మానవుని కృతజ్ఞత ఆవశ్యకతను జ్ఞప్తి చేస్తూ ఉంటుంది.

తూర్పు వైపున *గౌరీ* (ఎత్తు 6590 మీ), *రత్బన్* (ఎత్తు 6126 మీ) పర్వతాలు, పశ్చిమాన *ఖుంట్ ఖల్* (ఎత్తు 4430 మీ) దక్షిణాన *శపత్*

*శృంగ్* (ఎత్తు 5030 మీ) ఉత్తర వైపు *నీలగిరి* (ఎత్తు 6479 మీ) పర్వతాల మధ్యస్థంగా మొత్తం 87.5 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఈ లోయ ఇమిడి ఉండగా అందులో 5 కిలోమీటర్ల పొడవు రెండు కిలోమీటర్ల వెడల్పులో ఈ వనం

విరాజిల్లుతోంది. అలకనంద, ధవళగంగ, ఈ లోయలో ప్రవహించే ప్రధాన నదులు. 'త్రిప్రా' హిమసానువుల్లో పుట్టిన పుష్పవతి అనే హిమనది కూడా ఈ లోయలోనే ప్రవహిస్తుంది. ఈ ప్రాంతంలో పచ్చిక బయళ్ళు విస్తారంగా ఉండటంతో,1982 సంవత్సరం వరకూ ఆ ప్రాంత వాసులు వేసవి కాలంలో పెద్దసంఖ్యలో తమ గొర్రెలను , మేకలను మేపుకునేవారు. ఆ తరువాతి కాలంలో ఈ లోయకు లభించిన ప్రాచుర్యం, ప్రాశస్త్యం దృష్ట్యా జాతీయ ఉద్యానవన హోదాతో పాటు సంరక్షణ నిమిత్తమై 'నందాదేవి భూజీవ ఆరక్షిత' (Nanda Devi Biosphere Reserve) కార్యక్రమంలో రెండవ ప్రముఖ ప్రదేశంగా చేరటంతో ఈ ప్రాతంలోనికి పశువుల ప్రవేశం నిషేధించబడి, నియంత్రించబడిన మానవ పర్యటనకు మాత్రమే యోగ్యంగా చేయబడింది.

ఆ పర్వత సానువుల్లోనే ఒక్కొక్క ఎత్తులో ఒక్కక్క విధమయిన పుష్పాలు విరుస్తాయి. ఎక్కువగా ఒర్కిడ్స్, పోపీ, ప్రిమ్యులా, క్యాలెండులా డైసీ, అనేమోనే, పేరుగల పుష్పాలు ఉంటాయి. వీటిలో బ్రహ్మకమల్, బ్లూపాపీ, కోబ్రా లిల్లీ ప్రముఖంగా చెప్పుకోదగ్గవి. మొత్తం దాదాపు 600 రకాలున్న అరుదైన ఈ పర్వత పుష్ప జాతులలో చాలవరకు అంతరించే దశలో ఉన్నవని ఈ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు . ఔషధ గుణాలు కలిగి ఉండి మందుల తయారీలో ఉపయోగింపబడేవి మరి కొన్ని.

కేవలం పుష్పాలకే కాక దేశంలో మరే ఇతర ప్రాంతాలలో కనబడని అరుదైన హిమాలయన్ గోల్డెన్ఈగెల్, గ్రిఫాన్ వల్చర్, స్నోపార్ట్రిడ్జ్, హిమాలయన్ స్నోకాక్, హిమాలయన్ మోనాల్, స్నో పిజియన్, స్పారో హాక్ మొదలైన పక్షులు, ఇంకా తాహర్, స్నో లెపర్డ్, మస్క్ డీర్, రెడ్ ఫాక్స్, కామన్ లంగూర్, భరల్, సెరో, హిమాలయన్ బ్లాక్ బేర్, హిమాలయన్ బ్రౌన్

బేర్, పీకా *(Mouse Hare)* మొదలైన జంతువులకూ అంతే కాకుండా ఎన్నో రకాలయిన సీతాకోకచిలుకలకూ ఈ ప్రాంతం నెలవు.

**పుష్పవన లోయ పర్యటన**

లక్ష్మి హేమకుండ్ కూడా చూడటానికి ఉత్సాహపడింది. తన భార్యతోపాటు వెళదామనుకున్నప్పటికీ జలుబు కారణంగా అశక్తతతో కిరణ్ విరమించుకోగా రవి సుప్రియలు తమ వల్లకాదని ముందే చేతులెత్తేయటంతో, లక్ష్మి ఒంటరిగానే వెళ్లిరావటానికి నిశ్చయించుకుంది. పుష్పవన లోయకు నడక, డోలీ మినహా మరే ఇతర సౌకర్యం లేదు. అయితే స్వభావ రీత్యా తను ఎంతదూరమైనా నడవతానికే తప గుఱ్ఱం ఎక్కటానికి ఇష్టపడదు. కానీ ఆనాటి ముఖ్యమైన పర్యటనకు నా శ్రీమతి తప్ప మిగతా అందరమూ నడవవలసే యున్నందున, శక్తి నిలుపు కోవలసిన అవసరం దృష్ట్యా హేమకుండుకు గుఱ్ఱం మీద వెళ్లి రావలసినదని సూచించగా తన తత్వానికి విరుద్ధమైనప్పటికీ అలాగేనని తెల్లవారు ఝామున ఐదు గంటలకే అలారం పెట్టుకుని లేచి స్నానం ముగించి బయలు దేరింది.

ఈ గాంప్రియాలో తీగలద్వారా విద్యుత్ సరఫరా ఉండదు. హోటళ్ళు, గెస్ట్ హవుసులు, దుకాణాల వ్యాపారస్తులు డీజిలుతో నడిచే జనరేటర్లు వాడతారు. అవి ఉత్పత్తి చేసే విద్యుత్ వోల్టేజి చాలా మంద్రస్థాయిలో ఉంటుంది కనుక, వేడినీటికి గీజర్లుగాని హీటర్లు గాని పనిచేయవు. అందుచేత గెస్టుహౌసుల్లో బసచేసే వారికి స్నానానికి నీరు స్టవులపై కాచి ఇస్తారు. అవి కూడా మనిషికి ఒక బాల్చీనే ఇస్తారు. గోరువెచ్చగా మాత్రమే ఉంటాయి. వాటికి కూడా ముందురోజే ఆర్డరు ఇవ్వవలసి యుంటుంది. మా ఐదుగురికీ నీరు వచ్చేటప్పటికి చాలా సమయమే పట్టింది. అలాగే స్నానాలు చేసి, లక్ష్మి తిరిగి వచ్చేటప్పటికి సిద్ధంగా ఉన్నాం. ఈ లోగా, కిరణ్ 'రజనీష్ చౌహాన్' అనే

ఒక ప్రముఖ వ్యక్తిని కలుసుకున్నాడు. ఇతను ఆ ప్రాంతవాసి. చిన్నతనంలోనే తన తండ్రి వద్ద పర్వతారోహణలో శిక్షణ పొంది స్వయంగా నీలకంఠ (బదరీ నాథ్ దేవాలయానికి వెనుక) పర్వతంతో సహా ఆ ప్రాంతంలోని ప్రధాన పర్వతశిఖరాలన్నీ అధిరోహించి ఉన్నాడు. ఔత్సాహిక పర్వతారోహకులకు శిక్షణ ఇవ్వటం, పర్వతారోహణలో వారికి అవసరమైన సామగ్రిని సమకూర్చటం ఈయన వృత్తి. పుష్పవన లోయపై పరిశోధన చేసి ఉన్నాడు. తాను పరిశోధించిన విషయాలపై గ్రంధాలను రచించి ఫొటోలతో సహా ప్రచురించాడు కూడా. ఆయన మమ్ములను స్వయంగా గైడు చేయటానికి అంగీకరించి, పదకొండు గంటలకల్లా సిద్ధంగా ఉండమని సూచించగా, ఆ మేరకు, అదనపు సాధారణ దుస్తులు, వర్షపు దుస్తులు భోజన పదార్థాలు, మంచినీరు, వగయిరా అన్నీసిద్ధం చేసుకున్నాము. కేమేరాలన్నీ కూడా ముందురోజు రాత్రే ఛార్జ్ చేసుకున్నాము.

ఈ సరంజామా మోయటానికి ఒక పోర్టరును, జయలక్ష్మి కోసం ఒక డోలీని రజనీష్ చౌహానే మాట్లాడి ఉంచాడు. సరిగ్గా అనుకున్న సమయానికి గాంఫ్రియాలో బయలుదేరాము. 40 నిముషాలు నడిచి, లోయ చెక్ పోస్ట్ వద్దకు చేరాము. ఇద్దరు పోర్టరులకు కూడా కలిపి మొత్తం 8 మందికి తలకి రు. 150/- చొప్పున రు. 1200 ప్రవేశ రుసుము చెల్లించి టికెట్లు తీసుకున్నాము. రజనీష్ చౌహాన్ కు తన ఇచ్ఛానుసారం లోయలోనికి వెళ్లివచ్చే శాశ్వత అనుమతి ఉంది. అందువల్ల అతనికి రుసుమేమీ వసూలు చేయలేదు. అక్కడ మొదలెట్టి ప్రధాన వనం చేరే వరకూ ఏ చిన్న అంశాన్నీ విస్మరించకుండా రజనీష్ వివరిస్తుండగా విస్మయంతో గ్రహిస్తూనూ, సందర్భోచితంగా కలిగే సందేహాలను నివృత్తి చేసుకుంటూనూ నింపాదిగా నడక సాగించాము. రజనీష్ స్వయంగా వృత్తి నైపుణ్యం కలిగిన ఛాయా గ్రాహకుడు

కూడా కావటంతో కిరణ్, తన *నికాన్ డి-200* (Nikon D-200) కేమేరాను అతనికి అప్పగించాడు. తద్వారా బృందంలోని మిగతా సభ్యులతో పాటు అన్ని ఫోటోలలోను తను కూడా ఉండే అవకాశం ఏర్పడింది. లేకుంటే రెండు వీడియో కెమెరాలతో సహా మొత్తం అయిదు కేమేరాలున్నా ఏ ఫోటోలోనూ అది తీసిన వ్యక్తి ఉండే అవకాశం లేదు కదా! ప్రకృతి దృశ్యాలను తీసేటప్పుడు ఒక కెమెరాలో కంటే మరొక దాన్లో తీసిన ఫోటో మెరుగ్గా ఉండే అవకాశం కూడా, ఒకటికంటే ఎక్కువ కెమరాలు అందుబాటులో ఉన్నందువల్ల ప్రయోజనం.

పూర్వకాలంలో గ్రంధాలు తాళ పత్రాలపై, ఘంటాలతో వ్రాసేవారని మనం చదువుకున్నాం. అటువంటిదే ఒక చెట్టు బెరడు మాకు తారసపడింది. అది 'బోర్షు' వృక్షం. అవటానికి బెరడు అయినా మన ఆధునిక కాగితమంత మందమే ఉంది. ఆలా అని పట్టుకుంటే చిరిగిపోనూ లేదు. నేను ఒకటి సేకరించి భద్రపరచుకున్నాను. మరొకచోట ఒక వృక్షం మొదలుకు అడుగున్నర ఎత్తులో ఒక పెద్ద తొఱ్ఱ. అయిదడుగుల ఎనిమిది అంగుళాల ఎత్తున్న కిరణ్ దాన్లో నిలబడ గలిగాడంటే దాని ఎత్తు ఎంతో ఊహించుకోవచ్చు. ఇంతకీ ఆ తొఱ్ఱ, ఎలుగుబంట్లు తమ నివాసం కోసమై ఏర్పాటు చేసుకున్నాయట.

అలా కనబడిన విశేషాన్నల్లా సంభ్రమాశ్చర్యాలతో గమనిస్తూ ముందుకు సాగి ఒక చోట కూర్చుని వెంట తెచ్చుకున్న ఆహారాన్ని, రజనీష్, డోలీల వాళ్ళతో పంచుకుని భోజనం చేసాము. వనంలో ప్రవేశానికి టిక్కెట్లు తీసుకునేటప్పుడే,

లోయలో విహరించేటప్పుడు చేయతగని పనుల గురించి సూచనలతో ఒక కరపత్రం ఇచ్చారు. వాటిప్రకారం ఆ వనంలో సహజంగా ఉద్భవించనిది ఏదీ దానికి చెందినదికాదు. అందుచేత బయటనుంచి వచ్చిన ఏ చిన్న పదార్థమూ, వస్తువూ కూడా అక్కడ వదిలివేయ టానికి వీలులేదు. అందుకని మేము వెంట తెచ్చుకున్న ఆహార పదార్థాల ప్యాకింగుకు ఉపయోగించిన పేపర్లు, సంచులు అవి ప్లాస్టిక్ వే కాకపోయినప్పటికీ ఏవీ వదలకుండా మళ్ళీ వేరే సంచిలో వేసుకుని వెనక్కుతెచ్చాము. భోజనాలు పూర్తయ్యాక మళ్ళీ నడక సాగిస్తూ గం.2.30 సమయంలో చిన్న సెలయేరు ప్రమాణంలోఉన్న 'పుష్పవతి' నదిని దాటి అసలు వనంలోకి ప్రవేశించాం.తిరిగి రావటానికి శక్తి మిగిలి ఉన్నంత మేరకు ఆ వనంలో గడిపి, ఫోటోలు తీసుకుని, సమయం నాలుగు గంటలవుతుండగా వెనుకకు మరలాము. వెళ్ళటానికి పట్టినంత సమయం తిరిగి రావటానికి పట్టలేదు.

తిరిగివస్తూ ప్రవేశద్వారం దగ్గరకు రజనీష్, నేనూ ముందుగా చేరుకొని మిగిలినవారి కోసం నిరీక్షిస్తుండగా "ఈ వన సందర్శనపై మీ అనుభూతి ఏమిటి?" అని అడిగాడు. నిజానికి ఆ వనసందర్శన ఎవరికైనా ఏ విధమయిన నిరాశనుగాని, అసంతృప్తిని గాని కలిగిస్తుందని అనుకోలేము. అటువంటిది ఎందుకు అతను ఆ విధంగా అడగవలసి వచ్చిందో అర్థం కాలేదు. నా సందేహాన్ని ముందే బయట పెట్టకుండా అతను అడిగినదానికి సమాధానంగా "అద్భుతమైన అనుభవం. ఈ వన సందర్శన నిజంగా నేను చేసుకున్న పుణ్యఫలంగా భావిస్తాను." అని సూటిగా అనగానే అతని కళ్ళలో సంతృప్తి కనిపించింది. అప్పుడు అడిగాను "ఎందుకు అలా అడిగావు" అని. అతను చెప్పినది విని నిర్ఘాంతపోయాను. తన చిన్నతనం నుంచీ స్వయంగా పర్యాటకులను గైడు చేసిన అనుభవంలో, కొంతమంది ఈ

లోయను దర్శించిన తరువాత నిరాశ పడటమే కాక తమ అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తపరచిన సందర్భాలు చూసాడట. ఆ వనంపై యధా లాపంగా చేసిన అటువంటి వ్యాఖ్యలు, అవిచేసిన తీరు అతనిని తీవ్రంగా నొప్పించినట్లుగా నాకు అర్థమైంది. అటువంటి వ్యాఖ్యలకు కారణం ఏమై ఉంటుందని అడిగాను. ఈ లోయ గురించి గాని, అందులోని పుష్పవనాన్ని గురించిగాని, వారికి ఏ విధమైన ముందస్తు సమాచారం గాని అవగాహనగాని లేకుండా, ఒకరి బలవంతం మీదనో, మొహమాటానికో రావటమే అందుకు కారణంగా చెప్పాడు. అన్ని కిలోమీటర్లు ఎంతో శ్రమకోర్చి వస్తారో ఏమో, ఈ వనంపై వారి అంచనాలు వేరే విధంగా ఉంటాయి కాబోలనుకున్నాను. బహుశా ఊటీలోని బొటానికల్ ఉద్యానవనంతోనో, మైసూరులోని ఒకప్పటి బృందావన్ ఉద్యానవనంతోనో, రాష్ట్రపతిభవన్ లోని మొఘల్ ఉద్యానవనంతోనో లేదా తమకు తెలిసిన మరే ఇతర ఉద్యానవనాలతోనో పోల్చుకుని అలా ఈ వనాన్ని ఊహించుకోవటంవల్ల బహుశా వారికి ఆ అభిప్రాయం ఏర్పడటానికి కారణం కావచ్చునంటూ, విత్తనాలు, క్షేత్ర యాజమాన్య పాలన, పోషణ, ఎరువులు, క్రిమిసంహారక మందులతో చీడ, పీడలు లేకుండా మానవుని సృజనాత్మతకి లోబడి తీర్చిబడి, నిర్వహింపబడే ఆ కృత్రిమ వనాలకీ ప్రకృతి సిద్ధంగా ఏర్పడి ఎలాంటి మానవ సంబంధమైన నిర్వహణ లేకుండానే వాటి వాటి ధర్మాల కనుగుణంగా మొలకెత్తి, పెరిగి, పుష్పించి జీవితకాలం పూర్తి చేసుకుని మరొక మొక్క ఉద్భవించటానికి అవకాశం కల్పించే ప్రకృతి ధర్మానికి మధ్య భేదం తెలుసుకోలేక పోవటం వారి అసంతృప్తికి, నిరాశకు కారణమైఉండవచ్చని అతనిని సమాధానపరచ ప్రయత్నించాను. ఆతను నాతో ఏకీభవించి, మాకు అలాంటి అభిప్రాయం లేనందుకు అభినందించినప్పటికీ నా వివరణతో అతను పూర్తిగా సంతృప్తి చెందినట్లు అనిపించలేదు. అప్పుడు

*'జోన్ మార్గరెట్ లేగ్గే'* శిలా ఫలకంపై చెక్కబడిన వాక్యం ***"ఎక్కడ నుండి నాకవసరమైన ఆసరా లభిస్తుందో ఆ పర్వత శిఖరాల ఔన్నత్యం వైపు చూస్తూనే ఉంటాను."*** అతనికి గుర్తుచేశాను. మానవుని కీర్తిస్తుతులను కోరి ఈ లోయ ఏర్పడిందా? లేదే! అది ప్రకృతి లక్షణం. అలాగే తనను దర్శించిన మానవుని సంతృప్తి పరచటం కూడా ప్రకృతి బాధ్యత కాదు. చూచి ఆనందించే హృదయం అందరికీ ఉండక పోవచ్చు. అలా ఉండాలని కూడా లేదు. అది వారి వారి సంస్కారాన్ని బట్టి ఉంటుంది. అసలు ఈ ప్రాంతం గురించి తెలియనివారూ, తెలిసినా ఒకసారి చూడాలని అనుకోని వారు, అనుకున్నా అది సాధ్యం కానివారు ఎంతమంది లేరు? కానీ నాగరికత ముసుగులో, స్వార్థపూరితమైన, దుర్మార్గపు ఆలోచనలతో దాని వినాశనానికి కారణమవటమే కాక, తాము నాగరికత అనుకుంటున్న జీవితంలో ఎంత ధనం వెచ్చించినా లభించని అరుదైన మానసిక ప్రశాంతతను ప్రసాదించే ఈ వైభవాన్ని గుర్తించకపోవటం, పైగా చులకన చేయబూనటం ప్రకృతిని పరిహసించటమే కాక దాని సృష్టికర్తను నిందించటమే, కనుక, అజ్ఞానంతోనొ అహంకారంతోనో ఎవరో చేసిన వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు అన్నాను.

మా సంభాషణ ఇలా సాగుతుండగా మిగతా వాళ్ళు మాతో చేరారు. చీకటి పడుతుండగా అందరం గాంప్రియా చేరి అక్కడ హోటలులో గులాబ్ జామూన్లు, సమోసాలతో అల్పాహారం చేసి మసాల టీ సేవించి విశ్రాంతి గృహానికి చేరుకున్నాము. చలి అధికంగానే ఉంది. రాత్రి భోజనాలు కూడా ముగించి మరునాటి కార్యక్రమాన్ని సమీక్షించుకుంటూ త్వరగానే నిద్రలకు ఉపక్రమించాము

## మళ్ళీ జోషిమట్ లో

29 వ తేదీ. ఉదయం గం. 8.00 లకు గెస్టుహౌసు ఖాళీచేసి గుఱ్ఱాలస్టాండుకు చేరాము. నేను వచ్చేటప్పుడు ఎక్కినది ఒకటే అయినా, రాను పోను రు.1800లకు రెండు గుఱ్ఱాలు మాట్లాడుకున్నాను. ఖాళీగా ఉన్న గుఱ్ఱం మీద అతను వేరే ప్రయాణీకులను (ఇద్దరు సిక్కు బాలలను) ఎక్కించాడు. నిజానికి, అదనపు రుసుమేమీ లేకుండా తిరుగు ప్రయాణానికి ఆ గుఱ్ఱం నా శ్రీమతికి ఉపయోగపడాలి. అది న్యాయం కూడా. అయితే తిరుగు ప్రయాణంలో రెండవ గుఱ్ఱాన్ని కూడా నేనే వినియోగించుకుంటానని మొదట బేరం మాట్లాడుకున్నప్పుడే గోవిందఘాట్ లోని కార్యాలయంలో నమోదు చేయించి ఉండవలసింది. అయితే, మావాళ్ళందరూ నాకంటే ముందే వెళ్లినందువల్లనూ, తిరుగు ప్రయాణానికి వారు ఎటువంటి ఏర్పాట్లు చేసుకున్నారో తెలియనందువల్లనూ, వారిని సాధ్యమైనంత త్వరగా చేరుకోవాలనే ఆత్రుతలోనూ, ముఖ్యంగా BSNL వారి పుణ్యమా అని వారితో సమాచారం పంచుకోవటానికి అవకాశం లేకపోవటంతోనూ, నేనాపని చేయలేక పోయాను. ఈ కారణంగా జయలక్ష్మి గుఱ్ఱానికి మళ్ళీ చెల్లించవలసి వచ్చింది. అంటే రెండు ప్రయాణాలకు ఇద్దరికీ మేము ఉపయోగించుకున్న నాలుగు గుఱ్ఱాలకి రు. 1800/- మాత్రమే చెల్లించవలసి ఉండగా ఉపయోగించు కొనని అయిదో గుఱ్ఱానికి అదనంగా రు. 450/- చెల్లించామన్నమాట. మిగతా నలుగురూ నడకతో బయలుదేరారు.

పూర్తి తిరుగు ప్రయాణానికి అది ప్రారంభం. గృహోన్ముఖమన ప్రయాణం ప్రారంభమైందన్న భావన కావచ్చు లేదా యాత్రలో క్లిష్టమయిన దశ పూర్తి అవుతున్నదనే సంతృప్తే కావచ్చు ఈసారి ప్రయాణం అంత ప్రయాస అనిపించలేదు. ముందుగా మేమే గోవిందఘాటుకు చేరుకొని

గురుద్వారా ఎదురుగా ఉన్న యాత్రికుల విశ్రాంతిశాలలో నిరీక్షిస్తుండగా ఒంటి గంట సమయంలో ముందుగా రవి, సుప్రియ ఆ తరువాత కిరణ్, లక్ష్మిలు మమ్మల్ని చేరుకున్నారు. మా రాకను డ్రైవరుకు తెలియచేయగా, అరగంటలో అతను వాహనాన్ని తెచ్చాడు. సామాను ఎక్కించుకుని సమయం రెండు గంటలవుతుండగా గోవిందఘాటులో బయలుదేరి మరోగంటలో మళ్ళీ జోషిమట్ చేరి అక్కడ 'ఆలీ గోల్డ్' అనే రెస్టారెంటులో భోజనాలు చేసాము.

నాలుగు గంటలకు జోషిమట్ లో కేబుల్ కారు స్టేషనుకు ఈసారి సకాలంలో చేరుకున్నాము. ఇది ఆసియాలోకెల్లా అతి పొడవైన 'రోప్ వే' కేంద్రం. కాళ్ళకు పొడవాటి చెక్కలు కట్టుకుని మంచుపై జారుతూ వినోదించే 'స్కీయింగ్' అని పిలువబడే క్రీడకు భారత దేశంలో నైనిటాల్, సిమ్లా, గుల్ మార్గ్, మనాలీలు ప్రసిద్ధి. అంత ప్రముఖమైనది కాకపోయినప్పటికి, ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత ఉత్తరాఖండులో జోషిమట్ సమీపంలో 'ఆలీ' (Auli) కు కూడా ఈ క్రీడకు ప్రాచుర్యం ఏర్పడింది. ప్రభుత్వరంగ పర్యాటక అభివృద్ధి సంస్థ'గర్వాల్ మండల్ వికాస్ లిమిటెడ్' సంస్థే ఈ పర్యాటక కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్నది. జోషిమట్ కు నాలుగున్నర కిలోమీటర్ల ఆకాశమార్గ దూరం (Nautical distance)లో మరో పర్వతంపై నున్న 'ఆలీ' అనే ప్రదేశాన్ని కలుపుతూ ఈ 'రోప్ వే' ఉంది. ఈ రెండు ప్రదేశాల మధ్య భూమార్గ దూరం 14 కిలోమీటర్లు. సుమారు 20 మంది కేవలం నిలబడగలిగే చిన్నగది లాంటి వాహనం సుమారు పది పన్నెండు అంతస్థుల భవనమంత ఎత్తులో బలమైన ఉక్కుతాళ్ళను పట్టుకుని వ్రేలాడుతూ ఈ రెండు ప్రదేశాల నడుమ ప్రయాణిస్తుంది. అటువంటివి రెండు వాహనాలు నిర్ణీత సమయంలో పర్యాటకులను అటూ ఇటూ విహరింపచేస్తాయి. టిక్కెటు ధర మనిషికి రు. 600/-. ఒక వైపు ప్రయాణ సమయం సుమారు

20 నిముషాలు. అటువైపు గడపటానికి సమయం ఒక గంట. ఆ గంట సమయంలోనే అక్కడ వివిధ క్రీడలు కూడా ఉన్నాయి.

పారదర్శకమైన రబ్బరుతో నిర్మింపబడిన భారీబంతిని గాలితో నింపి

దాని మధ్యలో గోళాకారంలో ఉండే మరొక గది లాంటి ప్రదేశంలో ఇద్దరు వ్యక్తులు బంధించుకుని ఒక అర కిలోమీటరు దూరం దొర్లే 'జోర్బింగ్' (Zorbing) అనేది అటువంటి ఒక క్రీడ. ఒకింత ప్రమాదభరితమైనదే. అయినప్పటికీ కిరణ్, లక్ష్మిలు అందులో పాల్గొనగా, నేనూ, రవి వారిని వీడియో తీస్తూ ఆనందించాము. గం.6.30 లకు రోప్ కార్ దిగి బయలుదేరాము. 40 కిలోమీటర్లు ప్రయాణించి బిరాహి చేరుకున్నాము. ఇక్కడ కూడా నిగం గెస్టుహౌసులోనే మకాం. ఇంతకు మునుపు ఒక సందర్భంలో పేర్కొన్నట్టు ఈ విశ్రాంతి గృహం అలకనంద నది ఒడ్డునే ఉంది. మనం ఉన్న గది కిటికీలోనుంచి ఆ నదిని చూస్తూ కూర్చుంటే ఎన్ని గంటలయినా క్షణాలుగా గడిచి పోతాయి. ముందుగా బుక్ చేసుకున్న గెస్టు హౌసు మరో 9 కిలోమీటర్ల దూరంలోనున్న చమోలిలో ఉంది. కేవలం మరో పదిహేను నిముషాల ప్రయాణంతో అక్కడకు చేరుకోవచ్చు కూడా. అయినప్పటికీ ఈ ప్రకృతి సౌందర్యానికి ఆకర్షితులమై ఇక్కడే ఆగాము. అయితే విడివిడిగా గదులు ఖాళీ లేక పోవడంతో ఒకే పెద్ద గదిలో అదనపు పడకలు ఏర్పాటు చేసారు. ఆ మేరకు రుసుములో రాయితీ ఇచ్చారు. ఇక్కడ మాత్రమే గదిలో టీవి సౌకర్యం ఉంది. ప్రపంచ కప్ ఫుట్ బాల్ మాచ్ కొచెం సేపు చూసి నిద్రించాము.

## రిషీకేశ్ లో

30 వ తేదీ గది ఖాళీ చేసి ఉదయం గం. 7 లకు బయలు దేరాము. 210 కిలోమీటర్లు ప్రయాణించి మధ్యాహ్నం గం. 2 లకు రిషీకేష్ చేరాము. నిగం విశ్రాంతి గృహంలో మూడు గదులు తీసుకున్నాము. ఈ అతిధి గృహం గంగా నదిమీద నున్న 'రాంఝూలా'కు కొంచెం దూరంలో ఉంది. వారి రెస్టారెంటులోనే భోజనం చేసి కొంచెం సేపు విశ్రమించిన తరువాత రాంఝూలా వద్దకు చేరుకునే సరికి అవతల ఒడ్డున గంగా హారతి కార్యక్రమం జరుగుతూ ఉంది.

నది దాటి అవతలకు వెళ్లి సమీపం నుంచి దర్శించే సమయం లేదు. ఇవతలి ఒడ్డునుంచే ఆ వేడుకను వీక్షించాము. జయలక్ష్మి హైదరాబాద్ నుండి తెచ్చుకున్న ఆవునేతి వత్తులు కొన్ని ఇక్కడికోసమని మిగుల్చు కుంది. అయితే గాలి ఎక్కువగా వీస్తున్నందు వలన దీపం వెలిగించి ప్రమిదలు నదిలో వదలటానికి వీలుకాలేదు.



ప్రత్యామ్నాయంగా అక్కడే ఉన్న గంగా మాత ఆలయంలో వెలిగించాము. కొంచెంసేపు ఆ నది ఒడ్డునే విహరించి, మరి కొంతసేపు అక్కడి దుకాణాలను పరిశీలించి తిరిగి విశ్రాంతి గృహం చేరుకున్నాము.

జూలై 1. నిర్ణయించబడిన కార్యక్రమం ప్రకారం ఈ రోజు మధ్యాహ్నం 11 గంటలకు బయలుదేరి, 12 గంటలకు హరిద్వార్ చేరుకొని, రాత్రికి అక్కడే బసచేసి మరునాడు ఉదయం గం. 6 లకు రైల్వే స్టేషనుకు చేరుకోవాల్సి ఉంది. అక్కడ నిగం గెస్ట్ హవుసు ఊరికి కొంత దూరంగా ఉంది. పోనీ అంతకు ముందున్న రాజ్ డీలక్స్ లోనే ఉందామంటే వాళ్ళ అద్దెలు నిగం వారికంటే

చాలా ఎక్కువ. ఇక్కడ మూడు గదులకు రు. 2400/- లతో పోగా అక్కడ రు.4500/- చెల్లించాలి. పైగా హరిద్వార్ చేరటంతోటే వాహనం ఒప్పందం ముగుస్తుంది. కనుక రైల్వే స్టేషనుకు ఆరుగురు మనుషులు సామానుతో చేరుకోటానికి వేరే వాహనం ఏర్పాటు చేసుకోవాలి. ఇక్కడ (రిషీకేష్) వసతి గృహం, వాళ్ళ రెస్టారెంట్, అందులో భోజన పదార్థాలు కూడా చాల బాగున్నాయి. అంతకు ముందే బృందంలోని అందరం హరిద్వారులోని అన్ని దేవాలయాలను, గంగా హారతిని దర్శించి యున్నాము. ఇప్పుడు ప్రత్యేకించి చూడవలసినది కూడా ఏమిలేదు. అందువల్ల మరునాడు ప్రాతః సమయంలో అదనపు శ్రమ, నివారింప సాధ్యమైన ఒత్తిడికి గురికాకుండా ఏ నాలుగు గంటలకో లేచి తయారై పోయి రిషీకేష్ నుంచే నేరుగా హరిద్వార్ రైల్వే స్టేషను (30 కి.మీ) చేరితే ఎట్లా ఉంటుంది అని ప్రతిపాదించాడు కిరణ్. హైదరాబాదు, ముంబాయి లాంటి నగరాల్లో ఉదయం వేళల్లో బయలుదేరే రైళ్ళను అందుకోవటానికి, పాతిక ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉండే రైల్వే స్టేషన్లకు వెళ్ళటం లేదూ! అది అందరికీ అనుభవమే కనుక అందరం ఈ ప్రతిపాదనని ఏకగ్రీవంగా ఆమోదించాం.

ఈ నిర్ణయం గతరాత్రే జరిగి పోయినందువల్ల, ఇక ఆ రోజంతా విశ్రాంతే. పదకొండు గంటలకు బయలుదేరి, గంగానది దాటి, గీతా మందిర్

ఇతర దర్శనీయ స్థలాలు తిరిగి 'చోటివాల' హోటలు చేరాము. దేశం లోని అన్ని ప్రాంతాల భోజనాలకు ఇది ప్రసిద్ధి. చాల రద్దీగాకూడా ఉంటుంది. మన కూరగాయలు, పప్పు, సాంబారు, అన్నం పెరుగుతో తృప్తిగా భోజనం చేసాము. బిల్లు రు.

870/-. బసకు తిరిగివచ్చి విశ్రమించి, పది రోజులనుంచి కలగా పులగమై పోయిన వస్తువులు, దుస్తులు ఎవరివి వారు వేరు చేసుకుని బ్యాగుల సంఖ్యను కుదించి ఒక క్రమంలో పెట్టుకున్నాము. కిరణ్ కు స్వల్పంగా జ్వరం వచ్చింది. ఉత్తరాఖండ్ ప్రభుత్వ సంస్థ దుకాణంలో లక్ష్మి, సుప్రియలు రుద్రాక్షలు, మరేవో ఆభరణాలు కొనుగోలు చేసారు. వారు తిరిగి వచ్చిన వెంటనే పలహారాలు చేసి విశ్రమించాము.

**తిరుగు ప్రయాణం**

అనుకున్నట్లుగానే 2 వ తేదీ గం. 4 ల కే లేచి, స్నానాలు కూడా చేసి, గదులు ఖాళీచేసి ఆ సమయంలో సౌజన్య పూర్వకంగా వారిచ్చిన వీడ్కోలు టీ సేవించి, వారి రిజిస్టరులో మా అభిప్రాయాలను, సూచనలను నమోదుచేసి గత పది రోజులుగా మాకు ఆత్మీయంగా ఆతిధ్యమిచ్చిన 'గర్వాల్ మండల్ వికాస్ నిగం' సిబ్బందికి ధన్యవాదాలు తెలిపి, బయలుదేరాం. గం. 5.45 కల్లా హరిద్వార్ రైల్వే స్టేషనుకు చేరుకున్నాము. ఇవ్వవలసిన బకాయిలు చెల్లించి, వాహనం విడుదల చేస్తున్నట్టు అవసరమైన పత్రాలపై సంతకంచేసి, డ్రైవరు 'విపిన్' కు ధన్యవాదాలతో వీడ్కోలు పలికాము.

సరిగ్గా గం 11.45 కు డిల్లీలో దిగాము. మా స్వస్థలాలకు బయలుదేరే రైళ్లకు నాలుగు గంటలకు పైగా వ్యవధి ఉంది. ఆ మధ్యాహ్నం భోజనం డిల్లీలోని శరవణ భవనులో చేద్దామని ముందే నిశ్చయించాం. లక్ష్మి తను పనిచేసే సంస్థ తరపున అధికారికంగా డిల్లీ సందర్శించే సందర్భంలో తను వాడే వాహనాన్ని స్టేషనుకు పిలిపించగా లగేజీ అందులో ఎక్కించుకుని కన్నాట్ ప్లేసుకు వెళ్ళాము. ఒక్క పది నిముషాలు ముందు వెళ్ళామో ఏమో,

హోటలులో వెంటనే టేబులు దొరికింది. ఇక ఆ తరువాత వచ్చిన వాళ్ళంతా పొడవైన క్యూలో బయటనే వేచి ఉండవలసివచ్చింది.

ఆ రోజు ఉదయం రిషికేష్ లో మేము బయలుదేరినప్పుడు అక్కడ ఉష్ణోగ్రత సుమారు 20 డిగ్రీలు ఉండచ్చు. హరిద్వారులో కూడా ఇంచుమించు అంతే ఉంది. రైలులో సరే సరి, ఎయిర్ కండిషన్ కోచ్. డిల్లీలో దిగేసరికి ఉష్ణోగ్రత 35 డిగ్రీల వరకు ఉంది. ఉష్ణోగ్రతలో ఈ హఠాత్ వ్యత్యాసంవల్ల జయలక్ష్మి రక్తపోటు కూడా అంతే హఠాత్తుగా పడిపోయి విపరీతంగా చెమటలు పట్టాయి. ఫలితంగా పూర్తిగా నీరసించిపోయింది. శరవణభవనులో కూర్చున్న తరువాత కొద్దిగా ఉప్పు కలిపిన నిమ్మరసం సేవింపచేసి సపర్యలు చేయగా స్వల్పంగా కోలుకుంది. కాని వికారంగా ఉండటంతో ఏమీ తినలేదు. తిరిగి నిజాముద్దీన్ స్టేషను చేరుతూ, మార్గంలో కిరణ్, లక్ష్మి రవి, సుప్రియలు, ప్రయాణంలో చదువు కోవటానికి పుస్తకాలు కొనుగోలు చేసారు. స్టేషనుకు చేరిన తరువాత కూడా ఎయిర్ కండిషన్ తరగతి ప్రయాణీకుల వేచియుండే గది క్రిక్కిరిసి ఉండటంతో ఆ సదుపాయాన్ని వినియోగించుకోలేక పోయాం. ప్లాటుఫారం సయితం ప్రయాణీకులతో రద్దీగా ఉండటంతో కూర్చోవటానికి కూడా స్థలం లభించలేదు. రెండు బ్యాగులను చేర్చి జయలక్ష్మి కూర్చోగా మిగిలిన వారు వంతులవారీగా ఆమెకు సపర్యలు చేసారు.

ట్రయిను ప్లాటుఫారం మీదకు వచ్చినదే తడవుగా దాన్లో కూర్చుని ఊపిరి పీల్చుకున్నాము. ముందుగా బయలుదేరిన మాకు వీడ్కోలు చెపుతూ కిరణ్, లక్ష్మిలు వారి ట్రయిను కొరకు నిరీక్షణ కొనసాగించారు. మా ట్రయిను ఆగ్రా దాటుతుండగా వారి ట్రయిను బయలు దేరినట్లు సమాచారం అందింది. ఆ మరునాడు జూలై 3వ తేదీ మా ట్రయిను నాగపూర్ దాటిన కొద్ది సేపటికి

వారు ముంబై సెంట్రల్ స్టేషనులో దిగేశారు కూడా. ఆ మధ్యాహ్నం గం. 2.00 లకు మేము సికిందరాబాదులో దిగి ఎవరిళ్లకు వారం చేరాం.

## బడ్జెట్ అంచనాలు - యదార్థ ఖర్చు ల వివరములు

ఇటువంటి యాత్రల విషయంలో ఆర్థిక వ్యవహారాల నిర్వహణకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. దేని దేనికి ఎంత ఖర్చు కావచ్చు, మొత్తం ఖర్చు ఎంత అవుతుంది అనే దానిపై స్పష్టమైన అవగాహన తప్పనిసరి. వృత్తి పరంగా ఇటువంటి యాత్రలు నిర్వహించే వారు రైలు, బస్సు ప్రయాణానికి, ఆహార పానీయాలకు మాత్రమె బాధ్యత వహిస్తారు. వసతి, గుఱ్ఱాలు, డోలీలు, పల్లకీలు, దేవాలయాలలో దర్శన, పూజలు, ఇతర వ్యక్తిగత ఖర్చులు ఎవరివి వారే భరించ వలసి యుంటుంది కనుక వాటిపై శాస్త్రీయమైన ఒక అంచనా తప్పనిసరి. ఊహాజనితాలు పనికే రావు. ఈ దృష్ట్యా, ఇది కేవలం మా వ్యక్తిగతమే అయినప్పటికీ, ఎంతో కొంత ఉపయుక్తంగా ఉండక పోతుందా అనే సదుద్దేశంతో మా అంచనాలు-యదార్థాలు ఇస్తున్నాను.

| పద్దువివరము | అంచనా | యదార్థ ఖర్చు | వ్యత్యాసం |
|---|---|---|---|
| (1) రైలు టికెట్లు | 22,546 | 22,546 | --- |
| (2) హోటళ్ళు, గెస్ట్ హౌసులు | 22,500 | 34,941 | + 12,441 |
| (3) యాత్ర మొత్తానికి వాహనం | 33,000 | 35,351 | + 2,351 |
| (4)గుఱ్ఱాలు/పల్లకీలు/ పోర్టర్లు | 10,000 | 13,277 | + 3,277 |

| | | | |
|---|---|---|---|
| (5)ఆహార పానీయాలు | 19,800 | 19,395 | - 405 |
| (6) ఆకస్మిక ఖర్చులు | 12,000 | 12,080 | + 80 |
| మొత్తం | **1,19,846** | **,37,590** | **17,744** |

**పద్దుల వారీ వివరణ:**

(1) ముందే కొన్నవి కనుక అంచనాతో నిమిత్తం లేదు.

(2) ముందే బుక్ చేసుకున్న హరిద్వార్ రాజ్ డీలక్స్ హోటల్ లో గదికి రు. 1500 చొ.న మూడు గదులకు రోజుకు రు. 4,500 చొ.న రెండు రోజులకు రు. 9,000 అంచనా. మిగతా 9 రాత్రులకు గదికి కనీస రుసుము రు.500 అంచనాతో మూడు గదులకు రు.1,500 చొ.న (500x3x9) 13,500 అంచనా కాగా నిగం గెస్ట్ హౌసుల్లో ఎకానమీ తరగతి గదుల కనీస రుసుము రోజుకు రు. 800. ఈ వ్యత్యాసంతో, తిరుగు ప్రయాణంలో హరిద్వారులో బస రద్దు అయినప్పటికీ, అంచనాకు ఖర్చుకు మధ్య వ్యతాసం ఒక రోజుకే రు. 900 ఉన్నందున ఆ మేరకు యదార్ధ ఖర్చు, అంచనాను మించింది.

(3) యాత్ర సన్నాహాల సమయంలో హరిద్వారులోని ట్రావెల్ ఏజంటుతో సంప్రదించినప్పుడు మొదట ఇచ్చిన అంచనా రు. 33,000. ఏ కారణంచేతనో గానీ, ప్రయాణం మొదలుపెట్టే ముందు దీనిని రు. 26,000 కు సవరించారు. చివరకు ఆ ఎనిమిది వేలూ మిగలాలి. కానీ రు.2,351 అదనం తేలింది. ఎందుకంటే, డిల్లీలో వాడిన మూడు వాహనాలకు చెల్లించిన రు. 4,851/- అంచనాలో చేర్చబడలేదు. కాని యదార్ధ ఖర్చులో చేరింది. మిగతా వ్యత్యాసం, వాహనం అదనంగా ఒకరోజు వాడుకున్నందుకూ, పది రోజుల పాటు మాకు అండగా ఉండి ఎంతో విశ్వాసంగా తన విధులను నిర్వహించి

నందుకుగానూ డ్రైవరు 'విపిన్' కు మా పిల్లలు కృతజ్ఞతా పూర్వకంగా ఇచ్చినది

(4) పర్వత ప్రాంతాల్లో నడక భాగానికే పోర్టరుల రుసుము అంచనాకు అందింది కానీ, రైల్వే స్టేషన్లలోనూ, హరిద్వారులో హోటలుకు చేరుకోవటానికి గాని పోర్టరుల ఖర్చులు అంచనాలో చేరలేదు. ఒక్క డిల్లీ స్టేషన్లలోనే ఈ పద్దు క్రింద రు. 680 హరిద్వారులో మరో రు. 300 తో మొత్తం 3,277 వ్యత్యాసంలో రు. 980 ఇక్కడే తేలింది. మిగతా రు. 2,297 లో లక్ష్మి హేమకుండ్ వెళ్లి రావటానికి అంచనాలోలేని గుఱ్ఱం ఖర్చు రు. 1000 లు పోను, అంచనాకు యదార్ధానికి నికర వ్యత్యాసం రు. 1,297 .

(5) ఇంటి నుండి బయలు దేరి తిరిగి ఇంటికిచేరిన రోజులతో కూడా కలిపి మొత్తం యాత్ర 14 రోజులు కాగా రానూ పోనూ ప్రయాణంలో రైళ్ళహోదా, మేము ప్రయాణించిన తరగతి రీత్యా ప్రయాణ కాలంలో అన్ని భోజన, పానీయాలు, అల్పాహారాలు రైల్వేవారే సమకూర్చారు. మిగతా 9 రోజులకు ఉదయం అల్పాహారానికి, మధ్యాహ్న,రాత్రి భోజనాలకు, కాఫీ, టీ లకు గాను మనిషికి రోజుకు రు. 300 ప్రాతిపదికపై మొత్తం పదకొండు రోజులకు, ఆరుగురికి (300x6x11)=19,800 అంచనా వేయబడగా యదార్ధ ఖర్చు 19,395. విస్మరించదగిన వ్యత్యాసం రు. 405 మాత్రమే.

(6) ఈ పద్దు క్రింద కూడా పెద్ద వ్యత్యాసం లేదు. ఒక మనిషికి మొత్తం యాత్రకు గాను రు. 2,000 వ్యక్తి గత ఖర్చుల క్రింద (2000 x6) రు. 12,000 అంచనా వేయగా యదార్ధ ఖర్చు 12,080/- తిరుగు ప్రయాణంలో పిల్లలు డిల్లీలో కొనుక్కున్న పుస్తకాలు కానీ, రిషీకేష్ లో లక్ష్మి, సుప్రియలు కొనుగోలు చేసిన రుద్రాక్షలు ఇతర ఆభరణాలు గాని అంచనాలో చేర్చబడనందున యదార్ధ ఖర్చులో కూడా చేర్చలేదు.

**సంక్షిప్తంగా**

**(ఆరుగురి బృందానికి)**

| | |
|---|---|
| **మొత్తం యాత్రకు అంచనా** | **రు. 1,19,846** |
| **యథార్థ ఖర్చు** | **రు. 1,37,590** |
| **వ్యత్యాసం** | **రు. +17,744** |
| **నికర అంతరం:** | **11.48%** |
| **తలసరి ఖర్చు** | **రు. 22,931.66** |
| **తలసరి ఖర్చులో వ్యత్యాసం** | **రు. +2,890.67** |

**పై సమీక్ష వెలిగించిన యదార్థం:**

ప్రణాళికలో ఆకస్మిక ఖర్చులకు అదనంగా మరో పది శాతం వరకూ వెసులుబాటు (Cushion)కు కూడా కేటాయించవలసి ఉంటుంది. అంచనాలో ఇవి చేరే ఉన్నవి. దానిపై పది శాతం కలిపినా కూడా ఈ మొత్తం రు. 1,198.46 మించటానికి వీలులేదు. తలసరి ఖర్చులో ఇది విస్మరింపవీలుకాని వ్యత్యాసమేనని అంగీకరించాలి. కనుక, ఇది ప్రణాళికలో అసమగ్రతను, మౌలిక లోపాన్నే చూపుతున్నది.

# ఆరవ అధ్యాయం



2010 సంవత్సరము జూన్, జులై నెలలలో చేసిన కేదార్, బదరీ యాత్రలు, వాటి కొనసాగింపుగా పుష్పవనం (The Valley of Flowers) 'ఆలీ' (Rope Way) లలో చేసిన పర్యటనలను గ్రంధస్థం చేసినందువలన కలిగిన సంతృప్తి, ఆసక్తిగా ఆ గ్రంధం చదివినవారు సహృదయంతో చేసిన అభినందనలు, తెలియజేసిన అభిప్రాయాలతో లభించిన ప్రోత్సాహంతో ఆ తరువాత చేసిన మరి కొన్ని యాత్రలు, పర్యటనల విశేషాలు, అనుభవాలు కూడా ఈ గ్రంధానికి అనుసరణికగా పొందు పరచే ఉద్దేశంతో –

***శుక్లాంబర ధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం***
***ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నో ప శాంతయే/***
***అగజానన పద్మార్కం గజాననమహర్నిశం***
***అనేకదం తం భక్తానాం ఏక దంత ముపాస్మహే ||***
***సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి***
***విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా ||***
***పద్మ పత్ర విశాలాక్షీ పద్మ కేసరవర్ణినీ***
***నిత్యం పద్మాలయా దేవీ సా మాం పాతు సరస్వతీ ||***

*వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమః ప్రభ*

*నిర్విఘ్నం కురుమే దేవ సర్వ కార్యేషు సర్వదా ||*

అని ప్రార్థిస్తూ అందులకు ఉపక్రమిస్తున్నాను.

2011 సంవత్సరం ఫిబ్రవరి 9వ తేదీన ముంబయిలోని మా కుమారుని ఇంట్లో ఒక చిన్నవేడుకలో పాల్గొనవలసి వచ్చింది. ఎలాగూ అక్కడివరకూ వెళుతున్నాం కదా ఆ కార్యక్రమమేదో ముగిశాక తిరుగు ప్రయాణంలో ఫిబ్రవరి 11 నుండి 13 వరకు పూణే మీదుగా ఆ రాష్ట్రంలోని భీమాశంకరం, నాశికాత్ర్యంబకం, ఘ్రుష్మేశ్వర్ జ్యోతిర్లింగాలను దర్శించుకుని, ఔరంగాబాద్ మీదుగా 14 వ తేదీకి సికిందరాబాదు చేరేటట్లు, తిరిగి మార్చి 13వ తేదీ నుండి 25వ తేదీ వరకు నైమిశారణ్యం. వారణాసి, గయ, బైద్యనాథ్, కోల్కతా, పూరి, కోణార్క్, భువనేశ్వర్ మీదుగా హైదరాబాదు చేరుకోవటానికి కార్యక్రమం రూపొందించుకున్నాను. తదనుగుణంగా రైలు టికెట్లు రిజర్వు చేశాను.

అలా టికెట్లు రిజర్వు చేసుకుని ఇంటికి తిరిగి వచ్చానో లేదో విజయవాడనుండి వచ్చిన మా బావమరిది శ్రీ అచ్యుతరావుగారు, వారి శ్రీమతి సత్యప్రసూనగారు మా ఇంట్లో ఉన్నారు. మా యాత్ర సన్నాహాలు తెలుసుకుని తామూ వస్తే బాగుంటుందనే అభిలాషను చూచాయగా వెలిబుచ్చారు. అయితే అప్పటికే టికెట్లు తీసేసుకోవటం అయిపోయినందువల్ల వత్తిడి చేయలేక పోయారు. గత సంవత్సరం చేసిన కేదార్, బదరీ యాత్రలలోనే మాతో కలిసి యుండేవారు. కానీ, అప్పుడు వారు అమెరికాలో తమ కుమారుడి వద్ద ఉండటంతో అది సాధ్యపడలేదు. వారి ఉత్సాహాన్ని గమనించి, వారు మరొక్క సారి నిరుత్సాహం పొందకుండా ఉండేందుకుగాను, అప్పటికీ మించి పోయినదేమీ లేదనీ, ఎలాగూ మా ఇద్దరివీ ప్రయాణపు తేదీ నుంచి

33 రోజుల వ్యవధిలో ఉపయోగించవీలున్న, అప్రూవు అయిన సర్క్యులర్ టికెట్లు కనుక, చేయవలసినదల్లా, ఆ బృందంలో మరి రెండు పేర్లు జేర్చి, మొత్తం నాలుగు టికెట్లు ఒకే వరుసలో ఉండే విధంగా అప్పటికే నిర్ధారింపబడిన మా ఇద్దరి టికెట్లను రద్దుచేసి అవసరమైన అదనపు రుసుము చెల్లించి వీలయితే అవే తేదీలకు, కాకుంటే మరో తేదీకి ప్రయాణం మార్చుకోవచ్చనీ, ఈ మార్పులను నిర్వహించటానికి రైల్వేలో మా మిత్రుడు శ్రీ పంచాంగం చలపతిబాబు గారు ఎలాగూ ఉన్నారు కనుక, తేదీల విషయమై తాము ఒక నిశ్చయానికి రాగలిగితే అవసరమైన ఏర్పాట్లు చేయగలనని వారిని ప్రోత్సహించాను. దీనితో సంతృప్తి చెంది, హైదరాబాదులోనే ఉండే వారి పెద్ద కుమారుని సంప్రదించి మాతో రావటానికి తుది నిర్ణయాన్ని ఆ సాయంత్రానికే తెలియజేశారు. ఆ మరునాడే రిజర్వేషను కార్యాలయానికి వెళ్లి, 13 తేదీ బదులు మార్చి 18వ తేదీ నుండి 29 వరకు కార్యక్రమాన్ని సవరించి మళ్ళీ కొత్తగా టికెట్లు తీసుకున్నాను.

ఫిబ్రవరి 9 కార్యక్రమానికి గాను 7వ తేదీన మధ్యాహ్నం గం.02.45ని. లకు హుసేన్ సాగర్ ఎక్స్ ప్రెసులో బయలుదేరి 8వ తేదీ ఉదయం గం 4.50 ని.లకు ముంబై చేరుకున్నాము. ఆఖరి క్షణంలో మనసు మార్చుకున్నది కాబోలు, మొదట నిశ్చయించుకున్న దానికి భిన్నంగా ఆ కార్యక్రమానికి మా పెద్ద కుమార్తె చి.సౌ| సుధామాధవి కూడా వచ్చింది. సమయ, సందర్భౌచిత్యాలను అనుసరిస్తూ ఫిబ్రవరి 21వ తేదీన, వారి రెండవ కుమారుని ఉపనయనం ఆకస్మికంగా నిర్ణయించినట్లు తెలిపింది. ఆ సమయంలో తన భర్త వ్యాపార నిమిత్తం విదేశాల (నైజీరియా) లో ఉన్నారు. వ్యవధి స్వల్పంగా ఉన్నందువల్ల ఆ కార్యక్రమ ఏర్పాట్లలో మా సహకారాన్ని కోరింది. అందువల్ల, అప్పటికే 11వ తేదీ నుంచి చేయవలసియున్న యాత్ర

(భీమాశంకరం, త్ర్యంబకం, ఘ్రుష్మేశ్వర్) కోసం ముంబై పూణే, నాశిక్ ఔరంగాబాదు, ఔరంగాబాదు సికిందరాబాదులకు రిజర్వు చేసుకున్న ప్రయాణాలను రద్దుచేయించి హుటాహుటిన తనతో పాటు మమ్మల్నీ హైదరాబాదుకు తిరుగు పయనం చేయించింది. ఆ విధంగా ఆ మూడు జ్యోతిర్లింగాల దర్శనం మరొకసారి వాయిదా పడ్డది. మార్చి నెల యాత్రకు సంబంధించి కూడా కొన్ని అవాంతరాలు గోచరించాయి. అయితే భగవదనుగ్రహంవల్ల అవన్నీ సకాలంలో తొలగి యాత్ర సాధ్యపడింది.

ప్రయాణపు తేదీకి వారం ముందుగానే మా బావమరిది దంపతులు హైదరాబాదుకు చేరుకున్నారు. ఆ వారంలో ఒకటి రెండు సార్లు సమావేశమై దర్శించబోయే యాత్రాస్థలాలను, ఆయా ప్రదేశాలలో గడపదగిన సమయం మొదలైన అంశాలను, యాత్రకు ఇతర ఏర్పాట్లను చర్చించుకుని, సమీక్షించుకున్నాం. ఆ వారంలోనే, నా చిరకాల మిత్రుడు శ్రీ పరమాత్ముని సుబ్బారావుగారిని కలిశాము. వీరు రాష్ట్ర ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖలో జాయింటు కమీషనరుగా సేవలందించి పదవీ విరమణచేసి విశ్రాంతంలో ఉన్నారు. తమ పదవీకాలంలో, అదే శాఖలో పనిచేసి పదవీ విరమణచేసిన మా బావమరిదిగారికి వీరు ఉన్నతాధికారి. యావత్భారతదేశం విస్తృతం గానూ కొన్ని విదేశాలలోనూ వీరు సకుటుంబంగా పర్యటించి ఉన్నారు. తమ పర్యటనల విశేషాలను, ఆయా ప్రదేశాలలో దర్శనీయస్థలాలూ, ముఖ్యమైన వ్యక్తుల, సంస్థల పేర్లు, ఫోనునంబర్లు, అందుబాటులో నున్న వసతి, భోజన సదుపాయాల వివరాలు, మొదలైన సమాచారాన్నంతా కంప్యూటరులో భద్రపరచి, ఉత్తరోత్తరా అవి అవసరమైనవారికి అందచేయటం వారి ఉత్తమ అభిరుచుల్లో ఒకటి.

ఈ నేపథ్యంలో వారితో మా సమావేశం ఎంతో ప్రయోజన కరమైంది. కోల్కతాలో గడప వలసిన పూర్తిరోజుకు సమగ్రమైన కార్యక్రమాన్ని సూచించారు. కోల్కతా నుంచి పూరి మార్గంలో బాలాసోర్ - కటక్ ల మధ్యన ఉన్న జాజిపూర్ గురించి వారు ప్రముఖంగా ప్రస్తావించారు. దీనిని 'నాభిగయ' అని కూడా అంటారని, అక్కడ వైతరిణి నది, మరీ ముఖ్యంగా అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటిగా పేర్కొనబడిన గిరిజాదేవి ఆలయం ఉన్నట్లు, అందుచేత వీలుచేసుకుని ఆ ప్రయాణంలో 'జాజిపూర్ రోడ్డు' స్టేషనులో దిగి ఈ క్షేత్రాన్ని కూడా చూసి అక్కడనుంచి నేరుగా పూరి వెళ్ళవలసినదిగా సూచించారు. మేము టికెట్లు బుక్ చేసుకున్న కోల్కతా పూరి ఎక్స్ ప్రెస్ 'జాజిపూర్ రోడ్డు' స్టేషనుకు తెల్లవారు ఝామున గం.03.24 ని.లకు చేరి కొద్ది క్షణాలపాటు నిలుస్తుంది.

వారి సూచనను గౌరవిస్తూ ఆ స్టేషనులో దిగి జాజిపూర్ చేరుకొని, కార్యక్రమాలు పూర్తిచేసుకుని తిరిగి అక్కడనుండి పూరి చేరేవిధంగా ఉదయం గం.11.02 ని.లకు 'జాజిపూర్ రోడ్డు' స్టేషను నుంచి బయలు దేరి మధ్యాహ్నం గం. 02.30 ని.లకు పూరి చేరే హౌరా - పూరి 'ధౌళి' ఎక్స్ ప్రెసులో, కోల్కతా నుంచి పూరి వరకు అప్పటికే నిర్ధారింపబడియున్న టికెట్లను రద్దు చేయకుండా, (స్వభావరీత్యా నాకు కొంచెం దూకుడు ఎక్కువ. కొన్ని సందర్భాలలో వెనుకా ముందూ ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకుంటూ ఉంటాను. ఈ సరళి చిక్కులు తెచ్చిపెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీనికి భిన్నంగా నేను తీసుకున్న అరుదైన మంచి నిర్ణయాలలో ఇదొకటి. దూకుడూ, సంయమనాల నడుమ సమతౌల్యం పాటించే సామర్థ్యాన్ని ఇప్పుడిప్పుడే అలవరచుకుంటున్నాను) 'జాజిపూర్ రోడ్డు' స్టేషను నుండి పూరికి అదనంగా టికెట్లు తీసుకున్నాను. అయితే ఇవి, నిరీక్షణ జాబితాలో

5,6,7.8 గా నమోదై వున్నాయి. ప్రయాణ సమయానికి ధృవీకరింపబడే అవకాశం ఉంది.

ఆ వారంలోనే, శ్రీ చివుకుల సీతారాముడుగారి ద్వారా వైద్యనాథ్ లోనూ, గయలోనూ తెలుగు తెలిసిన క్షేత్ర పురోహితుల సమాచారం, వారి ఫోను నంబరులు సేకరించి దగ్గర ఉంచుకున్నాను. డాక్టరు రేమెళ్ల అవధానిగారు, గయలో నిర్వహింపవలసిన పిండప్రదాన కార్యక్రమాల ప్రాశస్త్యం, ఆవశ్యకతలను వివరించారు. అక్కడ కాగల ఖర్చు విషయమై కూడా సూచనప్రాయంగా ఒక అంచనా ఇచ్చారు. NTVలో పని చేసే మిత్రులు శ్రీ వెంకటరావుగారు నైమిశారణ్యం గురించి అక్కడ ఉన్న వసతుల గురించి ఉపయుక్తమైన సమాచారం అందించారు.

**ప్రారంభ ప్రయాణం**

మార్చి 18వ తేదీ ఉదయం గం. 6.45 ని.ల కల్లా ఎవరి ఇళ్ళ నుండి వాళ్ళం సికిందరాబాదు స్టేషనుకు చేరుకున్నాం. నిర్ణీత సమయం గం.7.20 ని.ల కల్లా రైలు బయలుదేరింది. సోదరి సత్య ప్రసూన (మా బావమరిదిగారి శ్రీమతి) ఆ రోజు మధ్యాహ్నానికి భోజనం, రాత్రికి అల్పాహారం సిద్ధం చేసుకొచ్చి ప్రయాణంలో ఆ లోపం లేకుండా చేసింది. ప్రయాణం 26 గంటల సుదీర్ఘమైనది. నిర్ణీత సమయానికి గంటంబావు ఆలస్యంగా మరునాడు ఉదయం గం. 11.00 లకు లక్నో చేరాము. మా పెద్దన్నయ్య గారి కుమారుడు చి| బింబాధర్ CNN-IBN ఛానల్ తరపున లక్నోలో వీడియో న్యూస్ ఎడిటరుగా పనిచేస్తున్నాడు. (అంతకు మునుపు అక్కడే ఈటీవీ లో కెమెరామాన్ గా పనిచేసేవాడు) మేము వెళ్లే సమయానికి అతను శెలవుపెట్టి స్వస్థలంలో ఉన్నాడు. మా రాక గురించి మునుపే తెలిసి యుండటం చేత, స్టేషనుకు

వాహనాన్ని ఏర్పాటు చేసి, డ్రయివరు 'బబ్లూ' ఫోను నంబరు నాకు ఇచ్చియున్నాడు.

మేము 19వ తేదీన చేరుకోగా 20వ తేదీ హోలీ అయింది. ఉత్తరాదిన ఈ పండుగను అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు ఆ ఉల్లాసం, ఆనందం, తన్మయత్వం తప్ప ఆ రోజున వారికి మరేదీ పట్టదు. సాధారణ జనజీవనం స్తంభించిపోతుంది. ఇక మనలాటి పర్యాటకుల పాట్లు చెప్పనలవి కావు. 2009 లో ఇదే హోలీ రోజున మేము అలహాబాదులోఉండటం జరిగింది. కనీసం టీ నీళ్ళు కూడా దొరకని స్థితిలో రోజంతా హోటలుగదిలో దుర్భరంగా గడపవలసి వచ్చింది.

ఈ అనుభవం మదిలో తాజాగానే ఉన్నప్పటికీ, యాత్రకు తేదీలు నిర్ణయించే సమయంలో ఎందుకనో ఈ 'హోలీ' దృష్టిలోకి రాలేదు. శ్రీ సుబ్బారావుగారికి కూడా ఇటువంటి అనుభవం ఉండటంచేత వారితో సమావేశంలో ఇది ఒక సమస్య రూపంలో ప్రముఖంగానే చర్చకు వచ్చింది. ఎంతో అసాధారణమైతే తప్ప, రైలు మధ్యాహ్నం పన్నెండు లోపలే లక్నో చేరుతుందని ఆశిస్తే, వెంటనే బయలుదేరి మరో రెండు మూడు గంటల్లో నైమిశారణ్యం చేరుకొని అక్కడ దర్శనీయ స్థలాలను వెంట వెంటనే చూసేసి, తిరిగి ఆ రాత్రికే లక్నోకు చేరి ఆ మరునాటి కాశీ ప్రయాణానికి గాను స్టేషను చేరటానికి ఒకవేళ అప్పటికీ వాహనమేదీ దొరకని పరిస్థితి ఉంటే, నడిచిపోయే వీలుగా స్టేషను సమీపంలో, రెస్టారెంటు అనుబంధంగా నున్న ఏదయినా మంచి హోటలు చూసుకుని కుదురుకోవలసినదిగా పరిష్కారాన్ని సూచించారు. అలాగే నిశ్చయించుకున్నాం. ఇక్కడే సమాచార ప్రస్థానంలో కొంత అంతరం చోటు చేసుకున్నది. తత్కారణంగా ఈ విషయం

బింబాధరుకు సకాలంలో తెలియ జేయలేక పోయాను. అలాగే తను మాకు తెలపాలనుకున్న కూడా మరొక ముఖ్య విషయం మాకూ చేరలేదు.

స్టేషను బయటకు వచ్చాక సామానుతోసహా మిగతా బృందాన్ని ఒకచోట నిలిపి 'బబ్లూ'కు ఫోను చేశాను. వాహనం నంబరు, తను నిరీక్షిస్తున్న స్థలం స్పష్టంగా చెప్పటంచేత తేలికగానే వాహనాన్ని గుర్తించి, నన్ను నేను పరిచయం చేసుకుని, వాహనంతో సహా తిరిగి బృందాన్ని చేరుకొని, సామాను ఎక్కించుకుని బయలుదేరాము. నైమిశారణ్యం వెళ్ళవలసియుందని తెలిసినప్పటికీ, వాహనాన్ని నేరుగా బింబాధర్ నివాసముండే 'ఇందిరానగర్' ప్రాంతం వైపు పోనిస్తున్నాడు. అంతకు మునుపు ఒకసారి ఆ నగరాన్ని సందర్శించటంచేతనూ, ఇంటర్నెట్లో లక్నో నగర మ్యాపును కొంత చదివి యుండటం చేతనూ, ఆ నగరంలో ప్రధాన రహదార్లు, కూడళ్ళు మొదలైన వాటిపై కొంత అవగాహన ఏర్పడటంవల్ల, ఎందుకో వ్యతిరేక దిశలో వెళుతున్నట్టు అనుమానం కలిగి "మనం నైమిశారణ్యం కదా వెళుతున్నాం?" అని డ్రైవరును అడిగా. అతను మౌనంగా వాహనం నడుపుతున్నాడు. వినబడలేదు కాబోలని మళ్ళీ అడిగాను. కానీ విచిత్రం! అతనికి 'నైమిశారణ్యం' అంటే అర్థమే కాలేదు. అతనికి అర్థం కాలేదనే విషయం నాకు అర్థమయ్యే సరికి చాలా దూరం వెళ్లాం. ఆ తరువాత తెలిసింది. అక్కడ 'నైమిశారణ్యం' అంటే ఎవరికీ అర్థం కాదని, 'నిమిశ్' అనాలని. నైమిశారణ్యంలో ఉన్న గ్రామం పేరు 'నిమిశ్". మొత్తానికి, మనం బింబాధర్ ఇంటికి వెళ్ళటంలేదని, నేరుగా 'నిమిశ్' కు వెళ్లి, రాత్రికే లక్నోకు తిరిగి వస్తామని ఈ సారి సందేహాతీతంగా తెలియజేసి 'హమ్మయ్య' అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నాను. అతను యువకుడు. సాధుస్వభావి, పైగా సున్నిత మనస్కుడు. విషయం తెలుసుకోకుండా తొందరపడి వేరే మార్గంలో

తీసుకువెళ్ళినందుకు పదే పదే క్షమాపణలు చెపుతూనే అసలు విషయం బయట పెడుతూ "ఇపుడేం చేద్దామ"ని అడిగాడు. హోలీ వల్ల ముఖ్యంగా తన పరోక్షంలో మాకు కలిగే అసౌకర్యం బింబాధరుకు తెలుసు కనుక ఆరోజు రాత్రి వాహనంతో సహా నైమిశారణ్యంలోనే ఉండిపోయి మరునాడు హోలీ వేడుకలు సద్దుమణిగే సాయంత్ర సమయానికి అక్కడ బయలుదేరి నేరుగా లక్నో స్టేషనుకు చేరుకునే విధంగా డ్రైవరుకు అప్పటికే ఆదేశాలు ఇచ్చి యున్నాడు. సరే, ఆ విధంగా నైమిశారణ్యంలో నిద్ర చేసే అవకాశం చి| బింబాధర్ రూపంలో ఆ శ్రీమన్నారాయణుడే కల్పించాడనుకుని "మరీ మంచిది. అయితే, మరి సాయంత్రం దాకా ఎందుకు? ఎలాగూ బింబాధర్ నగరంలో లేరు కనుక వారింటికి వెళ్ళే పని కూడా లేదు. అందుచేత నేరుగా 'నిమిశ్' కే పోనీ" అన్నాను.

'సరే' అంటూనే మళ్ళీ అంతలోనే అతను అన్యమనస్కంగా అయ్యాడు. అందుకు కారణం సులభంగానే కనిపెట్టగలిగాను. 'నిమిశ్"కు తీరిగ్గా సాయంత్రం కదా వెళ్ళేదనే ఆలోచనలో కదా అతను అంతవరకు ఉన్నాడు? అందుకు భిన్నంగా నేరుగా 'నిమిశ్' వెళుతున్నట్లు, రాత్రికి అక్కడే ఉంటున్నట్లు, తన ఇంట్లో చెప్పలేదన్నమాట.ఈ ఆకస్మిక మార్పు ఫోనులో తెలియజేసే వీలున్నపటికీ, ఒక రాత్రి బసకు అవసరమైన దుస్తులు ఇతర వస్తువులైనా తెచ్చుకోవాలి. పైగా, మరునాడు వాళ్ళకు ముఖ్యమైన పర్వదినం. విధి నిర్వహణా ధర్మం పాటించవలసిన కారణంగా తను వారితో ఉండలేక పోయినా, భార్యాబిడ్డలకు చేతిలో ఏమయినా ఉంచటం ద్వారా గృహస్తు ధర్మం కూడా పాటించాలి కదా. ఇలా అనేక సందేహాలు చుట్టుముట్టగా అతనినే సూటిగా అడిగేశాను. అన్నింటికీ అతను 'లేదనే' సమాధానమే చేప్పాడు. "భలే వాడివయ్యా 'బబ్లూ'! దీనికోసమా, ఇంతగా

ఆలోచిస్తున్నావు? సరే! అయిన ఆలశ్యం ఎలాగో అయింది. మరికొంచెం సేపయినా మించిపోయిందేమీ లేదు. ఎంత దూరమైనాగానీ, ఫరవాలేదు, నేరుగా మీ ఇంటికి పోనియ్ బండిని." అన్నాను. అలాగే పోనిచ్చాడు. నా చనువుకూ, సౌజన్యానికి అతను ఎంతో సంతోషించాడు. అతని నివాసం కూడా మేము ప్రయాణించే ప్రధానమార్గానికి చేరువలోనే ఉండటంచేత పెద్ద ఆలస్యం కాలేదు. మధ్యాహ్నం సరిగ్గా పన్నెండు గంటలవుతుండగా లక్నో నగర శివార్లు దాటాము.

## నైమిశారణ్యం – తపోభూమి

జీవితంలో కనీసం ఒకసారయినా శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం చేయనివారు కానీ, ఆ వ్రతం చేస్తుండగా చూడనివారు కానీ లేదా ఆ వ్రత కథ శ్రద్ధగా వినని వారు కానీ ఉండరంటే అతిశయోక్తి కాదు. అలాంటి వారికి, ఆ వ్రత కథ మొదటి అధ్యాయంలోని ఈ మొదటి శ్లోకం సుపరిచితం.

*శ్లో/ ఏకదా నైమిశారణ్యే ఋషయశ్శౌనకాదయః*

*పప్రచ్ఛురాగతం సర్వే సూతం పౌరాణికం ఖలు//*

ఎవరీ సూత మహాముని? ఎవరు శుక, శౌనకాది మహా ఋషులు? ప్రపంచంలో అరణ్యాలు ఎన్నోఉండగా వాళ్ళు ఈ నైమిశారణ్యంలోనే ఎందుకున్నారు? అక్కడ వీరికేమిపని? ఇటువంటి ప్రశ్నలు, ఏవో పనిలేకనో లేక అజ్ఞానంతోనో వేసినవి కాకపోతే, సమాధానం ఆసక్తిదాయకంగా ఉంటుంది. ఆ ఆసక్తినుండే ఈ ప్రాంతాన్ని ఒకసారి దర్శించాలనే ఉత్సాహం కలుగు తుంది. అలా కలిగిన ఉత్సాహమే మా ఈ పర్యటనకు ప్రేరణ.

## స్థల పురాణం

కలియుగారంభంలో, ఈ యుగలక్షణాల పట్ల తీవ్ర భయాందోళనలకు గురైన మునులు, మహర్షులు, తాము తపస్సులు, యజ్ఞ యాగాదులు

చేసుకొనుటకు కలి ప్రభావం లేని ప్రదేశం చూపమని ప్రార్థింపగా, సృష్టికర్త యయిన బ్రహ్మ, దర్భలతో చేయబడిన ఒక చక్రాన్ని అనంతంలోకి విడిచి, "ఇది ఎక్కడపడి నిలుస్తుందో ఆ ప్రదేశాన్ని మీ తపోభూమిగా గుర్తించండి" అని సూచించగా, అందరూ ఆ చక్రగమనాన్ని అనుసరించి సాగారుట. ఆ విధంగా, స్వయంభూ మండలంనుండి బయలుదేరిన ఆ 'దివ్యవిశేషం' పరమేష్టి, సూర్య, చంద్ర మండలాలు దాటి భూమిపై పడిన ప్రదేశమే 'నైమిశారణ్యం' గా ప్రసిద్ధి గాంచినది. ఏ నైమిశారణ్యంలోనైతే 'శ్రీమద్భాగవతం' రచించారో ఆ భాగవతంలోనే వ్యాస భగవానుడు స్వయంగా ఆ ప్రదేశాన్ని కూడా ప్రస్తావించారు. ఉదాహరణకు ప్రథమ స్కంధం, ప్రథమ అధ్యాయం, నాల్గవ శ్లోకం ఇలా ఉంది.

శ్లో. ***ఓం నైమిశే అనిమిష క్షేత్రే ఋషయః శౌనకాదయః***

***సత్త్రం స్వర్గాయ లోకాయ సహస్ర సమ మాసత |***

ఈ శ్లోకాన్ని, *"నైమిశారణ్యం నందు శౌనకాది మహా మునులు స్వర్లోక గేయమానుండగు హరిం జేరు కొఱకు సహస్ర వర్షంబులనుష్ఠాన కాలంబుకాగల సత్త్రసఙ్ఖికంబైన యాగంబు సేయుచుండిరి"* అని శ్రీ బమ్మెర పోతనామాత్యులు ఆంధ్రీకరించారు. ఇంకా –

కం| "పుణ్యంబై ముని వల్లభ
గణ్యంబై కుసుమ ఫలవికా యోత్థితసా
ద్గుణ్యంబై, నైమిశాఖ్యా
రణ్యంబు నుతింపదగు నరణ్యంబులలోన్"

*"పుణ్యవంతమూ, తాపసోత్తములకు శరణ్యమై పుష్ప ఫల భరిత తరువరేణ్యమూ అయిన నైమిశము అనే పేరు గల అరణ్యం అరణ్యాలన్నింటికీ*

*అగ్రగణ్యమై అలరారుతూ ఉండి, మహామునుల చేత పొగడ తగినదిగా ఉన్న ది"* అంటూ అసలు పురాణంలోనికి మనలను తీసుకువెళ్ళే ముందు, ఇంకా విస్తారంగా వర్ణిస్తారు భాగవతోత్తముడైన పోతనామాత్యులు. *"మఱియును"* అంటూ ఆ వర్ణన ఇలా సాగుతుంది.

***"మధువైరి మందిరంబునుబోలె మాధవీ మన్మ ధ హితంబై,***
***బ్రహ్మ గేహంబునుంబోలె శారదాన్వితంబై,***
***నీలగళ సభా నికేతనంబునుంబోలె,***
***వహ్ని వరుణ సమీరణ చంద్ర రుద్ర హైమవతీ కుబేర వృషభ గాలవ శాండిల్య పాశుపత నటిపటల మండితంబై,***
***జలభేది భవనంబునుంబోలె, నైరావతామృత రంభా గణికాభిరామంబై,***
***మురాసుర నిలయంబునుంబోలె, నున్మత్త రాక్షస వంశసంకులంబై,***
***ధనదాగారంబులునుంబోలె, శంఖ, పద్మ కుండ, ముకుంద సుందరంబై,***
***రఘురాము యుద్ధంబునుంబోలె, నిరంతర శరానల శిఖా బహుళంబై,***
***పరశురాము భండనంబునుంబోలె, నర్జునోద్భేడంబై,***
***దానవ సంగ్రామంబునుంబోలె, నరిష్ఠ జంభ నికుంభ శక్తి యుక్తంబై,***
***కౌరవ సంగరంబునుంబోలె, ద్రోణార్జున కంచస్యందన కదంబ సమేతంబై,***
***కర్ణు కలహంబునుంబోలె, మహోన్న త శల్య సహకారంబై,***
***సముద్ర సేతు బంధనంబునుంబోలె, నలనీల పనసాద్యద్రి ప్రదీపితంబై,***
***భరు భజనంబునుంబోలె, నానా శోక లేఖా ఫలితంబై,***
***మరుని కోదండంబునుం బోలె, బున్నా గా శిలీముఖ భూషితంబై,***
***నరసింహ రూపంబునుంబోలె, గేసర కరజా కాంతంబై***
***నాట్య రంగంబునుం బోలె, నట నటీ సుషిరాన్వితంబై***

*శైలజా నిటలంబునుంబోలె, జందన కర్పూర తిలకాలంకృతమై, వర్ణాగంబునుంబోలె,*

*నింద్ర బాణాసన మేఘ కరక కమనీయంబై నిగమంబునుంబోలె, గాయత్రీ విరాజితంబై,*

*మహా కావ్యంబునుంబోలె, సరల మృదులతా కలితంబై,*

*వినతా నిలయంబునుంబోలె, సువర్ణరుచిరంబై*

*యమరావతీ పురంబునుంబోలె, సుమనోలలితంబై*

*కైట భోద్యోగంబునుంబోలె, మధుమా న్వితంబై,*

*పురుషోత్తమ సేవనంబునుబోలె, నమృత ఫలదంబై,*

*ధనంజయ సమీకరణంనుంబోలె, నభ్రం కష పరాగంబై*

*వైకుంఠ పురంబునుంబోలె, ఖడ్గ పుండరీక విలసితంబై*

*నంద ఘోషంబునుంబోలె, కృష్ణ సారసుధరంబై*

*లంకా నగరమునుంబోలె, రామ మహిషీ పంచక సమంచితంబై*

*సుగ్రీవ సైన్యంబునుంబోలె, గజ గవయ శరభ శోభితంబై*

*నారాయణ స్థానంబునుంబోలె, నీలకంఠ కౌశిక భరద్వాజ తిత్తిరి భాసురంబై*

*మహా భారతంబునుంబోలె, నేక చక్ర బక కంక ధార్తరాష్ట్ర శకుని నకుల సంచార సమ్మిళితంబై*

*సూర్య రథంబునుంబోలె, సురుతర ప్రవాహంబై*

*జలభ కాల సందా ముహూర్తంబునుం బోలె, బహు విత్తత జాతి సామనస్యంబై*

*యొప్పు నైమిశారణ్యంబను శ్రీ విష్ణు క్షేత్రంబు"*

తన రచనల్లో పోతనకు అలంకార ప్రీతి ఎక్కువనీ, అనుప్రాసాది శబ్దాలంకారాలను విరివిగా వాడతారని కవి పండితుల, సాహితీ విమర్శకుల విశ్లేషణ. పైన ఉదహరించిన ఖండం ఈ శబ్దాలంకార ప్రయోగానికి

పరాకాష్ఠ యనదగినదిగా నున్నది. ఒక ప్రదేశాన్ని వర్ణించటానికి ఆంధ్ర సారస్వతంలో ఎన్ని ఉపమాన, ఉపమేయాలున్నాయో, వాటన్నిటినీ ఉపయోగించి కూర్చిన ఉపమాలంకార సమాహారాన్ని సుదీర్ఘ సమాసాలంకారాలతో మేళవించిన తీరు, ఆ ప్రాంత వైభవాన్ని, మనోహర దృశ్యంగా ఆవిష్కరించటమే కాక కవితా ప్రాభవాన్ని భాసిల్లజేసిందని కూడా చెప్పవచ్చు.పౌరాణిక కోణంలో పరిశీలించగా భారతావనిలో తొమ్మిది అరణ్య ప్రాంతాలు తపోవనాలుగా ప్రసిద్ధిగాంచినవని తెలుస్తున్నది. ఇవి నైమిశారణ్యం. దండక, సైంధవ, జంబు, పుష్కర, ఉత్పల, గురుజంఘాల, అరుత్పుర, బదరీ వనాలుగా చెప్పబడ్డాయి. అలాగే స్వయంవ్యక్త విష్ణు క్షేత్రాలు ఎనిమిది. అవి, తిరుమల, శ్రీరంగం, శ్రీముష్ణం , తోతాద్రి, సాలగ్రామం,, పుష్కర్లతో పాటు మళ్ళీ ఇక్కడ కూడా నైమిశారణ్యం. బదరీలుగా చెప్పబడ్డాయి. అలా రెండు విధాలుగా నైమిశారణ్యం, బదరీలు ప్రాముఖ్యతను సంతరించుకున్నవి. వేద వ్యాసుడు నైమిశారణ్యంలో శ్రీమద్భాగవతాన్ని రచించి, మహాభారత రచనను బదరీలో చేయటం కాకతాళీయం కాదనీ, దానికొక పౌరాణిక తాత్పర్యం ఉన్నట్లు దీనివల్ల స్పష్టమవుతున్నది.

***శ్లో. వ్యాసాయ విష్ణు రూపాయ వ్యాస రూపాయ విష్ణవే***
***నమో వై బ్రహ్మ నిధయే వాశిష్టాయ నమో నమః***

వ్యాసుడే విష్ణువు, విష్ణువే వ్యాసుడు. నైమిశారణ్యంవలెనే బదరీ కూడా సాక్షాత్తూ విష్ణు స్వరూపమై ఉండటమే దీనికి కారణంగా గ్రహించవచ్చు.

**నైమిశారణ్యం - భౌగోళిక స్థితి**

ఇది ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోకు వాయవ్య దిశలో 98 కిలోమీటర్ల దూరంలోని సీతాపూర్ జిల్లాలో ఉంది. లక్నో- డిల్లీ 24 నెంబరు జాతీయ రహదారిలో 58 కిలోమీటర్ల వద్ద సిద్ధౌలి అనే ప్రదేశ కూడలిలో

ఎడమవైపు మళ్ళాలి. అలా 29 కిలోమీటర్లు వెళ్ళగా 'కథి' అనే గ్రామం వద్ద మరో కూడలిలో మళ్ళీ ఎడమ వైపునకు మళ్ళాలి. ఆ మార్గం ప్రారంభంలోనే "శ్రీ బాలాజీ మందిర్, విజయవాడ" అని తెలుగులో చెక్కబడి ఉన్న అక్షరాలతో ఒక శిలా (సిమెంట్) తోరణం ఉంటుంది. ఆ మార్గంలో మరో 11 కిలోమీటర్లు ప్రయాణించగా 'నిమిశ్' గ్రామం చేరుకుంటాము. ఇక ఆ గ్రామ పరిసరాలన్నీ పవిత్రమైన నైమిశారణ్యమే. సరిగ్గా రెండు గంటలకు నైమిశారణ్యం చేరాము. ఇక్కడ వైఖానస సమాజం, విజయవాడ శాఖ వారిచే నిర్వహింప బడుచున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం గురించి ముందుగా చెప్పుకోవాలి.

సుమారు 18–19 సంవత్సరాల క్రితం ఇది నిర్మింపబడింది. ఈ దేవాలయంలో సిబ్బంది స్థానికులే అయినప్పటికీ పూజారులు మాత్రం తెలుగువారు. కొంచెం తమిళం కూడా తెలుసు. మరీ ముఖ్యంగా చెప్పుకోవలసినది ఆ దేవాలయం నిర్వహిస్తున్న 'మాతాజీ' గురించి. ఈమె పూర్వనామం 'రామానుజ కుమారి'. యౌవనం లోనే సన్యాసం స్వీకరించి వైఖానస సమాజం వారి అభ్యర్థన మేరకు ఈ దేవాలయం నిర్మించినప్పటినుంచీ అక్కడనే ఉంటూ స్వామి సేవకే పూర్తిగా అంకితమైన పరమ భక్తురాలు. ఆలయ ప్రాంగణాన్ని ఆనుకుని ఉన్న ప్రదేశంలో ఒక పూదోట మధ్యస్థంగా పర్ణశాలను బోలిన ఆశ్రమాన్ని నిర్మించుకుని అందులో ధ్యానం చేస్తూ ఉంటారీమె.

ఆశ్రమ ఆవరణలోనే ఒకవైపు గోశాల, అందులో వత్సములతో సహా కొన్ని గోవులు ఉన్నాయి. ఆలయ ప్రధాన ప్రవేశ ద్వారానికి వెలుపల లక్ష్మీ

సమేతుడైన శ్రీ మహావిష్ణువు శేషశయ్యా శయనుడై ఉన్న పాలకడలి ఇంకా గజేంద్రమోక్షం ఇత్యాదులు ఇతివృత్తంగా 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్'(Plaster of Paris) పదార్థంతో రూపొందింపబడిన విగ్రహాలతో ఏర్పాటు చేసిన దృశ్యాలు, సందర్శకులలో భక్తి తత్పరతా భావాలను ఇనుమడింపజేస్తాయి.

ప్రధాన ఆలయాన్ని ఆనుకుని ఉన్న ప్రదేశంలో తెలుగు వణిక్ ప్రముఖులు శ్రీ గ్రంధి సుబ్బారావుశ్రేష్టిగారి దాతృత్వంతో నిర్మించిన కళ్యాణమంటపం ఉన్నది. ఇందులో వివాహాది శుభకార్యాలు కూడా నిర్వహించవచ్చును. మేము ఉన్న సమయంలో, ఓడిశా రాష్ట్రం నుంచి వచ్చిన సాధుసంతులు, భక్తజనులతో కూడిన పెద్ద బృందమొకటి ఈ కళ్యాణమంటపంలో వారి భాషలో, సంగీతవాద్య సహితంగా శ్రావ్యంగా శ్రీమద్భాగవత పారాయణ సప్తాహం చేస్తున్నారు.

ఈ దేవస్థానంవారి ఆధీనంలో సుమారు ముప్పయి వరకూ గదులు ఉన్నాయి. నైమిశారణ్యం సందర్శనకు వచ్చే భక్తులందరికీ వీటిలో ప్రాంతీయ, భాషా, వర్ణ భేదాలకతీతంగా వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు. నామమాత్రపు అద్దెకు ఇవి లభిస్తాయి. వచ్చిన భక్తులందరికీ మాతాజీ స్వాగతం పలికి ఈ సౌకర్యాలను స్వయంగా పర్యవేక్షిస్తారు. నిత్యాన్నదాన కార్యక్రమం సరే సరి. అయితే, భక్తులు తమ రాకను బృందంలోని సభ్యుల సంఖ్యతోసహా సముచితమయినంత ముందుగా తెలియజేయవలసి ఉంటుంది. వీరి ఫోను నంబరు – **09415766122.**

ఆ విధంగా మేము కూడా మా రాకను ముందే తెలియజేసి, అక్కడకు చేరుకున్న వెంటనే మాతాజీకి పరిచయం చేసుకుని మాకు కేటాయించ బడిన గదుల్లో స్థిరపడిన పిదప భోజనశాలకు చేరుకున్నాము. అక్కడ మా కుటుంబ మిత్రులు శ్రీమాన్ శ్రిమత్తిరుమల శేషాచార్యులుగారు వారి ధర్మపత్ని శ్రీమతి రాధగారితో సహా దర్శనమిచ్చారు. వీరు హైదరాబాదులో చైతన్య కళాశాలలో చరిత్రోపన్యాసకులుగా పదవీవిరమణ పొందియున్నారు. వారితో పాటుగా వారి సహ ఆర్ధిక శాస్త్రోపన్యాసకురాలు శ్రీమతి జానకి గారు, ఆమె భర్త శ్రీ కైలాసపతి గారు కూడా ఉన్నారు. మా కుమార్తె చి. సౌ| లక్ష్మీభవాని, ఆమె భర్త చి. విజయ్ గోపాల్, ఆ కళాశాల పూర్వ విద్యార్థులు, వీరివురికీ శిష్యులు. ఆ పవిత్ర ప్రదేశంలో సాక్షాత్తు గురువులైన వారితోపాటు మేమూ ఉండటం ఎంతో ఆనందం కలిగించింది.

## గోమతీ నది

భోజనానంతరం కొద్ది సేపు విశ్రమించి గోమతీ తీరానికి వెళ్ళాము. గోలోకంలో ఉద్భవించిన ఈ నది సత్యయుగంలో స్వచ్ఛమైన క్షీరాన్ని ప్రవహింపజేస్తూ, ఋషులు, మునుల ఆకలి దప్పులను తీరుస్తూ ఉండేదట. కలి ప్రభావంచేత ఆ క్షీరం జలంగా మారినప్పటికీ, దీని ప్రాశస్త్యానికి, పవిత్రతకు ఏ మాత్రం లోటు రాలేదు. దేశంలోని ప్రముఖ పుణ్యనదుల సరసన దీనికి కూడా సముచితమైన స్థానం ఉంది. ఈ నదిలోని ఇసుక రేణువులు బంగారు, వెండి వర్ణాల్లో కలగలిసి ఉంటాయి. భక్తులు ఈ ఇసుకను సేకరించి తమ ఇండ్లలోని తులసి కోటల్లో ఉంచి పూజిస్తారు.

ఆ నదిలో సంకల్ప పూర్వకంగా పుణ్యస్నానమాచరించి, అక్కడి పురోహితులకు దక్షిణలు సమర్పించి తిరిగి బసకు చేరాము. ఆ తరువాత అక్కడ దర్శించవలసిన ప్రదేశాల్లో ముఖ్యమైనటువంటి చక్రతీర్థం, వ్యాసగద్దె,

సూతగద్దె, హనుమంతుని ఆలయం, లలితాదేవి ఆలయం మొదలైనవి దర్శించాం.

**చక్ర తీర్థం**

దర్భలతోచేయబడి బ్రహ్మచే విసరబడిన 'దివ్యవిశేషం' పడిన ప్రదేశం మొత్తంగా నైమిశారణ్యమైతే, సరిగ్గా అది పడిన బిందువులో ఈ 'చక్రతీర్థం' ఏర్పండిందట. దేవతలు సయితం దీని దర్శనానికి ఉత్సాహ పడతారట. ఈ తీర్థం చుట్టూ విఘ్నేశ్వర, బదరీనారాయణ, దేవాలయాలు, ప్రధాన ద్వారానికి బయట మహాకాళీ, వీరాంజనేయ, శ్రీ రాధాకృష్ణ మందిరాలు ఉన్నాయి.

గోమతీ తీరంలో మాకు తారసపడిన జ్ఞానసంపన్నుడయిన ఒక సాధువు ద్వారా ఈ తీర్థంలోని జలం యొక్క పవిత్రత దృష్ట్యా కేవలం తలపై చల్లుకోవటం (మార్జన స్నానం), ఆచమానం చేయటమే తప్ప కాళ్ళు కడగటం, స్నానంచేయటం నిషిద్ధమని తెలిసింది. అయినప్పటికీ, మేము ఈ తీర్థాన్ని దర్శించే సమయంలో కొందరు శుభ్రంగా ఈతే కొడుతున్నారు. అది చూసి కూడా ఏ భక్తులైనా ఆ తీర్థంతో ఆచమానం చేయగలరా? భక్తులు తమకు తాముగా ఎంతో కొంత దక్షిణ రూపంలో ఇచ్చేవరకూ ఆగకుండా, పీడింపులకు ఒడిగట్టే ఈ తీర్థం వద్ద ఉండే పండాలకు కానీ, పురోహితులకు కానీ, తమకు జీవనోపాధి కల్పిస్తున్న ఈ తీర్థ పవిత్రతను, పరిరక్షించాలనిగానీ, పారిశుధ్యాన్ని పాటించాలనిగానీ లేకపోవటం భక్తుల మనోభావాలను నొప్పిస్తుంది.

**వ్యాస గద్దె**

మొదట, ఒకే రాశిగా నున్న వేదాలను, వేద వ్యాసుడు, అగ్ని, వాయు, ఆదిత్య, సోమ స్వరూపాలైన ఋక్, యజు, అధర్వ, సామ మనే నాలుగు భాగాలుగా చేసి, తన ప్రియ శిష్యులైనటువంటి పైల, వైశం పాయన, జైమిని, సుమంత మహర్షులకు బోధించిన స్థలమే ఈ వ్యాస గద్దె. శ్రీమద్భాగవతం, అష్టాదశ పురాణాలు, శ్రీ విష్ణు సహస్రనామస్తోత్రం వేదవ్యాసుడు రచించినది ఇక్కడే. ఇక్కడ వ్యాసమహర్షి, శుకమహర్షుల విగ్రహాలు ఉన్నాయి.

**సూత గద్దె**

నానా విధాలైన వృక్షాలతో, లతలతో, మృగాలతో, పక్షులతో నిండి పరమ పవిత్రమై, లుప్తముకాని చైతన్యమే స్వరూపముగాగల శ్రీ విష్ణు క్షేత్రమైన ఆ నైమిశారణ్యంలో శౌనకుడు మొదలైన మహా మునులు స్వర్గలోకమునందు గానము చేయబడువాడు, భక్తులచే సదా ధ్యానింపబడువాడు అగు శ్రీహరి సన్నిధిని చేరుకొనుటకు కోరినవారై వేయి సంవత్సరాల పర్యంతం కొనసాగే 'సత్త్ర' యాగంచేస్తూ నిత్యమూ ఆచరించేవి, నైమిత్తికాలైనప్పటికీ, ఒక నిమిత్తమై ఆచరించబడే హోమాదులను నిర్వర్తించిన వారై ఒక ప్రాతఃకాలమందు, సూత మహా ముని వద్దకు చేరి –

*చ. అలసులు మందబుద్ధియుతు లల్పతరాయువు లుగ్ర రోగ సం*
*కలితులు మంద భాగ్యులు సుకర్మము లెవ్వియు జేయజాలరీ*
*కలియుగమందు మానవులు గావున నెయ్యది సర్వ సౌఖ్యమై యలవడు?*
*నేమిటంబొడము నాత్మకు శాంతి? మునీంద్ర చెప్పవే.*

మునీంద్రా! ఈ కలియుగంలో మానవులు సోమరులు, మందబుద్ధులు, మందభాగ్యులు, అల్పాయుష్కులు, నానావిధములైన భయంకర వ్యాధులతో

పీడింపబడుచున్న దురదృష్టవంతులు. సత్కార్యములేవీ చేయటానికి సమర్థులుగాకున్నారు. అందువల్ల వారికి సమస్త సుఖములను ఏది కలిగించజాలినదో, ఏది వారి ఆత్మలకు శాంతిని ప్రసాదించగలదో అటువంటి మార్గాన్ని మాకు తెలియజేయవలసినది" అని ప్రార్థించగా –

నిర్మలమైన మనస్సు గలవాడూ, విజ్ఞాన విశేషం చేత వేదాలనూ, పురాణాలనూ, ఇతిహాసాలనూ, పండించుకున్నవాడూ, అనంతమైన కారుణ్యంతో నిండినవాడూ, శ్రీమన్నారాయణుని సద్గుణ సమూహాన్ని సదా సంకీర్తించేవాడూ అయిన సూత మహాముని ఈ ప్రార్థనలకు ప్రసన్నుడై, ఈనాడు మనం వింటున్నటువంటి అష్టాదశ పురాణాలనూ, సకల శాస్త్రాలనూ, వాటిలోని విజ్ఞానసారాన్ని మానవాళి శ్రేయస్సుకై మొట్టమొదటిసారిగా ఇక్కడనుంచే ప్రవహింపజేసాడు. ఈ బోధనలను యావత్తూ ఆ మహాముని సమక్షంలో నున్న మునులేకాక అయిదు క్రోసుల విస్తీర్ణంలో, వివిధ ప్రదేశాలలోనున్న 88 వేల మంది ఇతర మునులు కూడా తమ యోగశక్తితో ఆలకించారట.

శౌనకాది మహాఋషులు స్వయంగా పూజించిన, అనాదిగా ఈనాటికీ నిత్యం పూజలందుకుంటున్న 108 సాలగ్రామాలు ఇక్కడ మనం దర్శించు కుంటాం. అష్టాదశ పురాణాలూ ఇక్కడ ఉన్నాయి. పూర్వం ఇక్కడ శ్రీ సత్యనారాయణస్వామి దేవాలయం ఉండగా అది మహమ్మదీయుల దాడిలో కనీస ఆనవాళ్ళు సయితం లేనంతగా ధ్వంసమైనదట. లౌకిక ప్రభుత్వాల సహకారలేమి వల్లనైతేనేమి, భక్తుల నుంచి తగినంత ప్రోత్సాహం లేకపోవటం వల్లనైతేనేమి, ఈనాటికీ ఈ ఆలయం పునర్నిర్మాణానికి నోచుకోవటంలేదని అక్కడ పూజారి ఆవేదనతో తెలియజేసాడు. మాకు తోచిన విరాళమిచ్చి

అక్కడనుంచి వీడ్కోలు పొందాము. మార్గమధ్యంలోనున్న లలితాదేవి ఆలయాన్ని దర్శించి, పూజించి బాలాజీ మందిరానికి చేరుకున్నాము.

ఈ అధ్యాయాన్ని ముగించే ముందు ఒక మాట తప్పక చెప్పవలసి ఉంది. ఈ యాత్రకు మునుపు ఈ నైమిశారణ్యం దర్శించిన వారిలో నాకు తెలిసిన కొంత మందిని, కొంత కాలంగా కలవటం జరిగింది. వారిలో కొందరు, ఇక్కడ అంతగా చూడవలసినదేమీ లేదని పెదవి విరువగా, మరికొందరు దీని ప్రాశస్థ్యాన్ని కీర్తిస్తూ దానిని దర్శించి తీరవలసిన ఆవశ్యకతను సహేతుకంగా వివరించారు. నా మటుకు నాకు, ఇది దర్శించాక, ఎంత పరస్పర విరుద్ధమైనప్పటికీ, ఆ రెండు వాదనలూ సహేతుకంగానే అనిపించాయి. ఎందుకంటే, ఇక్కడ ఏముందో చూసి తెలుసుకుందామనే జిజ్ఞాసతో వచ్చేవారికి అన్నీ ఆసక్తిగానూ, ఆకర్షణీయంగానూ, విజ్ఞానదాయకంగానే ఉంటాయి. అక్కడ ఏముందిలే చూడటానికి అనే తృణీకారభావంతో వచ్చేవారికి మాత్రం భారతదేశంలోని లక్షలాది గ్రామాల్లో ఇది కూడా ఒకటి. అటువంటి భావనలో నున్నవారికి సయితం జ్ఞానోదయం, వారి శ్రేయస్సు కాంక్షించిన వారైనందుననే ఆ మహామునులు, సూత మహాముని ద్వారా యావత్తు మానవాళికి ప్రయోజనమైన జ్ఞాన నిధిని బహుళ ప్రాంతాలనుండి కాక కేవలం ఇలా ఒకే పవిత్రమైన ప్రదేశం నుంచే అందించే ప్రయత్నం చేసి ఉంటారని అర్థమైంది. ఏది ఏమైనా అవకాశం ఉన్నవారు ఈ ప్రాంతాన్ని ఒకసారి దర్శించి సాధు, సజ్జన సాంగత్యంలో జ్ఞాన సముపార్జన చేసుకుంటూ ధ్యానాదులు చేసుకుంటూ వీలయినన్ని రోజులుండి, మనశ్శాంతి పొందవచ్చు.

బసకు తిరిగి వచ్చాక మళ్ళీ శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో కొంతసేపు గడిపాము. శ్రీ శేషాచార్యులు వారు, 'శ్రీకృష్ణభక్తి' పై లఘు ప్రవచనం చేశారు.వారి శ్రీమతి రాధ గారు, 'మహాగణపతి, క్షీరాబ్ధి కన్యకకు, నారాయణతే, వేంకటాచలనిలయా" కీర్తనలు శ్రావ్యంగా ఆలపించారు.

ఆ తరువాత స్వామివారికి జరిగిన పవళింపు సేవలో పాల్గొన్నాము. విశాఖపట్నం నుంచి వచ్చిన పాతిక మంది జానపద మహిళా భక్తబృందంతో కలిసి మాతాజీ స్వయంగా స్వామివారికి నృత్యం సమర్పించారు. అనంతరం మంగళాచరణంతో ఆ సేవ పూర్తయింది.

మరునాడే హోలీ. ఆ చుట్టు ప్రక్కల ఇంకా చూడవలసిన ప్రదేశాలు ఉన్నప్పటికీ హోలీ వేడుకల కోలాహలంలో బయటికి వెళ్ళటానికి సాధ్యపడలేదు. ఆ రోజు, దేవాలయంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం చేద్దామని సంకల్పించుకున్నాం. ఆ రీత్యా ఉదయం ఏ విధమైన అల్పాహారం స్వీకరించకుండా ఉపవాసదీక్షలో కూడా ఉన్నాము. మధ్యాహ్నమైనా కూడా గ్రామంలో దుకాణాలు తెరిచిన పాపాన పోలేదు. తత్కారణంగా అవసరమైన సంభారాలేవీ లభించలేదు. వ్రతం చేయించవలసిన పురోహితుడు సయితం హోలీ వేడుకల్లో మునిగిపోయి మా కార్యక్రమాన్ని పట్టించుకోనేలేదు. సరే! స్వామి అనుగ్రహింపలేదు కాబోలని గ్రహించి, మూడు గంటలకు భోజనాలు చేసి గదులు ఖాళీ చేసి, మాతాజీకి ధన్యవాదాలు తెలిపి వీడ్కోలు తీసుకుని లక్నోకు ప్రయాణమయ్యాం. హోలీ కోలాహలం సద్దుమణుగుతుండగా ట్రాఫిక్ ఇక్కట్లు అంతగా లేవు. నగరంలో కూడా ప్రయాణం సాఫీగా సాగింది.

## లక్నోలో

సాయంత్రం గం.6.20 ని.లకు లక్నో స్టేషను వద్ద దిగి 'బబ్లూ' కు హోలీ శుభాకాంక్షలతోను, కృతజ్ఞలతోను వీడ్కోలు చెప్పాము. రాత్రి గం.9.50

ని.లకు లక్నోలో బయలుదేరే 14258 నెంబరు న్యూ డిల్లీ - వారణాసి 'కాశివిశ్వనాథ్ ఎక్స్ ప్రెసులో వారణాసికి బయలుదేరాలి. మూడు గంటలకు పైగా స్టేషనులోనే గడపవలసియున్నది. సామాను క్లోకు రూములో భద్రపరచి స్టేషనులోనున్న 'కుంసుం' రెస్టారెంటులో అల్పాహారం తీసుకుని వచ్చేపోయే రైళ్ళను చూస్తూ కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నాము. అలా నిరీక్షణ కొనసాగుతుండగా చెన్నై నుంచి వచ్చిన ఎక్స్ ప్రెసులో బింబాధర్, కుటుంబంతో దిగాడు. ఉభయకుశలోపరి పిదప వారు గృహోన్ముఖులైనారు. వారు అటువెళ్ళగానే నిరాశ కలిగించే ఒక తాజా సమాచారం. అదే! మా ట్రయిను నాలుగు గంటలు ఆలస్యంగా నడుస్తున్నదని. అంటే మరో గంటలో రావలసినది, అర్ధరాత్రి దాటిన తరువాత ఒకటిన్నరకు వస్తుందన్నమాట. బెంచీలమీదే అలా ఇంకా ఎంతసేపని కూర్చోగలం? పైగా దోమల బాధ. స్టేషనులో విశ్రాంతి గదుల కొరకు విఫలయత్నం చేశాను. అలసట ప్రభావం చేత సహనం క్రమంగా క్షీణదశకు చేరుతున్నది. కాకతాళీయంగా ఈ సమాచారం తెలుసుకున్న బింబాధర్, బబ్లూను స్టేషనుకు పంపుతున్నట్లూ వెంటనే ఇంటికి రావలసినదిగానూ కోరాడు. సుదీర్ఘ ప్రయాణం తరువాత అప్పుడే ఇంటికి చేరిన అతనికి అసౌకర్యం కలుగుతుందని తెలిసినప్పటికీ, అప్పుడు మేమున్న పరిస్థితిలో కాదనలేకపోయాం. అయితే, భోజనాల ప్రయత్నమేదీ చేయబోమనే హామీపై వారింటికి వెళ్లాం. స్నానాలు చేసి, కోడలు ఇచ్చిన 'టీ' మాత్రం సేవించి, ఒక మూడు గంటలు అలా నడుములు వాల్చి, తిరిగి ఒంటి గంటకు స్టేషనుకు చేరుకొనిన వెంటనే క్లోకురూము నుంచి సామాను విడిపించుకున్నాం. మరొక గంట తరువాత రెండున్నరకు ట్రైను వచ్చి మరో పది నిముషాల్లో బయలు దేరింది.

## వారణాసి 3

***సానందమానంద వనే వసంతం ఆనంద కాండం హత పాపబృందం***

***వారణాసీ నాథమనాథ నాథం, శ్రీ విశ్వనాథం శరణం ప్రపద్యే.***

దశాశ్వమేధ ఘాట్, వారణాశి

21 వ తేదీ ఉదయం గం. 4.50 ని.లకు చేరవలసిన వాళ్ళం గం.8.45 ని.లకు వారణాసి చేరాం. వెంటనే రెండు ఆటోలు మాట్లాడుకుని ఆంధ్రాశ్రమం చేరుకున్నాము. ఖాళీలు లేవు. అంతకు మునుపు మేమిరువరం వారణాసి వెళ్ళిన రెండు సందర్భాలలోనూ 'అన్నపూర్ణా యాత్రీ నివాస్'లో ఉండగా మా బావమరిదిగారు వాళ్ళు ఆంధ్రాశ్రమంలో ఉన్నారట. ఈ మారు రెండింటిలోనూ ఖాళీలు లేవు. వేచియున్న యాత్రికులు ఎక్కువగానే ఉన్నారు. అక్కడికీ గదులు, పడకలు, ఖాళీ అవుతూనే ఉన్నాయి, అయినవి అయినట్లు ముందుగా వచ్చిన వారికి కేటాయిస్తూకూడా ఉన్నారు. నేనూ అచ్యుతరావుగారూ చెరొక చోట మా వంతు కోసం వేచి ఉన్నాం. ముందుగా నేను వేచి ఉన్న అన్నపూర్ణా యాత్రీ నివాస్ లోనే అనుకూల పరిస్థితి కనిపించింది. 3 గంటలకు ఒక గది, 5 గంటలకు మరొకటి ఇవ్వగలనని చెప్పి అప్పటివరకు, సామాను ఆఫీసులో ఓ వారగా ఉంచుకొని స్నానాలు అవీ చేయవచ్చని మేనేజరు గారు (పాత మేనేజరు రాంబాబుగారి స్థానే మరొకరు

వచ్చారు). వెసులుబాటు కల్పించారు. ఈలోగా కరివెన నిత్యాన్నదాన సత్రంలో (భోజనానికి) పేర్లు వ్రాయించి, గంగాస్నానానికి కేదార్ ఘాటుకు వెళ్లాం. స్నానం చేసి, కేదారేశ్వరుని దర్శనం చేసుకొన్నాము. భోజనానంతరం బసకు తిరిగివచ్చి, ఆ ఒక్క గదియయినా ఎప్పుడు ఇస్తాడురా భగవంతుడా అనుకుంటూ ఆఫీసులోని కుర్చీలలోనే కునికిపాట్లుపడుతూ కూర్చున్నాము. మొత్తానికి అయిదు గంటలకల్లా రెండు గదులూ కేటాయించబడ్డాయి. కొంతసేపు పూర్తి విశ్రాంతి పొందాక శరీరాలు తగినంత శక్తి కూడదీసుకున్నాయి. స్నానాలు చేసి విశ్వనాధుని సేవకు బయలుదేరాం. రద్దీ మామూలుగా ఉన్నది. దర్శనం త్వరగానే పూర్తయింది. గం. 7.30 ని.లకు జరిగే సప్తరుషి పూజ, హారతి కార్యక్రమాలకు టికెట్లు తీసుకొని, ఆ కార్యక్రమాల ద్వారా స్వామివారిని మళ్ళీ సేవించుకున్నాము. మరునాడు వేకువ ఝామున అభిషేకానికి టికెట్లు తీసుకున్నాము. విశ్వనాధుని దర్శనానికి పూర్వమే దుండి గణపతిని దర్శించవలసి ఉన్నా, రక్షణ వ్యవస్థ వారి ఆంక్షలవల్ల అది సాధ్యపడలేదు. అందుచేత అన్నపూర్ణా దేవిని దర్శించుకున్నాక, ఈ స్వామిని దర్శించి రాత్రి పది గంటలవుతుండగా బసకు చేరుకున్నాము.

22వ తేదీ వేకువ ఝామున 3 గంటలకే లేచి స్నానాదులు ముగించి, పట్టుబట్టలు తీసుకుని నాలుగు గంటలకల్లా ఆలయానికి చేరుకున్నాం. దుస్తులు మార్చుకున్నాక, పది నిముషాల్లో మాకు అప్పగించబడిన పురోహితులు సంకల్పపూర్వకంగా, లఘున్యాసం, నమకం, చమకం చేయించారు. ఆ తరువాత స్వామికి మాచే అభిషేకం చేయించారు. మంత్రపుష్పం, ఆశీర్వచనం పూర్తయ్యాక లైనులో వెళ్లి మరొకసారి దర్శనం చేసుకున్నాము. అక్కడనుంచి, వరుసగా అన్నపూర్ణా దేవికీ, విశాలాక్షీ అమ్మవారికీ కుంకుమార్చనలు చేసి, ప్రసాదాలు స్వీకరించి బసకు

చేరాము. సాయంత్రం గంగానదిలో నౌకావిహారం చేద్దామని అనుకున్నాం. ఈ లోగా కొంత 'షాపింగు' చేసి వస్తామని వారు ముగ్గురూ వెళ్ళారు. 'షాపింగు' అంటే ఒక పట్టాన అయ్యే పనా? నేను మాత్రం అప్పటి వరకూ జరిగిన యాత్రా విశేషాలు వ్రాసుకుంటూ గదిలోనే ఉండి పోయాను. ఊహించి నట్టుగానే వారు తిరిగి వచ్చేటప్పటికి చీకటే పడింది. ఇంకేం నౌకావిహారం? గంగాతీరానికి వెళ్లి కొంతసేపు గడిపాం.

23 వ తేదీ. నిన్న వాయిదా పడిన నౌకావిహారం, కాలభైరవ దర్శనం, మధ్యాహ్నం పన్నెండు గంటలకు మణికర్ణికాఘాటులో స్నానంతోపాటు ఆ రోజు చేయవలసిన కార్యక్రమాలు విరామానికి తావులేకుండా ఉన్నాయి. మళ్ళీ సాయంత్రమే గయకు ప్రయాణం. అక్కడకు చేరిన తరువాత బస చూసుకొనే పని తత్సంబంధమైన శ్రమ ఎలాగూ ఉన్నాయి. వీటన్నిటికీ శక్తి నిలుపు కోవలసిన అవసరం ఉన్నప్పటికీ, సోదరి సత్యప్రసూన కోరిక మేరకు, వాళ్ళు ముగ్గురూ ఉదయం 5 గంటలకే మరోమారు స్వామి దర్శనం కోసం వెళ్ళారు. రద్దీ ఎక్కువగా లేదు కాబోలు, దర్శనం చేసుకుని త్వరగానే తిరిగిరాగలిగారు. వెంటనే గంగా తీరానికివెళ్లి ముందుగా నౌకావిహారం చేసుకుని బసకు తిరిగి వచ్చాము.

**నౌకావిహారం**

ఎన్ని మార్లు చేసినా మనసు పదే పదే కోరుకొనే ఒక

మధురానుభూతి ఈ నౌకా విహారం. ఇరవై ముప్పై మందితో కలిసి మోటారు బోటులో వెళ్ళిన దానికంటే, మనవరకు మాత్రమే ప్రత్యేకంగా తెడ్డు వేసే పడవ

మాట్లాడుకుంటే ఆ విహారంలో ఉండే అనుభూతే వేరు. నౌకావిహారం పూర్తి కాగానే ఆటో ఒకటి మాట్లాడుకుని, బిర్లా విశ్వనాధమందిర్ (ఇది బెనారస్ హిందూ విశ్వ విద్యాలయ ప్రాంగణంలో ఉంది) గవ్వలమ్మ దేవాలయం, తులసీమానస మందిర్ దర్శించాము. ఆరోజు మంగళవారం. సంకటమోచన హనుమాన్ దేవాలయం విపరీతమైన రద్దీగా ఉంది. దేవాలయానికి వెళ్లాం కానీ దర్శనం ప్రాప్తించలేదు. అక్కడనుంచి కాలభైరవ స్వామిని సేవించుకుని మణికర్ణికా ఘాటుకు చేరుకొని సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలకు సంకల్పపూర్వకంగా పుణ్యస్నానమాచరించాము. అనంతరం బసకు చేరుకొని, దుస్తులు మార్చుకొని, కరివెనలో భోజనంచేసి తిరిగి వచ్చేటప్పటికి సమయం రెండున్నరయింది. గయ వెళ్ళటానికి గం. 4.25 ని.లకు డూన్ ఎక్స్ ప్రెస్. సామానంతా ఉదయమే సర్దేసుకున్నాము కనుక ఒక్క అరగంట విశ్రాంతి తీసుకుని, గదులు ఖాళీచేసి రెండు ఆటోలు మాట్లాడుకొని, సకాలంలో వారణాసి స్టేషనుకు చేరుకున్నాము. ట్రైను నిర్ణీత సమయానికే వచ్చింది.

**గయలో**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గయ. జిల్లా కేంద్రం. అలహాబాదు కోల్కతా రైలుమార్గంలో వారణాసి నుండి 220 కిలోమీటర్ల దూరంలో బీహారు రాష్ట్రంలో ఉన్నది. వారణాసి నుండి రైలు ప్రయాణం నాలుగున్నర గంటలు. ఇతర దేనాలయాలు కూడా అనేకం ఉన్నప్పటికీ ప్రధానంగా ఇది విష్ణు క్షేత్రం. రాత్రి గం.9.20 ని.లకు దిగాం. ఇక్కడ మేము నిర్వహించిన కార్యక్రమాల క్రమాన్ని వివరించటానికి ముందు ఈ క్షేత్ర ప్రాశస్త్యం గురించీ, ఇక్కడ నిర్వహించే పిండప్రదాన కార్యక్రమాల ప్రాధాన్యత గురించీ క్లుప్తంగా వివరించే ప్రయత్నం చేస్తాను.

శ్లో. ***అత్ర విష్ణుపదం దివ్యం దర్శనం పాపనాశనం |***

***స్పర్శనం పిండదానేన ఆత్మానాం పితృణాం ముక్తి హేతునా//***

గయలోని ఈ దివ్య విష్ణుపాదాన్ని ఎవరైతే దర్శించి, స్పర్శించి, పితృదేవతలకు దానం చేయబడిన పిండాలను సమర్పిస్తారో, వారి స్వీయపాపాలు తొలగిపోవటమేకాక వారి పూర్వీకులందరికీ ముక్తి సంప్రాప్త మవుతుందని ఈ శ్లోకం ప్రామాణీకరిస్తున్నది.

ఈ ప్రదేశాలలో ఒకసారి పిండప్రదాన కార్యక్రమం నిర్వహిస్తే తిరిగి ప్రతి సంవత్సరం ఆబ్దీకాలు పెట్టనవసరంలేదని భావించేవారూ ఉన్నారు. అటువంటి భావన కలవారు, అందుకు ప్రామాణికమేమిటో కూడా తమకు తామే వివరించుకొని మరీ సంతృప్తిపడాలి. తల్లితండ్రులకు తద్దినం పెట్టక పోతే ఎందుకు పెట్టలేదని ఎవరూ అడగరు. తల్లిదండ్రులు అసలే అడగరు. ఇందుకు సమర్ధనలు, సంజాయిషీలు ఆత్మవంచనలు అవసరమే లేదు కదా! క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం ఆబ్దీకాలు నిర్వహించేవారూ, అలా చేయలేని వారు కూడా అనేకులు గయకు వెళ్లి వారి వారి శక్త్యానుసారం భక్తిశ్రద్ధలతో యధావిధిగా శ్రాద్ధకార్యక్రమాలు నిర్వహిస్తారు ఆ కార్యక్రమం పూర్తయిన పిమ్మటనే భక్తులు శక్తిపీఠమైన మంగళగౌరీ దేవి దర్శనంగానీ ఇతర దేవాలయాలు, దర్శనీయ స్థలాల పర్యటనగానీ చేస్తారు. వీలుంటే ఏడు కిలోమీటర్ల దూరంలో నున్న 'బోధ్ గయ' లోని బౌద్ధారామాన్ని సందర్శిస్తారు.

ఈ క్షేత్రంలో నివశించే వివిధ రాష్ట్రాలకు చెందిన పురోహితులకు ఈ కార్యంపై వచ్చేవారే ప్రధాన జీవనాధారం. అందుచేత వీరినే లక్ష్యంగా చేసుకుని వృత్తి నిర్వహిస్తూ ఉంటారు. ఈ క్రమంలో, వారిలో వారి మధ్య పోటీవల్ల కొందరు అడ్డదారులను ఆశ్రయించటం, వాటివల్ల యాత్రికులకు కొంత ఇబ్బంది కలగడం కద్దు. పూర్తిగా మోసమని అనలేము గానీ, అక్కడకు వెళ్ళిన 'లక్ష్యం' రీత్యా ఇటువంటి వారితో యాత్రికులు అప్రమత్తంగా

ఉండవలసిన అవసరం మాత్రం ఎంతైనా ఉందని వివరించ టానికే ఈ ప్రహసనం.

సనాతన వైదిక ధర్మాలను పాటించేవారు దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఉంటారు అటువంటివారిలో లక్షలాది మంది, ఏడాది పొడవునా ప్రాంతీయ భాషాభేదాలకు అతీతంగా ఇక్కడకు వచ్చి పితృదేవతలకు పిండప్రదానాలు నిర్వహించి పితృతర్పణాలు, కారుణ్య తర్పణాలు వదులుతారు. ఇది ప్రధాన కార్యక్రమం. వీటి లక్ష్యం ఒకటే అయినా, ఆయా ప్రాంతాలు, భాషలు, ఆచారాలనుబట్టి నిర్వహించే పద్ధతిలో ఉండే వ్యత్యాసాలవల్ల అన్ని ప్రాంతాలకు, భాషలకు, సాంప్రదాయాలకు చెందిన పురోహితులు ఈ క్షేత్రంలో ఉన్నారు. ఉదాహరణకు మనం తెలుగు వారం. మన స్వస్థలంలోనో, మన నదీతీర ప్రాంతాలలోనో ఈ కార్యక్రమాలు నిర్వహింపవలసినప్పుడు మన పురోహితులు ఏ పద్ధతిలో చేయిస్తారో అలాగే రాష్ట్రం బయట ఇతర తీర్థక్షేత్రాలలో కూడా చేయాలని కోరుకుంటాం. మరి ఇలా చేయాలంటే ఇతర రాష్ట్రాలకు చెందిన పురోహితులకు కేవలం మనతో సంభాషించగలిగినంత తెలుగు పరిజ్ఞానం ఉంటే సరిపోతుందా? మన పద్ధతులు, ఆచారాలు కూడా తెలిసి ఉండాలి కదా! ఈ మనోభీష్టాలను పట్టించుకోకుండా, యాత్రికులు రైలు దిగటమే ఆలస్యం, ఆయా పురోహితుల తాలూకు మనుషులు చుట్టూ మూగిపోయి వచ్చీ రాని తెలుగులో (రైలు దిగినవారు మాట్లాడుకునే భాషను బట్టే వారు ఏ ప్రాంతం నుంచి వచ్చారో గ్రహించగల నైపుణ్యం వీరు పుణికిపుచ్చుకుని ఉంటారు) మనలను ఉక్కిరిబిక్కిరి చేసి, ఆలోచించుకొనే సమయం లేకుండా చేస్తారు. 'మేము ఇంకా ఏమీ ఆలోచించుకోలేదు కాస్త అవతలకు వెళ్ళండి' అన్నప్పటికీ వెళ్లరు.

మా విషయంలో సరిగ్గా ఇదే జరిగింది. ఈ యాత్రకు ఏర్పాట్లలో భాగంగా దర్శించబోయే అన్ని క్షేత్రాలలోని పురోహితుల పేర్లు, చిరునామాలు ఫోను నంబరులు దగ్గరనే ఉంచుకున్నాను. ఇక్కడ మన సాంప్రదాయంలో ఈ కార్యక్రమం చేయించే దక్షిణ భారత పురోహితులు శ్రీ షోడషి అరుణాచార్య, వారి సోదరుడు షోడషి రవి ఆచార్య గార్లు. వారి –

**చిరునామా**

**కృష్ణా ద్వారకా వీధి, చాంద్ చౌర,**

**గయ, బీహార్ - 823 001**

**ఫోను**

**094312 2463 * 09334718080 * 093042 23820**

అక్కడకే వెళదామని నిర్ణయం యాత్రకు సన్నాహాల దశలోనే జరిగిపోయింది కనుక ఆ విషయమై చింత గానీ పునరాలోచన గానీ లేదు. కోరుకుంటే, మనకు వసతి కూడా వారే ఏర్పాటు చేయగలరు. ఆ మేరకు ముందే సమాచారం ఇస్తే, వాళ్ళ మనిషి మనలను స్టేషనులో గుర్తించి నేరుగా అక్కడికే తీసుకు వెళ్తారు. ఇందుకోసం ప్రతి పురోహితుడూ కొందరు సహాయకులను నియమించుకుంటారు. కానీ, మా రాక గురించి సమాచారమేదీ మేము నిర్ణయించుకున్నఅరుణాచార్యగారికి ముందస్తుగా ఇవ్వలేదు. ఇందుకు కారణాలు రెండు.

ఈ సహాయకులలో కొందరు ఒకరి కంటే ఎక్కువ మంది పురోహితులకు ప్రతినిధిగా ఉంటారు. అలావచ్చిన ప్రతి వ్యక్తివద్దా మిగతా అందరి పేర్లు, ఫోను నంబరులు ఉంటాయి. వచ్చిన ఇబ్బందల్లా వారిలో మనకు కావలసిన వానిని గుర్తించటం, నిర్ధారించుకోవటమే. మనం ఫలానావారి మనిషి కోసం చూస్తున్నామని చెప్పామో,అయిపోయామన్న

మాటే. ఇద్దరు ముగ్గురు మీద పడిపోతారు. ఎవరికీ వారు ఆ మనిషిని తానేనని చెప్పేసి, ఇక మన ప్రమేయమేదీ లేనట్లుగా సామాను అందుకో బోతారు. ఆ సమయంలో మనలో ఏ స్వల్ప ప్రమత్తత చోటుచేసుకున్నా ఇక అంతే సంగతులన్నమాట. "నా మనుషులను తీసుకువెళుతున్నా వేమిటంటూ వారిలో వారు ఘర్షణ పడతారు. ఆ పోటీలో, కాస్త నోరుగలవాడు, మనలను, తను తీసుకువెళ్ళదలచిన చోటుకే తీసుకు వెళ్తాడు. అలా తీసుకువెళ్ళేవాడు కాకతాళీయంగా మనకు కావలసిన వాడు అయితే ఫరవాలేదు. ఒకవేళ కాకపొతే స్టేషనుకు వచ్చిన అసలు వ్యక్తి మనకోసం వెదుకుతూ మనం కనబడక, ఫోనుచేసి "మాతో ఒప్పందం కుదుర్చుకుని మరో చోటికి ఎలా వెళ్తారంటూ నెపం మనమీదనే వేసి మరీ నిలదీస్తారు. అపుడు తెలుస్తుంది మనం మోసానికి గురయ్యామని. ఇక అక్కడనుండి బయటపడటానికి చేసే ఏ ప్రయత్నమూ ఫలించదు.

మా రాకను మా పురోహితులకు ముందుగా తెలియ జేయక పోవటానికి పైన చెప్పినది మొదటి కారణమైతే రెండవది, మేము వారణాసి నుండి బయలుదేరిన ట్రైను గయకు రాత్రి గం.9.17 ని.లకు చేరుకోవాలి. ఒకవేళ అది నిర్ణీత సమయానికంటే ఆలస్యంగా గమ్యం చేరితే, వెంటనే మనకు కావలసిన సరయిన మనిషే దొరికాడనుకున్నా, తీరా అక్కడకు వెళ్ళాక వారు కేటాయించిన వసతి, ఇతర సౌకర్యాలు మనకు అనుకూలంగా లేకపోతే! అవేమీ, ఆధునిక సౌకర్యాలున్న హోటళ్ళు కావు. అది కారణంగా చూపి, మొహమాటం విడిచిపెట్టి, మరునాడు వస్తామని చెప్పి బయట పడగలిగినా, ఆ రాత్రివేళ సామానుతో ఎక్కడకని పోగలం? అందుకని, వారికి ఏ విధమైన ముందస్తు సమాచారం ఇవ్వలేదు. ఆ విధంగా స్టేషనులో కాపలాకాసిన ఆగంతకుల బారినుంచి చాకచక్యంగా తప్పించుకోగలిగినప్పటికీ 'ఆంధ్రాశ్రమం'

పేరుతో ఒకడు పట్టుకుని బురిడీ కొట్టించే సాహసం చేయనే చేశాడు. బదరీ, వారణాసి, రిషీకేష్, హరిద్వారులలో తప్ప 'ఆంధ్రాశ్రమం' వారికి దేశంలో మరెక్కడా శాఖలు లేవు. అది నాకు తెలుసని పాపం, అతనికేం తెలుసు? (రిషీకేష్ లో తిరుమల తిరుపతి దేవస్థానంవారి మరొక 'ఆంధ్రాశ్రమం' ఉంది. తిరువన్నామలైలో కూడా ఒక ఆంధ్రాశ్రమం ఉన్నది. అది కూడా వీరిది కాదు) నా గురించి ఏమీ చెప్పకుండా అతని కార్డు తీసుకున్నాను.

ఆ కార్డులోని తెలుగు అక్షరాల తీరూ, అతని 'తెలుగు' మాటా, అతని వాలకాలే అతను చెప్పిన 'ఆంధ్రాశ్రమం' ఏ మాత్రపు తెలుగువారిదో స్పష్టంగా చెపుతున్నాయి.

ఆ కార్డు జేబులో పెట్టుకుంటూ తరువాత ఫోను చేస్తానని చెప్పి సామాను పోర్టరులకు అప్పగించి నడవసాగాము. అతను మమ్మల్ని అనుసరించటం నేను గమనించకపోలేదు. స్టేషనుకు ఎదురుగా నున్న హోటలులో రెండు గదులు తీసుకుని వాటిలో చేరిపోయాము.

ఊహించినట్లుగా, మరునాడు ఉదయం ఈ నకిలీ 'ఆంధ్రాశ్రమం' మనిషే గది తలుపు తట్టాడు. వివరాలేవీ చెప్పకుండా నేను మరొకచోటికి వెళ్తున్నట్టూ అతని సహాయం అవసరం లేదని ఖచ్చితంగా చెప్పాను. తాను అరుణాచార్యగారికి కూడా చెందిన వాడినని, వారితోనే మాట్లాడిస్తానని చెప్పాడు. నమ్మించే ప్రయత్నంగా చీకట్లో ఓ రాయి విసిరాడన్నమాట. అదే

నిజమైతే క్రితం రాత్రే తను ఆ విషయం చెప్పి ఉండేవాడు. ఇప్పుడు అలా చెప్పటంతో, అతను మాట్లాడించబోయే అరుణాచార్యగారు ఎవరై ఉంటారో ఊహించటం కష్టం కాలేదు. అతనికి ఆ అవకాశమివ్వకుండా అతని సమక్షంలో నేనే అరుణాచార్యగారికి ఫోను చేసి పరిచయంచేసుకొని మేము బసచేసిన ప్రదేశాన్ని తెలియజేస్తూ, వారి వద్దకు చేరుకోవటానికి అవసరమయిన సూచనలు కోరుతుండగానే ఇతగాడు చల్లగా జారుకున్నాడు.

మరి కొంతసేపటికి అసలు అరుణాచార్యగారు పంపించిన వ్యక్తి రాగా గుర్తింపుని నిర్ధారించుకుని అతను మాట్లాడిన ఆటోలో వారి నివాసానికి చేరుకొన్నాము. స్వాగతం, పరిచయాలు, ప్రధాన కార్యక్రమం తాలూకు డబ్బు చెల్లించటం వంటి లాంచనాలన్నీ ముగిశాక ఈ 'ఆంధ్రాశ్రమం' ప్రహసనం వారి చెవిలో వేశాను.

ఈ కార్యక్రమ నిమిత్తమై అక్కడకు వచ్చిన కుటుంబాల వారు చాలామంది ఉన్నారు. నేరుగా అక్కడికి వచ్చిన కొందరు స్నానాలు కూడా అక్కడే చేస్తున్నారు. ఈ కార్యక్రమమానికి గాను రు.650/- ఇద్దరు వ్యక్తుల భోజనానికి మరో రు.100/- మొత్తం రు.750/- లు తీసుకున్నారు. కార్యక్రమంలో కొంత భాగం 'ఫల్గు' నది ఒడ్డున, మిగతాది విష్ణుపాద దేవాలయ ప్రాంగణంలోనూ జరుగుతుందని వివరించారు. ఒక సహాయకుడు వెంటరాగా ఒక బృందంతో కలిసి 'ఫల్గు' నదీ తీరంలోని ఘాటుకు సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించే ప్రదేశానికి చేరుకున్నాము.

గంగానది, శివుని జటాజూటం నుండి భువికి అవతరించగా, 'ఫల్గు' నది సాక్షాత్తు విష్ణుమూర్తియొక్క ద్రవ స్వరూపమని 'వాయు పురాణం'లో చెప్పబడినదట. గయకు 75 కిలోమీటర్ల దక్షిణ దిశగా 'కోరం' అనే ఒక పర్వతంపై ఉద్భవించిన 'నిరంజర' లేదా 'లిలాజన' అని, 'మోహన' అనే

రెండు ప్రవాహాలు గయ వద్ద ఏకమై అక్కడనుండి 'ఫల్గు' నదిగా ఉత్తర దిశగా ప్రవహించి ఉపనదిగా గంగలో కలుస్తుంది. దీనిలో ఎన్నడూ నీరుండదు. ఇందుకు సీతాదేవి శాపం కారణమట. అందుకు సంబంధించిన కథ ఇలా సాగుతుంది.

"శ్రీరామచంద్రుడు తన తండ్రి దశరధుడికి శ్రాద్ధ విధులను నిర్వహించటానికి గయ వెళ్ళటం తటస్థిస్తుంది. రామ లక్ష్మణులు దూరంగా వేరే కార్యక్రమంలో నిమగ్నమైఉన్న సమయంలో సీతాదేవి ఒంటరిగా ఈ నది ఒడ్డున ఇసుకలో కూర్చుని యధాలాపంగా ఆ ఇసుకను చేతిలోకి తీసుకుని చిన్న ముద్దల్లాగా చేస్తూ పితృదేవతలకు పిండం పెట్టే అర్హత స్త్రీలకు కూడా ఉండి ఉంటే నా మామగారికి స్వహస్తాలతో ఇలా పిండాలు చేసి నేను కూడా భక్తిగా సమర్పించే దానిని కదా! ఆ అదృష్టం నాకు లేకపోయెనే అని తలపోసిందట. మరుక్షణమే తన మామగారైన దశరధుడు ఆ నదిలోనుంచి ప్రత్యక్షమై చేతులు చాచి 'అమ్మా! ఆ పిండాలు ఇలా ఇవ్వు నేను తింటాను" అని వాటిని స్వీకరించి అంతర్ధానమై పోయాడట.

తరువాత అక్కడకు చేరుకున్న రామలక్ష్మణులకు ఈ విషయం వివరించగా వారు విశ్వసించక పోగా పరిహాసం చేశారట. అపుడు, ఆ సంఘటనకు సాక్షీభూతులైన, ఆ నదిని, అక్కడ ఉన్న గోవును, పురోహితుడిని తాము చూసినది చెప్ప వలసినదిగా కోరిందట. అయితే వారెవరూ సీతాదేవి పిండప్రదానం చేసినట్లు, దశరధుడు స్వీకరించినట్లు, అది తాము చూసినట్లు చెప్పటానికి ముందుకు రాలేదట. అందుకు వారికుండే కారణాలు వారికున్నాయి. తాము చూశామని చెప్పి ఉంటే, రాముడు ఇక మళ్ళీ పిండప్రదానం చేయకపోవచ్చు. అలా జరిగితే, నదిలో మళ్ళీ స్నానం చేయడు కనుక ఆ పుణ్యం నది కోల్పోతుంది. చూశానని చెపితే రాముడు

దశరధుని పెట్టిన తాను భుజించవలసిన పిండం ఇక తనకు దక్కదు అందుకు ఆవు "చూడలేదు" అని తల అడ్డంగా ఊపింది. ఇక పురోహితుని సంగతి సరే సరి. పుణ్యం సంగతి ఎలా ఉన్నా ఆయనకు రావలసిన దక్షిణ రాదు. ఇలా అందరూ ఎదురు తిరిగేసరికి సీతాదేవికి బాధ కలిగి ఖిన్నురాలై ఉన్న సమయంలో అక్కడ ఉన్న మట్టి మాత్రం "సీతాదేవి పిండం పెట్టటం దశరధ మహారాజు అది స్వీకరించటం నేను చూశాను." అని బాహాటంగా ప్రకటించింది.

అందుకు సంతోషించిన సీతాదేవి ఆ మట్టి చెట్టుకు ఎల్లపుడూ నవనవోన్మేషంగా శాశ్వతంగా ఉండేట్టు వరం ప్రసాదించి, అత్యవసరమైన సందర్భంలో అసత్యమాడిన దోషానికి 'వల్గు' నదిని ఎప్పుడూ నీరు లేకపోవుగాక అని, మానవుల చేత ముఖము పూజనీయము కాకుండా గోవునూ, నిత్య దారిద్ర్యంతో ఉండేట్టుగా పురోహితులనూ శపించిందట. వీటి ఫలితంగా మట్టి చెట్టు అక్షయ వట వృక్షమై యుగాలు మారినా ఇప్పటికీ పచ్చగా అలాగే ఉండగా నది ఎప్పుడూ ఎండిపోయే ఉంటుంది. లక్ష్మీ స్థానంగా ఆవుల పృష్ట భాగాన్ని పూజించినంత భక్తిగా తలను గౌరవించరు. ఇక్కడ పురోహితులకు సంతృప్తి అనేదే ఉండదు. ఎంత సంపాదించినా నిత్య దారిద్ర్యంతో అక్కడికి వచ్చే వారిని పీడిస్తూ ఉంటారు.

ఈ నదిలో ప్రవహించే నీరు కనబడకపోయినా చేతితో ఇసుక తవ్వితే, అలా తవ్విన కుంట పరిమాణాన్ని బట్టి స్వచ్ఛమైన నీరు ఎంత కావాలంటే అంత లభిస్తుంది. ఈ లక్షణం చేత దీనిని 'గుప్తగంగ' అని కూడా పిలుస్తారు. ఈ నది ఘాటుల పొడవునా స్థానికులు, నదిలో పెద్ద కుంటలు త్రవ్వి వాటి చుట్టూ ఒక దడి కట్టి, అలా నిల్వచేసిన నీటిని విక్రయిస్తారు.

క్రతువు ఒకటే అయినా, చేసే విధానంలో వ్యత్యాసం ఉంటుంది కాబోలు, అక్కడికి చేరాక, బ్రాహ్మణులను, బ్రాహ్మణేతరులను వేరు చేశారు.

సాధారణంగా శ్రాద్ధక్రతువులు మధ్యాహ్నానికి పూర్తి చేస్తారు. ఇక్కడ అటువంటి నియమమేమీ లేదట. అందుచేత అవసరాన్ని, యజమానుల సంఖ్యను బట్టి ఎన్ని విడతలుగా సాయంత్రము వరకూ కూడా చేస్తారు. మా విడత బృందంలో సుమారు ముప్పయి మంది వరకూ శ్రద్ధాళువున్నారు. విశాలంగా నున్న ఘాటులో రావిచెట్టు నీడలో పదకొండు గంటలకు కార్యక్రమం మొదలైంది.

పిండాలకు అవసరమైన అన్నాన్నిమట్టి ముంతలలో ప్రత్యేకంగా వండుతారు. ఉడికిన తరువాత చాలా సేపటివరకూ వేడితో అవి కాలిపోతూ ఉంటాయి. ఆకుల సహాయంతో ఒక్కొక్కరు అటువంటివి మూడు ముంతలు తెచ్చుకుని ఒక్కక్కదానిలోని అన్నంతో ఇరవైరెండేసి చొప్పున గుండ్రంగా మొత్తం 66 పిండాలు చేయాలి. ఇదే చాలా సమయం తీసుకుంటుంది. (ఈ పని త్వరగా పూర్తి అవటానికి, ఆసక్తి ఉంటే స్త్రీలు సహాయం చేయవచ్చును. ఆక్షేపణ ఏమీ లేదు) అలా అందరూ చేయటం పూర్తయ్యాక మళ్ళీ మంత్రపూర్వక క్రియాభాగం కొనసాగుతుంది. వంశంలో గతించిన వారందరికీ, గురువులకూ, స్నేహితులకూ, పెంపుడు జంతువులతోసహా అందరికీ పిండ సహితంగా పితృ, కారుణ్య తర్పణాలు విడిపిస్తారు. ఈ తర్పణాల సందర్భంలో పురోహితులు మన పూర్వీకుల పేర్లు బంధుత్వాలవారీగా అనేకం గోత్రాలతోసహా అడుగుతారు. ఇందుకు సంబంధించిన ప్రమాణం యజుర్వేదంలో ఇలా ఉన్నట్లు తెలుస్తున్నది.

శ్లో| *ఆదౌ పితా తథా మాతా సాపత్నీ జననీ తథా*
*మాతా మహాస్స పత్నీ కా ఆత్మ పత్నీ త్వనంతరం ||*
*సుత భ్రాతృ పితృ వ్యాశ్చ మాతులా స్సహ భార్యకాః|*
*దుహితా భగినీ దౌహిత్రో భాగినేయకః |*
*పితృష్వసా మాతృష్వసా జామాతా భావుకస్సు పా/*

*శ్వశ్శురస్స్యాలకస్చైవ శ్వశ్రూశ్చ గురు రిక్థినః ||*

తా| ముందుగా, తండ్రి – తాత – ముత్తాత – మాత – పితామహి – ప్రపితామహి – పిదప, సవతి తల్లి - మాతామహాది త్రయము - మాతా మహీత్రయము - తన భార్య – కుమారుడు – భ్రాతలు – పినతండ్రి – పెదతండ్రులు – మేనమామ - అతని భార్య, కుమార్తె - తోబుట్టువు – మనుమడు – మేనల్లుడు – మేనత్త – పినతల్లి – పెదతల్లులు - అల్లుడు బావమరదులు – కోడలు - మామ - భార్యయొక్క సోదరుడు - భార్యయొక్క తల్లి - గురువు - రిక్థి, వీరందరికీ విష్ణు పాదం మీద తర్పణాలు వదలాలి.

పాఠకుల ఉపయోగార్థమై, పై శ్లోకంలోని బంధుత్వాల జాబితాను సులభశైలిలో పట్టికగా ఇస్తున్నాను. ఇలా ఎప్పుడైనా ఈ కార్యక్రమం నిర్వహింపవలసివచ్చినపుడు, ఈ బంధుత్వాల ఆధారంగా వారి వారి పేర్లు గోత్రములు వ్రాసుకొని సిద్ధంగా ఉంచుకుంటే, సామూహికంగా చేసే ఇలాంటి సందర్భంలో ఇవి తడుముకుంటూ మిగతా వారికంటే వెనుక పడకుండా ఈ జాబితా ఉపకరిస్తుంది.

1. **పితృతర్పణాలకు బంధుత్వాల జాబితా**

| సం | తండ్రి వైపు | తల్లి వైపు |
|---|---|---|
| 1 | తండ్రి | తల్లి |
| 2 | తండ్రి – తండ్రి( తాత) | తల్లి - తండ్రి (తాత) |
| 3 | తండ్రి - తాత (ముత్తాత) | తల్లి - తాత - తండ్రి (ముత్తాత) |
| 4 | తండ్రి - ముత్తాత - తండ్రి | తల్లి - ముత్తాత - తండ్రి |
| 5 | తండ్రి - ముత్తాత - తాత | తల్లి - ముత్తాత - తాత |

| | | |
|---|---|---|
| 6 | తండ్రి - తల్లి (నాయనమ్మ) | తల్లి - తల్లి (అమ్మమ్మ) |
| 7 | తండ్రి - నాయనమ్మ - తల్లి | తల్లి - అమ్మమ్మ - తల్లి |
| 8 | తండ్రి – నాయనమ్మ- అమ్మమ్మ | తల్లి - ముత్తమ్మమ్మ - తల్లి |

2. **కారుణ్య తర్పణాలు**

| | | | |
|---|---|---|---|
| 1 | పెద తండ్రి, | 4 | స్వంత సోదరీ సోదరులు, |
| 2 | పిన తండ్రి, | 5 | సవతి తల్లి, తండ్రి |
| 3 | పెద తల్లి, | 6 | సవతి సోదరీ సోదరులు |
| 7 | పిన తల్లి, | 10 | వదినలు, బావలు, |
| 8 | మేనమామ/మేనత్త | 11 | బావ మరుదులు, వారి భార్యలు |
| 9 | వారి భార్య/భర్త, | 12 | మరదళ్ళు, వారి భర్తలు |
| 13 | చివరగా గతించిన వారసులతో సహా, పై యావన్మంది యొక్క సంతానము. | | |
| 14 | *వంశంలో ఎవరైనా పుత్రులు లేకుండా మరణించి నట్లయితే వారికి. | | |

**(అ) బంధువులు**

* శ్లో/ ***ఏ కేచాస్మత్కులే జాతా అపుత్రా గోత్రిణా మృతాః***
***తే గృహ్ణంతు మయాదత్తం సూత్రనిష్పీడనోదక***
***శ్రీరామ శ్రీరామ శ్రీరామ***

**(ఆ) హితులు, స్నేహితులు**

1. సహాధ్యాయులు,
2. ఆ తరువాత స్నేహితులైన వారు,
3. ఇరుగు పొరుగు వారు,
4. ఉద్యోగమూ, వృత్తులలో అభివృద్ధికి తోడ్పడిన వారు
5. వృత్తి ఉద్యోగాదులలో మన క్రింద పని చేసినవారు, ఇంట్లోనూ, వ్యవసాయంలోనూ,సహాయకులుగాను, సేవకులుగాను పని చేసిన వారు.

**(ఇ) గురువులు/శిష్యులు**

1. జ్ఞానోపదేశం చేసినవారందరూ,
2. విద్యాభ్యాసంలోనూ, వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాదులలో గణనీయమైన పాత్ర పోషించిన వారు (ఒక్క మాటలో, మనం ఈరోజు ఉన్న స్థితికి కారణమైన వారందరూ)
3. మనవద్ద చదువుకున్నవారు, మనకు కృతజ్ఞులై ఉన్నవారు.

**(ఈ) ఇతరులు**

1. చిన్న పిల్లలు
2. పెంపుడు జంతువులు, పశువులు, పక్షులు,
3. మన పెరట్లో గానీ, పొలంలో కానీ అనేక సంవత్సరాలు జీవించి నీడ, ఫల పుష్పాదులు అందించి గతించిన మామిడి, వేప, చింత, కొబ్బరి, బాదం, రావి, మర్రి మొదలైన వృక్షాలు.

**(ఉ) మానవతా దృక్పథంతో విడువదగిన తర్పణాలు**

1. స్థానిక, రాష్ట్రీయ, జాతీయ నాయకులు

2. అభిమాన కవులు,కళాకారులు,గాయకులు, నటీనటులు
3. భూకంపాలు సునామీ లాంటి ప్రకృతి విలయాల్లో మృతి చెందినవారు
4. యుద్ధంలో మృతి చెందినవారు
5. తీవ్ర వాదుల దాడులలో మరణించినవారు
6. మన కళ్ళ ఎదుట ప్రమాదంలో చనిపోయిన వారు.

ఎవరికి తర్పణం విడుస్తున్నారో పురోహితులు ఆ బంధుత్వం చెప్పగానే వారి గోత్రం, పేరు, బ్రాహ్మణులైతే శర్మాణామ్ అనీ క్షత్రియులు వర్మాణామ్ అనీ వైశ్యులైతే గుప్తం అనీ ప్రతి పేరు చివరా చెబుతూ (మనసులో స్మరించు కుంటూ) 'స్వదానమస్తర్పయామి' అంటూ తర్పణం (నీరు)వదలాలి.

వంశవృక్షాలను, శాస్త్రీయ పద్ధతిలో వారసత్వంగా నిర్వహించే వారుంటారు. అలాంటి ఏ కొందరికో తప్ప పూర్వీకులకు తర్పణం వదిలే సందర్భంలో అందరికీ, అందరి పేర్లూ గోత్రాలూ లభ్యం కావు. కేవలం ఈ కారణంచేత, ఆ స్థానాన్ని విస్మరించవలసిన అవసరం లేదు. పురోహితులు, ఆ బంధుత్వం మంత్రపూర్వకంగా చెప్పిన వెంటనే, పురుషుడైతే 'యజ్ఞయ్య' అని స్త్రీ అయితే 'యజ్ఞమ్మ' అని చెప్పితే ఆ పిండం, తర్పణం వారికే చెందుతుంది. అలాగే గోత్రం విషయంలో కూడా. అది తెలియనపుడు బ్రాహ్మణులైతే 'కాస్యప' అనీ ఇతరులు 'కాశీ' గోత్రమనీ అని చెప్పవచ్చు.

అక్కడ కార్యక్రమం ముగుస్తుందనగా అది చేయించిన పురోహితులకు అన్నదాన నిమిత్తమై మన శక్త్యానుసారం ఎంతో కొంత ఇవ్వవలసియుంటుంది. ఈ దానాలు, దక్షిణలు వివిధ సందర్భాలలో ఇవ్వవలసే ఉంటుంది. ఎక్కడ ఎంత అనేది, ఇచ్చేవారి ఇచ్ఛ, శక్తిని బట్టి ఉంటుంది. ఏ దానమైనా దేశ, కాల, పాత్రములు ప్రాతిపదికగా చేయటం

ముఖ్యం. ఒక చోట పది రూపాయలే ఇవ్వవలసి రావచ్చు. అక్కడ యాభయి ఇవ్వలేం కదా. అలాగే మరొక చోట ఒక వంద రూపాయలు ఇవ్వవలసి వస్తుంది. కానీ మన దగ్గర ఐదు వందల నోటు ఉంటుంది. ఇవన్నీ అక్కడ తడుముకోవటం కంటే, ముందే చేసుకోదగిన స్వల్ప సర్దుబాట్లు. మనం ధోవతి ధరించి ఉంటాం కనుక జేబులు ఉండవు కానీ మన స్త్రీలు చెంతనే ఉంటారు కనుక వారి వద్ద పది, ఇరవై, యాభయి, వందలు ఇలా వివిధ రకాల నోట్ల రూపంలోనూ, అలాగే కొన్ని నాణేలు భద్రంగా ఉంచుకుంటే, ఎప్పుడు ఎక్కడ ఎంత కావాలంటే అంత వారు తీసి వెంటనే అందిస్తూ ఉంటారు. అక్కడ కార్యక్రమం పూర్తయ్యాక, కొన్ని పిండాలను గోవులకు తినిపించి మిగతా పిండాలు తీసుకుని దేవాలయ ప్రాంగణానికి వెళ్తాం.

ఇక్కడ కూడా కొంత కార్యక్రమం ఉంటుంది. అది పూర్తయ్యాక మిగతా వాటిలో కొన్ని పిండాలను తీసుకుని శ్రీ విష్ణుపాదమున్న గర్భాలయ ప్రవేశద్వారం వద్దకు వెళ్తాం. అక్కడి పండాలు (వీరిని 'గయావళీలు' అంటారు) మనచేత సంకల్పం చెప్పించి, గయా శ్రాద్ధఫలాన్ని ఆశీర్వచన పూర్వకంగా అందజేసి దక్షిణ పుచ్చుకుంటారు. ఇక్కడ కూడా యధాశక్తే అయినప్పటికీ, ఎంత ఇవ్వదలుచుకున్నదీ బహిరంగంగా ప్రకటించవలసినదిగా కోరతారు కొంచెం ఇబ్బంది కలిగించే సందర్భమే. కొంచెం ఉదారంగా ఉంటే ఆ ఇబ్బందిని తేలికగానే అధిగమించవచ్చు. ఆ తరువాత గర్భాలయం ప్రవేశించి 'ధర్మశిల' గా పిలువబడే ఒక రాతి పలకపై ఉన్న శ్రీ విష్ణుపాద దర్శనం చేసుకుని, పిండాలను ఆ పాదముపై నుంచి, స్పర్శించి నమస్కరిస్తాం.

ఆ పాదాన్ని అలా భక్తిగా తాకుతున్నపుడు నాకు "బ్రహ్మ కడిగిన పాదము, బ్రహ్మము తానీ పాదము" అనే అన్నమయ్య కీర్తన స్ఫురణకు వచ్చింది. శ్రీ విష్ణుపాదం వేళ్ళు దక్షిణ దిశగాను, మడమ భాగం ఉత్తరదిశగానూ సుమారు ఒక అడుగు ప్రమాణంలో ఉంటుంది. పాదాన్ని స్పర్శించటానికి అవరోధం కాని రీతిలో దాని చుట్టూ అష్టభుజిగా వెండితో చేయబడిన గట్టు వంటిది ఉన్నది. ఈ పాదానికి సరిగ్గా పై కప్పుపై ఒక ఛత్రం, దాని చుట్టూ దశావతారాలు చెక్కబడి వున్నాయి. మొత్తంగా దేవాలయం ప్రత్యేకించి ఈ గర్భమందిర నిర్మాణము మనోహరముగా నుంది.

అలా ఆ శ్రీ విష్ణు పాదాన్ని పూజించి బయటకు వచ్చాక, యధా పూర్వ ప్రదేశంలో కూర్చుని మరి కొంత కార్యక్రమం నిర్వహిస్తాము. దీనిలో భాగంగా మనం ఎవరి ముక్తికై ఈ శ్రాద్ధకర్మను నిర్వహించామో, వారందరినీ ఒక గయా క్షేత్ర బ్రాహ్మణోత్తమునిలో సమంత్రముగా ఆవాహన చేసి, "నేను చేసిన ఈ కర్మతో తృప్తిచెందారా?" అని అడుగు తాము. అందుకు ఆయన "సంతృప్తి చెందాను" అని బదులిస్తే మనం చేసిన కర్మ సఫలమై మనకు, మన సంతానానికి, మన తరువాత తరాలవారికీ పుణ్యం సంప్రాప్తమవుతుందని విశ్వసిస్తాము.

ఈ సందర్భంలోనే, భౌతిక వాంఛల పట్ల విముఖతకు ప్రతీకగా మనకు అత్యంత ఇష్టమైన ఒక కూరగాయ, ఒక పండు, ఒక పత్రం విసర్జించే క్రతువు ఉంటుంది. ఇది ఐచ్ఛికమే. నిర్బంధమేమీ లేదు. ఆ తరువాత శక్తి కలవారు వివిధ దానాలు చేస్తారు. షోడశ దానాలని వీటికి పేరు. ఇవి 1.బియ్యము

2.నెయ్యి 3. బెల్లము 4. తేనె 5. గ్రంథము, 6. వస్త్రము 7. పాదరక్షలు 8.ఛత్రము 9. చేతికఱ్ఱ 10. విసనకఱ్ఱ 11. శయ్య 12. ఫలములు, 13. గంట 14. పాత్ర 15. ఆసనము 16. నవ ధాన్యములుగా చెప్పబడ్డాయి.

ఈ ఆలయ ప్రాంగణంలో ఆగ్నేయదిశగా ఒక మర్రిచెట్టు ఉన్నది. దీనిని 'అక్షయ వటవృక్షం' అంటారు. (ప్రయాగలో కూడా ఇలాంటి వృక్షం ఉంది. దానిని కూడా అక్షయ వటవృక్షమనే అంటారు). యుగయుగాలనుండీ ఈ వృక్షం ఇదే తీరులో ఉన్నదట. ప్రతి చెట్టూ ప్రతి సంవత్సరం ఆకులు రాల్చేసి మళ్ళీ చిగుళ్ళు తొడగటం ప్రకృతి సహజం. ఈ వృక్షం మాత్రం అందుకు మినహాయింపు. దానాలు చేసేవారు చేస్తుండగా మిగతావారు, ఇంకా మిగిలి ఉన్న పిండాలన్నిటినీ ఈ వటవృక్షం మొదట్లో విడిచిపెట్టాలి. దీనితో మొత్తం కార్యక్రమం సంపన్నమవుతుంది.

అక్కడనుంచి తిరిగి అరుణాచార్యగారి నివాసానికి చేరుకొన్నాము. వారు నన్ను ప్రత్యేకించి దగ్గరకు పిలిచి, అక్కడనున్న ఒక పెద్దమనిషిని పరిచయం చేసారు. ఆయన వేరెవరో కాదు. 'ఆంధ్రాశ్రమం' యజమాని. వారికి సంబంధించిన వ్యక్తి నాకు కలిగించిన ఇబ్బందికి విచారం వెలిబుచ్చారు నిజానికి, వారి మనిషి, ఏదో కొంచెం విసిగించాడేగానీ పెద్దగా వేధించలేదు కదా. ఏదో స్వల్ప ప్రతిఫలానికి ఆశపడి కొంత అత్యుత్సాహం చూపి ఉండవచ్చు అంతకు మించి నాతో అతనికి శత్రుత్వమేముంది కనుక. ఇదే విషయం వారికి చెప్పి విచారం వెలిబుచ్చిన, వారి సహృదయానికి కృతజ్ఞతలు తెలియజేశాను. ప్రధాన పురోహితుల మధ్య సత్సంబంధాలే ఉండటం ఈ సందర్భం తెలియజేసింది. మనలాంటి శ్రద్ధాళువుల శ్రేయస్సు దృష్ట్యా ఇది ఆహ్వానించ దగినదే గదా!

భోజనాలయ్యాక అరుణాచార్యగారి ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలిపి, ఆశీస్సులుపొంది మధ్యాహ్నం మూడు గంటలవుతుండగా వీడ్కోలు తీసుకున్నాము. మెయిన్ రోడ్డు వరకూ నడుచుకుంటూ వచ్చి వంద రూపాయలకు ఒక ఆటో మాట్లాడుకుని మంగళగౌరీ దర్శనం చేసుకుని, హోటలుకు తిరిగి వచ్చాము. అక్కడ ఇంకా 'ప్రపితా మహేశ్వరాలయం', సూర్య భగవానుని 'దాక్షినార్క దేవాలయం', 'ప్రేతశిల', 'రామశిల', 'సీతాకుండం' అని పిలువబడే 'రామ గయ', 'బ్రహ్మయోని' 'ఉత్తర మానస్' మొదలైన అనేక ఇతర దర్శనీయ ప్రదేశాలు ఉన్నప్పటికీ, సమయాభావంవల్లనూ, అలసటవల్లనూ అవేమీ చూడలేదు. పైగా ఆ రాత్రికే అసంసోల్, జసిధీ మీదుగా ద్వాదశ జ్యోతిర్లింగాలలో తొమ్మిదవదయిన బైద్యనాథ్ వెళ్ళటానికి నిద్రకు అవకాశంలేని ప్రయాణం. అందుచేత హోటలుకు చేరుకొని విశ్రాంతి తీసుకున్నాం. సాయంత్రం ఆరు గంటలకు స్నానాలుచేసి, సామాను సర్దుకుని, గదులు ఖాళీచేసి, ఏడున్నరకు ప్లాట్ ఫాం మీదకు చేరాం.

**దేవఘర్ ప్రయాణం**

2308 నెంబరు జోధపూర్-హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ నిర్ణీత సమయానికంటే అయిదు నిముషాలముందే వచ్చి నిర్ణీత సమయం సరిగ్గా గం. 8.18 ని.లకు బయలుదేరింది. 'సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్' అని పేరుకు తగ్గట్లు అది ఆగే ప్రతి స్టేషనుకు అయిదు, పది నిముషాలు ముందుగానే చేరి నిర్ణీత సమయానికి బయలుదేరుతూ ఉంది. అసంసోల్ కయితే ఏకంగా పదిహేను నిముషాలు ముందే చేరింది. అర్ధరాత్రి పన్నెండున్నరకు అసంసోల్ జంక్షనులో దిగాము. ఇది చాలా పెద్ద జంక్షను. బైద్యనాద్ వెళ్ళటానికి ఇక్కడనుంచి పాట్నా వెళ్ళే మార్గంలో 'జసిదిహ్' అనే స్టేషనులో దిగాలి. అక్కడకు వెళ్ళటానికి టికెట్లు తీసుకున్న ట్రైను 8419 నెంబరు

'పూరి-దర్భంగా' ఎక్స్ ప్రెస్ బయలుదేరవలసిన సమయం గం.2.36 ని. ఇంకా రెండు గంటలుంది. దిగిన ప్లాటుఫారం పైనే ఒక బల్లపై అందరినీ కూర్చోబెట్టి మేము వెళ్ళవలసిన ట్రైను స్థితి ఏమిటో, ఏ ప్లాటుఫారం మీదకు వస్తుందో తెలుసుకుందామని విచారణ కార్యాలయానికి వెళ్లాను. తీవ్ర నిరుత్సాహం. అది నిర్ణీత సమయానికి పది గంటలు ఆలస్యంగా నడుస్తున్నది. అంటే, మేము బైద్యనాద్ లో అభిషేకం, దర్శనం పూర్తిచేసుకోవలసిన సమయానికి ఆ క్షేత్రానికి ఇంకా 112 కిలోమీటర్ల దూరంలోనే ఉంటామన్న మాట. అలా ఆ రోజులో మూడు వంతులు ఆ ట్రైను కోసం నిరీక్షణలోనే గడిచిపోతే, మిగతా యాత్ర సంగతేమిటి? విధుల్లోనున్న 'డిప్యూటీ స్టేషను మేనేజరు'ను కలిసి నా సమస్య చెప్పాను. ఆ మార్గంలో వెళ్ళే, తక్షణమే అందుబాటులోనున్న ఏ ట్రైనులోనైనా ప్రయాణించటానికి అనుమతిస్తూ టికెట్లపై వ్రాసి ఇచ్చారు. 8181 నెంబరు 'టాటానగర్ – ఝూఝూ' ఎక్స్ ప్రెస్ వస్తున్నట్లు ప్రకటన వినబడుతున్నది. పోర్టరులను నియమించుకుని ఆ ట్రైను ఉన్న ప్లాటుఫారం మీదకు చేరుకున్నాము. ప్రయాణ సమయం రెండు గంటలలోపే కనుక, సౌకర్యంగా కూర్చోవటానికే తప్ప నిద్రించే అవకాశం లేదు. నిర్ధారింపబడిన స్లీపరు తరగతి టికెట్లు ఉంచుకుని జనరల్ బోగీ ఎక్కలేము. అది మాకు సాధ్యమయ్యే పని కూడా కాదు. నిర్ధారింపబడిన టిక్కట్లేమో ఆ రైలుకు చెందినవి కావు. నిర్ధారింపబడిన బర్తులు లేకుండా స్లీపరు కోచీలో ప్రయాణించటం, టిక్కెట్టు లేని ప్రయాణం క్రిందకే వస్తుంది. అది నేరం కదా! ఆ ట్రైను విధులలోనున్న టీటీఈ ఒకరిని సంప్రతించి మళ్ళీ రుసుము చెల్లించి నాలుగు బర్తులు తీసుకున్నాము.

*పూర్వత్తరే ప్రజ్వలి కాని ధానే సదా వసంతం గిరిజా సమేతం*

*సురాసురాధిత పాద పద్మం శ్రీ వైద్యనాధం తమంతం నమామి*

బైధ్యనాద్

## వైద్యనాథుని దర్శనం

తెల్లవారు ఝామున గం.3.50 ని.లకు 'జసిధీ'లో దిగాము. దగ్గరలో ఉన్న మంచి హోటలుకు చేర్చే ఒప్పందంపై ఇద్దరు పోర్టరులను నియమించు కుని, యదాపూర్వం సామానుతో పాటు మిగతా బృందాన్ని ఒక చోట నిలిపి పోర్టరులను వెంటబెట్టుకుని హోటలు రూములు వెదికే పనిలో పడ్డాను. దగ్గరలో అందుబాటులోనున్న వాటిలో 'యాత్రీ హోటలు' కాస్తంత అనుకూలంగా అనిపించింది. గదులు తీసుకొనే పనిలో నేను నిమగ్నమవగా పోర్టరులు వెళ్లి సామాను, బృందాన్ని గదులకు చేర్చారు. ఆ రాత్రికి మేము కోల్కతా బయలుదేరవలసిన మిథిల ఎక్స్ ప్రెసుకు అందించే ఒప్పందం మీద పోర్టరులను పంపేశాను. అప్పటికి వారు రుసుమేమీ అడగలేదు. నేను ఇవ్వనూ లేదు. ఒక నాలుగు గంటలు నిద్రించాము.

లేచిన వెంటనే ఇంకా స్నానాలు చేయకముందే బైద్యనాద్ క్షేత్ర పురోహితులయిన శ్రీ కుమార్ ఆశీష్ రాజ్ గారిని సంప్రదించాను. వారి చిరునామా --

**చక్రవర్తిలేస్, బైద్యనాద్, దేవఘర్, ఝార్ఖండ్**

**ఫోను నంబర్లు**09204423996 * 09572638867

వీరు అవటానికి బీహారీయే కానీ తెలుగు చక్కగా మాట్లాడగలరు. మా రాకనూ, మేమున్న ప్రదేశాన్నీ తెలియజేయగా తాను ఒక గంటలో రాగలననీ, సిద్ధంగా ఉండవలసినదిగానూ కోరారు. అలాగే వచ్చారు. పరిచయాలు పూర్తయ్యాక వారే అందరికీ సరిపోయే పెద్ద ఆటో ఒకటి మాట్లాడారు. దేవాలయం ఉన్న పట్టణం దేవఘర్, జిల్లా ముఖ్య పట్టణం. 'జసిధీ' కి కేవలం 7 కిలో మీటర్లు. చక్కటి రోడ్డు. అరగంటలో దేవాలయ సమీపానికి చేరుకున్నాం.

ఈ క్షేత్రం ఉన్న దేవఘర్ మొదట బీహారు రాష్ట్రంలో నుండగా ఆ రాష్ట్ర విభజన జరిగిన తరువాత 'ఝార్ఖండ్' రాష్ట్రంలోకి వచ్చింది. ఈ రాష్ట్రంలో గిరిజనులు అధికం. ఇక్కడకు స్థానిక భక్తులు, బీహారీలు పెద్ద సంఖ్యలో బృందాలుగా మేళతాళాలతో వస్తారు. స్వామి వారి గర్భాలయ విమాన శిఖరానికీ, అభిముఖంగా నున్న పార్వతీదేవి ఆలయ శిఖరానికీ, గాలిపటాల ఆకృతిలో నుండే వస్త్రాలతో కూడిన తోరణాలను కడతారు. ఇది ఒక మొక్కుబడి. ఈ క్రియను 'డోరీ కట్టడం' అంటారట. 'మీరూ కడతారా?' అని అడిగాడు 'ఆశిష్'. మాకు అలాంటి ఆచారం కానీ మొక్కుబడి కానీ లేదని చెప్పాము.

ఈ ప్రాథమిక పరిశీలనతో దేవాలయ ప్రాంగణ పరిచయం ఏర్పడ్డాక, వెంటతెచ్చుకున్న పట్టుబట్టలు ధరించి ఆ ప్రాంగణంలోనే, భక్తుల కోలాహలానికి కాస్త దూరంగా ఒకచోట కూర్చున్నాము. అక్కడే సంకల్ప పూర్వకంగా లఘున్యాసం, నమక చమకాదులు చేయించారు. ఆ తరువాత అభిషేక ద్రవ్యాలతో గర్భాలయ ప్రవేశం చేశాము. చిన్న ద్వారం. పూర్తిగా వంగితే కానీ లోపలకు ప్రవేశించలేము. ఈ గర్భాలయాన్ని సాక్షాత్తు విశ్వకర్మ నిర్మించాడని స్థలపురాణం వల్ల తెలుస్తున్నది.

దక్షిణాదిలో ప్రముఖ దేవాలయాలన్నిటిలోనూ అక్కడక్కడా కొన్ని స్వల్ప లోపాలున్నప్పటికీ మొత్తం మీద ప్రతి దేవాలయంలోనూ దర్శనానికి ఒక క్రమ పద్ధతి ఉంటుంది. కొన్నిటిలో నిర్ధారిత రుసుముపై సేవలు, ప్రత్యేక దర్శనాలు కూడా ఉంటాయి. ఒక్క తిరుమలను మినహాయిస్తే మిగతా ఏ దేవాలయంలోనైనా క్యూ ఎంత పొడవున్నా భరించగలిగినంత సమయంలోనే సంతృప్తికరమైన దర్శనం చేసుకుని బయటకు రాగలము. ఒక్క తిరువనంత పురం అనంతపద్మనాభస్వామి దేవాలయం కూడా మరో విధంగా ఈ

సూత్రానికి మినహాయింపే. అక్కడ పూజారులు, ముఖ్యంగా ఆలయ సిబ్బంది, భక్తుల పట్ల చాలా అమర్యాదగాను, దురుసుగానూ వ్యవహరిస్తారు. ముఖ్యంగా భక్తులకు అవసరమైన సమాచారం అందిచే వ్యవస్థే లేదు . ఈ కారణాల వల్ల ఎంతోమంది భక్తులు చాలా సందర్భాలలో దర్శనం చేసుకోకుండానే వెనుదిరుగవలసి వస్తుంది. మాకూ అలాగే జరిగింది. (ఈ అనుభవాన్ని మరొక అధ్యాయంలో మరింత విస్తారంగా వివరించాను) ఇక మళ్ళీ ఉత్తరాది విషయానికి వస్తే, ఒక్క బదరీలో మాత్రమే ఎంతటి రద్దీ సమయంలోనయినా ప్రయాస రహిత దర్శనం లభిస్తుంది. ఇందుకు, శ్రీ రామానుజ చినజీయరుస్వామివారి చొరవ, కృషి కొంత కారణమని చెపుతారు. మిగతా దేవాలయాల్లో, కేదారుతో సహా ఎక్కడా ఎవరూ 'క్యూ' పద్ధతి పాటించరు. గుంపులుగా ఒకరిని ఒకరు త్రోసుకుంటూ లోపలికి వెళతారు. పోనీ వెళ్ళినవారు వెంటనే వస్తారా అంటే అదీ లేదు. ఏదో విధంగా లోపలికి వెళ్ళగలిగినప్పటికీ, మనలాంటి వాళ్ళం ఉక్కపోతతోనో, త్రోక్కిసలాటకు భయపడో కొన్ని సందర్భాలలో దర్శనం చేసుకోకుండానే బయటపడాల్సి వస్తుంది. ఒకవేళ దర్శనం లభించినా అది చిరకాలం గుర్తుండేటంత అనుభూతి మిగల్చదు. ఇక్కడ కూడా అంతే. గర్భాలయానికి ఉత్తర ముఖంగా ఒకటి, తూర్పు ముఖంగా మరొకటి రెండు ద్వారాలు ఉన్నప్పటికీ లోనికివెళ్ళటానికి బయటికి రావటానికీ కూడా ఒక్క ఉత్తర ముఖద్వారాన్నే ఉపయోగిస్తారు.

మేము పురోహితుడిని మాట్లాడుకున్నాం కనుక ఆయనే, మనకు రక్షణగా ఒక వ్యక్తిని పంపించాడు. అతని విధి ఏమిటంటే మనముందు అతను బుల్డోజరు మాదిరిగా జనాన్ని ప్రక్కకి నెట్టుతూ వెళతాడు. అతనికీ మనకూ, అలాగే మనలో మనకూ మధ్యన మరొకరు దూరకుండా నెట్టుకుంటూ మనం

అతనిని అనుసరిస్తూ ముందుకు సాగాలి. ఇందుకోసం అతనికి కొంత సమర్పించుకోవాలి. అలాగే ద్వారం దగ్గర ఉన్న ఉద్యోగికి కూడా. మేమూ అలాగే వెళ్లి, తీసుకు వెళ్ళిన పాలు, తెనె, గంగా తీర్థంతో స్వామిని అభిషేకించాము అనటం కంటే అక్కడ కుమ్మరించాము అంటే సముచితం. అవి ఆ స్వామి మీదే పడ్డాయో వెరెవరిమీదైనా పడ్డాయో కూడా తెలియదు. బయటకు వచ్చి మళ్ళీ యధాపూర్వ స్థానంలో కూర్చుని, మంత్రపుష్పం సమర్పించి ప్రసాదం స్వీకరించాం. పురోహితులకు యధాశక్తి దక్షిణలు, అన్నదానానికి గాను మరికొంత చెల్లించి, ఆ ప్రాంగణంలో ఉన్న పార్వతీదేవి, గణపతి, నాగరాజు, గాయత్రీ మందిరాలను కూడా దర్శించి మరికొంత సేపు గడిపాము. ఫోటోలు తీసుకుని బయలుదేరాము. మార్గమధ్యంలో స్వామి పుష్కరిణి వద్ద ఆగాము. సామాన్యంగా భక్తులు ఈ పుష్కరిణిలో స్నానం చేసిన తరువాతనే స్వామివారి దర్శనం చేసుకుంటారు. ఈ నీటిలో స్నానం ఆరోగ్యం ప్రసాదిస్తుందని విశ్వాసం. మనసులో కోరిక ఉన్నప్పటికీ ఆ నియమం పాటించటానికి మాకు సాధ్యపడక మార్జిన స్నానంతో సరిపెట్టుకున్నాము. 'ఆశిష్' అక్కడవరకూ వచ్చి ఆటో మాట్లాడి వీడ్కోలు చెప్పాడు. మరో అరగంటలో 'జసిధీ' చేరుకున్నాము.

ఇక అక్కడ చూడవలసినవి ఏమీలేవు. ఆంగ్లంలో 'Jasidih' గా పిలువబడే ఈ 'జసిదిహ్' పేరు పలకటమే కొంచెం కష్టంగా ఉంది. మా బావమరిదిగారు మంచి సరసుడు. ఇంత కష్టపడి పలకటం ఎందుకని ఆయన ఈ ఊరు పేరును 'జడిసి' గా మార్చేశాడు. కావాలని పదే పదే 'జడిసి' 'జడిసి' అంటుంటే మాకూ వినోదం కలిగి "బావగారూ ఈ ఊరు పేరు మరిచిపోయాను. అదేమిటి?" అంటూ నేనూ ఆట పట్టించాను. ఇక భోజనాల విషయానికి వస్తే యాత్ర మొదలు పెట్టిన తరువాత గయ వరకూ మంచి భోజనానికి ఇక్కట్టేమీ

కలుగలేదు. అది ఇక్కడే మొదలైంది. మేము బస చేసిన హోటలు క్రింది అంతస్తులో రెస్టారెంటు ఉన్నది. అన్నం ఉంది కానీ ఏమీ బాగా లేదు. రోటీలు, సబ్జీలతో ఏదో చేశామనిపించాం.

రాత్రి గం. 9.43 ని.లకు 3022 నంబరు 'మిథిల ఎక్స్ ప్రెస్' లో కోల్కతాకు ప్రయాణం. ఉదయం మమ్ములను ఈ హోటలుకు తీసుకువచ్చిన పోర్టరులు గం.8.30ని.లకే వచ్చి ట్రైను ఆలస్యంగా నడుస్తున్నట్లు, దాని రాకకు సంబంధించిన చివరి ప్రకటన రాగానే మళ్ళీ వస్తామని, అప్పటివరకూ నింపాదిగా నుండవచ్చని చెప్పారు. స్థితిని ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉన్నారు. పదకొండు గంటలకు గదులు ఖాళీచేసి స్టేషనుకు చేరుకున్నాం.

మరో అరగంటకు ట్రైను వచ్చింది. అయితే కోచీలో ఎక్కడబడితే అక్కడ అడ్డదిడ్డంగా ప్రయాణీకులు పడుకుని ఉండటంతో లగేజీని మా బర్తుల వద్దకు చేర్చవలసిన పోర్టరులకు అది సాధ్యం కాలేదు. మొత్తం లగేజీని మేమే కోచీలోకి ఎక్కించి మేమూ ఎక్కాం. రైలు బయలుదేరింది. లగేజీ కాదుకదా అసలు మేమే బర్తుల వద్దకు చేరుకోవటం దుర్లభంగా తోచింది. ఎంతమందినని లేపగలం! ఇలా కాదని, అలా పడుకున్న వారందరినీ ముందుగా నా వద్ద నున్న డిజిటల్ కెమేరాతో ఫటా ఫటా ఓ పది ఫోటోలు తీశాను. ఆ తరువాత ఏదయితే అదయిందని నేను రెండు చేతులతో రెండు సూటుకేసులు ధరించి నా సాధ్యమయినంత మేరకు పడుకున్న వారిమీది నుంచి నడిచి వెళ్లసాగాను. ఒకటి రెండు హాహాకారాలు వినిపించాయి. లెక్క చేయలేదు. మిగతా మా వాళ్ళు కూడా అలాగే చేశారు. సెల్ ఫోను టార్చి వెలుగులో మా బర్తులు గుర్తించి వాటిపై నిద్రిస్తున్న వారిని బలవంతంగా లేపి ఎలాగోలా వాటిలో స్థిరపడ్డాము. లగేజీ సర్దుకుని వాటికి తాళాలు వేసిన తరువాత టీటీయి మహాశయుడు వచ్చాడు. అతను టికెట్లు ఇంకా అడగనే

లేదు. 'ఏమిటీ న్యూసెన్సు' అన్నాను చిరాగ్గా. తన నిస్సహాయతను అంగీకరించి ఉంటే అతనికి నా సానుభూతి దక్కేది ఉండేదేమో. అలా చేయలేదు. ఎందుకు చేస్తాడు? వారు తన అనుమతి(??) తోనే కదా పడుకున్నారు! పైగా వారందరూ వెయిటింగు లిస్టులో ఉన్నవారన్నాడు. నాకు మరింత చిర్రెత్తింది. "అలాగా! అయితే వెయిటింగు లిస్టులో ఉన్నవారు కూడా నిర్ధారింపబడక పోయినా స్లీపరు కోచీ ఎక్కి ఖాళీ ఉన్నచోట పడుకుని హాయిగా నిద్ర కూడా పోవచ్చన్న మాట. ఆ నిబంధనేదో శెలవిస్తే, దాని ప్రయోజనం భవిష్యత్తులో మేము కూడా పొందుతాము కదా!" అన్నాను మరింత వెటకారంగా. అతని సమాధానం కొరకు వేచి ఉండకుండానే, "చూడండి! అసంసోల్ చేరేలోపు మధుపూర్ జంక్షను, చిత్తరంజన్ స్టేషనుల వరకూ మీకు గడువిస్తున్నాను. ఆ లోగా వీరిని ఖాళీ చేయిస్తేనే నేను నా టికెట్లు మీకు చూపేది. అలా కాలేదో, అసంసోలులో నా టికెట్లు చూపే మాట అటుంచి, అసలు బండియే బయలుదేరదు - తరువాత పర్యవసానాలకు మీరే బాధ్యత వహించవలసి ఉంటుంది." అని తీవ్ర స్వరంతో హెచ్చరించాను. అప్పటికి అతను వెళ్ళిపోయి మరి కొద్దిసేపటికి మరో సహచరుడిని వెంటబెట్టు కొచ్చాడు. ఈ సారి కూడా నా టికెట్లు చూపలేదు సరికదా క్రింద పడుకున్న వారితో సహా వారిద్దరినీ కలిపి మరికొన్ని ఫోటోలు తీశాను. దీంతో నేను ఏమి చేయబోతున్నానో వారికి పూర్తిగా అర్థమయింది. మరేం మాట్లాడలేదు. మరి కొంతసేపటికి ఇద్దరు పోలీసులను వెంటబెట్టుకొచ్చి మొత్తానికి కొంతమందిని ఆ తరువాత స్టేషనులలో దింపేశారు.

**కోల్కతాలో**

26వ తేదీ తెల్లవారుఝామున నాలుగు గంటలకు చేరవలసినది ఉదయం ఏడు గంటలకు చారిత్రిక నగరం కోల్కతా ప్రధాన రైల్వే స్టేషను

'హౌరా'లో దిగాము. దేనికంటే ఏది పెద్దదనే మీమాంసకు, సారూప్యానికి తావు లేదు కానీ, భారతదేశంలో ఇప్పటి వరకూ నేను చూసిన వాటిలో (Terminuses) ముంబాయి ఛత్రపతి శివాజీ టెర్మినస్, కొత్త డిల్లీ, చెన్నై సెంట్రల్ స్టేషనుల కంటే కూడా పెద్దదిగా అనిపించింది.

ఒక్క జనసమ్మర్ధంలోనే ముంబాయికి కొంత సారూప్యం ఉందేమో. అయితే, ముంబాయిలో, స్టేషను బయట పాదచారులకోసం భూగర్భ (Sub Way) బాటలవల్ల వాహనాల రద్దీ కనబడినంతగా ప్రయాణీకుల రద్దీ

కనబడదు. ఇక్కడ అలాంటి ఏర్పాటు లేదు కనుక జనసమ్మర్ధం ఎక్కువ. వాహనాలు సరే సరి. పూర్వ పద్ధతిలోనే ఇక్కడ కూడా దగ్గరలో నున్న మంచి హోటలుకు తీసుకువెళ్ళటానికి, ఆ రాత్రికి తిరిగి స్టేషనుకు చేరటానికి రైల్వేపోర్టరుల సహాయం తీసుకున్నాము. ఇద్దరు వ్యక్తులు సామాను తీసుకుని సాగుతుండగా 'భీమసేన్ హోటలు' కు చేరుకున్నాము. స్టేషను ప్రక్కనే ఉన్నట్టే ఉందిగానీ ఒకటిన్నర కిలోమీటరుకు పైగానే నడిచాము. రెండు గదులు తీసుకున్నాము.

నేను సత్వరమే స్నానం చేసి, మిగతా వారు సిద్ధమౌతుండగా ఆ రోజు పర్యటనకు ఏర్పాట్ల కోసమై, అదే హోటలులో ఉన్న ట్రావెల్ డెస్కుకు వెళ్లాను. ప్రముఖంగా దర్శించవలసిన ప్రదేశాలతో వారివద్ద వివిధ పాకేజీలున్నాయి.

నాతో మాట్లాడిన వ్యక్తి వ్యవహార శైలి నచ్చలేదు. ఒక ప్రభుత్వ ఉన్నతాధికారి తనక్రింద పనిచేసే చిరుద్యోగితో ఏ విధమైన దర్పంతో మాట్లాడుతాడో అలా ఉంది ఇతని ధోరణి. ఎవరి కారణంగా అతనికి ఉపాధి దొరుకుతున్నదో ఆ వినియోగ దారుల పట్ల చూపవలసిన కనీస సౌశీల్యత, సౌజన్యం అతనిలో లోపించాయి. నా తత్త్వం అటువంటి వారిని ప్రోత్సహించదు సరికదా, చాలా కఠినంగా కూడా ఉంటాను. వాళ్ళు ఏమైనా అనుకోవచ్చుగాక, నేను మాత్రం అనుకున్నది వాళ్ళ ముఖంపైనే అనేస్తాను. కేవలం అతని వైఖరి కారణంగానే ఒప్పందం విషయంలో ముందుకు పోదలుచుకోలేదని స్పష్టంగా చెప్పి వెనుదిరుగు తుండగా, అప్పటివరకూ జరుగున్నదంతా ఏమీ ఎరగనట్టు గమనిస్తున్న అసలు యజమాని అప్పుడు కల్పించుకుని. నన్ను అనునయించటానికి ప్రయత్నించాడు. *'యథా ఉద్యోగి, తథా యజమానీ'* కూడా కదా. మహాత్మా గాంధీ నిర్వచించిన వ్యాపారీ-వినమయదారుడూ సంబంధాన్ని అతనికి తెలియజేసి ఆ సూత్రాలు ముందు నేర్చుకోమని అతనికి వివరించి బయటకు వచ్చాను. రైల్వే స్టేషనులో బెంగాలు రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ వారి సమాచార కేంద్రం ఉన్నట్లుగా తెలుసుకుని, అక్కడకు వెళ్లాను.

పది గంటలయినా అది తెరువలేదు. శనివారమైనందున ఒకవేళ శెలవేమో అనుకున్నాను. అక్కడనున్న పోలీసు అధికారి ఒకరిని అడుగగా, ఆ స్టేషనులో విధులు నిర్వహిస్తున్న కాలంలో ఒక్కసారి కూడా అది తెరిచి ఉండగా తాను చూడలేదన్నాడు. అక్కడే ఉన్న పుస్తకాల దుకాణంలో కోల్కతా నగర మాపును, గైడును కొనుగోలు చేస్తూ ఆ దుకాణం యజమాని ద్వారా, డల్హౌసీ స్క్వేరు అనే ప్రాంతంలో, పర్యాటక శాఖ వారి ప్రధాన కార్యాలయం ఉన్నట్లూ అక్కడనుంచి నగర పర్యటనకు, వారి వాహనాలు ఉంటాయని తెలుసుకున్నాను. స్టేషను బయటికి వచ్చి, హోటలులోనున్న

మా వాళ్ళను తీసుకుని డల్హౌసీకి వెళ్ళటానికి మీటరు ప్రకారం చార్జీ చెల్లించేటట్లుగా టాక్సీని మాట్లాడుకుని ఎక్కాను. మార్గమధ్యంలో ఆ డ్రైవరు డల్హౌసీలో పని ఏమిటి? ఎంతసేపు? అక్కడనుంచి మరెక్కడికైనా వెళ్ళాలా? అని అడిగాడు. సరే! ఇందులో రహస్యం ఏముంది. అసలు విషయం చెప్పాను. 'మీరెందరు?' అని అడిగాడు. చెప్పాను. పర్యాటక శాఖ వారి వాహనంలో మనిషికి అయిదు వందల చొప్పున నలుగురికీ మొత్తం రెండు వేలు అవుతుందని, పైగా ఉదయం పూట సందర్శనకు వాహనాలు ఆసరికి వెళ్ళిపోయి ఉంటాయని తెలియజేస్తూ, పదిహేనువందలిస్తే తానే సాయంత్రం వరకూ తిప్పి చూడదగిన ప్రదేశాలన్నీ చూపించగలననీ ప్రతిపాదించాడు. అతని మాటల్లో నిజాయితీ గోచరించింది. నమ్మదగిన వ్యక్తిగా ఆనిపించాడు. హోటలుకు చేరే లోపే ఒప్పందం కుదిరింది. అతని పేరు 'ప్రమోద్'. హోటలుకు చేరుకున్నాక, రిసెప్షనులో కూర్చుని నా వద్ద నున్న టూరిస్టు గైడు సాయంతో, అందుబాటులోనున్న సమయంలో చూడదలచుకున్న ప్రదేశాలను వివరించి, అందుకు తగిన క్రమాన్ని అతనికే వదిలేశాను. సందర్భోచితమైన సూచనలు కొన్ని చేసాడు. పదకొండు గంటలకు బయలుదేరాము.

**హౌరా వారధి**

హుగ్లీ నదికి ఒకవైపున హౌరా, మరోవైపున కోల్కతా నగరం. ఈ రెంటినీ కలిపేది ప్రసిద్ధ హౌరా సేతువు. మధ్యలో ఏ విధమైన స్తంభాలు

లేకుండా కేవలం ఇరు ఒడ్డులనుండి పరచబడిన (Cantilever Technology) ఉక్కు దూలాలపై 97 మీటర్ల ఎత్తు 705 మీటర్ల పొడవుతో ఈ వారధి కలకత్తా నగరానికి ప్రతీకగా చరిత్రలో నిలిచి ఉన్నది

1943వ సంవత్సరంలో రెండవ ప్రపంచ యుద్ధకాలంలో 26,500 టన్నుల ఉక్కు వినియోగించి ఇది నిర్మింపబడినది. ఈ తరహా సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మింపబడిన సేతువులలో ప్రపంచంలో అప్పటికి ఇది మూడవది. 1890 లో స్కాట్లాండ్ లోని ఎడింబర్గ్ లో నిర్మించిన 'ఫోర్త్ బ్రిడ్జ్', ఆ తరువాత 1917 లో కెనడా దేశంలోని క్యుబెక్ నగరంలోని 'పాంట్ డి క్యుబెక్' మాత్రమే దీని కంటే ముందున్నవి. ఆ తరువాత ప్రపంచవ్యాప్తంగా అనేకం వచ్చాయి.

రానూ పోనూ నాలుగేసి మార్గాలతో మొత్తం ఎనిమిది లేన్లపై సగటున రోజుకు 57 వేల వాహనాలు, ఇరవై లక్షల మంది ప్రజలు (అతిశయోక్తి కాదుకదా!) ప్రతిరోజూ ఈ వారధిపై ప్రయాణిస్తారట. 2011 సంవత్సరం జనాభా లెక్కల ప్రాథమిక నివేదిక ప్రకారం ఈ నగర మొత్తం జనాభా ఒక కోటి డెబ్బైఏడు లక్షల మూడువేల ఇరవై అయిదు. అంటే, అందులో 11.29 శాతం మంది పాదచారులు ప్రతి రోజూ ఈ వారధిని ఉపయోగించుకుంటారన్నమాట. ఆ రీత్యా ప్రపంచంలోనే అత్యంత రద్దీయయినది. దీని రాజసం, ఠీవి, సౌందర్యం బోటులో నది మధ్యనుండి చూడాలి.

## విద్యాసాగర్ సేతు

హౌరా వారధిపై రద్దీని తగ్గించేందుకు దానికి సమాంతరంగా దక్షిణ దిశగా రెండు కిలోమీటర్ల

దిగువన 1992 సంవత్సరం అక్టోబరు 10 న ప్రారంభింపబడిన దీనికి కూడా అనేక ప్రత్యేకతలున్నాయి.

హౌరా వంతెన ఉక్కు దూలాలతో నిర్మింపబడగా, ఇది ఉక్కు తాళ్ళతో నిర్మింపబడ్డది. 823 మీటర్ల పొడవు 115 మీటర్ల వెడల్పుగల ఈ సేతువును, నదికి ఇరువైపులా రెండేసి చొప్పున ఉన్న నాలుగు బ్రహ్మాండమైన స్తంభాల నుండి వ్రేలాడుతూ మొత్తం 121 భారీ ఉక్కుతాళ్ళు (Cable stayed technology) భరించి నిలుపుతాయి. చాలా సుందరమైన వారధి. దీనిపైనుండే కోల్కతా నగరంలోకి ప్రవేశించాము. మొదటగా చూసినది విక్టోరియా స్మారక భవనం.

## విక్టోరియా స్మారకం

పాలరాతి కట్టడాలలో సౌందర్యంలోనూ, నిర్మాణ కళానైపుణ్య రీత్యానూ ప్రపంచ ప్రసిద్ధ తాజ్ మహలుతో పోల్చదగిన అద్భుత కట్టడం ఈ భవనం. 1906 జూన్ 4వ తేదీన ఆనాటి బ్రిటిష్ ప్రభువు ఐదవ జార్జి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగగా, మొట్ట మొదటి బ్రిటిష్ మహారాణి విక్టోరియా గౌరవార్థం కర్జన్ ప్రభువు అధ్వర్యంలో ఇది నిర్మింపబడింది. 1921 డిసెంబరు 21వ తేదీన విండ్సర్ రాష్ట్ర అధిపతి (Duke of Windsor) చే ఈ మహలు ప్రారంభింపబడింది. అలనాటి బ్రిటిష్ రాజవంశానికి చెందిన ప్రముఖుల చిత్రపటాలు, విగ్రహాలు, వారు వాడిన 3500 వివిధ వస్తువులతో ఇది ప్రదర్శనశాలగా నున్నది. ఈ భవనము చుట్టూ సుందరమైన ఉద్యానవనం ఉన్నది. ప్రవేశం, ప్రదర్శనశాలకు ఉద్యానవనానికి వేరు వేరుగా ఉన్నది. ఒక

దానికి తీసుకున్న టికెట్టు మరొక దానికి ఉపయోగపడదు. లోనికి వెళ్ళామంటే ఎంత త్వర త్వరగా తిరిగినా దీని ఒక్కదానికే కనీసం రెండు గంటలు పైగా పడుతుంది. అంత సమయం లేనందువల్ల గేటు బయటనుండే భవనాన్ని తిలకించి ఫోటోలు తీసుకున్నాము. అక్కడనుండి, అశుతోష్ చౌదరీ అవెన్యూలో ఉన్న 'బిర్లామందిర్' కు వెళ్ళాము. ఉదయపు దర్శనవేళ ముగియటంతో లోపలకు వెళ్ళలేకపోయాము.

**కాళీఘాట్**

కాళీమాతకు దేశవ్యాప్తంగా ఉన్న దేవాలయాలలో ఇది ప్రముఖమైనది. హుగ్లీ నదితీరంలో ప్రథమంగా 1809 వ సంవత్సరంలో దీని నిర్మాణం జరుగగా 1971 లో పూర్తిగా నవీకరింపబడినది. నల్లరాతి విగ్రహంలో బంగారు వెండి ఆభరణాలతో అలంకృతమై ఉన్న అమ్మవారు ఎంతో తేజస్సుతో దర్శనమిస్తుంది.

ప్రతి ఏటా ఈ అమ్మవారికి *'స్నానయాత్ర'* అనే ఉత్సవం జరుగుతుంది. ఆ ఉత్సవం సంగతి ఏమో గానీ ఇక్కడకు వచ్చే భక్తులను లక్ష్యంగా చేసుకునే మోసగాళ్ళకు మాత్రం ప్రతినిత్యం ఉత్సవమే. వీరిలో మరీ ప్రముఖులు ఇక్కడి పండాలే. స్థానికేతరులైన యాత్రికులు ఎవరైనప్పటికీ ఏదో ఒక స్థాయిలో ఇక్కడ మోసానికి గురికాని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. కొందరైతే మౌనంగా భరిస్తారే గాని పైకి చెప్పుకోలేరు. ఒకసారి ఇంటర్నెట్లో చూస్తే ఇటువంటి మోసానికి గురయినవారి చేదు అనుభవాలు పుంఖాను పుంఖాలుగా కనిపిస్తాయి. అవి నాలాంటివారు వ్యక్తపరచిన కొన్ని మాత్రమే. అవ్యక్తంగా మరెన్ని ఉంటాయో? ఈ మోసాల్లో దేవాలయ యాజమాన్య పాత్ర, ఆ ఆదాయంలో వాటా ఉందని కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎందుకైనా మంచిది కొంచెం జాగ్రత్తగా ఉందామనే

ఆలోచనతో స్థానికుడు కనుక, దర్శనం పూర్తయి ఆలయం బయటకు వచ్చేవరకు మావెంట ఉండవలసినదిగా డ్రైవరు సహకారం కోరాను. అతనూ అంగీకరించాడు. కానీ, కారు పార్కింగు విషయమై సమస్య ఎదురవటంతో అతను అది వదలి వచ్చే అవకాశం లేకపోయింది. తాత్కాలికంగా ఒకచోట నిలిపి, మమ్ములను వెంటబెట్టుకుని, ప్రధాన మార్గం వరకూ వచ్చి అక్కడ తనకు తెలిసిన ఒక దుకాణదారునికి, ఏ విధమైన పూజలు లేకుండా కేవలం మాచేత దర్శనం మాత్రమే చేయించి తిరిగి అదే దుకాణం వద్దకుచేర్చే బాధ్యతను అప్పగించి వెళ్ళిపోయాడు. అయితే అందుకు ప్రతిఫలంగా ఆ దుకాణదారుడు ఒక టెంకాయ, ఒక స్వీటు పాకెట్టు, ఇతర పూజసామగ్రి కొనుగోలు చేయవలసినదిగా కోరాడు. సరేనని, వాటికిగాను నూటయాభై రూపాయలు, తిరిగివచ్చాక ఇచ్చేటట్లు ఒప్పుకున్నాము. అతను ఆ వస్తువులు ఇస్తూ ఉండగానే, "రద్దీ పెరుగుతుంది త్వరగా రండి" అంటూ ఒక వ్యక్తి మమ్ములను వెంట తీసుకువెళ్ళాడు.

దర్శనానికి 'క్యూ' అయితే ఉంది. కానీ, అది పేరుకే. నాలుగైదు పాయలుగా అల్లిన జడలాగా ఉన్నది. అక్కడక్కడ ఆ జడను ముడి వేశారా అన్నట్టుగా పది పన్నెండు మందితో గుంపులు. మా వెంట వచ్చిన వ్యక్తి మమ్ములను అతి కష్టం మీద ముందుగా గర్భాలయం ప్రవేశద్వారం దగ్గరకు చేర్చాడు. అక్కడ నుంచి మిగతా వారిని తోసుకుంటూ లోనికి తీసుకువెళ్ళాడు. గర్భాలయంలోకి వెళ్ళాక కూడా అదే పరిస్థితి. ఆ తోపులాటలోనే అమ్మవారిని దర్శించుకున్నాం. అక్కడే ఒక వారగా మమ్మల్ని నుంచోబెట్టి బెంగాలీ, హిందీ కలగలసిన చిత్రమైన భాషలో మాకేమీ అర్థంకాని మంత్రమో, స్తోత్రమో ఏదో చెప్పించాడు. హుండీలో యాభయి రూపాయలు వెయ్యాలని తీసుకుని జేబులో వేసుకున్నాడు. సరే, తను చెప్పిన హుండీ అదే కాబోలనుకున్నాం.

దర్శనం పూర్తయింది కదా వెళ్ళిపోదామనే ఆలోచనలో ఉండగా, వెళ్లనిస్తేనా? మరోక్కచోట నలుగురినీ కూర్చోబెట్టాడు. కొంచెం అవతలకు వెళ్లి మరేవరితోనో ఏదో మాట్లాడి తిరిగి వద్దకు వచ్చి "మీ ఇద్దరిలో పెద్దవారెవరు?" అని అడిగాడు. బలి ఇవ్వటానికి సిద్ధం చేస్తున్న మేకపిల్లలవలె ఉంది మా స్థితి. వేరే గత్యంతరం లేక 'నేనే' నన్నాను దీనంగా. "అయితే మీరిక్కడే ఉండండి." అని మాతో అంటూ 'మీరు రండి' అంటూ మా బావమరిదిగారిని ఆయన శ్రీమతిని మానుంచి మరో పది అడుగుల దూరం తీసుకు వెళ్ళాడు. 'ఎక్కడికి', 'ఎందుకు' అనే ప్రశ్నలు అడిగే అవకాశమే ఇవ్వటము లేదు. నిజానికి అక్కడ ఎవరికంటే ఎవరు పెద్ద ఎవరు చిన్న అనేది అప్రస్తుతం. ఏ ఆశీర్వచనమో, మంత్ర పుష్పమో అయితే, మొత్తం అందరిచేతా చేయించాలి కదా! ఇందులో చిన్నా పెద్దా అనే దానితో నిమిత్తం ఏమిటి? ఆ సాకుతో వారిని దూరంగా తీసుకువెళ్లటమేమిటి? మమ్ములను విడదీయటమే అతడి ధ్యేయంగా గ్రహించాను. ఇదేదో అనుమానించవలసిన సందర్భంగానే తోచింది.

సామాన్యంగా ఇటువంటి ప్రదేశాలు క్షేత్రాలు దర్శించే అవకాశం జీవితంలో అరుదుగా ఉంటుంది కనుక ఆయా దేవాలయాలలో వివిధ సేవలకుగాను నిర్ధారింపబడిన రుసుముతో పాటు, అర్చకులకు, సహకరించిన ఇతరుల పట్ల ఎంతటి పిసినారి వారైనా తమ సహజ తత్వానికి కొంత భిన్నంగా ఉదారంగానే ఉంటారు. తీర్థ యాత్రలలో ఉండే మహత్యమే ఇది. మేము కూడా చేసిన ఇన్ని యాత్రలలో కూడా ఎక్కడా ఎవరినీ విస్మరించలేదు. అసంతుష్టులను చేయలేదు. అలాగే, ఎక్కడా మోసపోలేదు. ఇక్కడే ఇలా జరుగు తున్నది. 'ఈ దేవాలయంలో ఇదీ సాంప్రదాయం' లేదా 'ఆచారం' ఇలా ఆచరించండి' .'ఈ పూజ చేసుకోండి.' 'మీకు శుభం

జరుగుతుంది', 'ఇంత ఇవ్వండి' లేదా 'మీకు తోచింది ఇవ్వండి' ఇలా సామరస్యంగా చెప్పటానికి ఎన్నో పద్ధతులు ఉన్నాయి. వీలయితే ఆచరిస్తాం లేదంటే ఒకే నమస్కారంతో అన్నీ సరిపెడతాం. అంతే కానీ మన ప్రమేయమే లేకుండా 'ఇక్కడ కూర్చో', 'ఇక్కడ నిలబడు', 'ఇటురా' 'ఇలా చెప్పు' 'ఇంత తియ్యి', అంటూ ఈ ఏకవచన సంబోధనలూ, ఏకపక్ష ఆజ్ఞాపనలూ ఏమిటి! నా రక్తం క్రమంగా వేడెక్కుతుండటంతో జరగకూడనిది ఏదో జరగటానికి హెచ్చరికగా గ్రహించాను. ప్రతిఘటించవలసి వచ్చేట్టే ఉంది. వాడు చేయించబోయే ఆ క్రతువేదో చేయకుండా అక్కడనుండి కదిలితే కాళీమాత ఆగ్రహానికి, శాపానికి గురయినా ఫరవాలేదు కానీ వాళ్ళ మోసంలో మాత్రం పడకూడదని నిశ్చయించుకుని, అందుకు అనువైన సమయం, సందర్భం కోసం అతను చేసేది తీక్షణంగా గమనిస్తున్నాను.

అక్కడ ఇంకొక వ్యక్తి చేరాడు. మా మా బావమరిది గారి చేతిలో ఒక కొబ్బరికాయ ఆయన భార్య చేతిలో స్వీటు పాకెట్టు ఉంచారు. ఇద్దరికీ మెడలో సన్నటి పూల మాలలు వేశారు. రిబ్బను లాంటి రెండు గుడ్డ పీలికలను కిరీటాలవలే వారి తలలకు చుట్టారు. పిచ్చి పిచ్చి మంత్రాలేవో చదువుతున్నారు. దగ్గరకు వెళ్లి "ఏమి జరుగుతున్నది ఇక్కడ" అన్నాను చిరాగ్గా. ఏదో చెప్పబోయాడు. నాకు కావలసినది అతను చేస్తున్న పనియొక్క వివరణ కాదు. "ఎవరు చేయమన్నారు ఇదంతా? ఏమీ అక్కరలేదు. ఆపేయ్' అన్నాను, ఈ సారి కోపంగా. ఆపలేదు సరికదా నా హెచ్చరికను ఏ మాత్రం పట్టించుకోకుండా మీద చేయి వేసి మరీ నన్ను ప్రక్కకు నెట్టాడు. అంతే. ఇక నేనూ తెగించక తప్పలేదు. వారి నెత్తిమీదనున్న కిరీటాలను, మెడలో దండలను పీకేశాను. చేతుల్లో ఉన్న కొబ్బరికాయలను స్వీటు పాకెట్లను విసిరికొట్టి, మా వాళ్ళ చేయిపట్టుకుని ఇవతలకు నడిపించసాగాను. నేను

ఇంత పనిచేస్తానని వాళ్ళు ఊహించలేదు. మాటలతో దాడికి దిగారు. వారిలో ఒకడు మేము కదలకుండా భౌతికంగా అడ్డుకునే ప్రయత్నం చేసాడు. దాడి చేయటమే తరువాయి.

కేవలం దర్శనం చేసుకుని వస్తామని వెళ్ళిన వాళ్ళం నలభైఐదు నిముషాలు గడిచినా, తిరిగి రాకపోయేసరికి విషయమేమిటో తెలుసు కుందామని తన వాహనాన్ని చూస్తూ ఉండమని సహచర టాక్సీ డ్రైవరుకు చెప్పి 'ప్రమోద్' మమ్ములను వెదుకుతూ బయలుదేరాడు. 'ఏమయింది సార్' అంటూ మేమున్న చోటికి సరిగ్గా సమయానికే వచ్చాడు. జరిగింది చెప్పాను ఆవేశంగా. అంతవరకూ మా వెంట ఎవరూ లేరనుకున్నారో ఏమో, హఠాత్తుగా యూనిఫారంలో నున్న స్థానికుడు మాకు అండగా వచ్చేసరికి, కొంత తగ్గి, అంతవరకూ చేసినదానికి డబ్బులివ్వమంటూ వెంటపడ్డారు. నేను ఏ మాత్రం లొంగలేదు. అలాగే మాటలతో ఘర్షణ పడుతూనే పూర్వపు దుకాణం వద్దకు చేరాము.

"నేను వీరిని దర్శనం చేయించిరమ్మంటే వారిచేత ఈ పూజలన్నీ ఎందుకు చేయించావు?" అని ఆ దుకాణదారుణ్ణి నిలదీశాడు ప్రమోద్. ఆ పూజ చేయించబూనిన వ్యక్తిని తాను నియోగించలేదనీ అతనెవరో అసలు తనకు తెలియదనీ మా అంతట మేమే అతని వెంట వెళ్లామని బొంకాడు. పైగా, అంతకు ముందు అతనివద్ద కొనుగోలుచేసిన సామగ్రికి నూటయాభయి రూపాయలని అప్పుడు చెప్పి ఇప్పుడు 750 రూపాయలకు దిక్కుమాలిన బిల్లొకటి నా చేతుల్లో పెట్టాడు. అంటే అసలు ఆ ముఠాకు మేస్త్రీ వీడేనని అర్థమైపోయింది. నాలో సహనం ఇక ఏ మాత్రం మిగల్లేదు. ఆ బిల్లు చింపేసి "ఎవడికీ ఏమీ ఇవ్వను. మీ దిక్కున్నచోట చెప్పుకోండి. పిచ్చివేషాలేశారంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తా" నని తీవ్రస్వరంతో హెచ్చరించాను. అది కేవలం

వారిని బెదిరించటానికి చేసిన హెచ్చరిక కాదు. అవసరమైతే ఆ రోజుకు మిగతా పర్యటనను విరమించుకునైనా సరే, వాళ్ళ పని పట్టాలని అప్పటికే నిశ్చయించుకున్నాను. ఓ వైపు, నన్ను కదలకుండా నిలబెట్టాలని ప్రయత్నిస్తున్న వాళ్ళను విదిలించుకుంటూ మరోప్రక్క ఏ వైపునుండి ఎవడు మా వాళ్ళలో ఎవరిని ఎటునుంచి గుంజుతారోనని జాగ్రత్తగా వారిని రక్షించుకుంటూ అక్కడనుంచి కదిలాను. అప్పటికీ ఒకడు వెంట పడుతూనే ఉన్నాడు. కారులో కూర్చున్నాక, షాపులో మొదట ఒప్పుకున్న నూటయాభయి మాత్రం ఆలా వెంటపడుతున్నవాడికి, ఇచ్చేసి క్షేమంగా బయటపడ్డాం.

మనసంతా వికలమైంది. అమ్మవారి దర్శనం చేసుకున్న సంతృప్తి ఏమాత్రం మిగలలేదు. “నీ అనుగ్రహం కోరి, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి బహుదూరాలనుంచి వచ్చే నీ భక్తులను ఈ దళారుల బారినుండి రక్షించలేవా అమ్మా!” అని మౌనంగా ప్రశ్నిస్తుండగా "మూర్ఖుడా! సమయానికి ‘ప్రమోద్’ ఎలా రాగలిగాడో గ్రహించలేవా?” కాళీమాత సమాధానం స్పష్టంగా స్ఫురించింది. నిజమే! సమయానికి ప్రమోద్ ను పంపినది ఆ చల్లని తల్లి కాక మరెవరు? ఆ దేవికి మనసులోనే కృతజ్ఞతాపూర్వకంగా మరొక్కసారి నమస్కరించాను. ఒకే సమయంలో ఒకే విషయమై ప్రమోదుకూ, నాకూ మదిలో పరస్పర భిన్నమైన ఆలోచనలు మెదులుతున్నాయి. సమయానికి తను రాకపోతే మా పని ఏమయిఉండేదని నేను ఆలోచిస్తున్నాను. తేలిగ్గా ఏ మూడు నాలుగు వేలో గుంజటమే కాక దురుసుగా కూడా ప్రవర్తించి ఉండేవారు. అది తప్పించాడు. ఇతని ఋణం ఎలా తీర్చుకోగలం అనే కృతజ్ఞతా భావం నిండిన మనసుతో నేను ఆలోచిస్తుండగా "అయ్యో! మోసపోకుండా, తమకు అండగా ఉండమని

కోరినప్పటికీ, అందుకు ఒప్పుకుని కూడా, మాట నిలబెట్టుకోనందుకు తన గురించి మేము ఏమనుకుంటున్నామో? పైగా ఆ మోసగాళ్ళతో తనకు కూడా సంబంధం ఉందనుకుంటున్నారో ఏమిటో? అని అతను ఆలోచిస్తున్నాడు. ఈ ఆలోచనల అలజడిలో కొద్ది క్షణాలు ఎవరమూ మాట్లాడలేదు. కారు మాత్రం పోతూనే ఉంది.

ఆలోచనలను ప్రక్కనబెట్టి వర్తమానంలోకి వచ్చే ప్రయత్నంగా "ఇప్పుడెక్కడికి వెళ్తున్నాం ప్రమోద్? అన్నాను. ఈ ప్రశ్నతో తనూ వర్తమానంలోకి వస్తూ "టైమెంతయింది సార్" అన్నాడు. "ఒకటిన్నర" అంటూనే అతని సమాధానంకోసం చూడకుండా "ఈ ప్రాంతంలో ఎక్కడో ఒక 'సౌత్ ఇండియన్ రెస్టారెంటు' ఉండాలి. పేరు నాకూ తెలియదు.అది ఎక్కడో తెలుసుకుని, దయచేసి అక్కడకు పోనియ్" అన్నాను.

కోల్కతా' లో 'కోమల 'అరిటాకు'

క్రితం రోజంతా సరియయిన భోజనం చేయలేదు. ఉదయం అల్పాహారం తీసుకోటానికి కూడా సమయం దొరకలేదు. ఆకలిగా ఉంది. ఎండవల్ల వేడి కూడా ఎక్కువగానే ఉంది. అక్కడక్కడ విచారణ చేస్తూ "రాస్ బిహారీ అవెన్యూ" లో నేను అడిగిన రెస్టారెంటు ఒకటి ఉన్నట్లు తెలుసుకుని ఆ ప్రాంతానికి వెళ్లి, మళ్ళీ ఒకరిద్దరిని అడిగి 'కోమల విలాస్' అని బోర్డున్న హోటలువద్ద వాహనం ఆపాడు. అందులోని రెస్టారెంటు పేరు అరిటాకు'. (Banaana Leaf). పేరుకు తగ్గట్టుగానే అరిటాకుల్లోనే వడ్డించారు. భోజనం

కూడా చాలా బాగుంది. మాతో పాటు ప్రమోద్ కూడా భోజనం చేసాడు. తరువాతి కార్యక్రమం మెట్రో రైలులో ప్రయాణం.

## కోల్కతా మెట్రో

భారతదేశంలో మొట్టమొదటి భూగర్భ రైలుమార్గం. అత్యుత్తమంగా నిర్వహింపబడే నగర రవాణా వ్యవస్థ. స్టేషనుల బహిర్భాగం గానీ, ప్లాటుఫారాలు కానీ, రైలుపెట్టెలుకానీ పరిశుభ్రత రీత్యా మిలమిల లాడుతూ ఉంటాయి. దుమ్ము ధూళి వెదికినా కనబడవు. ఉత్తర దక్షిణ దిశలుగా నున్న ఈ నగర రైలు మార్గం మొదటి దశలో ఉత్తరాన 'డండం' లోని 'నేతాజీ సుభాస్ చంద్ర బోస్' అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నగర నడిబొడ్డులోని 'ఎస్ ప్లనేడ్' వరకు ఉండేది.

పశ్చిమ బెంగాల్ ప్రస్తుత ముఖ్యమంత్రి కుమారి మమతా బెనర్జీ తొలిసారిగా కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నపుడు ఈ మార్గాన్ని నగర దక్షిణ ప్రాంతంలోని 'గరియా' ప్రాంతం వరకూ విస్తరించటానికి చర్యలు చేపట్టి, 2009 లో రెండవసారి మళ్ళీ ఆ శాఖను చేపట్టాక ఇది పూర్తిచేయటమే కాక, అదే సంవత్సరం గరియా బజార్ వరకు, 2010 సంవత్సరం అక్టోబర్ 7వ తేదీన 'న్యూ గరియా' వరకు పొడిగించబడిన మార్గాన్ని ప్రారంభించారు. అదే సందర్భంగా అంతకు మునుపు ఉన్న స్టేషనుల పేర్లను సమూలంగా మార్చివేసి, కొత్తగా బెంగాలు సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకలైన మహనీయుల పేర్లు పెట్టారు. ఉదా; గరియా బజార్ 'కవి నజ్రుల్' గానూ న్యూ గరియా స్టేషను 'కవి సుభాష్' గానూ, భోవానిపూర్ స్టేషను 'నేతాజీ భవన్' గానూ పునఃనామ కారణం పొందిన వాటిలో కొన్ని. మేము భోజనం చేసిన హోటలున్న 'రాస్ బిహారీ అవెన్యూ' కు సమీప మెట్రో స్టేషను 'కాళీఘాట్'. ఆ స్టేషను సమీపంలో భద్రమైన చోట కారు పార్కుచేసి, ప్రమోద్ కూడా మాతో బయలు దేరాడు.

'కాళీఘాట్' స్టేషనులోకి దిగాము. భూమి ఉపరితలం నుండి భూగర్భంలోని ప్లాటుఫారం మీదకు చేరగానే అద్భుతమైన మరో ప్రపంచంలోకి అడుగిడిన అనుభూతి కలిగింది. అతనే లైనులో నిలబడి దక్షణాన చివరిదయిన 'కవి సుభాష్' స్టేషనుకు అందరికీ టికెట్లు తీసుకున్నాడు. ప్లాటుఫారం చేరుకున్న ఐదు

నిముషాల్లోనే ట్రైను వచ్చింది. ట్రైను ఆగగానే తలుపులు వాటంతట అవే తెరుచుకుంటాయి. అదే రీతిలో, బయలుదేరే క్షణం ముందు మూసుకుంటాయి. ఏ ఒక్క ద్వారం తెరచిఉన్నా ట్రైను బయలు దేరదు. రైలు ప్రయాణించే దిశలో వచ్చే ప్లాటుఫారాలు అన్నీ ఒకవైపునే ఉండవు. కొన్ని స్తేషనులలో ఎడమ వైపునుంటే కొన్నిటిలో కుడివైపుంటాయి. ఇందుకు సంబంధించిన సూచనలు, సమాచారంతో తీయని కంఠస్వరంతో నిరవధికంగా ప్రకటనలు వెలువడుతూనే ఉంటాయి. ఒక విశేషమేమంటే ముంబాయిలోని లోకల్ రైళ్ళవలె ఇవి ఎనభై, నూరు కిలోమీటర్ల వేగంతో వెళ్ళవు. గరిష్ట వేగం గంటకు 55 కి.మీ. సగటు వేగం 30 కి.మీ మాత్రమే. ఏ పెట్టెలో ఎక్కినా ట్రైను ఆ చివర నుంచి ఈ చివర వరకు సులభంగా నడిచి వెళ్ళవచ్చు. కుదుపులుకానీ, రొద కానీ అసలుండదు. గరిష్ట వేగంతో వెళుతున్నప్పటికీ

సెల్ ఫోనులో మామూలుగానే మాట్లాడుకోవచ్చు. చివరిదయిన 'కవి సుభాష్' స్టేషనులో దిగాము.

## రోడ్డు మీద రైలు

ప్లాటుఫారం మారి తిరుగు ప్రయాణం కోసం రెండో వైపు ప్లాటుఫారం మీదకు వచ్చి ట్రైను కోసం నిరీక్షిస్తుండగా "కొంత దూరం ట్రాములో కూడా ప్రయాణిస్తారా?" అని అడిగాడు ప్రమోద్. 'సరే' నన్నాము. అందుకోసమని, కారు నిలిచి ఉన్న 'కాళీఘాటు' స్టేషనులో కాకుండా దానికి రెండు స్టేషనుల ముందు 'ఉత్తమ కుమార్' మెట్రో' స్టేషనులో దిగాము. రోడ్డు దాటి కొద్ది దూరం నడువగా అక్కడ ట్రాము బయలుదేరే స్టేషను ఉంది. ఇది రైలు లక్షణాలున్న బస్సు వంటిదన్నమాట. పూర్వం హైదరాబాదులో ట్రైలరు బస్సులని ఉండేవి. వాటి స్థానే ఇటీవల లాంగ్ బస్సులని కొత్తగా వచ్చాయి. ఇది కూడా అలాగే రెండు పెట్టెల బస్సు ఆకారంలో ఉంటుంది.

బస్సు వలెనె రోడ్డు మీదే కానీ రైలు లాగా పట్టాలమీద ప్రయాణిస్తుంది. బస్సు డీజిలుతో నడిస్తే ఇది విద్యుత్తుతో నడుస్తుంది. బస్సులకు వర్తించే రెడ్ సిగ్నలు వద్ద ఆగటం లాంటి ట్రాఫిక్ రూల్సు వీటికీ వర్తిస్తాయి. కానీ బస్సు అంత వేగం వెళ్ళవు. అంత వివరంగా గమనించలేదుగానీ గరిష్ట వేగం 30 కి.మీ. ఉంటుందేమో. ఉదయం సాయంత్ర సమయాల్లో ఇవి చాలా రద్దీగా ఉంటాయి.

నా చిన్నతనంలో ఈ ట్రాముల గురించి పాఠ్యపుస్తకాల్లో చదువుకున్నాను. కాస్త ప్రపంచజ్ఞానం తెలిసి ప్రయాణాలు చేయటం మొదలెట్టేసరికి ఇవి విస్తారంగానున్న అప్పటి మద్రాసు, బొంబాయి నగరాల్లో కనుమరుగైపోయి వాటి స్థానే లోకల్ రైళ్ళు ప్రవేశించాయి. ఈ కోల్కతాలో మాత్రం బహుశా మెట్రో ప్రాజెక్టు మిగతా నగరాల్లో కంటే వెనుకగా జరిగినందువల్ల (మెట్రోకు శ్రీమతి ఇందిరాగాంధీ చేతుల మీదుగా, 1972 డిసెంబరు 29న శంఖుస్థాపన జరుగగా, ఒకే లైనుతో మొదటి రైలు డండం, ఎస్ ప్లనేడుల మధ్య 1984లో నడిచింది. విస్తరణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి) వీటిని కొనసాగించక తప్పలేదు. ఏమయినప్పటికీ అత్యాధునికమైన మెట్రోరవాణా వ్యవస్థకు, పురాతన మైన మరో వ్యవస్థ కూడా సమాంతరంగా ప్రజలకు అందుబాటులో నుండటం ఆసక్తికరమైన వైవిధ్యమనే చెప్పాలి.

'కాళీఘాటు' మెట్రో స్టేషను సమీపంలో రెడ్ సిగ్నలు వద్ద ట్రాము ఆగగా ట్రాము కండక్టరు అనుమతితో అక్కడే దిగి రోడ్డు దాటి, కారు నిలిచిఉన్న ప్రదేశానికి చేరుకున్నాము. సమయం అయిదు గంటలైంది. చెమటతో, శక్తి అధికంగా ఆవిరైపోతున్నది. అలసట ప్రభావం చూపుతున్నది. జాజిపూర్ వెళ్ళటానికి ట్రైను రాత్రి గం.10.35 ని.లకు ఇంకా అయిదు గంటలే ఉన్నది. ఇక చూడవలసిన ప్రదేశాలేమన్నా ఉంటె కుదించమని ప్రమోదుకు చెప్పాను. 'భవానీపూర్' ప్రాంతంలో 'శరత్ బోస్' రోడ్డులో నున్న శ్రీ లక్ష్మీనారాయణ మందిరాన్ని (ఇది కూడా బిర్లా వారిదే) మాత్రం దర్శించి, అక్కడనుండి ఎక్కడా వాహనం దిగే అవసరం లేకుండా, హౌరాకు వెళ్ళే మార్గంలో, దేశంలో అతి పెద్ద క్రికెట్ స్టేడియం 'ఈడెన్ గార్డెన్స్', 'ఆకాశవాణి', 'జనరల్ పోస్ట్ ఆఫీసు', 'రాజ్ భవన్', 'హైకోర్టు', 'రైటర్స్ బిల్డింగ్' అని పిలువబడే

సచివాలయం మొదలైనవి తిలకిస్తూ ప్రయాణిస్తుండగా హౌరా వారధికి ఒక కిలోమీటరు దూరంలో రోడ్డుపై ఒక ఎన్నికల ప్రచారసభ జరుగుతుండటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనం ముందుకుగానీ వెనక్కుగానీ పోయే వీలులేదు. సమయం ఏడు గంటలవుతోంది. చివరి నిముషంలో ఉరుకులు పరుగుల అవసరం నివారించటానికి అక్కడే కారు దిగిపోయాము. కాళీఘాటులో అతను చేసిన సహాయానికి కృతజ్ఞతగా, ఒప్పుకున్న పదిహేను వందలకు మరో ఐదువందలు జోడించి ప్రమోద్ చేతిలో ఉంచాను. ఆ సందర్భంలో అ(న)వసరమయిన సంభాషణంతా ఇరు మనసులూ, కళ్ళద్వారానే చేసుకున్నాయి. అంతే! ఆ ఐదు వందలూ తిరిగి నా చేతిలో పెట్టాడు. నిజాయితీ నిలువెత్తులో సజీవంగా సాక్షాత్కరించిన ఒక అపురూపమైన సందర్భమది. కృతజ్ఞలతో వీడ్కోలు తీసుకుని, నడకతో సభ జరుగుతున్న ప్రదేశాన్ని దాటి రెండోవైపుకు వచ్చాము. అక్కడనుంచి స్వల్పదూరమవటంతో హోటలుకు చేరటానికి మరే ఇతర టాక్సీ కానీ ఆటో కానీ దొరకలేదు. సిటీ బస్సులో హౌరా వంతెన మీదుగా హుగ్లీ నదిని దాటాము. ఆ బస్సు స్టాండు సమీపంలోనే మా హోటలు ఉంది.

**పూరీ ప్రయాణం**

గదులకు చేరుతూనే స్నానాలుచేసి, కాఫీతో కాస్తంత సేదతీరి, ఆ పిదప చకచకా సామాను సర్దేసుకుని, గదులు ఖాళీ చేసేటప్పటికి రైల్వే పోర్టరు మహాశయులు సిద్ధంగా ఉన్నారు. ఈ స్టేషనులో రెండు రైల్వే మండలాలకు చెందిన మొత్తం 24 ప్లాటుఫారాలున్నాయి. వీటిలో 1 నుంచి 12 వరకు తూర్పు రైల్వేకి చెందినవి కాగా 13 నుంచి 24 వరకు మిగతా పన్నెండూ ఆగ్నేయ రైల్వేకి చెందినవి. మేము వెళ్ళవలసిన 'కోల్కతా పూరీ' ఎక్స్ ప్రెస్ 14వ నంబరు ప్లాటుఫారం నుంచి సకాలంలో బయలుదేరుతుందని చెప్పారు.

ఉదయం దిగిన ప్లాటుఫారం నుంచి ఇది చాలా దూరం, కనుక సాధ్యమైనంత త్వరగా బయలుదేరాలని వారు హెచ్చరించటంతో తొమ్మిదిన్నరకల్లా బయలుదేరాము. ట్రైను ప్లాటుఫారం మీదకు వస్తుండగా గం.10.05 ని.లకు ప్లాటుఫారం చేరుకున్నాము. నిర్ణీత సమయానికే బయలుదేరింది.

అలసట ప్రభావంనుంచి ఇంకా కోలుకోలేదు. నిద్ర పట్టిందంటే పొద్దున్నవరకు లేచేటట్లులేము. కార్యక్రమం చూస్తేనా, తెల్లవారు ఝామున గం.3.34 ని.లకు జాజిపూర్ స్టేషనులో దిగాలి. అంటే అలారం పెట్టుకుని ధైర్యంగా నిద్రపోయినా గట్టిగా మూడు గంటలకు మించి నిద్ర ఉండదు. "అలిసిపోయిఉన్నాం కదా, పోనీ, ఆ కార్యక్రమం ఎత్తేద్దామా" అని ధైర్యంచేసి మా బావమరిదిగారిని అడిగాను. ఆయన వెంటనే ఒప్పుకున్నారు. మహిళా సభ్యులు కూడా బలపరిచారు. ఇంకేం. మరో ఆలోచన లేకుండా నిద్రకుపక్రమించాము. జాజిపూర్ రోడ్డు నుంచి పూరీకి టికెట్లు (అవి నిరీక్షణ జాబితాలో ఉన్నాయి. వాటి అవసరం మర్నాటికి కదానని నిర్ధారింప బడ్డాయో లేదో కూడా తెలుసుకోలేదు) తీసుకునే సమయంలో, ఇప్పుడు చేస్తున్న ప్రయాణంలో ఆ భాగానికి టికెట్లు రద్దుచేయకపోవటం ఎంత మంచిదయింది! 27వ తేదీ అరగంట ఆలస్యంగా ఉదయం 8 గంటలకు పూరీలో దిగాము.

మిగతా పట్టణాల్లో మాదిరిగా స్టేషను చుట్టుప్రక్కల హోటళ్ళు గానీ, ఇతర వాణిజ్య సముదాయాలు గానీ లేవు. అసలు పట్టణమే స్టేషనునుంచి అరకిలోమీటరు నుంచి ప్రారంభ మవుతుంది. యదాపూర్వం అందరినీ స్టేషనులోనే నిలిపి హోటలు రూము వెతికేపనిలో ఒక రిక్షాలో బయలుదేరాను. అనేకం తిరిగాను. చాలాచోట్ల ఖాళీలే లేవు, ఉన్నవాటిల్లోనేమో సౌకర్యంగా అనిపించలేదు. చివరకు ఒకటి మంచిదే దొరికింది. ఆ మధ్యాహ్నం కోణార్క్

పర్యటనకు వెళ్ళటానికి టాక్సీని కూడా అక్కడే మాట్లాడుకుని, అదే టాక్సీలో స్టేషనుకు వెళ్లి అందరినీ తీసుకుని తిరిగి హోటలుకు చేరాను.

**కోణార్క్**

కోణార్క్ దేవాలయ దృశ్యం

జాజిపూర్ రద్దు కారణంగా ఆ ఉదయం వేరే కార్యక్రమాలేవీ లేవు. యాత్ర తుది దశకు చేరుకున్నాము. తిరుగు ప్రయాణానికి భువనేశ్వరులో సికిందరాబాదు వెళ్ళే ఫలకునుమా ఎక్స్ ప్రెస్ అందుకోవటానికి ఉదయం ఆరు గంటలకు పూరీలో బయలుదేరే 'పూరీ -పరదీప్' ఎక్స్ ప్రెస్ లో భువనేశ్వరుకు చేరుకోవలసి ఉంది. అయితే దీనిలో స్లీపరు సౌకర్యంలేదు. సీట్లకేమో అంత ముందుగా టికెట్లు రిజర్వేషను సౌకర్యంలేదు. అందువల్ల మొత్తం యాత్రకు టికెట్లు తీసుకునే సమయంలో ఈ ప్రయాణానికి టికెట్లు తీసుకోలేదు. వాటి కోసం ఇప్పుడు మళ్ళీ ప్రత్యేకంగా రైల్వేస్టేషనువరకు వెళ్లి అక్కడ లైనులో నిలబడి తీసుకోవాలంటే సగం రోజు అయిపోతుంది. అందుచేత కిరణ్ కు ఫోను చేసి ఆ ఏర్పాటు చేయమని కోరాను.

రెండు గంటలకు టాక్సీ వచ్చింది. వెంటనే కోణార్కుకు బయలుదేరాము. సముద్రతీరం వెంట ప్రయాణం ఆహ్లాదంగా సాగుతుంది. నాలుగుగంటల సమయంలో ప్రసిద్ధ సూర్యదేవాలయం చేరుకున్నాము. క్రీ.శ.పదమూడవ శతాబ్దంలో 'పూర్వగంగ' రాజ వంశస్తుడైన నరసింహదేవ రాజుచే ఈ దేవాలయం నిర్మింపబడింది. ప్రపంచ వారసత్వ కట్టడాలలో

ఒకటిగా పరిరక్షింపబడుతున్నది. ఇటీవల NDTV వారు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రపంచ వింతలలో ఒకటిగా ఎన్నిక కాబడినది.

ఏడు జతల గుఱ్ఱాలతో పూన్చిన బ్రహ్మాండమైన సూర్యరథం యొక్క ఆకృతిలో ఈ ఆలయం నిర్మింపబడింది. రోజులోని 24 గంటలకు సంకేతంగా ఒక్కోవైపు పన్నెండేసి చొప్పున మొత్తం ఇరవై నాలుగు చక్రాలున్నాయి. ఒక్కో చక్రానికి అమర్చబడిన ఆకుల నీడ ద్వారా మన గడియారాలను సరిచేసుకోగలిగినంత ఖచ్చితంగా సమయాన్ని గుర్తించవచ్చు.

ఈ మొత్తం కట్టడంలోని ప్రతి అంగుళం అద్భుతమైన శిల్పకళా చాతుర్యంతో తొణికిసలాడుతూ ఉంటుంది. *"ఈ శిలల భాష మానవ భాషకు అతీతమైనది."* (Here the language of stone surpasses the language of man) అంటూ విశ్వకవి రవీంద్రనాథ్ టాగూరు ఈ శిల్పకళను అభివర్ణించారు.ఈ సముదాయం మొత్తం ప్రధాన దేవాలయం, దానివి అభిముఖంగా నాట్యమండపంగా రెండు ప్రధాన భాగాలుగా ఉంటుంది. దేని ప్రత్యేకత దానిది. నాట్య మండపం దాదాపు శిధిలమై పోగా ప్రధానాలయం ప్రమాదకరమైన స్థితిలో ఉంది. గర్భాలయం లోపలి భాగంలో చెరియలు విరిగి పడుతున్నందు వల్ల ద్వారానికి గోడ కట్టి సందర్శకుల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించారు. ఒక

గైడును నియమించుకుని, ఈ విశేషాలన్నీ గ్రహించాము. సుమారు రెండు గంటలు గడిపి, అనేక ఫోటోలు తీసుకుని అక్కడినుండి బయలుదేరాము.

పూరీ చేరగానే ఇంటర్నెట్ కేంద్రంలో, మరునాడు భువనేశ్వరు వెళ్ళటానికి కిరణ్ మాకోసం బుక్ చేసిన టికెట్లు డౌన్లోడు చేసుకుని ప్రింటు తీసుకున్నాను. ఆ టికెట్లు పంపుతూ కిరణ్ సముచితమైన సూచనొకటి చేసాడు. హోటలుకు చేరుకొని ఏడు గంటలకు టాక్సీని విడుదల చేశాం.

**కరార్ ఆశ్రమం**

'క్రియాయోగం' ద్వారా భగవత్సాక్షాత్కారం సాధించే ప్రక్రియను ప్రతిపాదించి, ఆచరించినవారు *'శ్యాం చరణ్ లాహిరీ'* మహాశయులు. భారతీయ ఆధ్యాత్మిక గురువులలో వీరు ముఖ్యులు. వీరి ప్రథమ శిష్యులైన స్వామి యుక్తేశ్వరగిరి, పూరీ పట్టణంలో 'కరార్' ఆశ్రమాన్ని స్థాపించి అక్కడ నివశించి అచ్చటనే కైవల్యం పొందారు. వీరి శిష్య పరంపరలో ముఖ్యులు – *'స్వామి పరమహంస యోగానంద'.* వర్తమాన కాలపు ఆధ్యాత్మిక మహాపురుషులలో ఒకరు.

అద్భుతమైన తన బాల్యానుభవాలూ, జ్ఞానియయిన ఒక గురువు కోసం యౌవనంలో చేసిన అన్వేషణలో తారసపడిన సాధుసంతులతో తన అనుభవాలూ, రమణ మహర్షి, ఆనందమయి మాత, రామకృష్ణ పరమహంస శిష్యుడూ, సాధుశీలీ అయిన 'మాస్టర్' మహాశయ, మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ టాగూర్, జగదీశ్చంద్ర బోసులతో ఆయన సమాగమ వివరాలు, దైవసాక్షాత్కారం పొందిన, వారి గురుదేవుల ఆశ్రమంలో పది సంవత్సరాలపాటు సాగిన శిక్షణ, ప్రపంచ వ్యాప్తంగా సత్యాన్వేషకులకు బోధ చేస్తూ గురువుగా ఆయన గడిపిన అనేక సంవత్సరాల కాలంలో పొందిన

అనుభవాలతో ఆయన వ్రాసిన గ్రంధం ***'ఒక యోగి ఆత్మ కథ'*** (An Autobiography of a Yogi).

*".....Death is not a blotting-out of existence, a final escape from life; nor is death, the door to immortality. He who has fled his Self in earthly joys will not recapture it amid the gossamer charms of an astral world. There, he merely accumulates finer perceptions and more sensitive responses to the beautiful and the good which are one. It is on the anvil of this gross earth that struggling man must hammer out the imperishable gold of spiritual identity. Bearing in his hand the hard-won golden treasure, as the sole acceptable gift to greedy Death, a human being wins final freedom from the rounds of physical reincarnation."*

***("....మరణమనేది మనుగడను మట్టుపెట్టేదీ, జీవితం నుంచి చరమ పలాయనమూ కాదు; అమరత్వానికి ద్వారమూ కాదు. ప్రాపంచిక సుఖాల్లో మునిగి తన ఆత్మ నుంచి పలాయనమైనవాడు, సూక్ష్మ లోకపు సూక్ష్మాకర్షణల మధ్య దాన్ని తిరిగి వశం చేసుకోలేడు. అక్కడతడు కేవలం సూక్ష్మతర అనుభూతులనూ, మౌలికంగా ఒకటే అయిన సుందరమైన, మంచివైన ఇతోధిక సంవేదన శీలమైన అనుభవాల్నీ కూడబెట్టుకుంటాడు. సంఘర్షించే ఆ మానవుడు ఈ స్థూల ప్రపంచమనే దాగర మీదే ఆధ్యాత్మిక అభిన్నత అనే అక్షయ సువర్ణాన్ని సుత్తితో సాగగొట్టాలి. దురాశా పూరితమైన మృత్యువుకు స్వీకార యోగ్యంగా ఏకైక బహుకృతీ అయిన కష్టపడి సంపాదించిన బంగారు నిధిని చేతబెట్టుకొని మానవుడు భౌతిక పునర్జన్మల ఆవృత్తుల నుంచి చరమ విముక్తి సాధిస్తాడు."***

ఇలా, ప్రధానంగా మానవ ఆస్తిత్వపు అంతిమ మర్యాదలను నిశితంగా పరిశీలిస్తూ, జీవితలక్ష్యం వైపు సూటిగా సాగించే ఆలోచనలను

ప్రోదిచేస్తూ, వ్యక్తిలోని జ్ఞానజ్యోతిని పఠనాసాంతం ఉద్దీపింపజేస్తుందీ గ్రంథం. అందుచేతనే భాషలకు, మతాలకు అతీతంగా, మేధావులు, తత్వవేత్తలు, శాస్త్రజ్ఞులు, జిజ్ఞాసువులు, పండితులు, పామరులు అనే తారతమ్యాలు, అలాగే పిన్నలూ పెద్దలూ అనే భేదమూ లేకుండా ఆసక్తితో చదివిన ఏ వర్గం వారికైనా ఒక జీవిత కాలపు మధుర పఠనానుభూతిని శాశ్వతంగా మిగిల్చిన గ్రంథరాజంగా ఇది కీర్తి గడించింది. ఇరవైఒక్క భాషలలోకి అనువదింపబడి ప్రపంచ వ్యాప్తంగా అనేక కళాశాలల్లో, విశ్వవిద్యాలయాలలో పాఠ్యగ్రంథంగా, పఠనీయ గ్రంథంగా విస్తృతంగా ఉపయోగంలోనున్న ఈ గ్రంథాన్ని నాతోపాటు మా కుటుంబం యావత్తూ చదివి ఉండటం చేత, అందులోని బోధనల ప్రభావం ఎంతో కొంత మా అందరిమీద ఉన్నది.

పూరీ బీచ్ రోడ్డులో 'స్వర్గద్వార్' ప్రాంతంలోనున్న ఈ ఆశ్రమం చిరునామా, ఇతర వివరాలూ తెలియజేస్తూ సమయం అనుకూలిస్తే సందర్శించవలసినదిగా కిరణ్ తన మెయిలులో సూచించాడు. అప్పటికింకా ప్రధానమైన జగన్నాధస్వామి దర్శనమే చేసుకోలేదు. సమయమేమో తక్కువ.

ఈ రెండింటికీగాను, అవసరమైన వాహనాన్ని ఏర్పాటు చేయ వలసినదిగా హోటలు మేనేజరును కోరాను. రాత్రి పది గంటలవరకూ దేవాలయం తెరచే ఉంటుంది కనుక జగన్నాధస్వామి దేవాలయంతో ఏ సమస్యా లేదు. కానీ ఈ ఆశ్రమం గురించిన సమాచారమే, వారెవరి వద్దా లేదు. ఫోనులో ఎవరితోనో నిర్విరామంగా సంప్రదించి మొత్తానికి

వివరాలు రాబట్టాడు. పూరీ, భువనేశ్వరులలో తెలుగు మాట్లాడేవారు అధికంగానే ఉంటారు కనుక, తెలుగు తెలిసిన ఆటో వ్యక్తి ఎవరైనా దొరుకుతారేమో చూడమని చెప్పగా అలాగే ఒకతనిని తీసుకువచ్చారు. అప్పటికి సమయం ఎనిమిది దాటింది. ముందుగా ఆశ్రమానికే వెళ్లాం. స్వర్గద్వార్ రోడ్డునుంచి రెండు మూడు సన్నని వీధులలో మలుపులు తిరుగగా అక్కడ ఈ ఆశ్రమం ఉన్నది. ఎత్తైన ప్రహరీగోడకు ఉన్న ద్వారం మూసి ఉన్నది. కాలింగు బెల్లు లాంటిదేదీ కనబడలేదు. స్వల్పంగా తలుపు తడుతూ 'ఏమండీ' అంటూ రెండు మూడు సార్లు తెలుగులోనే పిలిచాను. తలుపు తెరుచుకోలేదు. లోపలినుంచే ఒరియాలో ఒక కంఠం వినిపించింది. 'మీరెవరు? అని అడుగుతున్నారు అని అనువదించాడు ఆటో డ్రైవరు. హైదరాబాదు నుంచి వచ్చామనీ ఆశ్రమం దర్శించ గోరుతున్నామని ఈసారి ఇంగ్లీషులో చెప్పాను. సమాధానంగా, ప్రాంగణానికి మరో ప్రక్కనున్న ద్వారం వద్దకు రావలసినదిగా కోరారు.

అలా ఒక శిష్యుడు మమ్మల్ని స్వాగతించి, సాయంత్ర సమావేశం అప్పుడే ముగిసినట్లూ, స్వామి ఇక ధ్యానంలో కూర్చోబోతున్నారనీ, ఈలోగా దర్శనం చేసుకోవచ్చనీ చెబుతూ విశాలమైన ఆవరణలో పెరటి తోటలతోనూ, అనేక ఇతర వృక్షాల మధ్యస్థంగా నున్న కాలిబాటలో మమ్ములను తోడ్కొని వెళ్ళారు. ఆవరణలో ఒక ప్రక్క ఆశ్రమ కార్యాలయమూ, ధ్యానమందిరమూ, ఆ ప్రక్కనే స్వామి నివాసము ఉన్నాయి. ప్రధాన ఆశ్రమం పురాతనమైన సాధారణ గృహం. నిరాడంబరంగా ఉంది. యాభయి మంది వరకూ సౌకర్యంగా కూర్చునే వీలున్న ఒక హాలులోకి ప్రవేశించాము. పరమహంస యోగానంద గారి శిష్యులు శ్రీ సత్యానందగిరి. వారి శిష్యులు పరమహంస శ్రీ హరిహరానందగిరి. వారి శిష్యులే, ఆశ్రమ ప్రస్తుత అధిపతి స్వామి

యోగేశ్వరానందగిరి. క్రియాయోగ సాధనలో అత్యున్నతస్థితి 'నిర్వికల్ప సమాధి' యోగం సాధించిన ధన్యులు. క్రియాయోగ సాధనలో ఆచరణాత్మక శిక్షణ, తత్వశాస్త్రము (Philosophy) మత సంబంధ విషయాల (Scriptures) పై బోధనలు, జ్యోతిష, ఖగోళ శాస్త్రాల అధ్యయనాలు ఈ ఆశ్రమ ముఖ్య కార్యక్రమాలు. శిష్యులందరూ వివిధ రంగాలలో నిష్ణాతులైన విద్యాధికులు. ఆ హాలులోకి మేము ప్రవేశించే సమయానికి అక్కడున్న ముగ్గురు నలుగురు శిష్యులతో స్వామి యోగేశ్వరానందగిరి ఏదో విషయమై ముచ్చటిస్తున్నారు. సంభాషణకు కొంచెం విరామమివ్వగా, తోడ్కొని వెళ్ళిన శిష్యుడు మమ్ములను క్లుప్తంగా పరిచయం చేసాడు. నాకు నేను, మా వాళ్ళను మరింత విపులంగా పరిచయం చేస్తూ, 'ఒక యోగి ఆత్మ కథ' గ్రంధం చదవటం, పొందిన అనుభూతి తెలియజేయగా అభినందన సూచనగా తల పంకించారు. గురు పరంపరలోని ప్రముఖులను అక్కడనున్న చిత్రపటాల ద్వారా వారే స్వయంగా విశదీకరించారు. అందరమూ వారి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు పొందాక, యుక్తేశ్వరగిరి వారి మహాసమాధి దర్శనము చేయించవలసినదిగా మరొక శిష్యునకు చెబుతూ ఆయన లేచి వెళ్ళారు.

బయటకు వచ్చి ఆ ప్రక్క నుంచి వెళ్ళగా, అదే ఆవరణలో హాలుకు వెనుక వైపున విడిగా ఉన్న ఒక మందిరంలో శ్రీ యుక్తేశ్వరగిరి వారి సమాధి ఉన్నది. ఆ సమాధిపై నిత్య పూజలందుకుంటున్న శివలింగం ఉన్నది. నమస్కరించి బయటకు వచ్చాక ప్రసాదం అందించారు. అది స్వీకరించి, శిష్యులకు ధన్యవాదాలు తెలిపి వీడ్కోలు పొందాము.

## జగన్నాధుని దర్శనం

సమయం తొమ్మిది గంటల వుతుండగా జగన్నాధ స్వామి ఆలయానికి చేరుకున్నాము. దేశం లోని ప్రసిద్ధమైన దేవాలయాలలో ఒకటి.

రద్దీ సామాన్యంగా ఉంది. మిగతా దేవాలయాలతో పోలిస్తే తోపులాట తక్కువనే చెప్పాలి. కొంచెం దూరం నుంచే అయినా చక్కటి దర్శనం లభించింది. అంతటితో తృప్తిపడక, మా మిగతా ముగ్గురూ మరోసారి టికెటు తీసుకుని ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. పది గంటలవుతున్నా భక్తులతో ప్రాంగణం ఇంకా సందడిగానే ఉన్నది. వాతావరణం కూడా ఆహ్లాదంగా ఉంది. విశాలమైన దేవాలయ మెట్లపై కొంతసేపు గడిపి, హోటలుకు చేరాము. దగ్గరలో ఉన్న రెస్టారెంటులో భోజనంచేసి సంతృప్తికరమైన మరొక రోజుకు వీడ్కోలు పలికాము.

## రైల్వే వారి నిర్వాకం

ఆరు గంటలకు మా ట్రైను. 67 కిలోమీటర్లు, గంటన్నర ప్రయాణం. ఏడున్నరకల్లా భువనేశ్వరు చేరతాము. మధ్యాహ్నం రెండు గంటలకు సికిందరాబాదు ఫలకునుమా ఎక్స్ ప్రెస్. చాలినంత సమయం ఉన్నది కనుక, అక్కడచూడదగిన లింగరాజ్, కేదారగౌరీ దేవాలయాలు, ధవళగిరి, ఇంకా సమయముంటే ఇతర దర్శనీయ స్థలాలు చూద్దామని సంకల్పించుకున్నాం. నాలుగు గంటలకే అలారం పెట్టుకుని లేచి, త్వరగా తయారయిపోయి, హోటలు కుర్రవాడు ఆటో తీసుకురాగా అయిదు గంటల ఐదు నిముషాలకల్లా స్టేషనుకు చేరాము. టికెట్టు పైనున్న వివరాలు.

| | |
|---|---|
| PNR నంబరు | **615-55714463** |
| ట్రైను నంబరు | 18416 'పూరీ–కెండుఝూఘర్ (KDJR) ఎక్స్ ప్రెస్. |
| ప్రయాణపు తేదీ | 28-3-2011 |
| నుంచి | పూరి |
| బయలుదేరే సమయం | గం. 06.00 లు. |
| కోచ్, సీట్ నంబరులు | సి-1; ఏసీ చైర్ కారు; 002, 003, 004, 005 |

సరియయిన రైలు ఎక్కటానికి బహుశా ఎవరికయినా ఈ కనీస వివరాలు చాలేమో! కానీ, మా విషయంలో మా వివేకం సరిపోలేదు. అసాధారణమైన తెలివితేటలూ, అత్యుత్తమ నైపుణ్యమూ, వ్యూహమూ అవసరమయ్యాయి. అవి మాకు లేకపోవటంతో ఎక్కవలసిన రైలు కళ్ళెదుటే వెళ్ళిపోతున్నా ఎక్కలేక పోయాము. ఎలా అంటే, స్టేషను చేరిన కొద్ది క్షణాలకు 18416 నంబరు 'పూరీ – కటక్ ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్' 4వ నంబరు ప్లాటుఫారం నుండి ఆరు గంటలకు బయలు దేరుతుందని ప్రకటన వెలువడింది. ట్రైను నంబరు సరిగ్గానే ఉంది కానీ, ట్రైను పేరు, దాని గమ్యస్థానం టికెట్లో పేర్కొనబడిన వాటికి పూర్తి భిన్నంగా ఉన్నాయి. సరే ట్రైను ప్లాటుఫారం మీదకు వచ్చాక చూద్దాములే అని వేచిచూస్తుండగా వెనుకకు దేకుతూ నెమ్మదిగా వచ్చింది. కానీ దాని మీద '18414 పూరీ-పరదీప్ ఎక్స్ ప్రెస్' అని ఉంది. ప్రకటన మాత్రం అదే 4వ నంబరు ప్లాటుఫారం నుండి ఆరు గంటలకు బయలుదేరే '18416 ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్' గురించే పునరావృతమవుతూ ఉంది. అప్పటికే ఆ ప్లాటుఫారం మీదున్న '18414 పూరీ-పరదీప్ ఎక్స్ ప్రెస్' ఊసే లేదు. కొంచెం సేపు అయోమయంలో ఉన్నాం. ఎక్కడో పొరపాటు

జరిగిందన్న భావన లీలగా కలుగుతున్నది. కానీ, ఎవరినయినా అడుగుదామా అంటే టికెటు మీద వివరాలు, అధికారిక ప్రకటన రైలు మీద బోర్డు, ఒకదానికొకటి అంత స్పష్టమైన విరుద్ధంగా ఉండగా ఎవరు మాత్రం మరో విధంగా ఏం చెపుతారు? మానవ సహజమైన అహం ఒకటి. పైగా 'చదువు'కున్న వాళ్ళమయ్యే! ఒకళ్ళు చెపితే ఎలా వింటాం? సరే, ఎప్పుడో వెళ్లియుండవలసియుండి, ఆలస్యం కారణంగా ఇప్పుడు ప్లాటుఫారం మీద ఉన్న ఆ 'పరదీప్ ఎక్స్ ప్రెస్' వెళ్ళగానే, మా బండీ ప్రకటన వెలువడు తుందేమోలే అని సర్దుకున్నాము.

ఆరూ ఇరవయికి మొత్తానికి ఇది బయలుదేరింది. దానితోపాటే, అప్పటివరకూ వస్తున్న మా బండీకి సంబంధించిన ప్రకటనల పరంపరా ఆగిపోయింది. తప్పుడు ప్రకటనతో మోసపోయామని నిర్ధారించుకున్నాను. విధులలో నున్న స్టేషను సూపరింటెండెంటు వద్దకు వెళ్లి టికెటు చూపిస్తూ –

"ఈ ట్రైను ఎప్పుడు వస్తుంది" అడిగాను.

చెప్పాడు.'వెళ్ళిపోయింది' అని. ఊహించిన సమాధానమే కనుక అనుమానమే నిజమయింది.

"అప్పటి వరకూ వచ్చిన ప్రకటనలు ఏ ట్రైనుకు సంబంధించినవి?" మళ్ళీ అడిగాను.

ఒక్క క్షణం నావైపు టికెటు వైపూ ఏదోలా చూసి "దీని మీద ఉన్న ట్రైనుకు సంబంధించినవే" అంటూ తలవంచుకుని ముఖం చిట్లించుకుని తన భాషలో ఏదో గోణుక్కోవడంలో అతనిలో ఆత్మరక్షణ ప్రక్రియ మొదలు అవుతున్నట్టు స్పష్టంగా తెలుస్తున్నది.

"మరి, ఆ ట్రైను మీదున్న నంబరు, గమ్యస్థానం ఏమిటి" అన్నాను. ఊహించని, తనవద్ద సమాధానంలేని ప్రశ్న కదా? హఠాత్తుగా స్వరం మారింది.

"ఈ వివరాలన్నీ ట్రైను బయలు దేరటానికి ముందు అడగాలి కదా!" అన్నాడు విసురుగా. తద్వారా, ఒక ప్లాటుఫారం నుండి బయలు దేరబోయే ట్రైను మీద నున్న వివరాలకు, అందుకు సంబంధించి వెలువడుతున్న ప్రకటనకు పొంతన లేదని అంగీకరించాడన్నమాటే కదా!

జరిగిన పొరపాటును గ్రహించి, మాకు కలిగిన అసౌకర్యానికి విచారం వెలిబుచ్చి, తప్పిపోయిన ప్రయాణానికి సానుభూతితో, ప్రత్యామ్నాయ సూచన చేస్తాడని ఆశించాను. అలా చేయకపోవటంతో అసలే ఆందోళనలోను, అవమానభారంలోనూ ఉన్న నాకు అతని నిర్లక్ష్య వైఖరి తీవ్ర అసంతృప్తి కలిగించింది.

"సరే! దయచేసి మీవద్దనున్న ఫిర్యాదుల పుస్తకం ఇవ్వగలరా?" అన్నాను. అప్పటివరకూ నిల్చోపెట్టే నేనడిగిన ప్రశ్నలకు నిర్లక్ష్యంగా సమాధానం. చెప్పినవానికి హఠాత్తుగా స్పృహ కలిగి కూర్చోమన్నాడు. కానీ ఆ పుస్తకం వెంటనే ఇవ్వలేదు. కొద్ది క్షణాలు మరేవో కాగితాలు సర్దుతున్నట్టు నటిస్తూ గడిపాడు. అప్పటికే జరిగిపోయిన నష్టాన్ని అంచనా వేసుకుని, ఇక జరగబోయే దానిని నివారించేందుకై యాతన, అది కనపడకుండా చేసే ప్రయత్నం ఫలించటం లేదు. అంతకు ముందున్న గాంభీర్యం సడలింది. అదే సమయంలో అక్కడకు వచ్చిన మరొక ఉద్యోగితో--

"ఈయన వెళ్ళిపోయిన 18416 ట్రైను గురించి ఫిర్యాదు చేయటానికి వచ్చారు"అన్నాడు.

ఆ చెప్పటంలో, తనకు సహాయపడమని వేడుకొలుకంటే అసలు విషయాన్ని చిన్నదిగా చూపే ప్రయత్నం చేస్తూ అందులో వ్యంగ్యం పాలు కొంచెం ఎక్కువ పోశాడు. అసలు విషయం అతనికేం తెలుసు? అయినా తక్షణమే రంగంలోకి దిగుతూ --

"మీరు సకాలంలో రాకపోతే బండీ మీ కోసం ఆగుతుందా? దీన్లో ఫిర్యాదు చేయటానికేముందీ"..." అంటూ కల్పించుకోబోయాడు.

అతని మాట ఇంకా పూర్తి కాలేదు. జరిగిన దాంట్లో పూర్తిగా దోషం నాదేనని నిర్ధారిస్తూ, నేను చేయబోయే ఫిర్యాదు ప్రయత్నం విరమించు కునేలా చేసి, తద్వారా తన సహచరుడిని రక్షించాలని అతని ఆలోచన నా గ్రాహక శక్తిని దాటలేదు. మరో విధంగా అతని లక్ష్యం సులభంగా నెరవేరి ఉండేదే . అయితే, విషయం తెలుసుకునే ప్రయత్నం చేయకుండా నింద నా మీద వేసే ప్రయత్నంలో అతను ఆ అవకాశం చేజార్చుకున్నాడు. ఎవరైనప్పటికీ, వెళ్లిపోయిన బండిని మా కోసం వెనుకకు తేలేరు కదా! అతనికి మళ్ళీ కథంతా వినిపించటం అనవసర చర్చకు, కాలయాపనకు తప్ప మరెందుకూ ఉపయోగపడదు.

"అలా జరగాల్సింది కాదు. అసౌకర్యానికి చింతిస్తున్నాం" అని కాని 'పోరపాటయింది' అని కానీ ఒక ముక్క అతని చేత చెప్పిస్తే సరిపోయేది కాదూ?

ఆ మాత్రం కూడా తెలివి లేని అతనితో "నీ పని చూసుకో" అన్నాను. అంతే! విషయం చేయి దాటి పోయిందని గ్రహించాడో ఏమో మాట పూర్తి చేయకుండానే తరువాతి ఘట్టానికి సాక్షిగా నిలిచాడు.

"నేను దేనికొరకు వేచియున్నానో అది మీరు ఇంకా ఇవ్వనే లేదు" అని గుర్తు చేశాను. ఈసారి కావాలనే స్వరంలో కాస్త కాఠిన్యం జోడించాను. ఇక

తప్పదనుకున్నాడో ఏమో వణుకుతున్న చేతులతో ఆ పుస్తకం అందించాడు. ఛడా మడా రాసి పారేశాను. ఇదిగో ఇలా –

Sir,

Sub: Misleading information about a certain train in Puri Station – Complaint - Regarding.

Ref: Circular Ticket No. 313309 dt. 05-01-2011 & 314314 dt. 07-01-2011 issued by the CRO, Secunderabad, South Central Railway.

--:o0o:--

I obtained the Circular Ticket for a four member Senior Citizen group under reference. The Tour went on well till yesterday. Now, we faced an ordeal in this Station. For this lap of journey, I bought an E - Ticket separately. The Particulars are –

| | | | |
|---|---|---|---|
| PNR No. | **615-55714463** | From | PURI |
| Train Name | **PURI–KDJR Express** | Date | 28-03-11 |
| Train No. | **18416** | Boarding Point | Puri |

Passenger details

| | Name | Age | Sex | Seat/Coach | | Status |
|---|---|---|---|---|---|---|
| 1 | K.TULASIDAS | 065 | Male | 0001 | Cl | CONFIRM |
| 2 | K.JAYALAKSHMI | 061 | Female | 0002 | C1 | CONFIRM |
| 3 | N.ACHYUTA RAO | 065 | Male | 0003 | C1 | CONFIRM |
| 4 | N.S.PRASUNA | 061 | Female | 0005 | C1 | CONFIRM |

We arrived at the Station at 05.05 Hrs. At that time, the Train Information Digital display Board and the Digital Voice Public Address system were announcing that Train No. 18416 Intercity Express would leave from Platform No. 4 at 06.00 Hrs.

As we were waiting, a few minutes before 06.00 Hrs, another train bearing No. **18414** with Destination Board '**Puri – Paradeep Express'** came on to the said Platform No. 4.

Except the train number '18416,' no other details such as the name of the Train or the destination, in the repeated Announcements, matched with those on the ticket or those the Train itself bore. There was hardly any mention about the '18414 Puri Paradeep Express' already holding the Platform No. 4. Eventually the said Train left around 06.20 Hrs. A few moments before the Train actually left too, the announcement was only about '**18416 Intercity Express'** and nothing about the one that was leaving! We were in utter confusion. In fact we were under the impression that once the one on the Platform leaves, the train we were awaiting would come on to the same Platform.

As ill-luck would have it, it did not happen. We soon realised that we were grossly misled by the improper, inaccurate and inadequate Train information and foolishly missed the Train proper. I promptly approached this officer (Station Superintendent on Duty) with a request to clarify the inconsistency between the 'Public Information' and the ground reality. He was rather recalcitrant to what had actually happened.

To my dismay, instead of looking into the veracity of my query and vouching for the 'information lapse' he resorted to cross fire holding me responsible for not approaching him well before the train in question factually departed. Such attitude of a responsible official discharging the crucial Train Operating Duties is unwarranted and uncalled for. It, however, established two things for certain--

- To his knowledge, the information given on the Digital Display Boards and in the Digital Voice Public Address System was not reliant worthy and that

- Sensible passengers instead of merely relying on such dubious information shall check its precision with the Station Superintendent personally!

That being the case, he is fit to be proceeded against with, for

- Being negligent in his legitimate duties
- Callous, irresponsible, indifferent and for being uncharitable to a group of Senior Citizens, especially when they were in lurch.

I request you to kindly order an enquiry into the matter. I shall deem my grievance stands redressed and adequately compensated from the inconvenience caused, only on being informed of the action taken against this Station Superintendent.

■ K.Tulasidas

తను సంతకం పెట్టి ఇవ్వగా దీని ప్రతి నొకదానిని తీసుకుని దగ్గరుంచుకున్నాను. నిర్ధారించబడిన ఎక్స్ ప్రెస్ ఏసీ తరగతి టికెట్లు ఉంచుకుని కూడా, సాధారణ బోగీలో ఒకరి నెత్తిన మరోరిని కూర్చోపెట్టుకుని ఎనిమిది గంటలకు బయలుదేరిన పాసింజరు రైలులో పదిన్నరకు భువనేశ్వరు చేరాము. ఆ సరికి భువనేశ్వరులో సగం పర్యటన పూర్తయి ఉండేది. ఆనవాయితీగా సామాను క్లోకు రూములో భద్రపరచి, స్టేషను బయటికి వచ్చాము.

**భువనేశ్వరులో**

అన్ని రైల్వే స్టేషనులలో మాదిరిగానే ఆటోవాళ్ళు చుట్టు ముట్టారు. కొద్ది సేపు వారిని నిగ్రహించి, అందులో కాస్త మర్యాదస్తుడిగా నున్న యువకుడిని దగ్గరకు పిలిచి మా అవసరాన్ని తెలియజేశాము. తిరిగి స్టేషనుకు చేరే ముందు దక్షిణ భారత భోజనం చేయవలసి ఉంటుందని, అది ఎక్కడుంటుందో, ఎంత దూరమో, అది కూడా దృష్టిలో ఉంచుకుని, రూటు, సమయం నిర్ణయించుకుని మరీ ఎంత ఇవ్వమంటాడో చెప్పమని అడిగాను.

పనిదినం కనుక సోమవారం ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా అందుబాటులో ఉన్న సమయంలో కేవలం లింగరాజ్, కేదారగౌరీ దేవాలయాలు సాధ్యపడతాయనీ, భోజనం చేసి తిరిగి స్టేషనుకు రావటానికి మాత్రమే సమయం సరిపోతుందనీ, మూడు వందలు ఇమ్మనీ అడిగాడు. అంగీకరించి, వెంటనే బయలుదేరి ముందుగా లింగరాజ్ దేవాలయానికి వెళ్ళాము.

క్రీస్తు శకం పదకొండవ శతాబ్దానికి చెందిన ఈ దేవాలయం కోరార్కు

(13వ శతాబ్దం) కంటే కూడా పురాతనమయినది. నూట ఎనభయి అడుగుల ఎత్తున్న గోపురం. దూరం నుంచి చూడవలసినదే తప్ప, ప్రాంగణం నుంచి చూడలేము. కాళ్ళు కడుక్కొని గర్భాలయంలోకి ప్రవేశించాము. అసలు రద్దీయే లేదు. ఇక్కడ స్వామి, లింగరూపంలో నున్న హరిహరుడు. అమ్మవారు భువనేశ్వరీదేవి. ఈ అమ్మవారి పేరుమీదనే బహుశా ఆ పట్టణానికి 'భువనేశ్వర్' అని పేరు వచ్చిందేమో! దేవాలయ స్థలపురాణంలోకానీ, నగర చరిత్రకు సంబంధించిన సాహిత్యంలో గానీ ఈ విషయం విశేషంగా పేర్కొనబడినట్లు నాకెక్కడా కనిపించలేదు. అయినా అలా భావించటం ఉచితమే.

అలంకృతమైనున్న ఆమ్మవారు ప్రసన్న వీక్షణాలతో దర్శన మిచ్చింది. మేము, వేరే రాష్ట్రానికి చెందినవారుగా గుర్తించాడు కాబోలు, పూజారి స్వచ్ఛందగా ముందుకు పిలిచి, నామ గోత్రాలతో లఘు పూజ చేసి, మంత్ర పుష్పం, తీర్థం, ప్రసాదం ఇచ్చాడు. ఇంత సంతృప్తిని మిగిల్చిన దర్శనం ఈ యాత్రలో మరే దేవాలయంలోనూ లభించలేదు.

అక్కడనుంచి, కేదారగౌరీ దేవాలయానికి వెళ్ళాము. పేరును బట్టి అమ్మవారి పేరు 'కేదారగౌరీ' యని భావించాము. కానీ, కేదారేశ్వరునికీ, గౌరీదేవికీ మందిరాలు విడివిడిగా ఉన్నాయి. ఇది కూడా పురాతన మైనదే కానీ, పునరుద్ధరణకు నోచుకున్నది

కాబోలు ఆధునికంగా ఉంది. ఇక్కడ కూడా రద్దీ లేకపోవటంతో విశ్రాంతిగానూ, సంతృప్తిగానూ దర్శనం చేసుకున్నాము. ఆ ప్రక్కనే, ఒక సుందరమైన పూదోట మధ్యస్థంగా మరి మూడు పురాతన శివాలయాల సముదాయం ఉంది. నోటు పుస్తకం ఆటోలోని సంచీలో ఉండిపోవటం వల్ల ఈ దేవాలయ వివరాలు వ్రాసుకోవటానికి వీలుకాలేదు. తీరా ఇప్పుడు అవి గుర్తు లేవు.

అప్పటికి సమయం పన్నెండు గంటలవుతోంది. పర్యటనను అంతటితో ముగించి 'ఖరావేల్ నగర్' అనే ప్రాంతంలో 'రాఘవాస్' రెస్టారెంటుకు తీసుకువెళ్ళాడు. పెద్ద ప్రసిద్ధిగలదేమీ కాదు. భోజనం ఫరవాలేదు. ఒంటిగంటకు స్టేషనుకు తిరిగి చేరుకున్నాము. ఉదయపు పోర్టరులు క్లోకురూము వద్ద సిద్ధంగా ఉన్నారు. సామాను విడిపించుకుని రైలు రావలసిన ప్లాటుఫారం మీదకు చేరుకున్నాము. గంట ఆలస్యంగా వచ్చిన ట్రైనులో ఎక్కి గృహోన్ముఖులైనాము.

రాత్రి పదిన్నరకు విశాఖపట్నం చేరింది. దేవేరులిద్దరూ భోజనం అవసరం లేదన్నారు. నేను మా బావమరిదిగారు వడలు తిని కాఫీ త్రాగాము. తెల్లవారు ఝామున నాలుగు గంటలకు వారివురూ విజయవాడలో దిగిపోయి, ట్రైను తిరిగి బయలు దేరేవరకూ ఉండి మాకు వీడ్కోలు చెప్పారు. మరునాడు

ఉదయం తొమ్మిదిన్నరకు సకాలంలోనే సికిందరాబాదు చేరగా మేమూ స్వగృహానికి క్షేమంగా చేరాము.

ఇంటికి చేరగానే, యాత్ర మిగిల్చిన బడలికను లెక్క చేయక, సామాను సయితం సర్దకుండా, పూరీ స్టేషనులో చేసిన ఫిర్యాదును పునరుద్ఘాటిస్తూ, దానిపై చర్యకు నా పట్టుదలను తెలియజేస్తూ మెయిల్ ఇచ్చి, స్టేషనులో చేతితో వ్రాసిన ఆ ఫిర్యాదు ప్రింటెడ్ కాపీని ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజరుకు రిజిస్టరు పోస్టు చేసాను. పది రోజులు కూడా తిరక్కుండా వారి నుంచి వచ్చిన సమాధానం.

Dear Sir,

Sub: Complaint regarding wrong announcement and information at Puri Station resulting missing of train No.18416.

--*--

The receipt of your complaint dated 28-03-2011 is acknowledged with thanks. This is to inform that your valued complaint has been seriously taken note of and it is stated that train No.18416 Puri – Nayagarh and train No. 18414 Puri – Paradip Express trains run combinedly upto Cuttack and accordingly frequent announcement is being done through Public Address System. However, staff have been strictly instructed to make proper and more effective announcement.

We deeply regret the inconvenience caused to your goodself.

Yours faithfully
Sr.Divl.Commercial Manager,
Khurda Road

**EAST COAST RAILWAY**

**KHURDA ROAD DIVISION**

Office of the
Sr. Divl. Commercial Manager,
Khurda Road.
Dated : 04.04.2011.

No.SDCM/PG/PUI/91/03/2011 /1397

To

Sri K. Tulasi Das,
Sector -5, B – 847 NGOs Colony,
Vanastalipuram,
Hyderabad.

Dear Sir,

Sub: Complaint regarding wrong announcement and information at Puri station resulting missing of train No.18416.

* * *

The receipt of your complaint dated 28.03.2011 is acknowledged with thanks. This is to inform you that your valued complaint has been seriously taken note of and it is stated that train No.18416 Puri – Nayagarh and train No.18414 Puri – Paradip Express trains run combinedly upto Cuttack and accordingly frequent announcement is being done through Public Address System. However, staff have been strictly instructed to make proper and more effective announcement.

We deeply regret the inconvenience caused to your goodself.

Yours faithfully,

Sr. Divl. Commercial Manager,
Khurda Road.

पि.के. बाला
P. K. Bala
सहायक वाणिज्यक प्रबन्धक
Asst. Comml. Manager
पूर्व तट रेलवे, खोरधा रोड
E.Co.Rly./Khurda Road

**బడ్జెట్ అంచనాలు ఖర్చులు**

(మొత్తం నలుగురు సభ్యుల బృందానికి)

| పద్దువివరము | అంచనా | యదార్ధ ఖర్చు | వ్యత్యాసం |
|---|---|---|---|
| 1. రైలు టికెట్లు | 3,500 | 3,500 | -- |
| 2.హోటళ్ళు, గెస్ట్ హౌసులు | 7,000 | 6,000 | -1,000 |
| 3. వాహనాలు | 5,000 | 4,700 | - 300 |
| 4.పోర్టర్లు | 2,000 | 3,100 | +1,100 |
| 5. ఆహార పానీయాలు | 3,000 | 1,400 | -1,600 |
| 6.ఆకస్మిక ఖర్చులు | 2,500 | 1,100 | -1,400 |
| **7. మొత్తం** | *** 23,000** | **19,800** | **-3,200** |

1. సాంప్రదాయ ఔచిత్యాన్ని పాటిస్తూ పూజారులకు దేవస్థానాలకు చెల్లించినవీ, పూజారులకు ఇచ్చిన దక్షిణలు అంచనాలో వేయలేదు. అలాగే యదార్ధ ఖర్చులో కూడా చేర్చలేదు.

2. అలాగే శ్రీ అచ్యుతరావు గారు మొత్తం పన్నెండు రోజులకు మంచినీరు, కాఫీ, టీ, పానీయాలకు ఒక్కరే ఖర్చు చేశారు ఆ వివరాలు వారు తెలియజేయటానికి ఇష్టపడలేదు కనుక ఆ మొత్తం అదనం.

# ఏడవ అధ్యాయం

***యందాకినీ శకినీ కాసమాజై నిషేవ్యమాణం పిశితా శనైశ్చ***

***సదైవ భీమాది ఏద ప్రసిద్ధం తం శంకరం భక్తిహీనం నమామి***



భీమాశంకరం

రెండు ప్రయత్నాలు విఫలమయ్యాక మొత్తానికి ఆ సర్వేశ్వరుని దయవల్ల మూడవ ప్రయత్నంలో మిగిలిన మూడు జ్యోతిర్లింగాల యాత్ర 2012 జనవరిలో సాధ్యపడింది. జనవరి 7వ తేదీన మధ్యాహ్నం గం.2.50 ని.లకు సికిందరాబాదు నుంచి రాజ్కోట్ ఎక్స్ ప్రెసులో బయలు దేరి అర్ధరాత్రి దాటాక తెల్లవారు ఝామున గం.2.20 ని.లకు పూనా స్టేషనులో దిగాము. అప్పటికే ధరించి ఉన్న ఉన్ని దుస్తులు చలికి తగినంత రక్షణ ఇవ్వలేదు. ముందుగా సేకరించిన సమాచారం ప్రకారం భీమశంకర క్షేత్రాన్ని చేరుకోవటానికి ఉదయం గం.5.30 ని.లకు మొదటి బస్సు బయలుదేరుతుంది. ప్రధాన బస్సు స్టాండు పూనా రైల్వే స్టేషను నుండి సుమారు మూడున్నర కిలోమీటర్లు. ఆటో ఎక్కితే

పావుగంటలో చేరుకోవచ్చు. ఇంకా మూడు గంటల సమయం గడపవలసి ఉంది.

అంతసేపు అక్కడ గడపటంకంటే కొంత సేపు రైల్వే స్టేషనులో గడుపుదామని ఒక వారగా న్యూసుపేపరు పరుచుకుని గంటసేపు కూర్చున్నాము. స్టేషనులోని కృష్ణ రెస్టారెంటులో కాఫీ సేవించి, ఎనభై రూపాయలకు ఆటో మాట్లాడుకుని సుమారు నాలుగు గంటలకు శివాజీనగర్ బస్సు స్టాండుకు చేరాము. తీరా అక్కడకు వెళ్ళాక రైల్వే స్టేషనే నయమనిపించింది. అక్కడ కూర్చోవటానికి నేల మీదనయినా స్థలం లభించింది. ఇక్కడ నిల్చోటానికి కూడా స్థలం లేదు. అరగంట పాటు నిల్చోగా ఇతర ప్రాంతాలకు వెళ్ళే బస్సులు కొన్ని వెంట వెంటనే రావటంతో రెండు కుర్చీలు ఖాళీ అయ్యాయి. అమ్మయ్య అనుకుంటూ వాటిలో కూలబడ్డాం.

అయిదు గంటలవుతుండగా భీమాశంకర్ అనే బోర్డున్న బస్సు వచ్చి మాకు ఎదురుగా ఆగింది. మొదటి బస్సు కదా కొంచెం రద్దీగానే ఉన్నప్పటికీ పెద్ద తోపులాట లేకుండానే ఎక్కగలిగాము. సీట్లు కూడా దొరికాయి. గం.5.20 ని.లకు బయలుదేరింది. ప్రయాణ సమయం నాలుగున్నర గంటలని చెప్పాడు. అప్పుడు మేమున్న స్థితికి సుదీర్ఘ మైనదనే చెప్పాలి. అలాగే ఒక కునుకు లాగించాము. గత రాత్రి కాలాతీతమైన భోజనం, నిద్రలేమి, పైగా ఘాటు రోడ్డు ప్రయాణం అన్నీ ఒకదానికొకటి తోడై జయలక్ష్మికి వాంతులు కలిగించాయి. తొమ్మిది గంటల పదిహేను నిముషాలకు నిర్మానుష్యమైన అత్యంత అపరిశుభ్ర మైన ఒక ఖాళీ స్థలంలో బస్సు ఆగింది. "ఇదే భీమాశంకరం. దిగండి" అన్నాడు కండక్టరు మహాశయుడు. దిగి పరిసరాలు చూడగానే నా ఒళ్ళు మండిపోయింది. కారణం సుస్పష్టం.

పది సంవత్సరాల క్రితం ఈ క్షేత్రాన్ని దర్శించినవారు అప్పుడు ఎలా ఉందని చెప్పారో ఇప్పుడు కూడా అలానే ఉంది. నిజానికి ఇన్ని యాత్రలకు ప్రణాళికలు రచించిన నా అనుభవంలో ఈ ఒక్క క్షేత్రానికి చేసిన కసరత్తు మరే యాత్ర మొత్తానికీ కూడా చేయలేదు. యాత్రికులకు, అక్కడి పూజారులు వసతి సౌకర్యం కలుగజేస్తారనీ ఒక కొత్త ధర్మశాల నిర్మాణంలో ఉన్నదనీ సాక్షాత్తూ దేవస్థానం వెబ్ సైటులోనే ఉన్నది. అదే వెబ్ సైటులో గణేష్ అనే వ్యక్తీ వివరాలు లభించగా యాత్రకు బయలుదేరే నాలుగు రోజుల ముందు అతనిని మెయిలు ద్వారా సంప్రదించాను. వెంటనే సమాధానం ఇచ్చాడు. అందులో పూజా వివరాలు, అక్కడ నుండి నాశిక్ వెళ్ళటానికి ఉన్న ప్రయాణ సదుపాయాల వివరాలు మాత్రమే ఇచ్చాడు కానీ ప్రధానమైన వసతి గురించి ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదు. మరింత సమాచారం అవసరమైతే తాను అందుబాటులోనే ఉంటానని ఫోను నంబరు ఇచ్చాడు. వెంటనే ఫోను చేశాను. తీయలేదు. మళ్ళీ మెయిలిచ్చాను. సమాధానం లేదు. ఇతర వెబ్ సైటుల్లో సయితం స్థానికంగానూ, చుట్టుప్రక్కల గ్రామాలలోనూ లాడ్జీలు ఉన్నాయని కొందరు మహానుభావులు వ్రాశారు. పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. వారి అనుభవమేమిటో ఆ భీమశంకరునికే తెలియాలి. ఈ సమాచారం ఆధారంగా పూర్తి స్థాయి హోటళ్లు కాకపోయినా కాలకృత్యాలు తీర్చుకుని, స్నానాలు చేసి సామాను భద్రపరుచుకొనటానికి అనువైన లాడ్జీలయినా ఉండక పోతాయా అనే నా అంచనా ఘోరంగా తప్పింది. అందుకే నా మీద నాకే కోపం వచ్చింది.

ఫర్లాంగుకు మించని ఒక రోడ్డు. ఇరువైపులా వివిధ దుకాణాలు, టీ స్టాళ్లు. ఇదే ప్రసిద్ధ భీమశంకర జ్యోతిర్లింగక్షేత్ర ముఖచిత్రం. ఒక ట్రాలీ సూటు కేసు, ఒకటి చిన్నది మరోకటి పెద్దది, రెండు సంచులు. ఇదీ నా లగేజి. ఓపిక

చూస్తేనా అంతంత మాత్రం. పూర్తిగా అలసిపోయి నీరసించిఉన్న శ్రీమతి. ఎక్కడకు పోవాలి? ఎక్కడ ఉండాలి? సరయిన సమాచారం ఇచ్చే దిక్కు కూడా లేదాయే. ఒళ్ళు మండదా మరి!

ముందుగా కాస్త టీ తాగి అలాగే నడుచుకుంటూ దేవస్థానంకు వెళ్ళే మెట్ల దారిలో ఒక గట్టు మీద సామానుతో ఆమెను కూర్చోబెట్టి దేవాలయం వెదుక్కుంటూ వెళ్లాను. దేవస్థానంకు సంబంధించి ఏ వసతులూ లేవనే చెప్పారు. స్నానం చేయాలంటే అక్కడ ఉన్న భీమకుండం (పుష్కరిణి) లో చేయవచ్చని చెప్పారు. అది అయ్యేపని కాదని, మళ్ళీ అన్ని మెట్లూ ఎక్కి వెనక్కు వచ్చి అక్కడ దుకాణాలలో మరింత లోతుగా విచారణ చేయగా 'ధర్మశాల' అని పేరు తగిలించుకున్నపురాతనమైన ఒక ఇంటిని చూపారు. అందులోకి వెళ్లాను. విశాలమైన గది. అందులోనే ఒక మూల స్నానం చేయటానికి చుట్టూ గట్టుతో ఒక చప్టా. చుట్టుప్రక్కల ఉన్న సువిశాలమైన వ్యవసాయ క్షేత్రాలే ప్రకృతిసిద్ధమైన బహిర్భూమి. స్నానాలు చేసి దర్శనం చేసుకుని తిరిగి వచ్చేవరకూ సామాను భద్రపరచటానికి అద్దె వంద రూపాయలు. స్నానానికి చెరో బకేటూ వేడి నీరు మరో ఇరవై రూపాయలు. ఇదీ ఒప్పందం.ఆ స్థితిలో మా పాలిట అదే స్టారు హోటలు. సరేనని ఒప్పుకున్నాము. స్నానాలు ముగిసాక స్వామివారికి అభిషేకంచేసే ఉద్దేశంతో పట్టు ధోవతి తీసుకుని ఆలయానికి వెళ్ళాము.

## భీమాశంకర్

సహ్యాద్రి పర్వత శ్రేణిలో ప్రశాంతమైన ప్రకృతి ఒడిలో ఒదిగిన సుందరమైన ఆలయం భీమాశంకర జ్యోతిర్లింగక్షేత్రం. సాధారణంగా ఇటువంటి ప్రసిద్ధమైన పురాతన దేవాలయాలు ఏ కొండపైనో ఎంతో కొంత ఎత్తు ఎక్కవలసి ఉంటాయి. ఈ భీమాశంకరుడు అందుకు వ్యతిరేకం.

బస్సు దిగిన ప్రదేశంనుండి ఒక లోయ అంచున సుమారు నూట యాభై అడుగుల దిగువన ఉంటుంది. అయితే రెండు వైపులా గోడలతో పరిశుభ్రంగా తీర్చి దిద్దబడిన అంద మైన మెట్లబాట ఉన్నది. ప్రతి నాలుగైదు మెట్లకూ మధ్యన సమతలమైన చప్టా లాంటి ప్రదేశంతో సహా మొత్తం 220 మెట్లున్నాయి. ఆరోగ్య వంతులు పెద్ద శ్రమపడకుండానే నడవవచ్చు. అశక్తులకు ఇద్దరు వ్యక్తులు మోసే కుర్చీ డోలీలున్నాయి. మాకు వాటి అవసరం కలుగలేదు.

పదకొండు గంటలకు దేవాలయం చేరుకున్నాము. ఒక్క ఆదివారం మినహా మరో ప్రత్యేకత లేని రోజవటంతో రద్దీ సామాన్యంగానే ఉంది. ప్రధాన పూజారి శ్రీ అరుణ్ గవాండే గారిని కలిశాము. మునుపు నేను మెయిలులో సంప్రదించిన శ్రీ గణేష్ గారికి వీరు తండ్రి. రుద్రాభిషేకానికి 551 రూపాయలు, పూజా సామాగ్రికి మరో ఇరవై మొత్తం 571 రూపాయలు చెల్లించి రసీదు తీసుకుని పూజా సామగ్రితో గర్భాలయ ప్రవేశం చేశాము. పానుమట్టంతో సహా లింగంపై వెండి తొడుగు ఉన్నది. దానిపైనే పంచామృతాలతో అభిషేకం చేయించారు. అనంతరం స్వామివారిని అలంకరించి అర్చన చేయించారు. ఆ ప్రక్కనే స్వామివారి దేవేరి పార్వతీ దేవిని కూడా పూజించాము. ఈ కార్యక్రమమంతా అరగంటలో పూర్తయింది.

స్వామివారి నిజదర్శనం చేసుకోవాలని ఉత్సాహ పడ్డది జయలక్ష్మి. కానీ ఆ వెండి తొడుగును స్వామివారికి మహానివేదన సమయంలో మాత్రమే

తొలగిస్తారట. అంతవరకూ వేచి ఉండవలసినదేనన్నారు. వచ్చిన ముఖ్యమైన పని పూర్తయింది. పైగా సాయంత్రానికి నాశిక్ చేరుకోవాలంటే సత్వరమే బయలుదేరవలసిన అవసరం ఉండటంతో అంత సమయం వెచ్చించలేక

పోయాము. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి "పునః దర్శన ప్రాప్తిరస్తు" అని పూజారుల ఆశీస్సులు పొందాము. మండపానికి అభిముఖంగా ఉన్న శనేశ్వరుని తైలంతో అభిషేకించి ఆ ప్రాంగణంలో మరికొంత సేపు గడిపి ఫోటోలు తీసుకుని మెట్లెక్కి యథాపూర్వ ప్రదేశానికి చేరాం. పార్వతి అమ్మవారు 'కమలజ' పేరుతో మరో ఆలయంలో ఇక్కడ కొలువై ఉన్నది. సంతృప్తి కరమైన ఈ అమ్మవారి దర్శనం కూడా ప్రాప్తించింది.

సత్రం గదిలోనుంచిన సామాను తీసుకుని మళ్ళీ ఒక టీ త్రాగి పన్నెండు గంటలకు ఉదయం బస్సు దిగిన చోటికి చేరాము. ఇక్కడనుండి నాశిక్ వెళ్ళటానికి నేరుగా బస్సులు లేవు. తక్షణమే బయలుదేరటానికి సిద్ధంగా ఉన్న బస్సెక్కి రెండు గంటలు ప్రయాణించి అరవై కిలోమీటర్ల దూరంలో పూనా నాశిక్ జాతీయ రహదారిపైనున్న 'మంచార్' అనే చిన్న పట్టణంలో దిగాము. బస్సుస్టాండు సమీపంలో కాస్త పరిశుభ్రంగా ఉన్న హోటలు చూసుకుని భోజనం చేసేటప్పటికి సమయం మూడు గంటలయింది. గంటసేపు నిరీక్షించినా నాశిక్ వెళ్ళే బస్సు ఒక్కటీ రాలేదు. సూర్యాస్తమయం సమీపించేకొద్దీ చలి తీవ్రత హెచ్చుతోంది. నాశిక్ చేరటానికి ప్రయాణం మరో నాలుగు గంటలు. సాధ్యమైనంత త్వరగా అక్కడకు చేరితే కదా తగినంత విశ్రాంతి లభించి మరునాటి కార్యక్రమం సుఖంగా సాగేది!

బస్సు స్టాండులోని సమాచార కేంద్రానికి వెళ్లాను. ముగ్గురు నలుగురు సిబ్బంది విధుల నిర్వహణను ఆస్వాదిస్తున్నారు కాబోలు, విలాసంగా కూర్చుని కులాసాగా పెద్దగా కబుర్లు చెప్పుకుంటున్నారు. ఎలాగో వారి సావధానాన్ని రాబట్టి "నాశిక్ వెళ్ళే బస్సుల గురించిన సరయిన సమాచారం ఎక్కడ లభిస్తుంది" అని, ఏ విధమైన యాస, ఉచ్చారణ, వ్యాకరణదోషాలు లేని స్వచ్ఛమైన హిందీలో అడిగాను. అడిగిన తీరులో నేను ప్రదర్శించిన హావభావాలకు అందరూ మరింత సావధానమయ్యారు. వారిలో ఒకరు అంతకు ముందు నేను వెళ్ళవలసిన బస్సుల గురించి ప్రాథమిక సమాచారం ఇచ్చినతను "మీరింకా ఇక్కడే ఉన్నారా" అన్నాడు. అది నేను అడిగిన దానికి సమాదానమో, ఎదురు ప్రశ్నో అర్థం కాలేదు. ఏమయినా ఆ ప్రశ్నాపూర్వక సమాధానంలో అప్పటికే నేను ఎన్నో బస్సులు వదులు కున్నాననే భావం స్ఫురించగా "అదేమిటి! మీరు చెప్పిన ప్రదేశంలోనే కదా ఇంతవరకూ నేనున్నాను? ఒక్క బస్సు కూడా రాలేదు. పైగా కేవలం బస్సులపై ఉన్న గమ్యస్థానం బోర్డులపై ఆధారపడకుండా వచ్చిన ప్రతి బస్సు డ్రైవరునూ అడుగుతూ కూడా ఉన్నానే! మీరు అలా అంటారేమిటి. మరి వెళ్ళిన బస్సులన్నీ ఎటునుంచి వెళ్ళినట్లు? మీ వద్ద సమాచారం లేకపోతే అదే చెప్పండి. అది తెలిసిన మీ పై అధికారులనయినా అడుగుతాను కదా. అంతేకాని ఇలా ప్రయాణీకులను తప్పుత్రోవ పట్టించే సమాచారం ఇస్తే ఎలా!" అని కాస్తంత హెచ్చరిక స్వరంతో గట్టిగా అడిగాను.

నా మాటల్లో ధ్వనింపజేసిన భావాన్ని అతను సరిగ్గా గ్రహించాడు. నాకు సహాయపడాలని నిర్ణయించుకుని గదిలోనుంచి బయటకు వచ్చి నచ్చచెపుతున్న ధోరణిలో "పూనా నుంచి నాశిక్ వెళ్ళే బస్సులు తక్కువ సంఖ్యలో ఉంటాయి సార్. ఉన్నా ఆ ఒకటీ రెండూ కూడా ఏ కారణం చేతనో

వచ్చినట్లు లేవు. ఒక వేళ ఏ క్షణంలోనయినా వచ్చినప్పటికీ, ఇక్కడ దిగే వారికంటే ఎక్కేవారు ఎక్కువ మంది ఉంటారు. కనుక మీరు ఎక్కలేరు. ఎక్కగలిగినా సీటు లభించదు. అందుచేత ఇక్కడకు పన్నెండు కిలోమీటర్ల దూరంలో నున్న 'నారాయణ్ గామ్' వెళ్ళండి. అక్కడనుండి బస్సులు చాలినంత సంఖ్యలో ఉంటాయి'. అన్నాడు. ఈ సమాచారం ముందే ఇవ్వనందుకు అతనిని నిందించేకన్నా ఇప్పటికైనా ఏదో మార్గం చూపాడు కదా అని మనసులో సంతోషిస్తూనే మరి అక్కడకు వెళ్ళే బస్సు ఎక్కడ ఆగుతుందో అదయినా సరిగ్గా చెప్పండి అన్నాను. చూపిస్తాను రండి అంటూ పూనా నుంచి వచ్చి బయలుదేరటానికి సిద్ధంగా ఉన్న షిరిడీ వెళ్ళే బస్సొకటి చూపించగా దానిలో ఎక్కాము. అరగంట, ఆసాంతమూ నిల్చోనే ప్రయాణించి నాలుగున్నరకు 'నారాయణ్ గామ్' లో దిగాము.

నాశిక్ వెళ్ళే బస్సులు వెంట వెంటనే వస్తూనే ఉన్నాయి. కానీ మేము లగేజీతో ఎక్కలేనంత రద్దీగా ఉంటున్నాయి. బస్సు ఆగీ ఆగక మునుపే పరిగెత్తుకుంటూనూ, ఒకరినొకరు త్రోసుకుంటునూ ఎక్కుతున్నారు. ఆ విన్యాసాలు మావల్లేమవుతాయి! బస్సు బస్సుకీ రద్దీ పెరుగుతున్నదే కానీ తగ్గే సూచనలే లేవు. ఈమె చూస్తేనా బల్ల మీదే నడుము వాల్చేసింది. ఆ పరిస్థితి చూడగా త్రోపులాటలో బస్సెక్కటం మాట అటుంచి అసలు ప్రయాణం చేయగలదా అనిపించింది. పోనీ డబ్బులు అయితే అయినాయి, సుఖానికి మించిన దేముంటుంది ఏదయినా టాక్సీలో పోదామా అని ఆ ప్రయత్నమూ చేశాను. ఒరరిద్దరు ట్రావెల్సు వారిని అడిగాను. రేటు సంగతి అటుంచి ఆసలు రావటానికే ఎవరూ కనీస ఆసక్తి కూడా చూపలేదు. ఇక మరో ప్రత్యామ్నాయం - ఆ రాత్రికి అక్కడే ఉండిపోయి మరునాడు ప్రొద్దునే లేచి స్నానాలుచేసి సాధ్యమైనంత త్వరగా బయలుదేరటం. ఇది ఒక మోస్తరు

పట్టణమే. బస్సు స్టాండు చుట్టుప్రక్కల రెండు మూడు లాడ్జీలు ఉన్నాయి. ఒకదానిలో సంప్రదించి గదుల లభ్యతను నిర్ధారించుకుని ప్రతిపాదనను జయలక్ష్మి ముందుంచాను.

నాశిక్ లో త్ర్యంబకేశ్వరుని దర్శనం తప్ప మరే సందర్శనకానీ పర్యటనకానీ లేదు. అక్కడనుండి ఔరంగాబాదు వెళ్ళటానికి సాయంత్రం అయిదు గంటలకుగదా ట్రైను. అప్పటివరకూ ఈ లగేజీతో ఎక్కడ ఉంటాం? అక్కడయినా మళ్ళీ రూము తీసుకోవలసినదే కదా! అన్నది. అది కూడా నిజమే! మరి ఇపుడేంచేద్దాం. అన్నాను. ఆ భీమశంకరుని మీద భారం వేద్దాం. ఎంత రాత్రయినా నాశిక్ చేరుకుంటే చాలు అన్నది. భగవంతుని పట్ల ఆమె విశ్వాసాన్ని, మరింత శ్రమకోర్చుకోవటానికి ఆమె సంసిద్ధతను అభినందిస్తూ, సరేనంటూ కూర్చోబోతున్నానో లేదో నాశిక్ అని కన్నడంలో వ్రాసి ఉన్న బోర్డుతో కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సొకటి వచ్చి ఆగింది. ఆశ్చర్యకరంగా ముగ్గురు నలుగురు దిగేవారే కానీ ఎక్కేవారెవరూ కనబడలేదు. ఒకవేళ అది నాసిక్ నుంచి వస్తున్నదేమోనని సందేహం కలిగి కండక్టరును అడిగాను. నాశిక్ వెళుతున్నదనే చెప్పాడు. వెంటనే ఎక్కేశాం. బస్సు ముందు భాగంలో సౌకర్యవంతమైన సీట్లు కూడా లభించాయి. ఆరు గంటలకు బస్సు బయలుదేరింది.

మార్గ మధ్యంలో 'సంగమనేర్' అనే పట్టణంలో కాఫీ త్రాగాము. తిరిగి బయలు దేరాక నాశిక్ కు చెందిన ఒక యువ అడ్వొకేటు పరిచయమయ్యాడు. పరస్పరం ఆసక్తి ఉన్న న్యాయ సంబంధ విషయాలు, రాజకీయాలపై అతనితో కబుర్లలో పడ్డాను. రాత్రి పది గంటలకు నాశిక్ లోని కొత్త బస్సు స్టాండులో దిగాము. స్థానికుడు కనుక ఆ అడ్వొకేటు మిత్రుని సూచన మేరకు బస్సుస్టాండు భవన సముదాయంలోనే ఉన్న 'సహ్యాద్రి' హోటలులో రూము

తీసుకున్నాము. ఆ హోటలు క్రిందనే బస్సు స్టాండు ప్రాంగణంలో ఒక రెస్టారెంటు ఉన్నది. హోటలు కుర్రవానిచేత పరాటాలు రూముకు తెప్పించుకుని భుజించి హాయిగా విశ్రమించాము.

*సహ్యాద్రి శీర్షే విమలే వసంతం గోదావరీ తీర పవిత్ర దేశే*

*యద్దర్శనాత్పాతక మాశునాశం ప్రయాతి తం త్ర్యంబక మీశ మీడే.*

త్ర్యంబకం

రాజధాని ముంబై తరువాత మహారాష్ట్రలో ఎన్నదగిన పెద్ద నగరాలలో నాశిక్ ప్రధానమైనది. జిల్లా కేంద్రం. అనేక పరిశ్రమలు, కంటోన్మెంటు, కేంద్ర ప్రభుత సెక్యూరిటీ (దస్తావేజు స్టాంపు పేపర్లు ముద్రించే) ముద్రణాలయం మొదలైన ప్రముఖ సంస్థలనేకం ఉన్నాయి. ఇక్కడినుంచి త్ర్యంబకం ముప్పై కిలోమీటర్లు. గంట ప్రయాణం. మేము బసచేసిన హోటలు ఉన్న బస్సు స్టాండుకు మరో వైపున ఉన్న పాత బస్సు స్టాండు నుంచి బస్సులు బయలుదేరుతాయి.

ఉదయం తొమ్మిది గంటలకు త్ర్యంబకం చేరాము. కొన్ని కారణాలవల్ల ఈ జ్యోతిర్లింగం అరుగుదలకు గురిఅవుతున్నదట. అందువలన భక్తులు స్వయంగా తాకి అభిషేకించటాలు నిషేధింపబడ్డాయి. వారణాసి, బైద్యనాద్ వంటి చోట్ల లఘున్యాసం మొదలైనవి దేవాలయ ప్రాంగణంలో మరో చోట చేయించినా అభిషేకం మాత్రం లింగానికి స్వయంగా భక్తుల చేతనే చేయిస్తారు. ఇక్కడ ఆ అవకాశం కూడా లేదు. ఈ కారణంచేత అభిషేకం ఆలోచన

విరమించుకున్నాం. సోమనాద్, రామేశ్వరం తప్ప కేదారంతో సహా మిగతా ఓంకారేశ్వర్, ఉజ్జయిని, నాగేశ్వర్, భీమాశంకరం, శ్రీశైలం, ఘ్రుష్మేశ్వర్ (ఈ యాత్రలోనే రెండు రోజుల తరువాత చూస్తాము) మొదలైన ఏ జ్యోతిర్లింగక్షేత్రం లోనూ అభిషేకం పై ఇటువంటి నిషేధం లేదు.

ఈశ్వరునికి ప్రియమైన సోమవారం కావటంతో రద్దీ ఎక్కువగానే ఉన్నది. పంచాక్షరీ మంత్రం జపిస్తూ లైనులో నిలబడ్డాం. తర్వాత గర్భాలయంలోకి ప్రవేశం లభించింది. అక్కడనున్న మహిళా సేవా సిబ్బంది ఔదార్యంతో మరి కొన్ని క్షణాలు అదనంగా నిలబడి సంతృప్తి కరమైన దర్శనం చేసుకున్నాము. ఒక్క పానుమట్టం తప్ప అసలు లింగం కనబడదు. అంతగా కృశించి పోయిందన్నమాట. బయటకు వచ్చి ప్రాంగణంలో మరి కొంతసేపు గడిపి పన్నెండున్నరకల్లా నాశిక్ తిరిగి వచ్చాము.

భోజనం చేసి కొద్ది సేపు విశ్రమించి నాలుగున్నరకు రూము ఖాళీ చేసి ఆటో మాట్లాడుకుని నాశిక్ రోడ్డు స్టేషను చేరాము. ముంబై ఔరంగాబాదు జనశతాబ్ది ఎక్స్ ప్రెస్ నలభై ఐదు నిముషాలు ఆలస్యంగా వచ్చినా గమ్యం మాత్రం ఇరవై నిముషాల ఆలస్యంతో తొమ్మిదింటికి చేరింది. జయలక్ష్మిని స్టేషనులో ఒక వారగా కూర్చోబెట్టి హోటలు వెదకటానికి బయలుదేరాను. స్టేషను మెయిన్ గేటు ప్రక్కన 'తిరుపతి', 'ప్రీతం' అని రెండు హోటళ్ళున్నాయి. ముందుగా ప్రీతం హోటలు ప్రతినిధి దారి కాచి, గది చూపాడు. గది గాలి వెలుతురుతో పరిశుభ్రంగానే ఉన్నది, కాకపోతే రెండవ అంతస్తులో ఉన్నది. లిఫ్టు సౌకర్యం లేదు. జయలక్ష్మికి అసౌకర్యంగా ఉంటుందేమోనని నేను తటపటాయించటం గమనించాడు కాబోలు, మొదటి అంతస్తులో మరొక గది చూపి, ప్రక్క హోటలు (తిరుపతి) లో కూడా ఇదే పరిస్థితి అని చెపుతూ కిరాయిలో వంద రూపాయలు రాయితీ ఇవ్వజూపాడు. దాని గురించి

కాకపోయినా కాలాతీతమవుతున్నందువల్ల సరేనని ఒప్పుకుని, రెండు రోజులకూ మొత్తం కిరాయి చెల్లించి, వారి రికార్డు కోసం నా గుర్తింపు కార్డునిచ్చి తిరిగి స్టేషనుకు వెళ్లి జయలక్ష్మినీ, లగేజీని తీసుకువచ్చి గదిలో చేరిపోయాను.

**అజంతా ప్రయాణం**

పదకొండవ తేదీ రాత్రి గం.10.45 ని. లకు అజంతా ఎక్స్ ప్రెసులో సికిందరాబాదు బయలుదేరవలసిన సమయానికి సరిగ్గా రెండు పూర్తి రోజుల సమయం ఉంది. మరో జ్యోతిర్లింగ క్షేత్రం ఘ్రుష్మేశ్వర్ దర్శనం, యాత్ర ప్రధాన లక్ష్యం. అది ఎలాగూ చూస్తాం. ఔరంగాబాదు సమీపంలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన అజంతా, ఎల్లోరా గుహలు ఉన్నాయి. ఇక్కడి వరకూ వచ్చాం కనుకనూ, వీటికోసం ప్రత్యేకంగా ఎలాగూ వచ్చేది లేదు కనుకనూ, వీటి పర్యటన కూడా ఉచితమనిపించింది. పైగా సమయం కూడా చాలినంత ఉన్నది.

హోటలు రిసెప్షనులో సంప్రదించగా చూడదగిన ప్రదేశాల జాబితా, అవి పర్యటించవలసిన క్రమం వివరించాడు. ఘ్రుష్మేశ్వర్ దేవాలయమూ, ఎల్లోరా గుహలూ ఔరంగాబాదు పట్టణానికి వాయువ్య దిశగా ముప్పై కిలోమీటర్ల దూరంలో ప్రక్క ప్రక్కనే ఉండగా, అజంతా గుహలు ఈశాన్యంగా నూటపది కిలోమీటర్ల దూరంలో నున్నాయి. అందుచేత ఘ్రుష్మేశ్వర్ తో పాటు ఎల్లోరాను సందర్శించ వలసి ఉంటుంది. అయితే, ఆ మరునాడు (మంగళవారం) ఎల్లోరాకు వారాంతపు శెలవు కనుక పర్యాటకులను అనుమతించరు. ప్రయాణ్నాయంగా ఆ రోజు అజంతాకు (దీనిని సోమవారం శెలవు) కేటాయించాము.

భారత పర్యాటక అభివృద్ధి సంస్థ (Indian Tourism Development Corporation) వారి వాహనంలో అజంతాకు మనిషికి నాలుగు వందలు. అదే

బస్సులో ఎల్లోరాకు 270 రూపాయలు . మన వరకే ప్రత్యేకంగా వాహనం మాట్లాడుకుంటే అజంతాకు పదిహేను వందలు ఎల్లోరా ఘ్రుష్మేశ్వరులకు వెయ్యి రూపాయలు అని తెలియజేశాడు. జయలక్ష్మిని సంప్రదించగా, నలుగురితో పాటు అజంతాకు బస్సులోనూ, ఆ మరునాడు ఘ్రుష్మేశ్వరు యాత్ర మన వ్యక్తిగతం, పైగా అభిషేకం అవీ ఉంటాయి కనుక సమయపాలనలో అవసరమైన స్వేచ్ఛ దృష్ట్యా టాక్సీలోనూ వెళదామని సముచితమైన సూచన చేసింది. అలాగే అజంతా కోసం ఇద్దరికీ కలిపి ఎనిమిది వందలు హోటలు కౌంటరులో చెల్లించాను.

పదవ తేదీ ఉదయం ఏడున్నరకు మేమున్న హోటలు సమీపంలోనున్న మహారాష్ట్ర ప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (Maharashtra State Tourism Development Corporation) వారి కార్యాలయానికి వెళ్ళాము. వారి రెస్టారెంటులో అల్పాహారం చేసి బస్సెక్కాము. నిర్ణీత సమయానికి బస్సు బయలుదేరి పట్టణంలో వివిధ ప్రాంతాలలో బస చేసి ఉన్న పర్యాటకులను ఎక్కించుకుంటూ అరగంటలో పట్టణ శివార్లు దాటింది. ముప్పై సీట్లు గల బస్సులో ఇరవై మంది వరకూ విదేశీయులే ఉన్నారు. మిగిలిన వారిలో మాతో పాటు హైదరాబాదు నుంచి వచ్చిన మరో తెలుగు కుటుంబం ఉన్నది. అజంతా వెళ్ళే ఈ రాష్ట్ర రహదారిలో మహారాష్ట్ర ఉత్తర ప్రాంత చివరి జిల్లా జలగాం ఉన్నది. అజంతాకు అరవై కిలోమీటర్లు. అక్కడికి మధ్యప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు నలభై కిలోమీటర్లు. ఇది రైల్వే జంక్షను కూడా. ఉత్తరాది రాష్ట్రాలనుండి అజంతా ఎల్లోరాలకు వచ్చేవారు ఈ జలగాం మీదుగా వస్తారు.

పదకొండు గంటలకు 'అజింత' అనే గ్రామానికి చేరాము. ఇక్కడకు, కొండలపై ఉన్న అజంతా గుహలు మరో అయిదు కిలోమీటర్లు. కొండపైన వాహనాలకు చాలినంత విశ్రమస్థలం లేదు. అందుకని అన్ని వాహనాలూ ఇక్కడ ఆగిపోతాయి. పైకి వెళ్ళటానికి మహారాష్ట్ర పర్యాటక సంస్థ వారి బస్సులు నిరంతరమూ పైకీ క్రిందకూ ట్రిప్పులు కొడుతూ విడతలవారీగా పర్యాటకులను అటూ ఇటూ చేరవేస్తుంటాయి. దీనికి అదనంగా రానూపోనూ మనిషికి యాభై రూపాయలు. దీనికోసం కొద్దిసేపు లైనులో నిలబడి ఆ బస్సులో పైకి వెళ్ళాము. మాతో వచ్చిన గైడు పేరు శ్రీ పూజారి. విద్యాధికుడు. మహారాష్ట్ర ప్రభుత్వ శిల్పకళా శాస్త్ర కళాశాల (Government College of Archeology & Engineering)లో ఉపన్యాసకునిగా సేవలందించి పదవీ విరమణ చేశారట. ఆయన విషయ పరిజ్ఞానం, విషయ విపులీకరణలో ప్రజ్ఞాపాటవాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వ పర్యాటక అభివృద్ధి సంస్థవారు పర్యాటకుల ప్రయోజనార్థం గౌరవ వేతనమిచ్చి ఆయన సేవలను ఈ విధంగా సద్వినియోగం చేస్తున్నారు. ఏడు పదులు పైబడిన వయసులోనూ, ఆరోగ్యంగానూ, చురుగ్గానూ ఉన్నారు. దేశ, భాషలకు అతీతంగా ఏ వయసు పర్యాటకులనయినా ఇట్టే ఆకట్టుకునే ఆకర్షణ ఆయన స్వంతం. ఆయన తన బృందాన్ని సమావేశపరచి అజంతా పర్యటన ప్రాథమిక సమాచారం, నియమాలు, పర్యాటకుల బాధ్యతలు మొదలైనవి వివరించి తాను అందరికీ ప్రవేశ టికెట్లు తీసుకువస్తాననీ, ఈ లోగా అందరిని భద్రతా తనిఖీ ప్రదేశం వద్దకు వెళ్లి అక్కడ తన కోసం వేచి ఉండమనీ చెప్పాడు. మేమంతా తను చెప్పిన ప్రదేశానికి చేరిన కొద్ది సేపటికి మాతో తిరిగి కలవగా అందరమూ ఆయనను అనుసరించాము.

**అజంతా గురించి**

మొత్తం 30 గుహలలో బౌద్ధ మతానికి చెందిన కళాత్మకమైన అసంఖ్యాక శిల్పాలు, బౌద్ధ జాతక కథల ఇతివృత్తంగా సిమెంటు పూత ఆరక మునుపు గోడ మీద లేదా పై కప్పు మీదా నీటి రంగులతో చిత్రించే ప్రక్రియ (Frescos) నుపయోగించి శ్రీలంకకు చెందిన 'సింగిరియా' శైలిలో చిత్రించిన అద్భుతమైన వర్ణ చిత్రాలూ ఉన్నాయి.

స్పింక్ అనే చరిత్ర కారుని పరిశోధనల ప్రకారం, ఈ గుహల పరివర్తన రెండు దశలలో జరిగినట్లు తెలుస్తున్నది. మొదటిది క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దానికి చెందినది. ఈ దశలో బౌద్ధ మతంలోని హీనయాన శాఖను ప్రోత్సహించిన శాతవాహన వంశ రాజుల కాలంలో 'వాఘోర' నదికి ఇరువైపులా ఉన్న పర్వత సానువులపై 'చైత్య' 'గృహ'లను తొలిచారు. వాటిలో ఇప్పుడున్న నెంబరు 9,10,12,15A గుహలు ప్రధానమైనవి. ఇవి కుడ్య చిత్రాల (Murals) కు ప్రాతినిధ్యం వహించాయి. క్రీస్తు శకం 460-480 సంవత్సరాలకు చెందిన రెండవ దశ 'వాకాటక' వంశస్తుడైన 'హరిసేన' చక్రవర్తి కాలానికి చెందినవి. ఈ దశలో బౌద్ధ ఆరామాలూ, విహారాలూ ఆలయాలకు ప్రాధాన్యత ఇవ్వబడింది. క్రీస్తు శకం 480 సంవత్సరంలో హరిసేన రాజ్య పతనం తోటే వీటి నిర్మాణమూ నిలిచిపోయింది. అందుచేతనే 25 నెంబరు నుంచి 30 వరకూ ఉన్న గుహలు నేటికీ అసంపూర్తిగా కనబడతాయి.

1819వ సంవత్సరం ఏప్రిల్ 28వ తేదీన అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ లో 28వ అశ్విక దళాధిపతి జాన్ స్మిత్ అనే అధికారి పులులను వేటాడుతూ ఈ ప్రాంతపు అడవులలో సంచరిస్తుండగా కాకతాళీయంగా ఒక ప్రవేశ ద్వారం



తారసపడింది. ఏముందో చూద్దామని లోనికి వెళ్ళాడు. కానీ వాటిలో గబ్బిలాలూ, గుడ్లగూబాలూ, పక్షులూ ఇతర జంతువులూ తప్ప మరేవీ కనబడలేదు. కానీ వీటికి అతీతంగా మరేదో ఖచ్చితంగా ఉన్నదని మాత్రం కనుగొనగలిగాడు. అదే నేటి పదో నెంబరు గుహ. ఒక గోడపై తన పేరూ, తేదీ గీశాడు. ఇది ఇప్పుడు అస్పష్టంగా కనబడుతుంది. ఇది జరిగిన కొంత కాలానికి అప్పటివరకూ వాటి మరుగున పడి ఉన్న చారిత్రిక రహస్యాలు వెలుగులోకి వచ్చి క్రమంగా బాహ్య ప్రపంచ దృష్టికి రావటం ప్రారంభించింది.

1983 వ సంవత్సరంలో ఈ గుహలు ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో ఆధీనంలోకి వచ్చాయి. అంతకు మునుపు 1861 సంవత్సరం నుంచీ ఈ సంపదను పరిరక్షిస్తున్న 'భారతీయ పురావస్తు సర్వేక్షణ' సంస్థ (Archeological Survey of India) అత్యుత్తమంగా నిర్వహిస్తూ గత సంవత్సరం 150 సంవత్సరాల (Sesquicentennial) వేడుకలను జరుపుకున్నది. ఈ వివరాలన్నీ శ్రీ పూజారిగారు వివరిస్తుండగా, ఒక్కొక్క గుహను ఆశ్చర్యచకితులమై తిలకించాము.

ఈ గుహలలో ఫోటోగ్రఫీ నిషేధం లేనప్పటికీ కెమెరా ఫ్లాష్ లైట్లు గానీ, అధిక వెలుగునిచ్చే ఇతర పరికరాలుగానీ వాడటానికి వీలులేదు. అవి విరజిమ్మే కాంతికి, విడుదలచేసే ఉష్ణోగ్రతకు చిత్రాలు వర్ణవిహీనమవటాన్ని గమనించి ఈ నిషేధం విధించారు. లోపల విద్యుద్దీపాలు ఉంటాయి కానీ ఆ వెలుగు చాలా మంద్ర స్థాయిలో ఉంటుంది. చిత్రాలను, శిల్పాలను మామూలు కంటితో దర్శించటం వరకే ఉపయోగ పడుతుంది. ఆ వెలుగు సయితం లేని చోట్ల పూజారిగారు ప్రత్యేకమైన LED టార్చి వెలుగులో చూపించి ఆయా విషయాలను వివరించారు. అంత మంద్ర స్థాయి వెలుగులో ఫోటో తీయాలంటే కెమెరా కటకాన్ని విశాలంగా ఎక్కువ సేపు తెరిచిఉంచే (Extended Exposure) విధానం అనుసరించాలి. దీనికి చాలా సమయం అవసరమవుతుంది. పైగా కెమెరాను చేతితో పట్టుకున్నప్పుడు ఈ విధానం సాధ్యపడదు. దానిని ప్రత్యేకంగా ఒక ముక్కాలి స్టాండు (Tripod) మీద అమర్చవలసి ఉంటుంది. ఇక్కడ నియమాల ప్రకారం ఏ పర్యాటకుడైనా ఒక్కొక్క గుహలో అత్యధికంగా అరగంటకు మించి గడపటానికి వీలులేదు. అంత స్వల్ప సమయంలో ఈ పద్ధతిలో ఫోటోలు తీయటం ఎలాగూ సాధ్యపడదు. అయినా ఈ కారణం చూపి ఎవరూ ఎక్కువ సేపు ఉండకుండా పనిలో పనిగా ఈ స్టాండులను కూడా నిషేధించారు.

14వ గుహ వరకు వచ్చేటప్పటికి సమయం ఒకటిన్నర యింది. మిగతా గుహలను తిలకించటంలో తన పాత్రకు ప్రాధాన్యత లేనందున తాను

విరమించుకుని ఆసక్తి ఉన్నవారు వాటిని దర్శించి రెండు గంటలకల్లా ప్రవేశద్వారం వద్దనున్న రెస్టారెంటుకు రావలసినదని చెప్పి వెళ్ళిపోయారు.

కొందరు ఆయనతో పాటే వెనుదిరిగి పోగా మేము మాత్రం మిగతా గుహలు కూడా తిలకించి రెస్టారెంటుకు చేరాము. కిటకిట లాడుతూ ఉంది. పదిహేను నిముషాల వరకూ టేబులు లభించలేదు. కూర్చున్న తరువాత

కూడా ఆదేశించిన భోజన పదార్థాలు అందజేయటం మరింత ఆలస్యం అయింది. బృందంలోని చాలా మంది సభ్యులు అప్పటికే భోజనం పూర్తి చేసుకుని ఒక విడత షటిల్ బస్సులో వెళ్ళిపోయారు. మేము వెనుకపడటం, మా కోసం మిగతావారు అసహనంగా వేచి ఉండవలసిన సున్నితమైన స్థితి కొంత ఇబ్బంది కలిగించింది. ఆర్డరు చేసిన భోజనం అవసరంలేదని చెబుదామా అని కూడా ఒక దశలో ఆలోచించాను. మా స్థితిని గమనించిన పూజారిగారు రెస్టారెంటు వారితో చెప్పి, మేము సత్వరమే భోజనం ముగించటానికి సహకరించారు. ఈ రెస్టారెంటు మహారాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ వారి నిర్వహణలో ఉన్నది. ఆ చుట్టుప్రక్కల ఇతర ప్రైవేటు రెస్టారెంటు లేవీ లేవు. ఉండటానికి అనుమతి కూడా ఇవ్వరు కాబోలు. అందుచేత పదార్థాల ధరలు ఆకాశంలో ఉన్నాయి. మా భోజనం మూడు వందల ముప్పై రూపాయలయింది. అదే భోజనం ఔరంగాబాదులో నూట యాభైకి మించదు.

మొత్తానికి మరొక షటిల్ ట్రిప్పులో బృందాన్ని చేరుకొని బస్సెక్కాము. సాయంత్రం ఆరు గంటలకు హోటలు చేరుకున్నాము. ఆ రోజు అనుభూతులు జ్ఞాపకాల పొరల్లో మరుగున పడకుండా, కంప్యూటరులో నిక్షిప్తం చేసుకుని,

యధాప్రకారం 'తిరుపతి' రెస్టారెంటులో భోజనం చేసి జీవితంలో ముఖ్యమైన మరొక రోజుకు వీడ్కోలు పలికాము.

పదకొండవ తేదీ. ఈ రోజు పర్యటనకు సంబంధించి ఈ పర్యాటక సంస్థ వారి బస్సు ముందు ఎల్లోరా వెళ్లి అక్కడ నుండి ఘ్రుష్మేశ్వర్ వెళుతుందట. దీనివల్ల మా యాత్రా ప్రాధాన్యానికి భంగం కలుగుతున్నది. మా మొదటి ప్రాధాన్యం ఘ్రుష్మేశ్వర్ కదా! అది పూర్తయిన పిదపనే మరే పర్యటనయినా. పర్యాటక సంస్థ వారి ప్యాకేజీలో 200 మీటరుల ఎత్తున్న కొండమీద నున్న దౌలతాబాదు కోట కూడా ఉన్నది. ఇరుకుగానుండే పదేహేను వందల మెట్లు ఎక్కాలట. అది ఎలాగూ మావల్ల కాదు. ఇది కాక మరేమైనా దర్శించ వలసినవి ఉంటే అవి సమయానుకూలంగా మా అంతట మేము వెళ్లి రాగలిగినవి. ఈ కారణాల దృష్ట్యా పర్యాటక సంస్థ వారి బస్సులో కాకుండా టాక్సీలో వెళ్లి రావటానికి నిర్ణయించుకున్నాం. కాకపోతే మరో అయిదు వందలు అదనంగా ఖర్చవుతాయి. కానీ దానివల్ల చేకూరే ప్రయోజనంతో పోలిస్తే ఈ ఖర్చు విస్మరించదగినదే. కనుక గత రాత్రే హోటలు రిసెప్షనులో డబ్బు చెల్లించి వాహనం ఏర్పాటు చేయ వలసినదిగా కోరాను.

## ఘ్రుష్మేశ్వర్

ఉదయం ఎనిమిదింటికి టాక్సీ వచ్చిందని సందేశం వచ్చింది. అంతకు ముందే మేము సిద్ధమై, ఆ సమయానికి 'తిరుపతి' రెస్టారెంటులో అల్పాహారం చేస్తున్నాము. అది పూర్తయిన వెంటనే బయలుదేరి తొమ్మిదింటికల్లా ఘ్రుష్మేశ్వర్ చేరాము. మేము దర్శించిన జ్యోతిర్లింగక్షేత్రాలన్నిటిలోకీ (ఇదే చివరిది కూడా) అతి చిన్న దేవాలయం. చాలా సుందరంగా ఉన్నది. ప్రాంగణం ప్రవేశ ద్వారానికి వెళ్ళే ప్రదేశంలో మమ్ములను దిగబెట్టి డ్రైవరు పార్కింగుకు వెళ్ళాడు.

ఐళాపురే రమ్య విశాలకేస్మిన్ సముల్లసంతం చ జగద్వరేఖ్యం
వందే మహోదర తర స్వభావం ఘ్రుష్ణేశ్వరాఖ్యం శరణం ప్రపద్యే

ఆలయంలో పూజాది వివరాలు, విధానాలు, రుసుముల వివరాలు తెలుసుకుని, పంచామృత అభిషేకం చేద్దామని నిశ్చయించుకున్నాము. 551 రూపాయలు చెల్లించి టికెట్టు తీసుకుని, పూజా సామగ్రి కొనుగోలు చేసి గర్భాలయంలోనికి ప్రవేశించాము. ఇరువురినీ పీటలపై కూర్చుండబెట్టి మాచే స్వయంగా నమక చమకాదులతో అభిషేకం చేయించారు. అనంతరం పార్వతీ అమ్మవారినీ పూజించి, మంత్రపుష్ప సమర్పణతో ఆ కార్యక్రమం ముగించాము. ఆలయ మండపంలో ప్రసాదం స్వీకరించి పూజారుల ఆసీస్సులందుకున్నాము. దుస్తులు మార్చుకుని మరో పదినిముషాలు ఆ ప్రాంగణంలో గడిపి బయటకు వచ్చాము. అక్కడ నుండి అయిదు కిలోమీటర్ల దూరంలోనే ఎల్లోరా గుహలున్నాయి.

## ఎల్లోరా

దక్కను పీఠభూమిలోని సహ్యాద్రి పర్వతాలను తొలచటం ద్వారా శిల్పాలే కాకుండా బ్రహ్మాండమైన ఆలయాలను సయితం రూపొందించిన ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ప్రదేశం. మొత్తం ముప్పై నాలుగు గుహలున్నాయి. ఇవన్నీ కొండ అగ్ర భాగాన మూడు అంచెలుగా ఉంటాయట. ఎక్క వలసిన మెట్లు కూడా ఎక్కువే. మా శక్తి మీద మాకు నమ్మకం లేక సాహసించ లేక పోయాము.

ప్రత్యామ్నాయంగా కొండ దిగువన ఉన్న పదహారవ నెంబరు గుహ కైలాస ఆలయానికి పరిమితమయ్యాం. ఇది కూడా అద్భుతమైనదే. విశాలమైన మండపాలలో వివిధ మూర్తుల భారీ విగ్రహాలు, లింగంతో సహా పెద్ద గర్భాలయంతో శివాలయం, ఆ గర్భాలయం ముందు ఒక హాలు, దాని ముందు ప్రవేశ మండపం, శిఖరాయమైన గోపురాలూ, సముదాయంలో ఇరువైపులా 70 అడుగుల ఎత్తైన రెండు స్తూపాలూ, ఇక దేవాలయాన్ని తమ వీపుల మీద మోస్తున్నట్లుగా ఆలయానికి మూడు వైపులా ఏనుగులు, యుద్ధంతో సహా రామాయణ ఇతివృత్తంగా ఆలయ గోడల మీద శిల్పాలూ, అన్నీ కొండను తొలిచి రూపొందించినవే. ఆ ప్రాంగణంలోని అణువణువూ మనలను ఎంత సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతాయంటే వాటినుంచి

తేరుకోవటానికి కొన్ని రోజులు పడుతుంది. ఎంత సేపున్నా మదిలో ఏ మూలో ఇంకా చూడవలసినది మరేదేమైనా ఉండిపోయిందేమోనన్న శంక అక్కడ నుంచి ఒక పట్టాన కదలనీయదు. అక్కడికీ అక్కడున్న రెండు గంటల పాటు వీడియో, స్టిల్ కెమెరాలు రెండూ నిర్విరామంగా పని చేస్తూనే ఉన్నాయి.

బయటకు వచ్చి ఔరంగాబాదు తిరిగివస్తూ దౌలతాబాదు కోటను బయటి నుంచే తిలకించాము. అక్కడ నుంచి 'భద్ర మారుతి' ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్ళాము. ఆంజనేయ స్వామి శయనించిన భంగిమలో నుండే అరుదైన ఆలయాలలో ఇది ఒకటి. అలహాబాదు త్రివేణీ సంగమం సమీపంలో కూడా ఆంజనేయస్వామిని ఇదే భంగిమలో చూస్తాము.

అక్కడినుంచి 'బీబీకా మక్బారా' అనే కట్టడం ఉన్న ప్రదేశానికివెళ్లాం. క్రీస్తుశకం పదిహేనవ శతాబ్దంలో మొఘలు వంశ యువరాజైన 'ఆజంషా' తన తల్లి, ఔరంగజీబు మొదటి భార్య అయిన 'రబియా దురానీ' స్మారకార్థం నిర్మించిన కట్టడం. ఇది సాక్షాతూ ప్రపంచ ప్రసిద్ధ తాజమహాలును పోలి ఉండటం విశేషం. తాజమహాలును దర్శించిన వారు గానీ, దర్శించబోయే వారు గానీ ఇది తప్పకుండా దర్శించాలి. ఎందుకంటే, అసలు తాజమహాలు ఏమిటో, తాజమహాలే ఎందుకో ఇది చూస్తేనే అర్థమవుతుంది. ఈ ఒక్క లక్షణమే ఈ కట్టడం పర్యాటకుల ఆదరణ నోచుకోకపోవటానికి ప్రధాన కారణం. అక్కడ నుంచి గోధుమలు, బియ్యం మొదలైనవి పిండిగా విసరటానికి నీటి శక్తితో తిరిగి 'పంచక్కీ' అనే విచిత్రమైన ఒక భారీ తిరగలి అది పని చేసే తీరూ తిలకించటంతో ఔరంగాబాదులో మా పర్యటన ముగించాం.

మధ్యాహ్నం రెండు గంటలకు హోటలు గదికి చేరుకొని, వాహనాన్ని విడుదల చేసాం. భోజనం చేసి రాత్రి తొమ్మిదిన్నరకు గది ఖాళీ చేసి అల్పాహారం చేసి, పది గంటలకు స్టేషనుకు చేరుకున్నాము. గం.10.40 ని.లకు

రావలసిన 17063 నెంబరు మన్మాడ్ సికిందరాబాదు అజంతా ఎక్స్ ప్రెస్ యధాప్రకారం రెండు గంటలు ఆలస్యంగా పన్నెండున్నరకు వచ్చింది. ఆ ఆలస్యం స్వల్పంగా పూడ్చుకుని మరునాడు తొమ్మిది గంటలకు చేరవలసినది పదిన్నరకు సికిందరాబాదు చేర్చగా పన్నెండు గంటలకు నిజగృహానికి చేరుకున్నాం. ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించాలనే జీవిత కాలపు స్వప్నాన్ని సాకారం చేసి సంతృప్తి మిగిల్చిన ఈ యాత్ర ఆ విధంగా మకర సంక్రాంతికి రెండు రోజుల ముందు సంపన్నమయింది.

## ఉపసంహారం

హిందూ సాంప్రదాయంలో పితృ దేవతలకు పిండ ప్రదాన విధులకు సంబంధించి పురాణాలలో పేర్కొనబడిన పుణ్య ప్రదేశాలు ముఖ్యంగా మూడు. అవి శిరోగయ, నాభిగయ, పాదగయ. వీటిలో మొదటిది బీహారు రాష్ట్రంలోని గయ కాగా, రెండవది ఓడిశా రాష్ట్రం లోని జాజిపూర్, మూడవది ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపురం. ఈ కార్యక్రమాలు నిర్వహింపవలసిన మరో ప్రసిద్ధ క్షేత్రం, బదరీలోని బ్రహ్మకపాలం వద్ద 2010 సంవత్సరంలో నిర్వహించి ఉన్నాను. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్ర యాత్రలో భాగంగా 2011వ సంవత్సరం మార్చి నెలలో వారణాసి నుండి ఝార్ఖండులోని వైద్యనాద్ వెళుతూ మధ్యలో గయలో ఒక రోజు ఆగి అక్కడ ఈ కార్యక్రమం నిర్వహించాము. అక్కడ నుండి కోల్కతా మీదుగా పూరీ ప్రయాణంలో ఈ జాజిపూరును చివరి క్షణంలో హడావుడిగా కార్యక్రమంలో కుక్కినందువల్ల కార్యాచరణలో అది సాధ్యపడలేదు. అప్పటినుంచీ ఈ జాజిపూరు యాత్ర ఊరిస్తూనే ఉంది. అపుడపుడు మా బావమరిది శ్రీ అత్యుతరావుగారు జ్ఞప్తి చేస్తూనే ఉన్నా, అన్ని సాధారణ కుటుంబాలలో వలెనే మా ఇరువురి కుటుంబాలలో కూడా వరుసగా చోటుచేసుకున్న కొన్ని కార్యాలవల్ల ప్రణాళికా

రచనకే సమయం దొరికింది కాదు. సరయిన సమయం కోసం అలా కాచుకుని ఉండగా 2012వ సంవత్సరం మార్చి మొదటి వారం కాస్త అనుకూలంగా తోచింది. ఆ నెల దాటితే మళ్ళీ వేసవి కాలం వస్తుంది. రైళ్ళూ, బస్సులూ, యాత్రా స్థలాలూ, హోటళ్ళూ అన్నీ క్రిక్కిరిసి పోతాయి. అందుచేత ఆ వారాన్ని అందిపుచ్చుకుని వెంటనే కార్యక్రమం రూపొందించి తదనుగుణంగా రైలు టికెట్లు కూడా కొనేశాను.

భువనేశ్వరు కోల్కతా జాతీయ రహదారిపై సుమారు 100 కిలోమీటర్లు దాటిన తరువాత 'పనిమోళి' అనే కూడలి వద్ద జాతీయ రహదారి నుంచి కుడివైపునకు తొలగి అక్కడనుండి సుమారు 40 కిలోమీటర్లు వెళితే అక్కడ ఈ జాజిపూరు ఉన్నది. 'జాజిపూరు కిరంజా రోడ్డు' (Jajpur K.Road) పేరుతో రైల్వే స్టేషను ఉన్నది. యాత్రికులను ఇదే కొంత అయోమయానికి గురి చేస్తుంది. అసలు జాజిపూర్ చాలా చిన్న పట్టణం. బసకు కానీ, భోజనాలకు కానీ వసతులు పెద్దగా ఉండవు ఈ 'జాజిపూరు కిరంజా రోడ్డు' భువనేశ్వర్ హౌరా రైలు మార్గంలో భువనేశ్వరుకు 100 కిలోమీటర్లు. ఈ స్టేషనులో ఇరు మార్గాలలోనూ సూపర్ ఫాస్టు రైళ్ళు తప్ప మిగతా అన్ని ఎక్స్ ప్రెస్ రైళ్ళూ ఆగుతాయి.. జిల్లా కేంద్రం. ఒక మోస్తరు పట్టణం. బస చేయటానికి హోటళ్ళు ఉంటాయి. ఇక్కడకు మనం వెళ్ళవలసిన అసలు జాజిపూర్ 50 కిలోమీటర్లు. ప్రజా రవాణా సౌకర్యం అంతంతమాత్రమే. ప్రైవేటు వాహనాల వారు ఇష్టం వచ్చినట్లు అడుగుతారు. ఒక నిర్దుష్టమైన రేటు గానీ ఆమోద యోగ్యమైన విధానంగానీ పాటించరు. అందుచేత ఆంధ్రప్రదేశ్ నుంచి భువనేశ్వరు మీదుగా వచ్చేవారు ఒక ఉదయం భువనేశ్వరులో దిగి ముందే మాట్లాడుకున్న వాహనంలో (ఈ వాహనాలు సమకూర్చే టూరిస్టు సంస్థల

వారి వివరాలు ఇంటర్నెటులో లభిస్తాయి) నేరుగా జాజిపూరుకు వెళ్లి కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రానికి తిరిగి భువనేశ్వరు చేరుకోవచ్చు.

2012 లీపు సంవత్సరం ఫిబ్రవరి 29వ తేదీన మేమిరువరం ఉదయం పది గంటలకు హైదరాబాదులో 18645 నెంబరు ఈస్టు కోస్ట్ ఎక్స్ ప్రెస్ లో బయలుదేరాము. అదే సాయంత్రం గం.4.50ని.లకు మా బావమరిది గారు ఆయన శ్రీమతి సత్యప్రసూన విజయవాడలో మాతో కలిశారు. మరునాడు మార్చి ఒకటవ తేదీన ఉదయం గం.7.20 ని.లకు భువనేశ్వరులో దిగాము. ముందే చేసుకున్న ఏర్పాటు మేరకు స్టేషనువద్ద సిద్ధంగా ఉన్న వాహనంలో బయలుదేరాము. నేరుగా జాజిపూర్ రోడ్డు స్టేషను (కిరంజా) కి వెళ్ళాము. అప్పటికే సమయం పదకొండు గంటలయింది. రాత్రి బస అక్కడ చేసే ఆలోచనతో హోటలులో గదులు తీసుకున్నాము. సామాను అక్కడ దింపేసి మళ్ళీ వాహనం ఎక్కి బయలుదేరగా మేము వెళ్ళినంత దూరం అదే రోడ్డుపై తిరిగి వాహనం భువనేశ్వర్ కోల్కతా జాతీయ రహదారివైపు వెళ్ళటం గమనించి ఎక్కడికి వెళుతున్నాం? అని అడిగాను. జాజిపూర్ అన్నాడు డ్రైవరు. అదేమిటి జాజిపూర్ కిరంజా ప్రక్కనే కదా ఉన్నది అన్నాను అమాయకంగా. 'ఎవరు చెప్పారు? ఇక్కడికి ఇంకా నలభై కిలోమీటర్లు ఉంది' అన్నాడు. అప్పటికి సమయం పన్నెండయింది. అదేమిటయ్యా! మరయితే నేరుగా అక్కడికే వెళ్ళే వాళ్ళం కదా, రానూ పోనూ ముప్పై కిలోమీటర్లు, గంటన్నర సమయం కలిసి వచ్చేవి కదా అన్నాను. మీరు చెప్పలేదు కదా అని నింద తిరిగి నాపైనే వేసేశాడు. అదీ యదార్థమే కదా. మరి నింద ఎలా అవుతుంది! భరించక చేసేదేముంది! అయితే మేము వెళ్ళవలసిన జాజిపూర్, జాజిపూర్ రోడ్డు (కిరంజా) పట్టణానికి ఏ నాలుగైదు కిలోమీటర్లో ఉంటుందనీ అక్కడకు కిరంజా మీదుగానే వెళ్ళవలసి ఉంటుంది కాబోలని భావనలో

ఉన్నాము. ఇలా భావించటానికి కూడా కారణం లేకపోలేదు. ఈ ప్రదేశానికి సంబంధించిన ఏ వెబ్ సైట్లో కూడా కిరంజా గురించి, జాజిపూరుకు సంబంధించిన సమాచారమే తప్ప ఈ రెండింటికీ మధ్య దూరానికి గానీ, రూటుకు గానీ సంబంధించిన సమాచారం స్పష్టంగా లేదు. మేము జాజిపూర్ వెళ్ళవలసి వలసి ఉన్నదని తెలిసినప్పటికీ (వాహనం మాట్లాడుకున్నది అక్కడికే కనుక) మా వాహనం డ్రైవరు కానీ, అది బుక్ చేసుకోవటానికి నేను ఇంటర్నెటులోనూ, ఆ తరువాత ఫోనులోనూ సంప్రదించిన ట్రావెల్ సంస్థ యజమాని కానీ, మేము జాజిపూర్ రోడ్డు (కిరంజా) కు ఎందుకు వెళ్ళాలని అనుకుంటున్నామో అడగనూ లేదు, చెప్పాలని నాకు తోచనూ లేదు.

అదే అసహనంతో మరో గంట ప్రయాణించి జాజిపూరులోని వైతరణీ నదీతీరాన ఉన్న గిరిజాదేవి ఆలయానికి చేరుకున్నాము. అక్కడి పూజారులకు మేము వచ్చిన కార్యం వివరించగా, అందుకు సంబంధించిన పురోహితులకు ఫోనుచేసి రప్పించారు. వారితో మా ఇద్దరికీ కలిపి కార్యక్రమానికి గాను ఏడు వందలు రుసుము మాట్లాడుకున్నాము.

ముందుగా వైతరిణి నదిలో దంపతులకు సంకల్ప పూర్వక

పుణ్యస్నానం చేయించారు. ఆ తరువాత దేవాలయ మండపంలో అసలు క్రతువు జరిపించారు. పిండితో చేసిన పిండాలను తిరిగి నదిలో నిమజ్జనం చేయటంతో వచ్చిన పని పూర్తయింది. అమ్మ వారి దర్శనం చేసుకుని దుస్తులు మార్చుకుని, పురోహితులకు, మాట్లాడుకున్న రుసుము, దానాల నిమిత్తం మరికొంత, ఆలయ పూజారులకు దక్షిణలు ఇచ్చి వారిని

సంతృప్తి పరచి సమయం మూడు గంటలవుతుండగా తిరిగి బయలు దేరాము.

ఆరోజు నిర్వహించవలసిన క్రతువు రీత్యా, ఉదయం అల్పాహారం తీసుకోలేదు. స్థానికంగా ఏదయినా మంచి భోజన హోటలు ఉందేమో తెలుసుకుని అక్కడకు తీసుకువెళ్ళమనగా అయిదారు చోట్ల విచారించి చివరకు ఒక చోటికి తీసుకువెళ్ళాడు. కారులోంచి దిగటానికి కాలు క్రింద పెట్టానో లేదో ముక్కు పుటాలు పేలిపోయే దుర్వాసన.. కారణం - ఆగిన ప్రదేశం ఒక బహిర్భూమి. ఒక మూత్రశాల. వీటి ప్రక్కనే భోజనం చేయ వలసియున్న హోటలు! మూత్రశాల ప్రక్కన భోజన హోటలు ఉన్నది అనటం కంటే, ఆ మూత్రశాలలో హోటలు ఉన్నది అనటం సముచితం. అంతే! మిగతావారు కారు దిగకముందే మళ్ళీ కారులో దూరి పోనీమన్నాను. నాలుగున్నరకు హోటలుకు చేరుకున్నాము.

కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని, స్నానాలు చేసి మంచి భోజన హోటలు కోసం అన్వేషణ ప్రారంభించగా 'వీంసేన్' (భీంసేన్ కు వికృతి కాబోలు) హోటలు గురించి తెలిసింది. మా డ్రైవరు మంచివాడే కానీ పూర్తిగా నిరక్షరాస్యుడు. మనం వెళ్ళవలసిన అడ్రసు కళ్ళెదురుగా కనబడుతున్నా ప్రతి ఇరవై ముప్పై మీటర్లకూ కారును ఆపి ఆ ప్రాంతంతో ఏ పాటి సంబంధమూ లేని దారినబోయే దానయ్యలనదరినీ ఆపి మరీ అదెక్కడ అని అడుగుతాడు. అతను మాట్లాడేది హిందీయే అయినా సందర్భాన్ని బట్టి మనమే అతని భావాన్ని రాబట్టాలి. పోనీ సందర్భాన్ని బట్టి మన భావాన్ని కూడా అలాగే గ్రహించగలడా అంటే ఆ నేర్పూ లేదు. అందుచేత అక్కడకు వెళ్ళవలసిన రూటును నేనే నిర్ణయించి మేము బసచేసిన 'మా' హోటలు సిబ్బంది ద్వారా అతనికి

స్పష్టంగా అవగాహన చేయించి అక్కడకువెళ్లి ఆ రాత్రి సంతృప్తికరంగా భోజనం చేసాము.

మరునాడు మార్చి 2వ తేదీ ఉదయం నాలుగు గంటలకే లేచి, స్నానాలు చేసి, రూములు ఖాళీ చేసి అయిదింటికల్లా బయలుదేరి ఏడింటికి భువనేశ్వరు చేరాము. మేము సామర్లకోట వెళ్ళవలసిన 17015 నెంబరు విశాఖ ఎక్స్ ప్రెస్ బయలుదేరటానికి ఇంకా గంటన్నర సమయం ఉంది. నేరుగా లింగరాజ దేవాలయానికి వెళ్లి హరిహరస్వామిని సంతృప్తిగా సేవించాము. భువనేశ్వరీ అమ్మవారి ఆలయం ఇంకా తెరువనందున ఆ అమ్మవారి దర్శన భాగ్యం కలుగలేదు. తదనంతరం, అల్పాహారం చేసి స్టేషనుకు చేరి, వాహనాన్ని విడుదల చేసి ట్రైనులో కూర్చున్నాము. నిర్ణీత సమయం గం. 08.35 ని. లకు ట్రైను బయలుదేరింది. రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం ఎనిమిది గంటలకు సామర్లకోట చేరి స్టేషను ఎదురుగా ఉన్న లాడ్జీలో గదులు తీసుకుని రాత్రికి బస చేశాము.

మార్చి 3వ తేదీ. ఒక టాక్సీ మాట్లాడుకుని అన్నవరం వెళ్లి శ్రీవారి వ్రతం చేసి, దర్శనం చేసుకుని, భోజనంచేసి తిరిగి సామర్లకోట చేరాము. ఆ సాయంత్రం సామర్లకోటలోని ప్రముఖ పంచారామ క్షేత్రం కుమారారామం భీమేశ్వరస్వామిని దర్శించి, అమ్మవారికి కుంకుమార్చనలు సమర్పించాము. తలపెట్టిన పిండ ప్రదాన కార్యక్రమానికి పురోహితుని ముందుగానే ఏర్పాటు చేసుకుని 4వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి ఆలయానికి వెళ్ళాము. ఇక్కడ చేయవలసిన ఈ కార్యక్రమ విశిష్టత వాయుపురాణంలో ఈ శ్లోకం రూపంలో చెప్పబడినట్లు తెలుస్తున్నది.

*శ్లో: యేష్టవ్యా బహవః పుత్రాః యద్యేకోపి గయాం వ్రజేత్*

*గౌరీంవా వరయేత్కన్యాం నీలం వా వృషముత్సృజేత్ /*

పురోహితుడు వచ్చాక, ముందుగా కుక్కుటేశ్వరస్వామిని, రాజరాజేశ్వరీ అమ్మవారిని, పురూహూతికా అమ్మవారినీ దర్శించి అసలు కార్యక్రమం మొదలెట్టాము. కార్యక్రమం మొత్తం రెండు గంటలు పట్టింది. తదనంతరం, దేవస్థానం బోర్డు చైర్మను గారి ఆహ్వానం మేరకు, దేవస్థాన అన్నదాన పథకంలో భోజనంచేసి తిరిగి సామర్లకోట చేరి, గదులు ఖాళీచేసి తిరుమల ఎక్స్ ప్రెస్ లో ఆ రాత్రికి విజయవాడకు చేరాము.

**శుభం**

**లోకాస్సమస్తా సుఖినోభవంతు**